## కూచిపూడి నాట్యవేద - ఆత్మయజ్ఞము

# గొల్లకలాపము

### అధ్యయన - వ్యాఖ్యాన పుష్పము



రచయిత : యేలేశ్వరపు హనుమరామకృష్ణ

# స్వపరిచయం



**వై. హెచ్. రామకృష్ణ**

మాతాపితలు : యేలేశ్వరపు ఆదిలక్ష్మి కామేశ్వరమ్మగారు
లక్ష్మీ నారాయణగారు

జన్మస్థానం : భావదేవరపల్లి, కృష్ణా జిల్లా

పుట్టిన తేదీ : 20-7-1951

స్వగ్రామం : కూచిపూడి - 521 136 (కృష్ణా జిల్లా)

విద్య : బి.కామ్. (హిందూ కాలేజి, మచిలీపట్నం 1968-71) సి.ఎ.ఐ.ఐ.బి.


వృత్తి : చీఫ్ మేనేజర్
ఆంధ్రాబ్యాంక్, జోనల్ ఆఫీస్
ఎస్.వి.యు కాంప్లెక్స్, తిరుపతి - 517502

ప్రవృత్తి : తాత్త్విక చింతన, సద్గోష్ఠులు, ధార్మికోపన్యాసాలు వినటం, శివార్చన, సాహిత్యాభిమానం

ఆశయం : సర్వమతములు మానవుని జీవితమును సుసంపన్నం చేయటానికి, ప్రశాంతత, ఆందనములతో నింపటానికే ఉన్నాయి. సర్వమార్గముల అంతర్లీగానమే మానవతా వాదము. అట్టి మానవతపు విలువలు పరిరక్షింపబడటానికి నేను సైతం నావంతు కృషి నిర్వర్తించి, తద్వారా 'మానవు డనై ఉండుట' అను మహోత్కృష్టమైన అవకాశమును సద్వినియోగ పరచుకోవటం.

ఇతర రచనలు : శ్రీ వసిష్ఠరామసంవాదము (యోగవాసిష్టము) వచనకావ్యము
భగవద్గీత
కఠ - ఈసావాస్యోపనిషత్ పుష్పాలు మరియు
శ్రీ నారద ప్రణీత భక్తి సూత్రములు

# ఓం నమశ్శివాయ



వందే శంభుం ఉమాపతిం సురగురుం వందే జగత్కారణం
వందే పన్నగభూషణం మృగధరం వందే పశూనాం పతిమ్ ।
వందే సూర్య - శశాంక వహ్నినయనం వందే ముకుందప్రియం
వందే భక్తజనాశ్రయంచ వరదం వందే శివం శంకరమ్ ॥

# ఓం నమో నారాయణాయ



శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం

విశ్వాకారం గగన సదృశం మేఘవర్ణం సుభాంగం

లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృత్ యానగమ్యం

వందే విష్ణుం భవభయ హరం సర్వలోకైకనాధమ్ ॥

# ఆత్మయజ్ఞము - గొల్లకలాపము ::

# అధ్యయన - వ్యాఖ్యాన పుష్పము



- యేలేశ్వరపు హనుమ రామకృష్ణ

గొల్లకలాపము - ఆత్మయజ్ఞము
అధ్యయన వ్యాఖ్యాన పుష్పము

ప్రథమ ముద్రణ : 27-6-2011
శ్రీఖరనామ సం॥ము బహుళ ఏకాదశి ఆదివారం

కాపీలు : 1000

వెల : రూ. 70/-

పబ్లిషర్ : **యేలేశ్వరపు ప్రశాంత్**
S/o వై. హెచ్. రామకృష్ణ
డో.నెం. 2555, సెక్టార్ 1, 24 మెయిన్, 14వ క్రాస్,
హెచ్.ఎస్.ఆర్. లే అవుట్, బెంగళూరు - 560 067
ఫోన్ : 098455 02416

ప్రతులకు : **వై.హెచ్. రామకృష్ణ**
రామలింగేశ్వరస్వామి టెంపుల్ వీధి, కూచిపూడి - 521 136
సెల్ : 92471 05392

**సిహెచ్. సీతారామశాస్త్రి**
డో.నెం. 15/28సి, శిశువిద్యామందిరం వద్ద, ఈడేపల్లి
మచిలీపట్నం - 521 136

కవర్‌పేజి : **భాగవతుల శరత్‌చంద్ర**
S/o రామకృష్ణ శర్మ, M.Sc., (ఫొటోగ్రాఫర్)
కూచిపూడి - 521 136
సెల్ : 99496 62352

# యేలేశ్వరపు హనుమ రామ కృష్ణ


| | | |
|---|---|---|
| 1. | అగ్రహారము | 19 |
| 2. | ఉభయకుశలోపరి | 21 |
| 3. | షట్కర్మలు-షోడశకర్మలు | 22 |
| 4. | నాఽహమ్ దేహమ్ ! - సోఽహమ్ ! | 25 |
| 5. | భౌతిక దేహము | 27 |
| 6. | పునరపి జననం | 29 |
| 7. | ఆహారము | 33 |
| 8. | గర్భనరకము - శిశువేదన | 34 |
| 9. | భూమిపై పడటం | 37 |
| 10. | ఏమరపు | 38 |
| 11. | సంసార బంధము - అనగా ? | 40 |
| 12. | సంసార బంధ విశేషాలు | 45 |
| 13. | చాతుర్వర్ణ్యాలు | 47 |
| 14. | దైవార్పిత కర్మ | 50 |
| 15. | ఏకో అనేక: | 51 |
| 16. | జలంలో ఆకాశము ప్రతిబింబించటము | 54 |
| 17. | సూక్ష్మదేహ నిర్మాణము - జడ చేతనములు | 55 |
| 18. | పంచకోశములు జడమే! | 58 |
| 19. | కర్మణా జాయతే ద్విజ: | 67 |
| 20. | బ్రాహ్మణ: కిమర్థమ్ ? కిముద్దేశ్యమ్? | |
| 21. | సకామ కర్మ - నిష్కామ కర్మ | 83 |
| 22. | స్వధర్మో నిధనం శ్రేయ: | 86 |
| 23. | క్రియా యజ్ఞము - ఆత్మ యజ్ఞము | 89 |
| 24. | కర్మల ఆవస్యకత | 91 |

| | | |
|---|---|---|
| 25. | ద్రవ్యమయాత్ యజ్ఞం | 96 |
| 26. | తారతమ్యములు | 102 |
| 27. | యజ్ఞము - అనేక మంది పాత్రలు | 106 |
| 28. | యజ్ఞపట్టు | 111 |
| 29. | ప్రాయశ్చిత్తము | 113 |
| 30. | ప్రవర్గహోమము | 115 |
| 31. | దక్షిణాగ్ని | 116 |
| 32. | యూపస్తంభము | 117 |
| 33. | చత్వాల దేశము | 117 |
| 34. | ఇడాపాత్ర - వప - అగ్ని సమర్పణము - పురోడాశము | 118 |
| 35. | సోమ పానము | 119 |
| 36. | దీక్ష | 120 |
| 37. | అవభృథ స్నానము | 121 |
| 38. | సమీక్ష | 126 |
| 39. | ఆత్మయజ్ఞము - పరిచయవిశేషాలు | 128 |
| 40. | అరిషట్ (6 - శత్రు) వర్గములు | 129 |
| 41. | క్షేత్రవిభాగములు | 132 |
| 42 | మహాద్భుత సంసార వృక్షము - సంసార అరణ్యము | 134 |
| 43. | బ్రహ్మబిలము - గంటానాదము | 136 |
| 44. | దశవిధ ప్రణవనాదోపాసనలు | 138 |
| 45. | మనో నిగ్రహము | 141 |
| 46. | ఆత్మయజ్ఞోపాసన - ఆవస్యకత | 143 |
| 47. | ఆత్మయజ్ఞ మహిమ | 146 |
| 48. | మానసిక యాగము | 161 |

## పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ

కూచిపూడి నృత్య కళాకారులు

ఫోన్ : 08671 252336 - సెల్ : 94404 88057


వేదాంత శాస్త్రమునకు అంతర్విభాగములైనటువంటి భక్తి - జ్ఞానము - గుణత్రయ విచారణ - గుణాతీతము - ముద్రలు - శరణాగతి ఇత్యాది యోగములను సంగీత - తాళ - లయ - దరువు మొదలైన విన్యాసాల సమన్వయంతో ప్రదర్శించేదే కూచిపూడి నాట్యశాస్త్రము. నవరస నాట్యమాలిక.

అటువంటి కూచిపూడి నృత్యవేదంలో సుదీర్ఘకాలంగా అనేకమంది బహుప్రావీణ్యులైన కళాకారులచే ప్రదర్శించబడుతూ వస్తున్న ఒకానొక గొప్ప విశేషము "గొల్లకలాపము అనే ఆత్మయజ్ఞము"

ఇది శ్రీ భాగవతుల రామయ్యగారిచే రచించబడింది. ఒక విప్రుడు - గొల్లభామల మధ్య జరిగే ఆత్మతత్త్వ సంబంధమైన సంవాదము - సంభాషణ. కనబడే జగత్తును "స్వస్వరూపాత్మ ప్రదర్శనా విన్యాసం"గా ఆస్వాదించటం ఎట్లాగో - నేర్పే మార్గాలు అందించే ఆత్మవిద్య. భౌమా విద్య.

ఈ నృత్యకావ్యములో-బ్రాహ్మణ శబ్ద నిర్వచనము, గర్భస్థ శిశువు యొక్క మనఃస్థితి, ఈ జీవుడు పూర్వజన్మ వాసనలను వెంట నిడుకొని వచ్చి - పుట్టి వర్తమాన దృశ్య విశేషాలతో తన్మయుడవటం, యజ్ఞపట్టు, సర్వము పరమాత్మ తత్త్వముగా సందర్శించటానికి సాధనమైనట్టి ఆత్మయజ్ఞము... ఇవన్నీ కూడా విప్రుడు - గొల్లల మధ్య సంభాషణగా

అభివర్ణించబడతాయి.

అటువంటి నృత్య కావ్యములోని విశేషాలను కూచిపూడి వాడగు శ్రీ యేలేశ్వరపు హనుమరామకృష్ణ ఈ అధ్యయన - వ్యాఖ్యాన పుష్పముగా వచన, సంభాషణ రూపముగా మనకు అందిస్తున్నారు. ఈ రచయిత తాతగారు కూచిపూడి వాస్తవ్యులయిన యేలేశ్వరపు రామకృష్ణయ్యగారు. వారు ప్రాత: స్మరణీయులు, హరికథానిపుణులు, భక్తి - జ్ఞాన - స్తోత్ర - మంగళహారతి విశేషాలతో కూడిన పాటల రచయిత. మా అందరికీ ఆరాధ్యులు. అట్టి మహనీయులగు యేలేశ్వరపు రామకృష్ణయ్యగారి అంశయే ఈ మన హనుమరామకృష్ణ గారు అని మేమందరమూ అనుకుంటూ ఉంటాము.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.....

ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగిగా అనేక బాధ్యతలు నిర్వర్తిస్తూ కూడా మన చిరంజీవి హనుమరామకృష్ణ 32వేల శ్లోకాలతో కూడిన శ్రీ వాల్మీకి విరచిత శ్రీ వశిష్ఠ మహర్షి ప్రవచిత యోగవాశిష్ఠ గ్రంధాన్ని ఆమూలాగ్రము తెలుగు వచనముతో శ్రీ వసిష్ఠ రామసంవాదము అనే పేరుతో వ్రాశారు. అంతే కాకుండా శ్రీమత్‌భగవద్గీత, కఠోపనిషత్, ఈశావాస్యోపనిషత్ గ్రంధాలలోని విశేషాలను వచన రూపంలో వ్రాసారు.

తమ తాతగారు శ్రీ రామకృష్ణయ్యగారి పాటలను క్రోఢీకరించి అర్ధసారాంశములతో సహా వ్రాసి ప్రచురించారు.

పాఠకులు గొల్లకలాపములోని ఈ విషయాన్ని సులభంగా, సుమధురంగా ఆస్వాదించడానికి ఈ అధ్యయన - వ్యాఖ్యాన గ్రంధపుష్పము వ్రాయబడినది.

ఈ రచన కూచిపూడి నాట్య కళామతల్లికి మరొక ఆభరణం. భారతీయ తత్వశాస్త్ర విశేషాలను గొల్లకలాపంలో ఏ విధంగా పొందుపరచారో చాటి చెప్పే మధుర వాక్యములు. మనస్సులను జ్ఞాన విశేషాలతో రంజింపచేసే దివ్య గానము.

విప్రుడు - గొల్లభామలమధ్య జరిగే సత్సంగ సంభాషణలను వర్తమాన, భవిష్యత్ తరాలకు వ్యాఖ్యానముగా అందించబడుచున్న సారస్వత సౌరభము.

చిరంజీవి హనుమ రామకృష్ణ - కనకదుర్గ దంపతులను పుత్రపౌత్రాభివృద్ధిగా ఆశీర్వదిస్తున్నాను.

ఈ పుస్తకము నాట్యాచార్యులు, నాట్య విద్యార్థులు, వేద వేదాంత విద్యాపారాయణులు, ముముక్షువుల కళాభిమానుల చేతులకు చేరాలని మనందరి హృదయాలను ఆత్మ జ్ఞాన విశేషాలతో స్పృసించాలని ఆకాంక్షిస్తూ...

పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ

07-06-2011



# గొల్ల కలాపము - ఆత్మ యజ్ఞము

# అధ్యయన - వ్యాఖ్యాన పుష్పము

ఒక పరమ సత్యమును 'ఋతము' అంటారు. అట్టి మహత్తర సత్యమును లోకములకు - లోకస్తులకు తెలియజేసినవారు 'మహర్షులు' వారు చెప్పిన జ్ఞాన సారాంశము "తత్త్వశాస్త్రము". **"ఓ సర్వ సహజీవులారా ! ఒక మహత్తరమైన పరమ సత్యాన్ని మేము కనిపెట్టాం. అను నిత్యంగా ఆస్వాది స్తున్నాం. బ్రహ్మానందమును అనుభవిస్తున్నాము. అందరికి అనుభవ యోగ్యమైనది మీలో ప్రతిఒక్కరికి సంబంధించినది అగు ఆ పరమానంద స్వాత్మ వైభవవిశేషాన్ని మీకుచెప్పుచున్నాం! వినండి! మీలో ప్రతి ఒక్కరు ఇహస్వరూప (జీవాత్మ) పరమితులుగారు ! కానేకారు !**

**- పరస్వరూపులు ! పరతత్త్వస్వరూపులు !**

- నాటకంలో పాత్ర వహించే నటుడు తన స్వభావసిద్ధమైన స్వస్వరూపము పోగొట్టుకొని పాత్రగా మారుచున్నడా ? లేదే ! నాటకంలో పాత్ర నాటకంలోదే ! నటనయో, తనదే ! మీరెప్పుడూ సహజసిద్ధ పరస్వరూపులే ! ఇదంతా జగన్నాటకం ! **ఆత్మయందు ఆత్మకు అభిన్నమైన మనస్సు యొక్క కల్పన".** ఈ వేద ఉపనిషత్ - మహర్షి గాన సారభాసాన్ని **తత్త్వశాస్త్రము** (తత్ త్వమ్ అసి - అని నిరూపించే శాస్త్రము) ...... అని అంటారు.

అట్టి తత్త్వ శాస్త్రాన్ని వేదములలో ఒకరీతిగా, ఉపనిషత్తులలో మరొక విధంగా, పురాణాలలో ఇంకొక చమత్కారంగా, బ్రహ్మసూత్రములు - యోగవాసిష్ఠము ఇత్యాది వేదాంత గ్రంథములలో వేరొకపద్ధతి వైవిధ్యమైన

మాటలలో చెప్పారు. ఒకే విషయం చెప్పుచున్నారు. **"అది నీవు ! ఇది నీవు కాదు."** అదే సత్యము జానపదాలలోని పాటలలో, పల్లెపాటలలో వినబడుతూ ఉంటుంది. అటువంటి తత్త్వ శాస్త్రము చెప్పే అనేక రీతులలో ఒకానొక చమత్కారం కూచిపూడి సాంప్రదాయమైనట్టి యక్షగానాలు. నృత్య భంగిమలు, అడుగులు, తాళములు, లయలు, ముద్రలు ఇలా ఎన్నోవిశేషాల కూర్పు కూచిపూడి నాట్య కళ. అందులో ఒక విశేషము **గొల్లకలాపము. ఆత్మయజ్ఞము** అనునది దాని ద్వితీయ నామము. ఇదొక తత్త్వశాస్త్ర - అధ్యాత్మశాస్త్ర ప్రవచనా రూపమైన, అడుగులు-లయలు - తాళములు తో కూడిన కూచిపూడి దృశ్య నాటకము. ఇద్దరి మధ్య జరిగిన ఆధ్యాత్మిక సత్సంగ సంభాషణము.

## గొల్ల కలాపము అనే ఆత్మయజ్ఞము

**రచయిత :** కూచిపూడి గ్రామ నివాసులు, యోగ విద్యావిశారదులు, మహాపండితులు, బ్రహ్మీభూత-బ్రహ్మశ్రీ॥ భగవతుల రామయ్యగారు.

**కాలము :** 18 వ శతాబ్దము. పూర్వార్ధము

**దీని మూలవిరాట్ గాచెప్పబడిన వారు :** శ్రీ రామయ్యగారి తండ్రి శ్రీ భాగవతుల రామలింగం గారి శృతము - స్వీయానుభవము నుండి బయల్వెడలినది. అనుభవంలోంచి భాష వస్తుంది. భాషలోంచి అనుభవం కాదు కాదా ! అందుకే మూలవిరాట్ శ్రీరామలింగం గారు !

**నామాంతరములు :** పిండోత్తి - యజ్ఞపట్టు చెప్పి ఉండటంచేత "ఆత్మ యజ్ఞము" అని చెప్పబడుతోంది.

గొల్లభామ యొక్క వాగమృతం కాబట్టి **"గొల్ల కలాపము"** అని కూడా

పిలువబడుతోంది.

**దీనిని రక్తి కట్టించి ప్రదర్శించిన మహనీయులు :**

- శ్రీ తాడేపల్లి పేరయ్యగారు
- శ్రీ భాగవతుల విస్సయ్య గారు
- శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణగారు
- శ్రీ వెంపటి వెంకటనారాయణ గారు,
- శ్రీ భాగవతుల రామయ్యగారు,
- శ్రీ భాగవతుల రామలింగంగారు,
- శ్రీ వెంపటి పెదసత్యనారాయణగారు,
- శ్రీ భాగవతుల రామకోటయ్యగారు
- శ్రీ నటరాజు రామకృష్ణ గారు,

**ఇందులోని కొంతభాగం పరిష్కర్తలు :** శ్రీ బందా కనక లింగేశ్వర రావు గారి దర్శకత్వంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు.

**రేడియో ప్రసారకళాకారులు :** కళాప్రపూర్ణ శ్రీ చింతా కృష్ణ మూర్తి గారు.

**దీని రచయిత అయినట్టి శ్రీ భాగవతుల రామయ్య గారి స్వహస్త లిఖిత తాళపత్ర గ్రంధము కాపాడినవారు :** శ్రీ భాగవతులు రామలింగశాస్త్రి గారు.

**తాళపత్రగ్రంధముము కొంత పరిష్కరించినవారు :** శ్రీ రామలింగశాస్త్రి గారి శిష్యులు సాహిత్య రత్న - కావ్య భూషో కవితా సుధాకర - పండితరత్న బ్రహ్మశ్రీ చింతలపాటి లక్ష్మి నరసింహశాస్త్రి గారు

**ప్రచురించి వెలుగులోకి తెచ్చినవారు :** శ్రీ చింతలపాటి పూర్ణ చంద్రరావు

గారు.

వీరు శ్రీ॥ చింతలపాటి లక్ష్మీ నరసింహశాస్త్రి గారి ద్వితీయ పుత్రులు విద్వత్‌వరేణ్యులు. ప్రస్తుత నివాసం : కూచిపూడి - 521136 కృష్ణాజిల్ల ఆంధ్రప్రదేశ్. వీరు అనేక సార్లు ఈ గొల్లకలాపమగురించి ఉపన్యసించట జరిగింది.

**పై పెద్దలందరు నాకు పూజనీయులు.**

కూచిపూడి సాంప్రదాయ నృత్య విశేషమైన "ఆత్మయజ్ఞము" లేక 'గొల్ల కలాపము' మూలగ్రంథప్రతులు బ్ర॥ శ్రీ॥ చింతలపాటి పూర్ణచంద్రరావు గారి (కూచిపూడి - 521136) వద్ద లభిస్తున్నాయి. వారు ఎంతో శ్రమకు ఓర్చి ప్రచురించారు. అందరికీ నా మనవి ఏమిటంటే దయచేసి అట్టి సాంప్రదాయ నాట్య గ్రంథమును (వెల. రూ. 40/-) తెప్పించుకుని చదివి ఆనందించండి.

**ఇక : ప్రస్తుతం : నా గురించి రెండు మాటలు :**

కూచిపూడి పిల్లవాడినైన నేను బాల్యంలో శ్రీ భాగవతుల రామలింగ శాస్త్రిగారి కరస్పర్శను ఆస్వాదించాను. మా పితామహులు శ్రీ యేలేశ్వరపు రామకృష్ణ య్యగారు హరిదాసు.

**తండ్రి :** యేలేశ్వరపు లక్ష్మీ నారాయణ గారు.

**తల్లి :** యేలేశ్వరపు ఆదిలక్ష్మి కామేశ్వరమ్మ గారు.

**తండ్రి గారు జన్మత : మాతపితలు :** యేలేశ్వరపు ఆంజనేయులు, యేలేశ్వరపు త్రిపురాంబ గారు.

**నాతండ్రి గారి దత్తత మాతాపితలు :** యేలేశ్వరపు రామకృష్ణయ్య గారు యేలేశ్వరపు మంగమ్మ గారు

పైనచెప్పబడిన పెద్దలందరికి హృదయ పూర్వక సాష్టాంగదండ ప్రణామములు.

**మీ చేతులకు చేరుచున్న ఈ పుస్తకం గురించి :**

కూచిపూడి సంప్రదాయ అనునిత్య పరిశీలకులైన శ్రీ భాగవతుల లక్ష్మీ నరసింహం గారు నన్ను "యజ్ఞపట్టు గురించి నీకు అర్థమైనది రాసి ఇవ్వవయ్యా !" అంటూ ఉండేవారు. అప్పుడు బ్రహ్మభూత భాగవతుల రామయ్య గారి విరచితమైన మరియు సాహిత్యరత్న, కావ్య భూషణ, కవితా సుధాకర - పండితరత్న బ్ర ॥ శ్రీ ॥ చింతలపాటి పూర్ణ చంద్రరావు గారిచే ప్రచురితమైన, **'భామాకలాపము అనే ఆత్మయజ్ఞము'** పుస్తకము కొంచెం చదివాను. ఊరుకున్నాను. కానీ లక్ష్మీ నరసింహం గారు ఊరుకోలేదు, "యజ్ఞపట్టు గురించి" అని నావెంటనంటి అంటూ ఉండసాగారు. ఇక చేసేది లేక, మరికొంత చదవటం ప్రారంభించాను. కించిత్ పరిశీలనాత్మక దృష్టితో పరిస్తూఉండగా అందులోని అధ్యాత్మశాస్త్ర విశేషాలు నన్నుఆశ్చర్యపరిచాయి. నా బాల్యంలో కూచిపూడి నృత్యము శ్రీ వేదాంతం పార్వతీశంగారి వద్ద నేర్చుకొనేటప్పుడు చెప్పిన నృత్యసంబంధమైన వేదాంత విశేషాలు మరల నాకు కొంచెం గుర్తుకొచ్చాయి. "మొత్తము గొల్ల కలాపాన్ని - అధ్యయన పూర్వకంగా బ్రాహ్మణుడు- గొల్లభామల మధ్య జరిగే ప్రసంగాలను, సంవాదములను వర్తమాన సంభాషణాపూర్వకమైన తెలుగుభాషలో వ్రాస్తే అనేక మంది విషయాన్ని గమనించి ఆస్వాదిస్తారు కదా ! అని నాకు అనిపించింది. ఇక వ్రాయటం ప్రారంభించాను.

- ఎప్పటికైనా మూలమే గొప్పది.

- ఇది అధ్యయన పుష్పం మాత్రమే ! అర్థం చేసుకోవటానికి ఉ
పయోగపడే ఒక ఉపకరణం వంటిది.

పెద్దలు క్షమించాలి.

ఈ అధ్యయన సంవాదమును వ్రాస్తూ మూడు విషయాలలో స్వతం
త్రించాను. ఇదంతా చదివే వారి కళాదృష్టిని ఆకర్షించి ఇందలి విషయమును
ఇంకొంచము మధురంగా వారు ఆస్వాదించాలనేదే నా ఉద్దేశ్యం.

(1) సంభాషణ కూచిపూడిలో వేంచేసిన శ్రీ బాలత్రిపురసుందరీ సహిత
రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగినట్టుగా
వర్ణించాను.

(2) బాలత్రిపుర సుందరీ అమ్మవారు, రామలింగేశ్వర స్వామి వారి
పరంగా శ్రీ యేలేశ్వరపు రామకృష్ణయ్య గారు వ్రాసిన రెండు
పాటలు ప్రథమంగా జోడించాను.

(3) భగవద్గీత, యోగవాసిష్ఠము, ఇత్యాది గ్రంథాలలో చెప్పిన విషయా
అయా సంధర్భాలలో ఉచితం కాబట్టి, ఉదహరించాను.

ఈ 'ఆత్మయజ్ఞము' అనే భాగవతుల రామయ్యగారి గొల్లకలాపము
మహత్తరము. అనుక్షణికమైన 'ఆత్మోపాసన'కు శ్రోతను సిద్ధం చేసి "అహం
సర్వస్య ప్రభవో " అనే ఆత్మ మమేకరూపమైన సింహాసనాన్ని చూపించే
గొప్ప విషయం !

ఇదీ చదవండి ! శ్రీరామయ్యగారి గొల్లకలాపం (మూలగ్రంథము
కూడా చదవండి.

'గొల్లకలాపం' ప్రదర్శనను వీలుంటే సందర్శించండి. ఎంత ఆదందమో ! చెప్పలేను ! కావ్యేషు నాటకం రమ్యం !

ఒకే ఒక్క మాట. నా వంటి స్వల్పజ్ఞుడు ఇంతటి మహత్తర విషయాన్ని "అధ్యయనపుష్పం" గా రచించటం మహనీయుల సంకల్పమేమో! ఇదంతా పెద్దల ప్రతిభయే! ఈ పరిచయ వాక్యాలలో ఉదహరించిన మహనీయు లందరి పాదపద్మములను పేరు - పేరున హస్తద్వయంతో స్పృశిస్తూ కళ్ళకు అద్దు కుంటున్నాను. ముకుళిత హస్తాలతో నమస్కరిస్తున్నాను.

తప్పులుంటే అవి నావిగా క్షమించండి, అస్మత్ గురువులు శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి గారి స్వామివారికి నమస్కరిస్తూ

ఈ అధ్యాయన వాఖ్యాన పుష్పమును సర్వాంతర్యామి - సర్వతత్త్వ స్వరూపుడు - సర్వాత్మ స్వరూపుడగు శ్రీ బాల త్రిపురసుందరీ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామివారికి పాదపద్మార్చనగా సమర్పిస్తున్నాను. లోక కళ్యాణ మస్తు.

యేలేశ్వరావు హనుమ రామ కృష్ణ తేది : 31 - 07 - 2011

(Date of Retirement from Andhra Bank)

# I ప్రార్థన

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనమ్ ధ్యాయేత్ సర్వవిఘ్నో2 పశాంతయే ॥

శ్లో॥ అగజానన పద్మార్కం గజాననం అహర్నిశం

అనేకదం తం భక్తానాం ఏకదంతముపాస్మహే ॥

## II దేవీ ప్రార్థన - చతరస్రగతి

అంబా । పరాకు । దేవీ పరాకు । మమ్మేలుమా ! శారదాంబా పరాకు !
వాణీ పరాకు ! గీర్వాణీ పరాకు, వాణీ ! చక్కని నీల వేణీ ! పరాకు !
ఓంకారి ! కౌమారి ! వారాహి !శర్వాణి ! శాంకరివౌ లోకశక్తి ! పరాకు !
ఈరీతిగా నిన్ను కోరిన వారిని, గావవే, కనకదుర్గా ! పరాకు !
సరసిజ లోచను చెల్లెలి వై మమ్ము, గరుణించు బంగారు తల్లీ ! పరాకు
ఆరు వీధుల నడుమ అలరారు బంగారు మేడలొ వెలసిన తల్లీ ! పరాకు
మూడు మూర్తుల కిలను మూలమౌ కూచిపూడిలో వెలయు పూబోడి
పరాకు ! కనకాబ్రమ జలధిలో జలకములాడుచు, కులుకుచు దిరిగేటి కలికి
పరాకు !

అంబ పరాకు ॥ దేవి పరాకు ॥
మమ్మేలుమా ॥ శారదాంబ ॥ పరాకు ॥

## శ్రీ సీతారామదాసు వారి - జీవ బ్రహ్మ - మేలుకొలుపు

జీవ నీవే బ్రహ్మమని స్మృతి తెలుపంగ నీ కేల తెలియదు లేరా ..........
పరబ్రహ్మరూపము నీవై ఉండగా మరుపేల వచ్చెను లేరా ॥ జీవ నీవె
బ్రహ్మము ॥

'అ' కారమనియేటి అఖండ తేజము అది తెల్లనాయెను ....... లేరా ..........
ప్రాకారమనియేటి హృదయ కమలమందు విమలముగ జూతువు లేరా
జీవ నీవె బ్రహ్మము ॥

ఇలలో దారాపుత్రాది బాంధవుల చింత వలదు నీకు .......... లేరా .......

ఫలమేమి సంసారమమిత జన్మములాయె.

కలమేలుకొని ........ ఈ కల మేలుకొని

నిదుర లేరా ........... జీవ నీవె బ్రహ్మము ॥

ఎరుక లేక మాయ గృహములో పవళించి, మాయ గృహములో నిదురించి

చిరకాల మాయెను లేరా ..........

ఆధార రూపము - అకలంక రూపము

నీవై ఉండగ

మరుపేల వచ్చెను లేరా ........ జీవ నీవె బ్రహ్మము ॥

వివేక మను మంత్రి నేనొచ్చినాడ దుర్భావము పోనాడి లేరా ..........

భావించి చూడ ఈ సంసార జలధికి

నావా కావా నీవే లేరా ... జీవ నీవె బ్రహ్మము ॥

ధాంతి శాంతి ఉపరతి తితీక్ష లనియే

కాంతలు వచ్చిరి లేరా .........

భ్రాంతి ద్వేష దు:ఖ దుర్బుద్ధి రతుల

విఖ్యాతి నొందించెదవు లేరా .......... జీవా నీవె బ్రహ్మము ॥

సత్తు చిత్తుల రెంటి సమరసము తెలసియు సమ కూడెదవు గాక, లేరా ................

చిత్తు చిదానంద చిద్రూప రూపుడవై తత్సుఖము చెందెదవు లేరా! జీవనీవె బ్రహ్మము ॥

అజ్ఞానమని యేటి అంధకారము పోయి విజ్ఞానమాయేను లేరా ........

సుజ్ఞానమను సూర్యుడుదయించు వేళాయె ..........

ప్రజ్ఞ తెలుసుకు నిదుర లేరా జీవ నీవె బ్రహ్మము ॥

ఆనంద జలధిలో స్నానము చేసి

సుజ్ఞాన వస్త్రము కట్ట లేరా ........
నానా వేదాంత సిద్ధాంత భూషితుడవై
గంధ లేపనము చేయ,
నిర్మలగంధ లేపనము చేయ-లేరా .......
జీవ నీవె బ్రహ్మము ॥

శిఖను నిర్వి కల్ప పుష్పమాలిక చుట్టి
ప్రకృతి పీఠము నెక్క లేరా ........
అకలంక మగు ముద్ర ధరియించి దొరవై
సుఖ రాజ్య మేలుదువు లేరా .........
జీవ నీవె బ్రహ్మము ॥

శ్రీ గురు రామ బ్రహ్మేంద్రాదుల కృపచే
సద్భావము నీదాయే లేరా ...............
దుర్భావము లేదాయె లేరా ...........
యోగ మాయ నిదుర లేచి ఇకను .........
సంయోగమొందెదవు గాక..... లేరా
జీవ నీవె బ్రహ్మము ॥
భాసురముగ సీత రామ దాసునకు
బోధకుడవు నీవె ... లేరా .............
వాసిగ వేముల వాడలో వెలసిన
కైలాసపతి నిదుర లేరా ॥ జీవ నీవె బ్రహ్మము ॥

విద్వాన్ చింతలపాటి పూర్ణచంద్రరావు
S/o. లక్ష్మీనరసింహశాస్త్రిగారు.
ప్రథమ శ్రేణి తెలుగు పండితుడు (రిటైర్డ్)

(రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత)
కూచిపూడి - 521136 కృష్ణా జిల్లా AP
PHONE: 08671-252717

## ఆత్మయజ్ఞము - గొల్లకలాపము - పరిచయవాక్యాలు

## కూచిపూడి వారి కలాపములు - వాటి విశిష్టత

శ్లో ॥ దేవానా మిదమా మనన్తి, మునయః కాన్తం క్రతుం చాక్షుషమ్
రుద్రేణేదముమాకృత, వ్యతికరే, స్వాంగే విభక్తమ్ ద్విధా
త్రైగుణ్యోద్భవ మత్రలోక చరితమ్ నానారసమ్ దృశ్యతే ...... (కాళిదాసు)

నవరసభరితము, త్రైగుణ్యాత్మకము, లోకచారిత్రకము అయిన పార్వతీ పరమేశ్వరులు ప్రదర్శించిన నాట్యం **లాస్యము, తాండవము** అని రెండువిధాలు. ఈ నాట్యాన్ని మునులు చాక్షుషక్రతువన్నారు. చతుర్విధాభినయాత్మకమైన ఈ నాట్యము సాహిత్యపు గుబాళింపుతో యక్షగానముగా పరిణామం చెందింది. దక్షిణాంధ్రయుగంలో ప్రాచుర్య మొందిన ఈ యక్షగాన ప్రక్రియ దేశీయమైన సాహితీసంస్కృతులకు మూలమైంది. పౌరాణిక గాథలకు ఆలవాలమైన ఈ యక్షగానాలు కాలగతిలో వచ్చిన ఆటుపోటుల్ని తట్టుకుంటూ 17వ శతాబ్ది ఉత్తరార్థమున కలాపాలుగా రూపాంతరాన్ని చెందాయి. తదాది కవిపండితులు, నాట్యవిద్యావిశారదులైన కూచిపూడి భాగవతులు వీనిని విశిష్ట రూపకాలుగ, సార్వజనీనమైన సాహితీ ప్రకరణాలుగ మలిచారు. కలాప రచయితలుగ కూచిపూడిలో లబ్ధప్రతిష్టులైనవారు ఇద్దరు. వారిలో ఒకరైన సిద్ధేంద్రుడు కలాపరచనకు ఆద్యుడు కాగా, మరొకరు భాగవతుల రామయ్యగారు. శ్రీ

సిద్ధేంద్రులవారు శృంగార భరితంగా భామాకలాపాన్ని వ్రాయగా, శ్రీ రామయ్య గారు శాంతరస ప్రధానముగ వేదాంత చర్చతో "ఆత్మయజ్ఞము" అనే గొల్లకలాపాన్ని వ్రాశారు. ఈ రెండు కలాపాలు యక్షగాన సరస్వతి మణి మంజీరాలు. ఈరెంటి యందూ యక్షగాన రచనకు సంబంధించి దరువులు - ద్విపదులు - కందములు - కందార్ధములు - కురంగ, తురంగ ప్రయాతముల - రగడలు - సంధివచనాలు మొదలగునవి ఉండటమే గాక దరువులకు సంబంధించిన రాగ - తాళాలు గూడ పేర్కొనబడ్డాయి. సాహితీపరముగ ఈ రెండు కలాపాలు చక్కని రచనలు.

## గొల్లకలాపము

ఆంధ్ర దేశములో నేడు రెండు రకాల గొల్లకలాపాలు కనిపిస్తున్నాయి. మొదటిది ఊరగొల్లకలాపముగ లోకంలో వ్యవహరింపబడుతోంది. దీనిలో ప్రధానభూమిక గొల్ల, ఆమె చక్కగ సింగారించుకొని వాడవాడలా చల్ల పాలు అమ్మవస్తుంది. అలా వచ్చిన ఆమె తమ కులములోని తెగలను, ఆ తెగలవారి ఆయా ఆచార విచారాలలోని విధి-నిషేధాలను గురించి ఏకరువు పెడుతుంది. జగమంతా గొల్లమయమని సిద్ధాంతము చేసి తరువాత సముద్రమథన కథను వివరిస్తుంది. ఆపె పేరు మందయాన. ఈ కలాపమందంతటా గొల్లభామ గొంతే వినిపిస్తుంది.

**ఇక, రెండవది :**

ఆత్మయజ్ఞమను గ్లొకలాపము. దీనిలో కూడ ప్రధాన భూమిక గొల్ల భామే. అయితే ఈమెకు చెలికత్తెగ-హస్యగానిగ-కథా సంవిధాతగ సమయానుకూలముగ ఉపయోగపడే ఒక పురుషపాత్ర ఉంది. అది స్వాతిశయముతో గూడిన, వేదవేదాంగములు చదివిన, సంగీత

సాహిత్యాభినయాలలో అరితేరిన, స్పష్టోచ్ఛారణ, సమయస్ఫూర్తి కలిగిన బ్రాహ్మణ పాత్ర.

చల్లకుండ తలపై పెట్టుకొని 'పాలోయ్మపాలు- చల్లోయమ్మ చల్ల అంటూ - రంగ ప్రవేశము చేసిన గొల్లభామ సూత్రధారుని కోరికపై **'స్వామీ ! మేము గొల్లవారమయ్యా!'** అంటూ తనను సభకు పరిచయము చేసుకుం టుంది. అప్పుడా బ్రాహ్మణుడు పకపక నవ్వుతూ, **"ఆహాహా! ఏమి వారము? ఆదివారము, సోమవారము, మున్నగు వారములను విన్నారము గాని గొల్లవారమని వినియుండలేదమ్మా!"** అంటూ చర్చ ప్రారంభిస్తాడు. ఈ విధంగా గొల్లభామ- బ్రాహ్మణ పాత్రల సంవాదముతో పిండోత్పత్తి- క్రమము- యజ్ఞపట్టులను గూర్చి సమగ్రంగా చర్చగావింపబడి మానసయాగ ఆవిర్భావముతో ముగిసే ఈ వేదాంతోపన్యాసము సర్వమానవ సమానత్వానికి ఎంత వరకు దోహదకారి అయిందో రేఖామాత్రంగా చూద్దాం.

❋

అనాది నుండీ యజనయాజన క్రియలు బ్రాహ్మణ ధర్మాలుగ పరిగణింప బడ్డాయి. కాలాంతరములో అవి బ్రహ్మజ్ఞాన పరిజ్ఞానానికి అంతగా దోహదకాలు కాలేదు. కారణం? మానవ జీవన విధాన ప్రాతిపదికపై ఏర్పాటు చేసికొనిన వర్ణవ్యవస్థ కట్టడికి, తూట్లు పడటం- ఆంగ్ల విద్యాప్రభావం వలన బ్రాహ్మణీకానికి పారమార్థిక చింతన సన్నగిల్లి లౌకిక విషయాలపై ఆసక్తి అధికం కావడమూను. ఇటువంటి కారణంగా విరాట్పురుషుని "బ్రాహ్మ ణో౽స్యముఖమాసీత్ బాహూరాజాన్య: కృత:, ఊరూ తదస్య యద్ వైశ్య:! పద్భ్యాగుమ్ శూద్రోఅజాయత" - అనే వేద ప్రామాణికవాక్యాలు విపరీదార్థాలకు దారితీశాయి. అట్టితరి, చేయు యజ్ఞ-యాగాదులు

అజ్ఞానపుటావధుల నధిగమించుట లేదని బ్రాహ్మణ పాత్ర ద్వారా కవి ఇలా అంటాడు.

**"యజన యాజనాది యఖిల కర్మలనెపుడు, ఎద్ది సేయవలయు నద్ది యపుడె, మొనసి సల్పు బ్రహ్మముఖ సముద్భవమ్మైన, బ్రాహ్మణులమె, గొల్లభామ మేము!!.**

'జన్మనా జాయతే శూద్ర:' అను విషయమును మరచి 'బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణ:' అను వాక్యానికి ఉదాహృతులుగాక. కించిత్ జాత్యహంకారముతో విప్ర వీగు తరుణమున చేయబడు యజ్ఞయాగాది క్రతువులు జ్ఞానాంజన శలా కలుగావని గుర్తుచేస్తాడు, సమాజములో కుళ్ళిపోయిన వర్ణవ్యవస్థకు **"తల్లితండ్రుల వలన గలిగనట్టి యా తనువులన్ని యొకటి కాదా! ఇలలో మేమధికులమను, అతిశయములు తొలగగ"** అంటూ మంగళముపాడి ఆధ్యాత్మిక భావనతో భారతీయ సంస్కృతిలోని మహత్తరమ్మైన విజ్ఞానరహస్యాలను అవగహన చేసికొని సర్వమానవ భ్రాతృత్వాన్ని, సమానత్వాన్ని పెంపొందించుకొని మనుగడ సాగించాలని సూత్రీకరిస్తాడు. 'దేవో దేవాలయ: ప్రోక్త: జీనోదేవ: సనాతన: అనే శ్రుతి వాక్యం ప్రతివారికీ అనుసరణీయమని, చెబుతాడు. **ఇదే ఆత్మయజ్ఞ కలాపోదయానికి నాంది.**

❋

పూర్వం బ్రాహ్మణవంశంలో తాతగాని, తండ్రిగాని, యజ్ఞం చేయలేక పోతే ఆవంశీకులు దౌర్బ్రాహ్మణులుగ పరిగణింపబడతారని, దానిని తొలగించుకోవడానికి వారు ప్రాయశ్చిత్త పశువును- అంటే తెల్లని వెంట్రుకలు లేని మేకను-విలిచి యూపస్తంభానికి కట్టి, దానిని వధించి, ఆపలలాన్ని భక్షిస్తే దౌర్బ్రాహ్మణ్యాం తొలగుతుందనీ, అట్టి విధివిధానంగా ప్రతి బ్రాహ్మణు

డూ యజ్ఞం చేసి తరించాలని పెద్దలు తీర్మానించారని యజ్ఞపట్టులో గొల్లభామచే గుర్తు చేయబడుతుంది.

**"యజ్ఞములు చేయు విప్రుల యందు మున్ను, తనదు తాత తండ్రులు యజ్ఞమును గడంగి, చేయకున్న దౌర్బ్రాహ్మణుడా యఘుంబు మాన్ప బ్రస్తుతమున జేయు మహిత కార్యము, విను డనుమానమును వీడి ఘనము మీర !!"**

**"మొదలు ప్రాయశ్చిత్తమునకంచు.... పదపడి పురోడాశమనుచు తిందురు!!**

అని సీసార్థములో అనిపిస్తాడు. తుదకిదియొక అంధ విశ్వాసంగా మారిందనీ అంటాడు. సకల కర్మలూ వేదం నుండి పుట్టాయనీ, ఆ వేదం అక్షరము నుండి జన్మించినదనీ, అందువల్ల సర్వవ్యాపకుడయిన పరబ్రహ్మ యజ్ఞపురుషునిగ పిలువబడతాడని బ్రాహ్మణ పాత్ర ద్వారా 'వినుము కర్మ లెల్ల వేదమందు జనించె ...... యజ్ఞ రూపుడనగ మించి రూఢి గాంచు!!" అని అనిపించి, దానికి సమాధానముగా భామచే "ఇటులనంగ తగునా? ఈ సభలో నందరువినంగ" అనే దరువుద్వారా జీవ హింసతో గూడిన-శరీరాయాసమును కలిగించే- ద్రవ్యమును వ్యయపరచే- యజ్ఞములు గొప్పవని గుడ్డిగ నమ్మి, చేసి, సోమయాజులమనిపించుకొనుట కన్నా - అనవద్యమగు భక్తియె సాధనమనీ, ఆసాధన వలన బ్రహ్మనాడి నెరింగి ఆనాడికి యగ్రభాగాన ఉన్న సుషిరము ద్వారా బ్రహ్మండాన్ని పరికించి దృష్టిని అనాహత చక్రాన ప్రవేశ పెడితే ఒక విధమైన నాదం వెలువడుతుందనీ, అది **"నాదము తైల ధారవలె ...... పెద్దల చేతనెప్పుడున్!!"** అనియనిపిస్తాడు. కాన వీరు - వారనక మానవులందరూ

ఇట్టినాదము నెరింగి మనోద్విపమును ధారణాయోగమన్ త్రాటితో కట్టి - సద్గురు బోధనమను అంకుశంతో పొడుస్తూ - నిశ్చల జ్ఞానమనే స్తంభానికి బంధించి అహింసాయుత మార్గం ద్వారా అమనస్కులై పరబ్రహ్మతత్త్వమను అమృతాన్ని ఆస్వాదించి బ్రహ్మ సోమయాజులనిపించుకోవాలని ఈ దృశ్య ప్రబంధం ద్వారా కవి ప్రజలకు సందేశమిస్తాడు. ఇందు లౌకిక పారలౌకిక విషయాలను, భగవద్గీతలోని ఆత్మసంయమము, మోక్ష, సన్యాసగాలలో గల గంభీరమైన క్లిష్టమైన అంశాలను, పండితపామరులకు అర్థమగునట్లు యుక్తి ప్రయుక్తులతో-వాద ప్రతివాదాల తో యజ్ఞయాగాదులు చేయుట వలన బ్రహ్మజ్ఞానమలవడదనీ, అందుకు ఆత్మయజ్ఞమే శరణ్యమని గొల్లభామ, బ్రాహ్మణపాత్రల ద్వారా సహేతుకముగ ప్రతిపాదింపబడిన కూచిపూడి కలాపప్రయోగము.

ఇందు పిండోత్పత్తికి సంబంధించిన ప్రకరణములో గర్భధారణ -గర్భస్థ శిశువుఉండుచోటు - అది ఆహారాన్ని స్వీకరించే పద్ధతి - అది చేయు దైవ ప్రార్థన- జననము ఇత్యాది విషయాలు - వస్తాయి **'మునికొని జీవుండు మెనసి నక్షత్రమై....... కాంత గర్భమందు శోణితమున గూడి యంత గట్టిపడుచు నొక ముద్దయై గర్భధారణ** జరుగునని,శిశవు ఆహారాన్ని స్వీకరిస్తూ **'అబ్బబ్బా ! ఎటులా సైతునీ గర్భ నరకవేదనలూ- గొబ్బున దీని వెడలుట నాకే దబ్బున తోచనేమందూ'** అనియేడుస్తూ **'మదిలో సర్వచరాచరాత్మకుని, సన్మౌనీం ద్రుని హృత్పంకజాదినేశుని ప్రభు నప్రమేయ.....** అని దైవ ప్రార్థన చేయుననీ, **'వేదాభ్యాసేన విప్రత్వం బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణః' 'అగ్నిర్దేవో ద్విజాతీనామ్'** వంటి ప్రామాణిక వాక్యాలనుదహరించి వర్ణవ్యవస్థ మానవ కల్పితమేగానీ దైవ కృతముగాదని చెప్పబడుతోంది. మాతృగర్భం నుండి వెలువడిన జీవుని శరీరానికి బ్రాహ్మణత్వము లేదా శూద్రత్వమనే గురుతులు

లేవని 'శరీర భిన్నం పరమాత్మ మేకం' వంటి వచనాలతో వివరిస్తాడు. ఈ సందర్భంగా మాతంగ వశిష్ఠమునుల జన్మక్రమాన్నీ, వారు బ్రహ్మత్వాన్ని పొందిన విధానాన్ని సులభసుందరంగా ఇలా వివరిస్తాడు.

'ఊర్వశీ గర్భ సంజాతో వశిష్ఠశ్చ మహాముని:' అని !

తత్త్వ నిరూపణ సమయాన జీవునిలో గల అన్నమయాది పంచకోశ వివరణ 'అన్నమయాదన్నమయం.......' అని ఉదాత్తముగా చెప్పబడింది. కర్మచే ద్విజులైనవారు తామధికులమని భావించుట సాంఘిక సదాచారం కాదని స్థిరీకరింపబడింది.

ప్రతివ్యక్తీ సర్వమానవసమానత్వాన్ని పాటిస్తూ గుణత్రయంబునొందక విజన స్థలంలోకి ప్రవేశించి పద్మాసనాసీనుడై ధారణా యోగమవలంబించి విషయేంద్రియాలను జయించి పరుడు- నేను అనే భేదాన్ని విడిచి **'సర్వం ఖల్విదం బ్రహ్మ** 'సర్వమునూ బ్రహ్మమయముగ భావించువారే బ్రాహ్మణులని నిరూపించబడింది. ఆత్మయజ్ఞాన్ని గూర్చి - షట్చక్ర, స్థూల సూక్ష్మ శరీర వివరణను గూర్చి శ్రుతిప్రమాణంగా గొల్లభామచే సోదాహరణంగా చెప్పబడినది. తనహృదయ కమల కర్ణికాంతరమందున్న ఆత్మను తెలుసు కోవలెనని ప్రవచింపబడినది. ఆత్మయజ్ఞమును చేయువారు పరిమితమైన మమతానురాగాలను త్యజించి, రాజయోగమునందాసక్తి గలిగి, యోగ మాయా చేష్టల నెరింగి, సంసారమునందు విరాగముగల్గి విదేహునివలె ముక్తి కాంతా భోగాసక్తికి ఉద్యమించి మానసయాగం చేయాలని ప్రబోధింపబడింది. దానితో బ్రాహ్మణుని అహంకారం పటాపంచలౌతుంది. ఇటువంటి యాగాన్ని కూచిపూడి అగ్రహార నివాసియగు భాగవతుల వంశ పయ:పారావార రాకానిశాకరులగు రామలింగ నామ విరాజితులచే చేయబడినదని

లక్ష్యముదాహరింపబడినది.

ఇందు అష్టమూర్తి స్వరూపుడైన పరమేశ్వరుని బ్రాహ్మణపాత్రలో ఆవహింపజేసి, ముక్తికాంతను గొల్లభామగా రూపుదిద్ది, కవి సాక్షీభూతుని నిలచి గొల్లభామ- బ్రాహ్మణ పాత్రల ద్వారా పిండోత్పత్తి క్రమము ద్వారా సాంఘికదురాచారమైన వర్ణవ్యవస్థను నిరశిస్తూ - యజ్ఞపట్టు ద్వారా జంతుబలులను నిషేధిస్తూ-ఆత్మయజ్ఞము ద్వారా అహింసాయుతమైన మానస యాగాన్ని ప్రతిపాదిస్తూ వేదాంత రహస్యాలను సర్వమానవ విజ్ఞాన వికాసానికి తోహదపడే విధంగా సాంఘిక, ఆధ్యాత్మిక విషయాలను పడుగు - పేకలా నేసిన చీనాంబరం ఈ. గొల్లకలాపం'.

విశ్వనాథ వారి మాటలలో

'గొల్ల కలాపం షట్ఛాస్త్రములకు నిలుకడ' - కలాపాలు ఈ విధంగా కమనీయంగా అల్లబడిన దృశ్య ప్రబంధాలు -

'నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనమ్'

ఇక ఈ అధ్యయన - వ్యాఖ్యాన పుష్పమును ఆస్వాదించండి !

**చింతలపాటి పూర్ణ చంద్రరావు**

08671-252717

# కూచిపూడి నాట్యవేద - ఆత్మయజ్ఞము అనే గొల్లకలాపము

## అధ్యయన - వ్యాఖ్యాన పుష్పం

## 1. అగ్రహారం

**కూ**చిపూడి అగ్రహారము! హేమంత ఋతువు. ఒకానొక శుభోదయం!

ఒక గొల్లభామ రోజూలాగానే శిరస్సుపై పాలు-పెరుగు-వెన్న పాత్రలను ధరించి,

"పాలోయమ్మ పాలో! వెన్నోయమ్మ వెన్న"

అని సుమధురంగా పలుకుతూ ......,

మధ్యమధ్యలో ..........,

- అమ్మా! "బాలత్రిపుర సుందరీ! మము పాలన చేయవమ్మా! మాయమ్మ!
- తండ్రీ! "సర్వ భూతములును తానై, సర్వసాక్షి అనగా వేరై, సర్వ బ్రహ్మాండములకు తానే సూత్రధారియై...! హే రామలింగేశ్వర స్వామీ!"

అని కూనిరాగాలు పాడుతూ ......,

వేదయజ్ఞ - యాగవిధి కోవిదులైన విప్రవర్యులు, యోగులు, ఉపాసకులు మొదలైనవారు నివశించే ఇళ్ళు ఉన్నట్టి వీధులలో సంచరిస్తూ ఉన్నది. హొయలుగా - చురుకుగా అడుగులు వేస్తోంది.

క్రమంగా **శ్రీ బాల త్రిపుర సుందరీ సహిత రామలింగేశ్వర స్వామి** ప్రాంగణం సమీపించింది. దేవాలయపు గోడలు స్పృశిస్తూ ఉండే రచ్చబండపై కించిత్ శ్రమచేత కాబోలు, కూర్చుని ఉన్నది.

శ్లో॥ **పుంఖాను పుంఖ విషయనుక్షణ తత్పరోఽపి**
**బ్రహ్మావలోక ధిషణం న జహాతి యోగి ॥**
**సంగీత తాళ లయ నృత్య వసంగతోఽపి,**
**మౌళిస్తకుంభ పరిరక్షణ ధీర్నటీవ॥**

అని యోగుల గురించి అన్నట్లుగా, ఆగొల్ల తలపై మూడుపాత్రలు ప్రకాశిస్తున్నాయి.

కాసేపటికి, సేదతీర్చుకోవడానికి కాబోలు, తలపై పాత్రలను రచ్చ బండపై దించి ప్రశాంతంగా స్వామి శిఖరం వైపు చూపు సారిస్తూ ఉన్నది!

ఇంతలో,

**ఒకానొక బ్రాహ్మణుడు ......,**

బ్రాహ్మీ ముహూర్తంలో నిదురలేచి తన గృహంలో
సంధ్యావందనము, దేవతార్చన, సూర్య నమస్కారాలు
వేదవిహితంగా నిర్వర్తించి, ముగించుకొని .........
ఉష : కాలపు ఎండను ఆస్వాదిస్తూ ......,

వేద శబ్దాలు తనలో తాను నెమ్మదిగా గానంచేస్తూ ఆ రచ్చబండవైపుగ వచ్చారు. ఆయన ముఖము విభూతి-గంధలేపనములతో గంభీరంగా ప్రకాశిస్తోంది. పండిత శాలువా భుజాన- మెడచుట్టూ వ్రేలాడుతోంది. మెడలో

పొడవుగా రుద్రాక్షలు వ్రేలాడుచున్నాయి.

ఆ బ్రాహ్మణుడు యాదృచ్ఛికంగా గొల్లభామవైపు చూచారు. వాత్సల్యము - చిరునవ్వులతో కూడిన ఆ గొల్లభామ ముఖంలో ఏదో అలౌకికానందం వెల్లివిరుస్తున్నట్లు ఆయనకు అనిపించింది. కాసేపు పలకరింపుగా సంభాషించాలనే ఉత్సుకత ఆయనకు కలిగింది. కొంచము దూరంగా రచ్చబండపై తానుకూడా ఆశీనులయ్యారు.

## 2. ఉభయ కుశలోపరి

**బ్రాహ్మణుడు :** ఓ తరుణీమణీ! నీ ముఖారవిందమున ఏదో అనిర్వచనీయము - అలౌకికము అగు ఆనందంతో కూడిన ప్రశాంతత నాకు కనబడుతోంది. నీ ఆకారం-చిరునవ్వు చూస్తుంటే మాకు, ఈ సభాసదులకు ఏదో చెప్పలేని సంతోషం కలుగుతోందమ్మా!

ఎవరమ్మా నీవు? ఏం చేస్తూ ఉంటావ్?

**గొల్లభామ :** హే మహాత్మా! పాదాభివందనములు. నేనా? మేము ఊరూరా తిరిగి పాలు-పెరుగు-వెన్న-చల్ల అమ్ముకొనే వాళ్ళం. చూస్తూనే ఉన్నారు కదా! మేము గొల్లవారము.

**బ్రాహ్మణుడు :** శతమానం భవతు! సుఖీభవ! (కించిత్ వినోదంగా నవ్వుతూ) గొల్లవారమా? మేము ఆదివారము విన్నాము. సోమవారము అనగా విన్నాము. మరి ఈ 'గొల్లవారము' అంటే?

**గొల్లభామ :** మీరు వేదవేత్తలు! బ్రహ్మజ్ఞులు! ఏదో చమత్కారంగా అంటూ ఉంటారు మీకు అన్నీ తెలుసు. అది సరీలేండి గాని, రుద్రాక్షలు, విభూతి, గంధము, పట్టుపంచ, శాలువ ధరించి మీరు అపర బ్రహ్మవలె నాకు కనబడుచున్నారు. మీ వాక్కు మధురంగాను, గంభీరంగానూ ఉన్నది.

మీరూపు-రేఖలు మాకు మీ పట్ల ఎంతో గౌరవం కలిగిస్తున్నాయి.

గొప్ప తేజస్సుతో ప్రకాశించే మీరెవ్వరో చెప్పితే ........ నేను - ఈ సభకు వేంచేసిన మహాశయులు సంతోషిస్తాము స్వామీ! దయచేసి

వివరించరూ!

**బ్రాహ్మణుడు :** మేమా? ఉత్తమ కులజులమగు బ్రాహ్మణులము.

**గొల్లభామ :** అట్లాగా? ..... అయితే,

**బ్రాహ్మణుడు :** ఊ! ఏమైనా అడగాలనుకుంటున్నావా ఏమిటి?

**గొల్లభామ :** అవును. మీ అనుజ్ఞ అయితే!

## 3. షట్కర్మలు - షోడశకర్మలు

బ్రాహ్మణుడు : ఓ ! తప్పకుండా! నీకు ఏఏ సందేహాలుంటే..... అవన్నీ అడుగు. వేద - ఉపాంగ విహితంగా, శృతి-స్మృతి పూర్వకంగా నీ సందేహాలకు సమాధానం ఇచ్చి అవన్నీ తొలగిస్తాము. సమాధానాలు చెప్పటానికి మేము సిద్ధం.

**గొల్లభామ :** 'మేము ఉత్తమ కులజులము' అని అన్నారు కదా! అనగా.....?

**బ్రాహ్మణుడు :** అదా! 'బ్రాహ్మణులము' - అని చెప్పాను కదా! జన్మతః బ్రాహ్మణ్యం మా వృత్తి - ప్రవృత్తి కూడా! మేము షట్కర్మ నిష్ఠులమై ఉంటాము.

**గొల్లభామ :** షట్కర్మలా! అనగా?

**బ్రాహ్మణుడు :** ఉత్తమమైన బ్రాహ్మణ కులంలో జన్మించటం చేత మేము షట్-ఆరు విధాలైన కర్మలు (Functions) దైనందికంగా (Every Day) నిర్వర్తిస్తూ ఉంటాము.

**గొల్లభామ :** అవి ఏమేమిటి? చెప్పరూ!

**బ్రాహ్మణుడు :** చెపుతాను, విను.

1. యజనము - యజ్ఞాలు, యాగాలు నిర్వర్తించటం
2. యాజనము - యజ్ఞయాగ, పూజావిధులు నిర్వర్తింపచేయడం. చేయించటము.

3. అధ్యయనము - వేద-వేదాంగాలు పఠించటము. పరిశీలించటము.

4. అధ్యాపనము - వేద-వేదాంగాలు పఠింపజేయుటం. వ్యాఖ్యానించటము. వినిపించటము.

5. దానము - ఇతరుల క్షేమము కొరకై ఉద్దేశ్యించటం. కర్మలు నిర్వర్తించటము. దాన-ధర్మాలు నిర్వర్తించటం. ఇతరులకు కూడా ప్రోత్సహించటం.

6. ప్రతిగ్రహణము - ఇచ్చేది ఇచ్చినంత వరకు ప్రశ్నించకుండా పుచ్చుకోవటము. ఆశీర్వాద వాక్యాల ద్వారా సర్వజనులకు క్షేమకారులవ్వై, శ్రేయస్సు కోరుకునేవారమై ఉండటం.

అంతే కాదు!

ఈ ప్రజల చేత జన్మ-దేహ-లౌకిక సంబంధమైన ఆయా సందర్భోచితమైన - శాస్త్రములలో చెప్పబడే కర్మలు కార్యక్రమములు నిర్వర్తింపజేస్తూ, పురోహితులమై ఉంటాము. అందరిచేత గ్రహదోషాలు తొలగే మంత్ర-క్రియలు చేయిస్తూ, దోషనివారణ కలుగజేస్తూ ఉంటాము. దానాలు చేయిస్తూ ఉంటాము.

**గొల్లభామ** : వివిధ కర్మలు చేయిస్తూ ఉంటారా? అంటే? మరికొంత విశేషంగా వివరించరా, మహాత్మా!

**బ్రాహ్మణుడు** : అనగా పుణ్యాహవాచనం, జాతకకర్మ, నామకర్మ, విద్యాభ్యాసం, ఉపనయనం, వివాహం, షష్టిపూర్తి, సహస్రచంద్రదర్శనం, ఆయా వ్రతాలు ...., నోములు, పూజలు, గ్రహదోషనివారణ శాంతులు, ఇత్యాది షోడశ కర్మలు - 16 రకాల కర్మలు, .... అందరి చేత వారివారి ఇళ్ళలోనూ, దేవాలయాలలోనూ శాస్త్రాలలో చెప్పిన మంత్ర-తంత్రానుకూలంగా చేయిస్తూ ఉండే మంత్ర - తద్విధాన సామర్థ్యము కలవారము. ఎవ్వరిచేత- ఏఏ సందర్భాలలో ఎప్పుడెప్పుడు- ఏఏ శాస్త్రవిహిత కర్మలు చేయించాలో అవన్నీ ఎరిగినవారమై ఉంటాము. జనులకు మార్గదర్శకులమై పూజ-యజ్ఞ-యాగ-వ్రతములు చేయించే అర్హత

మాకున్నది. బ్రహ్మ యొక్క ముఖము నుండి పుట్టిన బ్రాహ్మణ కులజులం. అందుచేత విశిష్టమైనటువంటి వారుగా జనులచే పూజింపబడుతూ లోకానికి శ్రేయస్సు కలుగజేస్తూ ఉంటాము.

**గొల్లభామ :** స్వామీ! ఒక్కనిముషము ఆగండి. మీరు చెప్పుచున్న మాటలలో కించిత్ విపరీతమైన అర్థము నాకు కనిపిస్తోంది.

**బ్రాహ్మణుడు :** ఏమున్నది? చెప్పు!

**గొల్లభామ :** "మా ఈ బ్రాహ్మణ జన్మలు ఉత్తమమైనవి. విశిష్టమైనవి" అని పదే పదే అనటం న్యాయమా? ప్రపంచంలో ఎక్కడ పుట్టినా- ఏ మానవుడైనా తన తల్లి-తండ్రుల నుంచే భౌతిక దేహం పొందటం జరుగుతోంది. ఈ కనబడే భౌతిక శరీరాలన్నీ కూడా ఒకే రీతిగా తల్లి గర్భంనుండి బయల్వెడలి, క్రమంగా ఈ ప్రకృతి ప్రసాదించే ఆహారం చేత పరిపోషించబడేవే కదా! మరి "మా జన్మలు మాత్రము కొంత ప్రత్యేకమైనవి. మేము ఉన్నత కులజులము" అని అంటున్నారేం?

**బ్రాహ్మణుడు :** ఓ గొల్లభామా! "ఈ జీవులందరి జన్మలు ఒక్కతీరైనవే"..... అని అనటం భావ్యం కాదు. కర్మలను అనుసరించి కదా, జన్మలు వస్తూ ఉంటాయి! అటువంటి పూర్వ కర్మలు వేదవిహితంగాను- వేదానుకూలముగానూ ఉండటం చేతనే మేము బ్రాహ్మణ జన్మ పొందటం జరుగుతోంది. ఇది పురాణాలలో చెప్పబడ్డ మాటే! "వేదోక్తమైన కర్మలచేత బ్రాహ్మణులు పూజనీయులు"..... అని మీ గొల్ల పెద్దలు అనగా నీవు ఎప్పుడూ వినియుండలేదా? మరొక్క విషయం. మేము ద్విజులము కూడా కదా!

**గొల్లభామ :** 'ద్విజులు' అనగా?

**బ్రాహ్మణుడు :** నీవు చెప్పినట్లు, అన్ని భౌతిక దేహాలు ఒక్కతీరుగానే తల్లి గర్భం నుండి బయల్వెడలుచున్న మాట నిజమే! అయితే బ్రాహ్మణ కులంలో జన్మించిన మేము ఉపనయనము ద్వారా వేద విద్యకు అర్హత పొంది రెండవ జన్మ పొందిన వారము అవుతున్నాము. అందుకే 'ద్విజులు' అని మమ్ములను అంటూ ఉంటారు.

**గొల్లభామ :** "జన్మ - కర్మల విధిని అనుసరించి మేము బ్రాహ్మణులము"

అని అన్నారు కదా! 'బ్రాహ్మణ' శబ్దము యొక్క అర్థాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక్క విషయం మనవి చేయవచ్చునా స్వామీ!

**బ్రాహ్మణుడు :** ఊ! అట్లాగే!

## 4. నా౽హమ్ దేహమ్! - సో౽హమ్!

**గొల్లభామ :** ప్రతి జీవుడు పుట్టినప్పటి నుండీ ఏదో ఒక కర్మ నిర్వర్తించవలసినదే కదా! ఎవ్వరు ఏవిధమైన కర్మలు నిర్వహించినప్పటికీ .....,

"- నేను వేరు, ఈ దేహము వేరు.

- నేను బ్రహ్మమే స్వరూపముగా కలవాడను.

- ఈ దేహమో, 'దేహి'నైన నాకు ఒకానొక ఉపకరణము మాత్రమే!ఇక కర్మలో, ప్రకృతికి సంబంధించినవి! మనోబుద్ధి - చిత్త - అహంకారాలు కూడా ఉపకరణములే!"

అను 'ఎరుక' నిశ్చలంగా కలిగి ఉన్నప్పుడు కదా, ఒకానొక జీవుడు 'బ్రహ్మభూతుడు' అని అనిపించుకోగలిగేది! సర్వ దేహములలో సర్వదా సమంగా ప్రకాశించే బ్రహ్మమును ఎరిగి బ్రహ్మమే తానై బ్రాహ్మణుడు - అయ్యేది! అవునా?

**బ్రాహ్మణుడు :** అవును. అది నిజమే! అందుచేతనే మేము చిన్నప్పటినుండీ కూడా .....,

"నా౽హమ్ దేహమ్!

అహమ్ బ్రహ్మోస్మి"

అనే వేదమహావాక్యాలు, వాటి-వాటి అర్థాలు నేర్చుకుంటున్నాము. వేదాధ్యయనము చేస్తున్నాము. వేదములలో చెప్పబడిన కర్మలను అందుకు సానుకూలంగా నిర్వర్తిస్తున్నాము. వేదవిహితంగా పంచయజ్ఞములు ఆచరిస్తూ, దేహభ్రమను విడచి **"బోధరూపమగు పరబ్రహ్మమే నేను!**

**సోऽహమ్**" అని గ్రహించి వర్తించువారము. అది దృష్టిలో ఉంచుకునే, "**బ్రాహ్మణ జన్మ ఉత్తమమైనది**" అని శాస్త్ర-పురాణ-ఇతిహాసములు వర్ణిస్తున్నాయి. ఇది నీవెప్పుడూ వినలేదా?

**గొల్లభామ** : హే మహానుభావా! మీరు పంచయజ్ఞములు నిర్వర్తిస్తూ ఉండవచ్చుగాక! అంతమాత్రం చేత ......,

"మేమే ఈశ్వరుని తెలుసుకున్నాం. యజ్ఞములు చేయనివారికి ఈశ్వరుని గురించి తెలియరాదు. జన్మచేత బ్రాహ్మణులమగు మేమే బ్రహ్మజ్ఞులము. బ్రహ్మము గురించి ఎరిగినవారము"

-అనే అభిప్రాయం కలిగి ఉండటం ఉచితమంటారా? అటువంటి అభిప్రాయం వలన - సర్వాత్మకుడగు శ్రీరామలింగేశ్వరస్వామిని తెలుసుకోవటం అనవచ్చునంటారా ?

**బ్రాహ్మణుడు :** మేము వంశాచారంగా, వ్యవస్థాపూర్వకంగా పంచయజ్ఞములు నిర్వర్తిస్తున్నాము. వాటిచే ఈశ్వరుని మెప్పిస్తున్నాము. పరబ్రహ్మమగు ఈశ్వరుని ముఖంల నుంచి పుట్టుచున్నామని 'బ్రాహ్మణోऽస్యముఖమాసీత్' అను వాక్యము పురుషసూక్తములో చెప్పటం నీవెప్పుడూ వినలేదా? ఆ కారణం చేతనే, ఓ చంచలాక్షీ! మమ్ములను "బుధులు - బ్రాహ్మణులు" అని జనులు శ్లాఘిస్తూ వుంటారు కదా!

**గొల్లభామ** : మీరు చెప్పేది సాంసారికమైన అహంకారము సూచించుచున్నదేమో మహనీయా?

- మేము పంచయజ్ఞాలు నిర్వర్తించే బ్రాహ్మణ వంశంలో జన్మించాము!
- బ్రహ్మ యొక్క ముఖంలోంచి వచ్చాము!
- బ్రాహ్మణులమయ్యాము!
- అందుచేత ఇతరులకంటే అధికులము!

..... అనే అహంకారం అనుచితమేమో? శాస్త్ర ఉద్దేశ్యము అదేనా? మీరు చెప్పేది శాస్త్రసమ్మతమేనంటారా?

**బ్రాహ్మణుడు :** ఎందుకు కాదూ! వేదవిహితమైన కర్మలు, అనుష్ఠానము వంశపారంపర్యంగా అనుసరించే బ్రాహ్మణకులంలో పుట్టి బ్రాహ్మణులమయ్యాము. నీకు శాస్త్రవచనాప్రవచనాలపై గురిగాని, పట్టుగాని లేనట్లున్నదే? శాస్త్రములు వినకుండా ఏదో కొంచెం కొంటెతనంగా మాట్లాడుచున్నావేమమ్మా?

**గొల్లభామ :** మహాశయా! పుట్టుకచేతనే ఒకడు బ్రాహ్మణుడు అవుతాడా? వాస్తవానికి అందరి పుట్టుక ఒక్కతీరైనదే కదా! "జన్మనా జాయతే శూద్రః। కర్మనా జాయతే ద్విజః॥ - జన్మచేత ప్రతి ఒక్కడు శూద్రుడే! కర్మచేతనే ద్విజుడు అవుతాడు" అనే శ్రుతి వాక్యాలు ప్రమాణవాక్యాలు కావా?

**బ్రాహ్మణుడు :** ఓహో! ధర్మ శాస్త్రవాక్యాలు బాగానే చెప్పుచున్నావే! నాకు సంతోషమే! అయితే ..., ఒక వాక్యం పూర్వపక్షమా? సిద్ధాంతమా? నీవు చెప్పిన ధర్మ శాస్త్రవాక్యము విషయంలో అది వివేచనయా (Is it an Analysis)? సూచనయా (Is it an Indication)? దశల వర్ణనమా (Is it a Stage by Stage discription)? గమనించి, అప్పుడు మాట్లాడాలి సుమా!

సరే! అది అట్లా కాసేపుంచు.

## 5. భౌతిక దేహము

**బ్రాహ్మణుడు :** "దేహములన్నీ ఒక్క తీరైనవే!" అని బహు సాహసంగా పలుకుచున్నావే!

ఈ వర్తమాన భౌతికదేహము జీవుని పట్ల ఎట్లా రూపుదిద్దుకుంటోందో నీకు తెలుసా? తెలిస్తే, తెలిసిఉన్నంత వరకు చెపుతావా?

**గొల్లభామ :** స్వామీ ! గురుతుల్యులగు మీవంటి పెద్దలు కొందరి దగ్గర విన్న విషయములు - విశ్లేషణను గుర్తుకు తెచ్చుకుంటూ పంచభూత సమ్మేళణము అయినట్టి భౌతికదేహము ఏ విధంగా రూపుదిద్దుకొంటోందో, నాకు తెలిసినది చెపుతున్నాను. వినండి.

**పూర్వదేహస్థితి :-** ఈ జీవుడు భౌతిక దేహంతో **"నేను దీనికి చెందిన వాడను - ఇది నాకు చెందింది. దేహమునకు నాకు అవినాభావ**

**సంబంధము"** ... అని జీవితాంతం రోజులు గడుపుచున్నాడు. అనగా, అజ్ఞానవశంగా మరణ సమయం ఆసన్నమయ్యే క్షణం వరకు దేహభావమును కొనసాగిస్తూనే ఉండటం జరుగుతోంది.

-"నేను దేహమాత్రుడను. దేహముచే పరిమితుడను.

- ఈ దేహమే నా రూపము। వీరంతా నా బంధువులు!

- వీరు నావారు ! వారు కాదు!

- ఇంతెందుకు! ఈ భౌతిక దేహమే నేను!

- అంతేకాదు. నేను కర్మబద్ధుడను కూడా!"

ఇటువంటి బలవత్తరమైన-సాంసారికమైన (దృశ్య సంబంధమైన) అజ్ఞాన భావనా తరంగాల మధ్యలో మసలుతూ ఉండగా, ఇంతలో ఒకానొక క్షణంలో ఈ భౌతిక దేహం చమత్కారంగా నిరుపయోగమవటం జరుగుతోంది. **'మరణము' అనే విరామం సంప్రాప్తిస్తోంది.**

ఆజన్మాంతరము 'దేహమే వాఽహమ్' భావనల కారణంగా దృశ్యము పట్ల ఆతడు ఘనమైన మోహమునకు వశమై ఉండటం జరుగుతోంది. **"నా తల్లిదండ్రులు-నా భార్య - నా భర్త - నా పిల్లలు - నా మనుమలు - నా పేరు - నా ఇల్లు - నా సంపద- నేను సంపాదించిన ఆస్తి - నా ప్రతిష్ఠ - నా ఊరు - నాజాతి"** ..... ఇత్యాది మనోభావాలే ఆతడు పరిపోషించుకుంటున్నాడు. అంతేకాని, స్వాత్ముడు, సర్వాత్మకుడు, సకల రూపములు తానైనవాడూ, సర్వసాక్షిగా వేరైనవాడు, అప్రమేయుడై ఉన్నవాడు - అగు ఈ రామలింగేశ్వర స్వామి యొక్క **"శివతత్త్వజ్ఞానము"** కొరకై ప్రయత్నించకున్నాడు. **"చిదానంద రూపం- శివోఽహమ్-శివోఽహమ్"** అనే ఆత్మతత్త్వ జ్ఞానానికి ఉద్యుక్తుడు కావటం లేదు. మృత్యువు వచ్చిపడుచున్నప్పుడు కూడా **"నా వారు ఏమౌతారో? పరాయి వాళ్ళు నా సొమ్ములు మ్రింగుతారేమో! నా వారి కొరకు నేను ఏమి చేయాలో? వీరు-వారు నా సొమ్ములు సొంతం చేసుకుంటారేమో? వీళ్ల పెళ్ళిల్లు - వాళ్ల ఉపనయనాలు, నా పేరు - ప్రతిష్ఠ - గౌరవాలు"....** అని అనుకుంటూ, దు:ఖాలు - భయాలు - వేదనలు - రోదనలు కొనసాగిస్తూ తెలిసీ

తెలియకుండా భౌతిక దేహం త్యజిస్తున్నాడు. ఫలితం? **పునరపి జననం. పునరపి మరణం. పునరపి జననీ జఠరే శయనం.**

పూర్వదేహానంతరము ఆ విధంగా అటువంటి అజ్ఞాన జీవుడు ఇతః పూర్వపు - సత్కర్మపు - దుష్కర్మపు ప్రభావములు, తత్సంబంధమైన భావావేశాలను అనుసరించి స్వర్గమో (సాత్విక సుఖ ప్రేమాదులతో కూడిన భావనాస్రవంతి), నరకమో (దుఃఖము-ఆదుర్దా-భయము ఇత్యాదులతో కూడిన భావనాస్రవంతియో) మనో అనుభూతం చేసుకుంటున్నాడు.

అయితే .....,

"జన్మించినవాడు మరణించకమానడు. మరణించినవాడు తిరిగి జన్మించక మానడు - జాతస్యహి ధృవో మృత్యుః ధృవం జన్మ మృతస్యచ। ".... అని కదా గీతా వాక్యం!

**బ్రాహ్మణుడు :** మరణించినవాడు తిరిగి ఎట్లా జన్మిస్తున్నాడు? అది కూడా చెప్పు! నీ వాక్చాతుర్యంతో అమృతవాణి వినిపించవమ్మా! మేమందరమూ విని సంతోషిస్తాము.

## 6. పునరపి జననం

**గొల్లభామ :** మరణించినవాడు భౌతికమైన ఇంద్రియములు కోల్పోవు చున్నప్పటికీ ...... అతని యొక్క (1) భావనా చైతన్య సత్త (2) ఆత్మ చైతన్య సత్త కొనసాగుతూనే ఉంటాయి.

అజ్ఞానపూర్వకమైన భావనావేశముల చేత మరొక దేహము కొరకై తాపత్రయపడుచున్నాడు. అట్టి భావనా దేహంతో ఆ దేహి ......,

- ఆకాశంలో నక్షత్రాకారంగా కొంతకాలం గడుపుచున్నాడు.
- ఆ తరువాత సూర్య కిరణాలలో ప్రవేశించి మరి కొంతకాలము.
- అటు తరువాత ఎప్పుడో మంచుకణ రూపంలో నేలపై వ్రాలుచున్నాడు.
- ఆ మంచుకణం నేలపై ఇంకుట చేత భూమిలో ఓషధ రూపుడై

ఇంకొంతకాలము.

- ఆ తదనంతరం అన్నరసరూపుడు అగుచున్నాడు.
- ఆ అన్నరసం భక్ష్య - భోజ్య-లేహ్య-చోహ్య (నమిలి మింగేది : కొరికి తినేది : పీలుస్తూ మింగబడేది : చప్పరించబడేది) రూపంగా ఆకలిగొన్న పురుషునిచే స్వీకరించబడుతోంది.
- దేహంలో ఆ విధంగా ప్రవేశించిన అన్నరసము 'శుక్లము' రూపమును సంతరించుకుంటోంది.
- ఆ పురుషుడు స్త్రీ యొక్క ఋతుకాలంలో స్త్రీతో సంగమించటం జరిగినప్పుడు శుక్లము 'శోణితము'తో ఏకము అవుతోంది.

**బ్రాహ్మణుడు :** (చిన్నగా నవ్వుతూ) ఏమిటేమిటి? "చైత్రము - వైశాఖము - జేష్ఠము - ఆషాఢము - శ్రావణము - భాద్రపదము - ఆశ్వయుజము - కార్తీకము - మార్గశిరము - పుష్యము - మాఘము - పాల్గుణము".... అనే 12 మాసముల కాలమానం అందరికీ తెలిసిందే! "వసంతము - గ్రీష్మము - శరదృతువు - హేమంత - వర్ష-శిశిర " అనబడే 6 ఋతువుల గురించి ఈ శ్రోతలందరికీ చిరపరచయమే! నీవు "స్త్రీ యొక్క ఋతుకాలంలో".... అని అంటున్నావు. అంటే?

**గొల్లభామ :** అదా! స్త్రీ బహిష్ఠు అయిన రోజు నుండి 14వ రోజువరకు 'ఋతుకాలము' అని అంటారుగా, స్వామీ! ఋతుకాలంలో ఆ స్త్రీతో పురుషుడు సంగమించడం జరిగినప్పుడు ఆ శుక్ర - శోణితముల మిశ్రమం స్త్రీ యొక్క నాభికమలములోని గర్భసంచిలో ప్రవేశించటం జరుగుతోంది. తద్వారా శిశుదేహము రూపుదిద్దుకుంటోంది.

- శుక్ర ప్రభావపు ఆధిక్యత చేత - పురుష శిశువు
- శోణితము యొక్క ప్రభావపు ఆధిక్యత చేత - స్త్రీ శిశువు
- శుక్ర - శోణితములు బీజ ద్వయం పొందితే - శిశు ద్వయం (కవల పిల్లలు)

- రెండింటి యొక్క సమాన ప్రభావం కారణంగా - నపుంసక శిశువు ..... గా అవటం జరుగుతోంది.

ఇక్కడ, ఒక ముఖ్య విషయం.

**జీవుడు తన యొక్క పూర్వ కర్మ సంస్కారముల ప్రభావం చేత-దృశ్యములో ఏదో పొందవలసింది ఉన్నది అనే ఆవేశం చేత శిశు దేహధారణకు ఉపక్రమించటం జరుగుతోందని కూడా అనవచ్చు.**

ఆ విధంగా స్త్రీ యొక్క నాభికమలములో బీజము ప్రవృద్ధమగుచూ, క్రమంగా శిశు దేహము రూపం పొందటం జరుగుతోంది.

**బ్రాహ్మణుడు :** బాగు బాగు! కానీ కొందరు దంపతులకు అతి దీర్ఘకాలం (లేదా) ఒకొక్కసారి జీవిత పర్యంతము శిశువులు కలగకపోవటం జరుగుతోంది కదా...!

**గొల్లభామ :** ఇదంతా ఈశ్వరమాయా చమత్కారం. భిన్నత్వంలో ఏకత్వం. కొందరి విషయంలో ఆ దంపతులు రమించే సమయంలో వారిలో ఒక్కరి (లేదా) వారిద్దరి బుద్ధి-మనస్సులు చాంచల్యానికి లోను కావటం జరుగుతోంది. ఆ కారణంగా కొందరు దంపతులకు అపుత్రత్వం సంభవిస్తోంది.

**మనోచాంచల్యము** = ఇతః పూర్వపు దోషకర్మల - వ్యతిరిక్త కర్మల తీవ్ర ప్రభావం. 'దోషము' రూపమైన తీవ్ర భావన!

అందుకే ....., సంతానం కావాలనుకునే దంపతులు 'ఋతుకాలము' యొక్క గుర్తును కలిగి ఉండటం, "సత్సంతాన ప్రాప్తి కలుగుగాక" అను భగవదనుగ్రహ ప్రార్థనా పూర్వకమైన భావం కలిగి ఉండటం **ఉపాసనతో** సమానంగా పెద్దలు పరిగణిస్తారు.

అయితే కూడా ఒక్క విషయం. ఇదంతా మాయా చమత్కారం. ఏకత్వములో అనేకత్వ నాటకీయం - అని గుర్తెరుగుదము గాక!

శుక్ర-శోణితముల సమ్మేళనమైన బీజరూపం నాభికమలంలో ప్రవేశించిన మొదటి రాత్రి చింతపడు - పెరుగుల సమ్మేళనము వలె

ఉంటోంది.

- క్రమంగా 5వ రోజుకు 'నురుగు'లాగా రూపం పొందుతోంది.
- 15వ రోజుకు అడుసు (బురద)వలె అవుతోంది.
- క్రమక్రమంగా అది గట్టిపడి పిండము (ముద్ద) రూపంగా రూపుదిద్దుకుంటోంది.
- ఒక నెల రోజులకు ఆ పిండమునకు తల యొక్క ఆకారం ఏర్పడటం జరుగుతోంది. క్రమక్రమంగా తల భాగంలో వేరువేరు విభాగాలు ప్రవృద్ధమౌతున్నాయి.
- 2 నెలలకు రెండు చేతుల ఆకారాలు బయల్వెడుచున్నాయి.
- 3 నెలలకు పొట్ట, చేతివ్రేళ్లు, కాళ్లు - ఆకారాలు రూపం పొందుచున్నాయి.
- 4 నెలలకు నవరంధ్రాలు ఏర్పడి, ఇక ఆ రూపము తల్లి గర్భంలో కదలటం ప్రారంభిస్తోంది.
- 5 నెలలకు ఆ దేహాకారంలో రక్త-మాంసములు, వాటి యొక్క సంచలనములు ప్రారంభమౌతున్నాయి.
- 6 నెలలకు కాళ్లు-చేతులు-గోళ్ళు-దవడలు ఏర్పడినవై చైతన్యవంతము అగుచున్నాయి.
- 7 నెలలకు ఆ దేహము సంపూర్ణజీవత్వం పొందటం జరుగుతోంది. ప్రేగుల పదార్థంతో తయారైన ఒకానొక తిత్తిలో ఆ దేహము ఉండిఉండటం జరుగుతోంది. దానినే 'మావి' అని పిలుస్తున్నారు. 7వ నెల ప్రారంభంలో ఆ దేహాకారంలో 'ఎఱుక-' అనే జ్ఞానాంశ (లేక ప్రజ్ఞాంశ) ప్రత్యక్షమౌతోంది.
- ఆ శిశుదేహము మావి అనబడే మాంసపు తిత్తిలో కదలుచూ క్రమంగా తల్లి ఆరగించిన ఆహారములోని కొంత విభాగమును పొందుతూ ఆస్వాదించటం ఆరంభిస్తోంది.

- క్రమంగా సుఖదుఃఖ అనుభూతులు ప్రారంభమౌతున్నాయి. తల్లి ఆరగించే .....

- సాత్వికాహారం చేత సుఖమును,

- రాజసిక ఆహారమైతే సుఖ-దుఃఖ సమ్మిళితమును,

- తామసికమైన ఆహారం కారణంగా వేసట-వ్యసనములను పొందటం జరుగుతోంది.

**బ్రాహ్మణుడు :** చాలా బాగా వివరిస్తున్నావు. అయితే ఆహారపు లక్షణాల గురించి కూడా చెప్పుతావామరి?

## 7. ఆహారము

**గొల్లభామ :**

**(1) సాత్వికాహారం :** రుచిగా-తియ్యగా మధురమైన రసంతో కూడి ఉన్న ఆహారం.

**(2) రాజసికాహారం :** కమ్మగా-చప్పగా-కొంచము కొంచము కారము - ఉప్పు రుచులతో కూడిన ఆహారం.

**(3) తామసిక ఆహారం :** అధికమైన కారము-ఉప్పు-చేదు-వగరు మొ॥ వి కలిగియుండే ఆహారం. మత్తు పదార్థముల వలన ఏర్పడే మొద్దుతనము.

**బ్రాహ్మణుడు :** తల్లి తింటున్న ఆహారము యొక్క రసవిభాగము శిశువు దేహానికి ఎట్లా చేరుతోంది?

**గొల్లభామ :** కొన్ని నాళములు తల్లి దేహములోని ప్రేగుల నుండి - 'మావి' అనే తిత్తిలోని శిశువు యొక్క బొడ్డులోనికి చొచ్చుకొన్నవై ఉండటం జరుగుతోంది. తల్లి తినుచున్న ఆహారములోని కొంత రసవిభాగం ఆ నాళములలోని సూక్ష్మరంధ్రముల ద్వారా శిశువు యొక్క దేహములోనికి ప్రవేశించటం జరుగుతోంది, ఆహా! ఎంతటి సృష్టి చమత్కారం !

అయితే అట్టి ప్రక్రియ నెరవేరటానికి ఒక కారణం శిశువు యొక్క పూర్వ కర్మల ప్రభావమేనని కూడా విజ్ఞులు అంటూ ఉంటారు.

ఆ శిశువు తల్లి తినే ఆహారరసమును నాళముల ద్వారా పొందుతూ కించిత్ ఉత్సాహంతో కదలటం ప్రారంభిస్తోంది. ఆ కదలిక మరికొంచెంగా అధికం అగుచున్నప్పుడు అట్టి కదలికలకు వెసులుబాటు కాక, .... క్రమంగా ఇరుకుగదిలో బంధించబడిన ఏనుగు వలె ఆ శిశువుకు అప్పటి స్థితి అనుభవమౌతోంది.

అంతే కాకుండా ..... మరో విషయం.

తల్లి యొక్క పొట్టలో ఆహారం జీర్ణింపజేయడానికి ఉత్పత్తి అయ్యే 'జఠరాగ్ని' యొక్క ఉష్ణస్పర్శ చేత ఆ శిశువు ఎంతో వేసట పొంద నారంభిస్తోంది.

ఆ వేసటను తప్పించుకోవడానికి చేసే ప్రయత్నములో ఆ శిశువు గర్భసంచిలో క్రిందవైపుగా కదలటానికి ప్రయత్నిస్తోంది. అక్కడేమో పురీషనాళము అడ్డం! పురీషనాళము నుంచి బయల్వెడలే మల-మూత్రముల దుర్వాసనచే 'అసహ్యత' పొంది, భరించలేక ఆ శిశువు మరల పైకి కదలుతూ వుంటోంది. ఈ లోగా, ఆ శిశువు యొక్క దేహాకారం రోజురోజుకు పెరుగుతూ ఉంటుంది. ఒక విధంగా ఆ శిశువు బహుదీనదశను అనుభవిస్తూ ఉంటోంది.

## 8. గర్భనరకము - శిశువేదన

**బ్రాహ్మణుడు :** అవును కదా! ఆహా! ఏమి ఆ శిశువు యొక్క దుస్థితి! మావిలో చిక్కుకొని యున్న దేహము రోజురోజుకూ వృద్ధి పొందుతూ ఉండటమా! మరొకవైపు మలమూత్రముల దుర్వాసన-జఠరాగ్ని యొక్క ఉష్ణముల మధ్య అల్పస్థలంలో అగుచాట్లు పడుతూ ఉండటమా! దానినే **'గర్భ నరకం'** అంటారు కదా!

**గొల్లభామ :** అవును. ఇంకొక వైపు నుండి అప్పుడప్పుడే చైతన్యం పొందే కాళ్ళు- చేతులు కదల్చటానికి అవకాశము, స్థలము లేక బిగబెట్టుకొని ఉండవలసి వస్తోంది. అదంతా ఆ శిశువుకు దు:ఖప్రదమేనని గర్భశాస్త్రం ఎరిగిన పెద్దలంటారు. **"ఆ శిశువుకు గర్భనరకం ఎందుకు ప్రాప్తిస్తోంది?"** ..... అనునది శాస్త్రీయంగా పరిశీలిస్తే, **"ఇత:పూర్వపు జన్మలలో - జడమగు భౌతిక దేహమే నేను"** - అనే రూపమైన దేహాభిమానం ప్రవృద్ధం చేసుకుంటూ

ఆత్మతత్త్వజ్ఞానాన్ని తగినంతగా పరిశీలించకపోవటం చేతనూ, ఒకవేళ పరిశీలించినా కూడా తగినంతగా హృదయస్థం చేసుకోకపోవటం చేతనూ! యోగాభ్యాసము - భక్తియోగము - ఆత్మజ్ఞానము - ఇత్యాదులు పూర్వజన్మలలో అభ్యసించి ఉంటే..., ఆ శిశువు ఆ గర్భనరక వేదన తాను పొందక అతీతంగా ఉండగలిగేదే!

**ఇక ఇప్పుడు, ఆ శిశువు ఆలోచనలలో పడుతోంది.**

- "అయ్యయ్యో! ఎక్కడి నుండో కాని ఏవేవో వేడి వాయువులు, మరొకవైపు నుండి భరించరాని దుర్వాసనలు వచ్చిపడి నన్ను బాధిస్తున్నాయే? ఏమిటి నా ఈ గతి?
- హే జగన్మాతా! జగజ్జననీ!
- ఓ దైవమా!
- పరమహంసల హృదయాలలో వేంచేసి ఉండే ఓ రామలింగేశ్వరస్వామీ! హే సర్వాత్మకా! ఓ సర్వేశ్వరా! ఎక్కడున్నావయ్యా?
- నేను ఇత:పూర్వపు అనేక జన్మలలో దర్శించియున్న జగత్తులకన్నిటికీ ఆధారభూతుడా!
- ఆయా పూర్వ జన్మలలో నీ పాదములు ఆశ్రయించకుండా జగదృశ్య పరవశంతో ఏవేవో దుష్టకర్మలను ఆశ్రయించి, తత్ఫలితంగా ఈ గర్భవాస దు:ఖాలన్నీ తెచ్చిపెట్టుకొన్నానే?
- ఓ పరమాత్మా! నీవు సర్వరక్షకుడివని పురాణద్రష్టలు వర్ణిస్తున్నారు కదా! ఈ గర్భవాసం నుండి నన్ను రక్షించండి!

**ఈ రీతిగా గర్భవాసదు:ఖాలు అనుభవిస్తూ ఆ జీవుడు క్రమంగా యోచించటం ప్రారంభిస్తున్నాడు.**

- అబ్బబ్బబ్బా! ఈ గర్భవాస నరకవేదన నేను భరించేదెట్లా?
- ఈ గర్భస్థానం నుండి బయటపడే మార్గమేమీ లేదా? ఉపాయం ఏమిటి?

- మార్గము, ఉపాయము చెప్పి నన్ను ఇక్కడినుండి రక్షించే వారెవరు? ఎక్కడున్నారు?

- ఎంతకాలం ఈ వేదనను అనుభవించాలి?

ఆహా! ఇత: పూర్వపు దేహాలు, దేహసంబంధ సందర్భములైనటువంటి తల్లి-తండ్రి-భార్య- పుత్రులు- పుత్రికలు - మనుమలు- ఇష్టమైనవారు - అయిష్టమైనవారు - అయినవారు - కానివారు - ఇవన్నీ ఇప్పుడేవీ? ఎక్కడికి పోయాయి? అవన్నీ ప్రతి ఒక్కసారి 'నిజమే' అని అనుకొని రాత్రింబవళ్ళు సంపద ఇత్యాది అల్పకాలపు మెరుపులాగా మెరిసే విషయాలను నమ్ముకొని కాలం వృథా చేసుకున్నానే! ఓ పరమాత్మా!

**ఓ రామలింగేశ్వరా ! ఎక్కడయ్యా నీవు?**

- ఈ జఠరాగ్ని జ్వాలలు నేను భరించలేకపోతున్నాను. ఇది తప్పేదెలా? ఏదీ త్రోవ?

- అలసిపోతున్నాను. బాధ భరించలేక మూర్ఛపోతున్నాను.

- ఇత: పూర్వపు సంపదలు- సంతానము - బంధువులు - సేవకులు మొదలైనవారు ఏరీ? ఇక్కడికి వచ్చి నన్ను రక్షిస్తారా? లేదు.

- ప్రారబ్దవశంగా ఇక్కడికి వచ్చి చిక్కుకున్నానే! దారి తెలియకున్నదే?

- **ఓ శ్రీహరీ!**

- నేను దేహ-దృశ్య తాదాత్మ్యము చెందుతూ అనేక ఉపాధి పరంపరలు వృథా చేసుకొన్నట్లు, ఇంద్రియ వశంగా అనుభూతులు పెంపొందించుకున్నట్లు నాకు ఇప్పుడు క్రమంగా జ్ఞప్తికి వస్తున్నాయి. నేరం ఎంచకు స్వామీ!

- ఇత: పూర్వ జన్మలలో అనేక సార్లు మాయలో పడి సర్వాత్మకుడవు - సర్వతత్త్వ స్వరూపుడవు అగు నిన్ను స్మరించనే లేదు కదా! పెద్దలు - శాస్త్రములు **శృణ్వంతి విశ్వే అమృతస్య పుత్ర:** అని మొత్తుకుంటూ చెప్పినా వినలేదు కదా!

- ఎట్లాగైనా ఈ గర్భచెర నుండి బయల్వెడలే త్రోవ చూపించు. బయల్వెడలానా, ఇక అశ్రద్ధ చేయను. పరమాత్మనే స్మరిస్తాను. పునర్జన్మ హేతువులైన కార్యక్రమములకు ఉపక్రమించను. దృశ్య వ్యవహారములతో తదాత్మ్యము చెందను!

........ అని ఆ శిశువు మనస్సులో వేదనలు చెందుతూ గావు కేకలు పెట్టుచూ ఉంటాడు.

**బ్రాహ్మణుడు :** ఓ లలనామణీ! ఆ గర్భస్థశిశువు యొక్క గర్భయాతనా పరంపరలు నీవు వర్ణించి చెప్పుతూ ఉంటే, ....... ఒళ్ళు గగుర్పొడుస్తోంది. "పరమాత్మ తత్త్వాన్ని ఆశ్రయించి పున: పున: జన్మల జాడ్యం ఎంత త్వరగా వదిలించుకోవాలి!" ....... అనే విషయం మాకందరికీ గుర్తుచేస్తున్నావు. సంతోషం. ఓ గొల్లభామా ! ఇంకా చెప్పు! ఆ శిశువు అట్టి గర్భచెరసాలను అనుభవిస్తూ ....... ఎట్లా ఏరీతిగా బయల్వెడలుచున్నాడు?

## 9. భూమిపై పడటం

**గొల్లభామ :** స్వామీ! వినండి! చెపుతాను.

ఆ గర్భస్థ శిశువు తన మనస్సులో **"సర్వచరాచరాత్మకుడు-మునీశ్వర హృదయ విహారి - జగత్ విభుడు - ఆద్యంత శూన్యుడు - సర్వ స్వరూపుడు - ప్రభువు"** అగు పరమాత్మను గర్భ చెరసాల నుండి విముక్తికై త్రోవ చూపించమని వేడుకుంటూ ఉన్నాడు కదా! తనకు తానుగా త్రోవ దొరకక అల్లల్లాడిపోతూ ఉంటున్నాడు. కొంతసేపేమో రోదన-వేదన-వేసట అనుభవిస్తున్నాడు. మరి కొంతసేపేమో అవాక్-మానస గోచరమైన పరబ్రహ్మ ము యొక్క అనుభవమును పుణికి పుచ్చుకున్న బ్రహ్మజ్ఞాని వలె ఏదో ధ్యానిస్తూ మౌనంగా ఉంటున్నాడు.

ఈ విధంగా క్షణాలు-నిమిషాలు-గంటలు-రోజులు లెక్కపెట్టుచూ కాలం గడుపటం జరుగుతోంది. **"భూమిపై ఎప్పుడు పడతానా?"** అని ఎదురుచూస్తూ - ఉబలాటపడుతూ ఉంటాడు.అధ్యాత్మ సంబంధమైన సాధనల గురించి ప్రణాళికలు యోచిస్తూ ఉంటాడు. క్రమంగా 10 మాసాలు గడుస్తున్నాయి.

ఒకానొక సమయంలో .....,

సర్వాత్మకుడగు శ్రీరామలింగేశ్వరస్వామి యొక్క కరుణా సముద్ర తరంగాల రూపంగా తల్లి గర్భంలో ఎక్కడి నుండో 'ప్రసూతి వాయువులు' బయల్వెడలుచున్నాయి. ఆ శిశుదేహాన్ని అధోముఖం చేస్తున్నాయి. క్రమంగా నెట్టుచున్నాయి. ఊపిరి సరిగ్గా ఆడక ఆ శిశువు ప్రసూతి వాయుశక్తిచే నెట్టబడుచూ తల్లి యొక్క రహస్య ద్వారం గుండా బహిర్గతుడై భూమిపై పడుచున్నాడు.

భూమిపై పడిన మరుక్షణం వర్తమానానుభవములచే స్పృశించబడి 'మాయ'చే కప్పబడుచున్నాడు.

## 10. ఏమరపు

**బ్రాహ్మణుడు :** భూమిపై పడిన ఆ శిశువు ఇత:పూర్వం తల్లి గర్భంలో గుర్తు చేసుకొన్న పూర్వజన్మల అనుభవ-అనుభూతులను, వాటికి సంబంధించిన జ్ఞాపకాలను,ప్రణాళికలను పూర్తిగా మరచిపోతున్నాడా? లేక కించిత్ ఏమరుస్తున్నాడా? కాక, జ్ఞప్తి పథములో కలిగియే ఉంటున్నాడా? అంతా మొదలంట్లా మరచి ఎదురుగా ఇప్పుడు ఇంద్రియాలకు తారసబడే దృశ్యప్రపంచంపట్ల ఆసక్తి పొందినవాడై ఉంటున్నాడా? ఇక్కడ జరుగుచున్నదేమిటి? చెప్పవమ్మా!

**గొల్లభామ :** తల్లి గర్భం నుండి భూమిపైకి పతనమైన (చేరిన) ఆ శిశువు (లేక) జీవుడు, "అమ్మయ్యా! ఇప్పుడు గొప్ప ఆపద తొలగిందిరా బాబూ!"... అని అనుకుంటూ సంతోషం పొందుతూ ఉంటాడు. కొద్ది క్షణాలలో క్రమక్రమంగా అనేక ఇత:పూర్వపు నారీజన- బంధు- కళత్ర- మిత్ర- విషయ వ్యవహార సంబంధమైన విశేషాలన్నీ ఏమరుస్తున్నాడు. **అవన్నీ సంస్కారముల రూపంలో జీవుని స్వభావము నందు దాగినవై ఉంటున్నాయి.**

మరికొద్ది క్షణాలలో మనోగతమైన ఇంద్రియార్థముల ద్వారా (శబ్ద-స్పర్శ - రూప - రస - గంధములకు సంబంధించిన మనోగతమైన సామర్థ్యముల ద్వారా) వర్తమానంలో దృశ్యాంతర్గతంగా లభించిన నూతన దేహము యొక్క ఇంద్రియములకు గోచరమగుచున్న విశేషములలో నిమగ్న

మగుచున్నాడు. అనగా ఇప్పుడు వినబడేవి, (అమ్మ యొక్క తీయటి పిలుపులు), స్పర్శ (అమ్మ యొక్క చేతులు - బుగ్గలను, నడుమును తాకుచున్న అనుభూతులు), ప్రియంగా పలకరిస్తూ కళ్ళకు కనబడే అమ్మ-నాన్న-అన్న-అక్కల రూపాలు, (అమ్మ పాలచే అనుభవమయ్యే మధురమైన) రుచి, (పుట్టిన గదిలోని) పరిమళాలు..... ఇవన్నీ అనుభవిస్తూ, అవి లభించనప్పుడు అవి 'పొందాలి-పొందాలి' అనే అభిలాషలు కలిగి ఉండటం ప్రారంభిస్తున్నాడు. వాటిని గురించి ధ్యానించటం మొదలు పెట్టుచున్నాడు.

**విశేష వివరణం : దృష్టాంతాలు**

1. ఒకడు 'కల' కంటూ కంటూ మెళుకువ రాగానే స్వల్ప విషయాలు క్షణంలో త్యజించి జాగ్రుత్తులో ఎదురుగా కనిపించే విశేషాలలో నిమగ్నమగుచున్నట్లు.

అట్లాగే,

జాగృతదృశ్యాన్ని ఆస్వాదిస్తూ - ఆస్వాదిస్తూ ఒకానొక క్షణంలో స్వప్నానుభవంలో ప్రవేశించి జాగృతదృశ్యాన్ని త్యజిస్తున్నట్లు ......,

గర్భంలో ఉన్నప్పుడు గుర్తొచ్చిన జ్ఞాపకాలను భూమిపై పడగానే **ఏమరుస్తున్నాడు.**

2) గీతాచార్యులవారు

- ధ్యాయతే విషయాన్ పుంస:
- సంగస్తే షూపజాయతే ।
- సంగాత్ సంజాయతే కామ: ।
- కామ: క్రోధో అభిజాయతే ।
- క్రోధాత్ భవతి సమ్మోహ: ।
- సమ్మోహాత్ స్మృతి విభ్రమ : ।
- స్మృతిభ్రంసాత్ బుద్ధి నాశ: ।
- బుద్ధినాశాత్ ప్రనస్యతి ॥

అని చెప్పిన వాక్యాలు సందర్భోచితమౌతుందని అనుకుంటాను.

ఆ విధంగా మత్తు కలిగించే పదార్థాలు సేవించినవానివల్ల పూర్వజన్మల జ్ఞాపకాలు - సంస్కారాలు మరుగున - అడుగున పడిపోయి, వర్తమాన అనుభవాలు, అనుభూతులు సందర్భాలు, జ్ఞాపకపరంపరలు **భావించటం** ఆరంభిస్తున్నాడు.

మొట్టమొదటగా ఆకలితో తల్లిస్తన్యం నుండి ప్రసాదించబడే తల్లి పాల 'రుచి'ని ఆస్వాదించటం ..., తద్వారా ఆకలి-దప్పికలు తీర్చుకోవటం ప్రారంభిస్తున్నాడు. ఇక, ఆపై ఆయా జీవితదశలకు 'నాంది' పలుకుచున్నాడు.

ఇంకేమున్నది? ఈ దృశ్యపరంపరలను బాల్య-యౌవన-కౌమార వార్ధక్యాలలో వేరువేరు విధాలుగా, ఒకటి తరువాత మరొకటిగా పొందటం జరుగుతోంది. ఒకేసారి అనేక పరస్పరానుకూలమైన - ప్రతికూలమైన విషయములలో చిక్కుకుంటున్నాడు. సుఖ-దు:ఖ, ప్రియ-అప్రియ, ఇష్ట-అయిష్ట భావ సమూహములను మనస్సులో కల్పించుకొని అనుభవరూపంగా (లేక) జగత్ రూపంగా పొందుచున్నాడు.

కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్యములనబడే అరిషట్ వర్గములకు లోనవుచున్నాడు. తాను పెంపొందించుకున్న ఆసక్తికి తానే "సంసారబద్ధుడు" అగుచున్నాడు. అట్టి ఆసక్తి రూప సంసారమే జీవునిపట్ల ఏర్పడే సర్వ అనర్థములకు కారణం స్వామీ! **అందుచేత సంసారమును త్యజించటమే ఉచితం కదా!**

## 11. సంసార బంధము - అనగా?

**బ్రాహ్మణుడు :** ఓ పూబోణీ! నీ మాటకు అడ్డువస్తున్నాను - అని అనుకోవద్దు. జీవునికి సంసారము బంధమా? భార్య-పిల్లలు మొదలైనవి త్యజించాలని నీ ఉద్దేశ్యమా! ఆశ్రయాలు (లేక) ఆశ్రమాలు 4 విధాలుగా వేదజ్ఞులు చెప్పారు కదా! అవి క్లుప్తంగా చెప్పుకుందామా?

**గొల్లభామ :** తప్పక చెప్పండి మహాశయా! మీరు వేద-యజ్ఞ-యాగ ప్రజ్ఞాదురంధరులని మీ వాక్ మాధుర్యమే చెప్పుచున్నది సుమా!

**బ్రాహ్మణుడు :** బ్రాహ్మణులకు, తదితరులకు కూడా నాలుగు ఆశ్రమాలు శాస్త్రాలు బ్రహ్మయజ్ఞ విధానంగా సూచన చేస్తున్నాయి.

**1) బ్రహ్మచర్యాశ్రమం :** కొందరు విద్యార్థి దశ తరువాత లౌకిక సంబంధమైన "వివాహము - పిల్లలు- సంపదలు".... ఇటువంటివి ఆశ్రయించకుండా, "గురుసేవ- వేదాధ్యయనము- బ్రహ్మము గురించిన సమాచార సేకరణ- బ్రహ్మము నందు రమించుటకై కావలసిన సాధనలు- ప్రయత్నములలో దైనందిక జీవితమును విధివిధానంగా నియమించుకోవటం.

**2) గృహస్థాశ్రమం :** మరికొందరేమో విద్యార్థి దశతరువాత ....., బ్రాహ్మణ తదితర కులాచారాలను అనుసరించి ఆ వంశాభివృద్ధికొరకై వైవాహిక జీవితాన్ని ఎన్నుకుంటున్నారు. వైవాహిక జీవితంలో శాస్త్రోచితంగా కొనసాగిస్తున్నారు. పెద్దల వద్ద విద్యార్థిగా నేర్చిన వేదాధ్యయనము, పఠనము, బోధనము అన్ని వర్ణాలలోని జనులచే యజ్ఞ-యాగ-వ్రత- పూజాదులు, స్మార్తకర్మలు నిర్వర్తింపజేయ టానికి, మంత్ర-తంత్ర పూర్వకమైనదంతా వృత్తి ధర్మంగా స్వీకరిస్తున్నారు. సంతానము- సంపద ఆస్వాదిస్తూ లోక-వేద విధాన పూర్వకంగా సాంఘి కమైన, సర్వజనానుకూలమైన గృహస్థ జీవితం శాస్త్రప్రవచితమైన మార్గంగా అనుసరిస్తున్నారు.

మరి కొందరు లోకావసరాలైన ఆర్థిక - గృహ - సామాజిక - ఆహార ఉత్పత్తి కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వేదోపాసన- నాదోపాసన- వేదాంత శాస్త్రాధ్యయనం నిర్వర్తించుతూ ఉండటం జరుగుతోంది. వీరంతా గృహస్థాశ్రమవాసులుగా చెప్పబడుచున్నారు.

ఇక అజ్ఞులైన ఇంకొందరి గురించి చెప్పాలంటే, వారు గృహస్థా శ్రమాన్ని అరిషట్ వర్గములచే వమ్ము చేసుకుంటున్నారు.

**3) వానప్రస్థాశ్రమం (వనజీవితం) :** విజ్ఞులలో కొందరు గృహస్థాశ్రమం కొన్ని సంవత్సరాలు గడుపుతూ సంతానము - సంపద - గృహస్థ ధర్మాలైన లోకకళ్యాణ పూర్వక యజ్ఞయాగాదులు మొ॥నవి నిర్వహిస్తూ ఒకానొక సమయంలో ఆ గృహస్థాశ్రమం త్యజిస్తున్నారు. ఏకాంత జీవితం ఆశ్రయిస్తున్నారు. ధర్మపత్నీసమేతంగా ఆ ఏకాంత ప్రదేశంలో తపస్సు - ధ్యానము కొనసాగిస్తున్నారు. శాస్త్రాధ్యయనం చేస్తూ ఆత్మతత్త్వానుభూతిని సుస్థిర పరచుకుంటున్నారు. వీరిని "వానప్రస్థులు" అని అంటారు.

**4) సన్యాసాశ్రమం :** విద్యార్థి - బ్రహ్మచర్య- గృహస్థాశ్రమములలోని స్థితి

నుండి సన్యాసాశ్రమం కొందరు స్వీకరిస్తూ ఉంటారు. ఇల్లు - వాకిలి - సంపదలు - బంధువులు ఇత్యాది సాంఘికమైన విశేషాలన్నీ త్యజించి సన్యాసాశ్రమంలో శాస్త్రవిధి - మంత్ర- తంత్ర నియమానుసారం ప్రవేశిస్తూ చిరకాలం ఒక ప్రదేశములో నివసించకుండా, ప్రదేశముల పట్ల ఏర్పడే మమకారాలను దరిజేరనీయకుండా, పరివ్రాజకులై ఉంటారు. శాస్త్రసాధనాలైన అష్టాంగయోగాలు అభ్యాసం చేస్తూ జనులకు ఆధ్యాత్మిక దృష్టిని గుర్తు చేస్తూ ఉంటారు.

బ్రాహ్మణ - క్షత్రియాది 4 వర్ణాలకు కూడా వేరు విధి-విధానాలతో సూత్రప్రాయంగా శాస్త్రములచే మార్గదర్శకమౌతున్న ఈ 4 ఆశ్రమాలలో **"గృహస్థాశ్రమమే ఉత్తమమైనది"**.... అనే వాక్యం నీవు వినివుండలేదా?

**గొల్లభామ :** విన్నాను ! ఎందుచేతనో మీరు చెప్పండి !

**బ్రాహ్మణుడు :** ఎందుచేతనంటావా? .... మిగతా మూడు ఆశ్రమవాసులు కొంతకొంతగా ఆహార-సంచార- జీవనవసతుల కొరకై నిత్య శ్రామికులైన గృహస్థులపై ఆధారపడి ఉంటారనే ఉద్దేశ్యముతో సుమా! ఇంకాకూడా చెప్పాలంటే ......,

సంసారాశ్రమంలో (లేక) గృహస్థాశ్రమంలో ఉన్నవాడు,

- అటు బ్రహ్మచారి-సన్యాసి - వానప్రస్థ ఆశ్రమవాసులకు తనసేవ - సంపదల సమర్పణతో సంతోషింపజేస్తూ .....,
- మరొకవైపు 'గురుశుశ్రూష'తో సద్గురువులగు మహనీయులకు సంతోషం కలుగజేస్తూ - వారి బోధలను శ్రవణము - మననము - నిధిధ్యాసల సహాయంతో హృదయస్థం చేసుకుంటూ,
- ఇంకొకవైపు లౌకిక ధర్మాలు నిర్వర్తిస్తూ.....,
- వేరొకవైపు భార్య- పుత్రాదులతో ఇంద్రియ-బాంధవ్య సుఖములను ఆస్వాదిస్తూ.....,

ఈ విధంగా **ఇహ పరంగా ఉభయ శ్రేయస్సులను నిత్యమూ సంపాదించుకోవచ్చు** కదా!

ఇక నీవు చెప్పేమాటల విషయానికి వద్దాం.

ఓ భామా! నీవు అంటున్నదేమిటి? "సంసారమే అన్ని అనర్థాలకు మూలం!" అని సిద్ధాంతీకరిస్తున్నావేమిటి? ఓహో! నాకు అర్థం అయ్యిందిలే! "ఈ జీవుడు సంసారంలో చిక్కుకుంటున్నాడు" అని అనేటప్పుడు, **"ఈతడు తెలియక- సరియైన అవగాహన- విశ్లేషన చేయనట్టి సందర్భాలలో కొన్ని కొరగాని మార్గములు - ఉద్దేశ్యములు- అవగాహనలు - అభిప్రాయములు కలిగి ఉండటం చేత"** ...... అని నీ అభిప్రాయము అయిఉంటుందేమో కదా!

**గొల్లభామ :** అవును! నా అభిప్రాయము అదేలే స్వామీ!

**బ్రాహ్మణుడు :** అయితే ఓ గొల్లభామామణీ! అటువంటి 'కొరగాని పనులు' అనగా ఏమేమో నీ ఉద్దేశ్యము మాకు, విజ్ఞులగు ఈ సభకు వేంచేసిన ప్రేక్షకమహాశయులకు సవివరంగా చెప్పవూ!

**గొల్లభామ :** ఓ బ్రాహ్మణ మహాశయా! వినండి. తెలివైనవాడు ఈ సంసారములో జీవన యాత్ర సాగిస్తూనే రాగ-ద్వేష-లోభ-మోహ-మద-మాత్సర్య - మమకారాదులు తన మనస్సును మకిలం చేయకుండా చూచుకుంటూ ఉంటాడు. అది దృష్టిలో పెట్టుకునే ధర్మశాస్త్రాలు గృహస్థాశ్రమ ధర్మాలు జీవులకు సూచిస్తున్నాయి.

ఒక తామరాకుపై కొంచం నీళ్ళు పోసామనుకోండీ!

- ఆ తామరాకుపై నీళ్ళు ఉంటాయా? ఉంటాయి. కొంతనీరు బిందువుల రూపంగా ఉంటాయి.
- అయితే, ఆ తామరాకు తనపై గల జలబిందువులను తాను పీలుస్తున్నదా? లేదు. పీల్చనే పీల్చదు.

అట్లాగే, ఇక్కడి సంగతి - సందర్భాలు, సంపద-ఆపదలు, సంబంధ-బాంధవ్యాలు, సానుకూల-ప్రతికూల వ్యవహారాలు, శత్రు-మిత్రులు - ఇత్యాదులన్నీ 'మనస్సు' అనే తామరాకుపై పడితే పడవచ్చు గాక! ఆ మనోనళినీదళం ఆయా ప్రాపంచిక వ్యవహార జలబిందువులు తనలోకి

పీల్చునట్టి సామర్థ్యమును ఈ గృహస్థాశ్రమ వాసి సర్వదా అలవరచుకుంటూ ఉండాలి.

బాహ్య విషయాలు బాహ్యానే ఉంచాలి. స్పర్శాత్ కృత్వా బహి: బాహ్యాన్ - అంతేగాని, వాటిని విషయముల రూపంగా మనస్సులో ప్రవేశించనీయరాదు.

**ఈ మాత్రం నిత్యసాధనలో కష్టం ఏముంటుంది చెప్పండి?**

అట్లాగే, ఇంకొక దృష్టాంతం చెపుతాను. మీరు, ఈ 'గొల్లకలాపం' అనే ఆత్మయజ్ఞము వీక్షించి ఆనందించటానికి వచ్చిన సభికమహాశయులు నాపై వాత్సల్యంతో వినండి !

ఎర్రపురుగును మనమందరమూ చూచియే ఉంటాము కదా! ఆ ఎర్రపురుగు బురదలోను - నీటిలోనూ కూడా తిరుగాడుతూ ఉంటుంది. అయితే ఏం? అది బురదనూ అంటించుకోదు. నీటినీ (తడినీ) అంటించుకోదు. మరి ఈ మానవుడో? ఈతనికి సర్వాంతర్యామి అయిన శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్తమ బుద్ధిని ప్రసాదించారే! సమాలోచన చేసి సమన్వయించుకోగల మనో-బుద్ధులు ఈతనికున్నాయి కదా! ఆ ఎర్ర పురుగుమాత్రం తెలివి లేకపోతే ఎట్లా?

మరి?

**దృశ్య విషయాలలో మనస్సు పాల్గొనుచున్నంత మాత్రం చేత దుష్టములైన రాగ-ద్వేష, మానావమాన భావపరంపరలను మనస్సులో పెంపొందించుకోవలసిన అగత్యమేమిటో చెప్పండి?**

పడవ నీటిలోనే ఉంటుంది. కానీ పడవ తనలోకి నీరు ప్రవేశించనీయదు. ఒకవేళ ఏ కారణం చేతనో ప్రవేశిస్తే? పడవ మునిగిపోతుంది కదా! అట్లాగే **ఈ దృశ్యము యొక్క స్వభావము తెలిసియున్నవాడు తన మనస్సు జగద్విషయములలో ఉన్నప్పటికీ, జగద్విషయములను మనస్సులో ప్రవేశించకుండా జాగరూకుడై ఉండటం అభ్యసిస్తూ ఉంటాడు.**

అనగా,

ఇక్కడి దృశ్యములోని, సంఘటనలు - సందర్భాలు- సంబంధములు - వ్యవహారములు - సుఖదు:ఖములు - లాభనష్టముల మధ్య జీవనయాగం కొనసాగిస్తూనే ... వాటిచే స్పృశించకపోవటం అభ్యసిస్తూ ఉంటాడు. వాటికి తాను సంబంధించక, అవి తనకు సంబంధించనీక...., ఒకానొక అతీతత్వము, అప్రమేయత్వము హృదయాంతరంగంలో అభ్యసిస్తూ ఉంటాడు. ఇదే శాస్త్రాలు చెప్పే అస్పృశ్యత!

మహాత్మా! ఈ దేహి ఆయా లౌకిక- వ్యవహారిక విశేషములచే అస్పృస్యుడై ఉంటూ, ఆత్మజ్ఞానాశయంతో లీలగా-క్రీడగా ఈ జగత్తులో చరిస్తూ ఉండటమే ఉచితం కదా!

అంతేగాని......,

"ఇవన్నీ నావే! నాకు సంబంధించినవే!" అనే భావాలను ఆశ్రయిస్తూ వాటిచే బద్ధుడై ఉండటం అవసరమా? సముచితమా? కానేకాదు!

పట్టుపురుగు తెలివితక్కువగా తన లాలాజల ధారములలో తానే చిక్కుకుంటోంది. ఆ రీతిగా అజ్ఞాని తన ఆశ-నిరాశ-సంబంధ బాంధవ్య-ప్రియ-అప్రియ భావావేశములలో తానే బద్ధుడౌతున్నాడని వేదాంత శాస్త్రం గుర్తుచేస్తూనే ఉన్నది కదా స్వామీ! స్వతహాగా ఆత్మస్వరూపుడే అయి ఉన్న జీవునకు అట్టి బంధము ఉచితం కాదు కదా!

కాదు. కాకూడదు.

## 12. సంసార బంధ విశేషాలు

ఓ విప్రవర్యా! 'సంసార బంధము' గురించి - గృహస్థాశ్రమము గురించి మరికొన్ని వివరాలు మరికొంతగా చెప్పుకోవాలంటే .......,

"నాఇల్లు - నావాకిలి - నాపేరు ప్రతిష్టలు - నా కళత్రం - నా పిల్లలు - నా సంపద - నావాళ్ళు - కానివారు - నా గొప్పతనం - నా అధికారం - నాకు ఇష్టమైనవారు - నాకు గిట్టనివారు..." ఇత్యాది విశేషాలు మననం చేస్తూ దృశ్యముతో 'స్వకీయకల్పన' అనదగిన 'బంధము'ను మనస్సుచే పొందటమునే 'సంసారము' అని అంటున్నారు. **అంతేగాని**

సంసారము అనగా 'గృహస్థాశ్రమం' అయి ఉండలేదు.

దృశ్యముతో ఉద్వేగపూర్వకమైన సంబంధము యొక్క తీవ్రతచే ఆత్మత్వము ఏమరచటమే సంసారము. అట్టి సంసార దీర్ఘరోగము నుండి సంసారస్పృంఖలముల నుండి విడివడటమే వర్తమాన "జన్మ" అనబడు దాని సద్వినియోగమని శాస్త్రహృదయమును ఎరిగినవారు హెచ్చరిస్తున్నారు కదా! మహనీయా! వింటున్నారు కదా! ఓ విప్రవర్యా!

**దృశ్యముతో పెట్టుకొనబడే మానసిక సంబంధము అనునది సంసారము.** ఆహా! 'సంసారము' అనే దీర్ఘమానసిక బంధముచే ఈ జీవుడు వివశుడౌతున్నాడు కదా! ఇదంతా స్వకీయమైన అభ్యాసంచేతనే ఏర్పడుతోంది. తనకు తానే స్వకీయ కల్పనలు అయినట్టి "దుర్మదము-దుర్మతి" అనేవి కళ్ళను కప్పి వేయచుండగా ఈతడు గ్రుడ్డివాడగుచున్నాడు. "ఆర్జిత కర్మలు" అనే దేవతకు తనకుతానే బానిసగా అగుచున్నాడు - చేసుకుంటున్నాడు. ఇంద్రియములకు - ఇంద్రియ విషయములకు దాసుడై రోజులు వృధా చేసుకుంటూ ఉండగా, ..... ఈ లోగా బాల్య-యౌవన-కౌమార వార్ధక్యాలు గడచిపోతున్నాయి.

ఎప్పుడో మృత్యువు వచ్చి ఈ భౌతిక దేహమును కబళించివేస్తోంది.

నిస్తేజము - నిరుపయోగము అయిన జీర్ణదేహాన్ని త్యజించి, ఇతఃపూర్వం చెప్పుకున్నట్లుగా, ఈ జీవుడు సంస్కారానుసారంగా మరొక భౌతిక దేహమును ఆశ్రయించి గర్భనరకములన్నిటికీ ప్రాత్రుడుగా (qualified) అగుచున్నాడే!

ఈ విధంగా ఉపాధిపరంపరలు అసంఖ్యాకంగా అజ్ఞాన జీవుని పట్ల వస్తున్నాయి. పోతున్నాయి.

ఓ విప్రపుంగవుడా!

ఇప్పుడు చెప్పండి!

కాలానుగతంగా వచ్చి-పోతున్న, ఉత్పత్తి అయి నశిస్తున్న ఈ భౌతిక దేహాలలో కొన్ని గొప్పవి - మరికొన్ని అల్పమైనవి - అనేది ఎక్కడ? వాస్తవానికి

అటువంటి భేదము ఎక్కడున్నది? ఈ అన్ని దేహాల యొక్క పుట్టుక-చావు ఒక్క తీరైనవే కదా! మరి "మా బ్రాహ్మణ దేహములు ప్రత్యేకమైనవి" ...... అని ఎట్లా అంటున్నారో చెప్పండి! నేను, ఈ సభకు వేంచేసిన ప్రేక్షకులు వింటాము.

## 13. చాతుర్వర్ణ్యాలు

**గొల్లభామ :** (కొంచము సేపు మౌనం - ఆ తరువాత) మరల అడుగుచున్నాను కదా అని, ఏమీ అనుకోకండేం!

మీరు-నేను - ఈ సభలోకి వేంచేసిన ప్రేక్షక మహాశయులు - తదితరులు - మనందరి యొక్క జగత్తులోనికి 'రాక' - జగత్తునుండి 'పోక'లు ఒక్క తీరైనవే కదా!

మరి?

"మా బ్రాహ్మణుల జన్మలు ప్రత్యేకమైనవి" అని మీరు ప్రకటించటం ఎట్లా యుక్తి యుక్తం?

**బ్రాహ్మణుడు :** సరే! "అన్ని దేహముల పుట్టుక ఒక్క తీరైనవే!"..... అని కాసేపు అనుకుందాం! అదే నిజమైతే "బ్రాహ్మణులు భూసురులు. భూమిపై జన్మించినవారిలో అగ్రజన్ములు" ... అని అనేకులు మమ్ములను ఎందుకు గౌరవిస్తున్నారంటావ్? అట్లా పూజించేవారంతా నీకన్నా తెలివి తక్కువ వారని నీ ఉద్దేశ్యమా ఏమిటి? చెప్పు! అసలు నీవేమనుకుంటున్నావో, అది చెప్పు?

**గొల్లభామ :** "వేష-భాషలు" మాత్రం చేత "మేము బ్రాహ్మణులము. తదితర జనులందరిచే పూజార్హులము" అని తమకు తామే భావించటం దట్టమై సాంసారిక సంబంధమైన 'అహంకారము' సూచిస్తుందేమోనని నేను అనుకుంటున్నాను. ఎందుకుంటారేమో! శాస్త్రములపై ఉన్న గౌరవం ప్రదర్శించటానికి బ్రాహ్మణులు పూజార్హులుగా అందరూ గౌరవిస్తూ ఉంటారు. ఇది దృష్టిలో పెట్టుకొని "బ్రాహ్మణుల జన్మలు అందరిలోకీ ప్రత్యేకమైనవి".... అని మీరు అనటం "అద్వితీయం బ్రహ్మమ్" అనే వాక్యార్థాని సానుకూల్యమా? చెప్పండి!

**బ్రాహ్మణుడు :** అట్లాగా? బాగానే ఉన్నది. అయితే, ఇప్పుడు మరొక

ప్రశ్నవేస్తాను. "బ్రాహ్మణులు- క్షత్రియులు- వైశ్యులు - శూద్రులు" అనే పేర్లు గల నాలుగు వర్ణాలు ఉన్నాయని అందరూ దైనందికంగా లోకంలో చూస్తూ ఉన్నదే కదా! ఆయా జాతి ధర్మాలు వివరించి చెప్పే ధర్మశాస్త్రాలు ఉన్నాయి. ఆయా ధర్మాలు బోధించే పాఠ్యాంశాలు అందరికీ అనుభవమగుచున్నదే కదా! అందరిచేత ఒప్పుకోబడుచున్న చతుర్వర్ణాలు నిజమంటావా? అబద్ధమంటావా? చెప్పు!

**గొల్లభామ :** స్వామీ! దయయుంచి చిరుకోపం తెచ్చుకోండి. ఈ శుభోదయాన ఇక్కడ వేంచేసియున్న ఈ ప్రేక్షకమహాశయుల సమక్షంలో ఆత్మయజ్ఞపూర్వకంగా 'సత్సంగము' మనందరము ఉపాసిస్తున్నాము కదా!

"4 వర్ణములు ఉన్నాయా? లేవా?" అని అడుగుచున్నారు కదా! మీ ప్రశ్నకు మనం ఉత్తమ సమాచారం పరిశీలించటానికి వీలుగా మరొక ప్రశ్న మీముందు ఉంచుచున్నాను.

మీరు చెప్పిన బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య-శూద్రులనబడే చాతుర్వర్ణ్యములు చతుర్ముఖ బ్రహ్మచేత కల్పించబడినవా? లేక, ఆ నాలుగు విభాగములు సృష్టిలో తమకుతామే ఏర్పడినాయా? కాక నియమితమైన గుణ - కర్మలకు సంబంధించిన విభాగమా? శాస్త్రోక్తంగా వివరించి దయచేసి చెప్పండి!

**బ్రాహ్మణుడు :** బ్రాహ్మణో ऽస్య ముఖమాసీత్
బాహూ రాజన్యః కృతః।
ఊరూతదస్య యద్వైశ్యః
పాద్భ్యాం శూద్రో అజాయత॥ - పురుషసూక్తం
-చాతుర్వర్ణ్యం మయాసృష్టమ్
గుణకర్మ విభాగశః ॥ - భగవద్గీత

ఆయా శాస్త్రీయ వాక్యాలను అనుసరించి విరాడ్రూపుడగు ఆ పరమపురుషుని (లేక) పరమాత్మ యొక్క ముఖమునుండి, భుజముల నుండి, తొడలనుండి పాదములనుండి 4 వర్ణములు పుట్టుచున్నాయి. ఈ 4 కాకుండా మరొక వేరైన వర్ణము కల్పించటానికి ఆచతుర్ముఖ బ్రహ్మకు కూడా అధికారము లేదు.

**గొల్లభామ :** హే మహనీయా! ఒక తండ్రికి నలుగురు కొడుకులున్నారనుకోండి. ఆ నలుగురిది ఒకే కులం - వంశం - జాతి- అవుతుందే కాని, .... ఆ నలుగురు వేరు-వేరు వర్ణములవారు కారు కదా?

**బ్రాహ్మణుడు :** అట్లాఎట్లా? మనం చెప్పుకున్న చాతుర్వర్ణ్య విభాగాలు విషయానికి వస్తే ... వారంతా 'ఒకటే' ఎట్లా అవుతారు?

- భుజములు ముఖముతో సమానమా?
- తొడలు-భుజాలు ఒక్కటేనంటావా?
- పాదాలు-తొడలతో సరిసమానమా?

ముఖం చేసే పనులు పాదాలు నిర్వర్తిస్తాయా? పాదాలు చేయవలసినవి తొడలు చేయలేవుకదా! భుజముల ధర్మాలు- పాదముల ధర్మాలు వేరువేరైనవే కదా?

**గొల్లభామ :** ఒక ఇంటి ప్రహరీలో బాదము విత్తు నాటామనుకోండి. ఆ బాదము విత్తునుండి పుట్టుకొచ్చిన పెద్ద బాదము వృక్షము యొక్క 4 కొమ్మలు ఒక్క తీరైనవే అవుతాయికాని, 'వేరువేరైనవి' అని ఎక్కడైనా, ఎవ్వరైనా అంటారా చెప్పండి?

**బ్రాహ్మణుడు :** విత్తు ఒక్కటే అవవచ్చు గాక! అయినప్పటికీ కూడా ఒక మహావృక్షము యొక్క వ్రేళ్ళు, మూలము (కాండము), కొమ్మలు, చిగుర్లు, ఆకులు, పూలు, పిందెలు, కాయలు, ఫలములు - ఇవన్నీ ఒక్కతీరుగా ఉంటున్నాయా? మూలము పని కొమ్మలు చేస్తాయా? కొమ్మలపని ఆకులు చేస్తాయా? ఆకులపని పుష్పాలు చేస్తాయా? పుష్పాల పని ఫలాలు చేస్తాయా? వేటి పని వాటివే కదా! అట్లాగే చాతుర్వర్ణ్యాలు కూడా - అని గమనించవచ్చును కదా!

**గొల్లభామ :** ఆయా వేరువేరు కార్యముల దృష్ట్యా చూస్తే కాండము - కొమ్మలు- ఆకులు- పుష్పములు వేరువేరైనవిగా లౌకిక దృష్టికి కనిపించవచ్చునుగాక!

కానీ, అధ్యాత్మ శాస్త్రప్రవచనాలను వేదమహా వాక్యాలను గమనిస్తే -"ఈ జీవులంతా ఏకస్వరూపుడు - అద్వితీయుడు- అఖండుడు -

అప్రమేయుడు అయినట్టి ఒకే పరమాత్మ యొక్క ప్రత్యక్షరూపం"..... అని తెలియవస్తుంది. పరమాత్మ యొక్క ప్రత్యక్ష లీలా విన్యాసమే (లీలా) వినోదమే అయినట్టి ఈ జీవుల సమూహాలను చూస్తున్నప్పుడు ఆరూఢుడగు ఒక ఆత్మజ్ఞాని, బ్రహ్మజ్ఞాని ఎట్లా చూస్తున్నాడు? సర్వము ఆత్మస్వరూపంగానే కదా! ఆతనికి జాతి-వర్ణ భేదాలు కనిపిస్తాయా? చెప్పండి.

**బ్రాహ్మణుడు :** ఓ కాంతామణీ! నీవు చెప్పినట్లు ఎవ్వడైతే ఈ దృశ్యప్రపంచ వ్యవహారశూన్యుడై కేవలము ఆత్మభావనను మాత్రమే కలిగి ఉంటాడో,..... అట్టి వాడు 'విదేహి' అని అధ్యాత్మ శాస్త్రం విభాగిస్తాం. దేహం లేని వానికి దేనితోనూ పని ఉండదు. దేహమున్నంత వరకు వ్యవహరించటం. వ్యవహారాలు తప్పేవి కావు. ద్వైతము తప్పేది కాదు. అవునా? కాదా?

ఎవ్వరైతే దేహములకు అతీతుడై, తన దృష్టిలో ఈ దేహ విభాగములు లేనివాడై ఉంటాడో... ఇక అట్టివాడు ఈ దృశ్యప్రపంచంలో ఉండవలసిన పనేముంటుంది?

- విదేహికి దృశ్యప్రపంచంతో పని ఉండదు.
- దృశ్యప్రపంచంలో ఉన్నంత వరకు వర్ణాశ్రమ సంబంధమైన ద్వైతరూపమైన వేరువేరు అవగాహనలు, అభ్యాసాలు అనివార్యము కదా?

అందుచేత చాతుర్వర్ణ్యాలు శాస్త్రములచే నిర్దేశించబడియుండగా... నీవు ఇప్పుడు ఏమి చెప్పదలచుకున్నావు?

## 14. దైవార్పిత కర్మ

**గొల్లభామ :** బ్రాహ్మణోత్తమా! ఈ మనస్సు - వాక్కు - కాయములనబడే మూడింటిని వుపయోగించుకుంటూ దైవార్పితంగా, సేవాభావంతో, కూచిపూడి దేవర శ్రీరామలింగేశ్వర స్వామి కృతంగా పరమాత్మ తత్త్వము ఎరిగి ఈ లోక సంబంధమైన వర్ణాశ్రమ ధర్మ-కర్మలు నిర్వర్తించే విదేహముక్తునికి ఆ కర్మలు చేయటం వలన వచ్చే లోటు ఏమీ ఉండదు కదా?

**బ్రాహ్మణుడు** : అవును. అది నిజమే. ఒప్పుకుంటాను.

ఎవ్వరైతే - ఆత్మయందు నిశ్చలత్వము
- సకల ప్రాపంచక కార్యక్రమముల యొక్క తత్త్వరహస్యము తెలుసుకొని,
- వాటి అంతర్లీనగానమైనట్టి ఆత్మానందమును ఆస్వాదిస్తూ
- సర్వవ్యవహారముల పట్ల ఉదాసీనుడై

ఉంటాడో,..... ఆతడే **తత్త్వవేత్త.** (ఉదాసీనో - గతవ్యధః - సర్వారంభ పరిత్యాగీ) - ఆతడు విదేహియే !

అయితే....,

ఒకడు తనయొక్క సహజవ్యక్తిత్వమును ఏమరచకుండానే తాను నటించే నాటకంలోని పాత్రను ఆ పాత్రకు ఉచితంగా నటిస్తూ ఉంటాడు కదా! అంతేకానీ, నాటకంలో నటిస్తూ, "ఈ నాటకంలోని పాత్రకు భార్య అయిన ఈమె నా భార్య కాదు. నా భార్య మా ఇంట్లో నాకోసం ఎదురుచూస్తూ ఉన్నది'' ..... అని ప్రేక్షకులలోని తన మిత్రుడికి అరుస్తూ చెప్పుతాడా? అది రసాభాస కదా!

అట్లాగే తత్త్వవేత్త అయినవాడు కూడా ఈ జగన్నాటకంలో 'జీవుడు' అనే పాత్రను వహిస్తున్నప్పుడు ఈ జగత్తులో గల కులగోత్రముల తారతమ్యమును అనుసరిస్తూ జీవించక తప్పదు, ఓ తరుణీమణీ!

## 15. ఏకో అనేకః

**గొల్లభామ** : ఓహో! అట్లాగా? అట్లా అయితే 'బ్రాహ్మణుడు' అనే శబ్దము - శబ్దార్థము ఎవరికి వర్తిస్తుందో... అది చెప్పండి! జీవుడికా? విదేహికా? పరమాత్మకా?

**బ్రాహ్మణుడు** : ఇంకెవరికి? ఈ జీవునికే! పరమాత్మకు బ్రాహ్మణ శబ్దం ఎట్లా వర్తిస్తుంది? విదేహి లోకదృశ్యాతీతుడు కదా!

**గొల్లభామ** : (నవ్వుతూ) జీవునికా? ఈ జీవునకు "నేను జీవుడిని. జీవితము-అనే చక్రమునకు పరిమితుడను''..... అని అనుకున్నంత వరకు

బ్రహ్మత్వము - బ్రాహ్మణత్వము ఎట్లా సిద్ధిస్తాయి చెప్పండి? జీవుడు - అని అనగా, "జీవించువాడు. దేహములు - దేహపరంపరలు పొందువాడు" - అని కదా, ఉద్దేశ్యం? "నేను అనేక జన్మలు పొందేవాడిని" అని భావించటం కొనసాగించేవాడు బ్రహ్మత్వమును ఎట్లా సిద్ధింపజేసుకోగలుగుతాడు?

**బ్రహ్మత్వము ఎప్పుడు సిద్ధించినట్లు? వినండి!**

శ్లో॥ మృత్పిండమేకమ్ ....... బహుభాండ రూపమ్।
సువర్ణమేకమ్ .......... బహుభూషణాఢ్యమ్।
గోక్షీరమేకమ్ ............ బహువర్ణధేనుమ్ ।
శరీరభిన్నమ్ ............. పరమాత్మం ఏకమ్।

**మృత్పిండమేకం :** కుండలు అనేక ఆకారాలు కావచ్చుగాక! కానీ, అవన్నీ కార్యరూపాలు. కారణరూపమగు మట్టి (Origin) ఒక్కటే!

కుమ్మరి మన్ను తొక్కి, పదును చేసి 'కులాల చక్రం' సహాయంతో వేరువేరు ఉపయోగాలను దృష్టిలో పెట్టుకొని అనేకరూపాలైన కుండలు- కూజాలు - [illegible]కుళ్ళు - ప్రమిదలు తయారు చేస్తున్నాడు.

అయితే మాత్రం ఏం? కులాల చక్రము ఒక్కటే. మట్టి కూడా ఒక్కటే.

ఆయా మట్టి పాత్రలకు ఆకారాలు ప్రక్కకు పెట్టి చూశామా, .... అంతా మట్టియే!

**"మృత్తికేవ సత్యం"! పరమాత్మ - అనేక జీవులు ఇట్టిదే!**

**సువర్ణమేకం :** కార్య రూపమైన ఆభరణాలు అనేక ఆకారాలు కలిగి ఉండవచ్చుగాక!

స్వర్ణకారుడు (గోల్డ్‌స్మిత్) జనుల అంగముల తీరు, అభిప్రాయములు - అభిరుచులను అనుసరించి అనేక ఆకారాలలో ఆభరణాలు తయారుచేస్తున్నాడు.

- అన్నిటికీ కారణము - బంగారమే!
- కార్యరూపములైనట్టి ఆభరణములు మాత్రం అనేక

నామ-రూపాత్మకాలుగా ఉంటాయి. గాజులు - ఉంగరము-చెవిపోగు - ముక్కుపుడక- చంద్రహారం- సూర్యహారం ..... ఈ విధంగా ప్రజల పరస్పర సంభాషణచే ప్రాచుర్యమై ఉండవచ్చుగాక!

- ఆభరణత్వమునకు అతీతదృష్టితో చూచామనుకోండి, ..... అంతా బంగారమే కదా!

**సృష్టికి మూలం పరమాత్మ. పరమాత్మ బంగారము వంటివాడైతే ..... జీవులంతా బంగారు ఆభరణములవంటివారు.**

**గోక్షీరమేకం :** కుండలో గల పాలంతా ఒక్కటే!

మా గొల్ల గ్రామ స్త్రీలము కుండనిండా పాలు నింపుకొని పురవీధులలో అమ్ముకుంటున్నాము. కుండలోని పాలు కలసిపోయి తెల్లగా ఉంటాయి. కానీ, ఆపాలు అనేక ఆవులు ఇచ్చినవి కదా!

- ఆవులలో కొన్ని తెలుపువి. కొన్ని నల్లవి. కొన్ని గోధుమరంగువి. కొన్ని ఎఱ్ఱవి.
- పాలలో ఆ భేదం చూడగలమా? కనిపిస్తుందా? ఆ పాల విభాగం తెల్లగోవులిచ్చాయి. ఈ పాల విభాగము నల్ల ఆవులవి" - అని విభేదించగలమా?

అదే విధంగా......

ఈ భౌతిక దేహాలన్నీ రంగు - లింగ - జాతి - నామ - రూప ఇత్యాది భేదాలు ఉండవచ్చు గాక. ఈ ప్రేక్షక మహాశయులలో ఒకొక్కరు ఒకొక్క విధంగా మన కళ్ళకు వేరువేరు వస్త్రధారులై కనిపిస్తూన్నారు కదా! వీరంతా వివిధములైన సన్న - లావు - పొట్టి అంగసౌష్టవాలతో మనం చూస్తూ ఉండవచ్చుగాక!

**మనందరి భౌతిక దేహాలను ప్రకాశింపజేస్తున్న ప్రత్యగాత్మ మాత్రం ఒక్కటే!** ఏకో-అనేక: అట్టి అభేద తత్త్వమై సర్వ దేహాలలో సమంగా ప్రకాశిస్తూ - సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ - అని చెప్పబడుచూ, మనచే శ్రీరామలింగేశ్వర స్వామిగా ఉపాసించబడుచున్న సర్వాంతర్యామికి

నామ-రూప భేదాలు, చాతుర్వర్ణ్యాలు ఎట్లా ఆపాదిస్తాం చెప్పండి! అది అజ్ఞానపూరితమైన సాంసారిక దృష్టి - దోషదృష్టి మాత్రమే కదా!

ఇక, శాస్త్రజ్ఞానం కలవారు - లేనివారు, బ్రహ్మజ్ఞానం కలవారు - లేనివారు ... ఈ భేదమేమిటంటారా?

ఆకాశంలో ప్రకాశించే సూర్యబింబము సర్వదాఒక్కటే అయిఉండి కూడా, ఆ సూర్య బింబము అనేక చోట్ల ప్రతిబింబిస్తూ ఉంటుంది కదా!

అట్టి సూర్య బింబము మలిన జలంలో ప్రతిబింబిస్తే మలినముగాను, నిర్మల జలంలో ప్రతిబింబిస్తున్నప్పుడు నిర్మలముగాను అగుచున్నదని అనగలమా? అవన్నీ ప్రతిబింబ కల్పితములు మాత్రమే కదా!

ఆ సూర్యబింబము మట్టి కుండలోని నీళ్ళలలో ప్రతిబింబిస్తుంటే మట్టి రంగుగాను, బంగారపు భాండములోని నీటిలో ప్రతిబింబిస్తున్నప్పుడు బంగారపు రంగును పొందుచున్నదనటం భ్రమచే ఆపాదించడం (Illusionary Attribution) వంటిది మాత్రమే కదా!

ఈ విధంగా సూర్య బింబము ఎక్కడ ఏ విధంగా ప్రతిబింబిస్తున్నప్పటికీ, అట్టి 'ప్రతిబింబించటము' అనే కార్యమునకు "సూర్యబింబము కర్త" - అని అనలేం! అనగా, సూర్యబింబము యొక్క కర్తృత్వమే లేదు, సర్వదా సర్వమునకు సూర్యబింబము అప్రమేయమే.

అట్లాగే, పరమాత్మ మనందరి దేహ- మనో- బుద్ధులలో రకరకాలుగా ప్రతిబింబిస్తూ కూడా, సర్వదేహములకు - గుణములకు పరమై, సర్వదేహ- మనో- బుద్ధి- చిత్త -అహంకారాల రూపంగా అకర్తృత్వముతో కూడి ప్రకాశిస్తున్నారు.

వింటున్నారా మహనీయా! విప్రోత్తమా! వేరువేరు ప్రతిబింబములకు ఘటభేదం- స్థలభేదం భౌతికమైన దృష్టులకు కనబడవచ్చుగాక! బింబమునకు ఏమి సంబంధము? ఇంకా చెప్పుకోవాలంటే....,

## 16. జలంలో ఆకాశము ప్రతిబింబించటము

ఒకానొక జలంలో చంద్రుడు నక్షత్రాలు ప్రతిబింబిస్తున్నాయను కోండి. చల్లటి గాలికదలికల కారణంగా జలంలో తరంగాలుగా కదులు

చున్నప్పుడు జలంలో ఆకాశము నక్షత్రాలు వగైరా కదలుచున్నట్లే కనిపిస్తాయి.

"ఈ జలంలో ఆకాశము - నక్షత్రాలు - చంద్రబింబము ఉన్నాయి! ఉండి కదలుచున్నాయి!".... అని ఎవ్వరైనా సిద్ధాంతీకరిస్తారా? ఒకవేళ అట్టి అభిప్రాయం వెలిబుచ్చితే అది భ్రమయే కదా!

పోనీ, ప్రతిబింబాంశము కర్తయా? జలంలో ప్రతిబింబించే ఆకాశాంతర్గత దృశ్యానికి 'కదలటము' అనే కర్తృత్వమే ఆపాదించలేము.

పైనున్న ఆకాశము కర్తయా? జలంలోని ప్రతిబింబపు కదలికలకు పైనున్న ఆకాశమే 'కర్త' - అని కూడా అనలేము. అట్లాగే,

"దేహత్వమునకు - జీవత్వమునకు బింబరూపమగు ఆత్మయే కర్త" అని కూడా అనలేము.

"ప్రతిబింబరూపమగు జీవుడే జీవదేహత్వభావనలకు కర్త" అనీ అనలేము. అట్టి ఈ దేహములలో "కొన్ని బ్రాహ్మణదేహములు - మరికొన్ని క్షత్రియదేహములు - ఇంకొన్ని వైశ్యదేహములు - వేరేకొన్నేమో శూద్రదేహములు"..... అనుదానికి సంబంధించిన కర్తృత్వమును (సూర్యబింబమునకు ఆపాదించలేనట్లే) బ్రహ్మమునకు ఆపాదించలేము! (ప్రతిబింబించటానికి కర్తృత్వమును జల - తరంగాలకు ఆపాదించలేనట్లే) దేహములకు అట్లా అని, ఆపాదించలేము.

**బ్రాహ్మణుడు :** అట్లాగైతే, భామామణీ! "సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ" అని కదా వేదాంత మహావాక్య సూక్తి! సర్వములో దేహములు ఉన్నాయి. అంతేకాకుండా, ఈ దేహములు 'బ్రహ్మము' అనే రసముతో నిండినవై, బ్రహ్మనిర్మితములే అయి ఉన్నాయని కదా, బ్రహ్మసూత్ర వాక్యాలు చెప్పుచున్నది! అయినప్పుడు 'దేహములకు బ్రహ్మత్వము లేదు' అని నీవు ఎట్లా అనగలవు?

## 17. సూక్ష్మ దేహనిర్మాణము - జడచేతనములు

**గొల్లభామ :** "బ్రహ్మము దేహములుగా అగుచున్నది" అనిగాని, "ఈ శరీరములుగాని,లేక వాటిలో కొన్ని మాత్రమే గాని బ్రహ్మము".... అనిగాని

అనటం కుదిరేది కాదు స్వామీ!

**అన్నమయాత్- అన్నమయమ్! అథవా, చైతన్యమయాత్- చైతన్యమేవ!**

అని శాస్త్రవాక్యం! ఈ వాక్య ప్రమాణమును అనుసరించి "ఈ దేహమే బ్రహ్మము" అనేది నిర్ణయమాత్మకమైన వాక్యము కాజాలదు.

కనుక, "ఈ దేహము యొక్క పుట్టుకచేత మేము బ్రాహ్మణులము అగుచున్నాము. బ్రహ్మరూపులము! మరికొందరు దేహదారులేమో బ్రహ్మరూపులు కాదు!" అనునది ప్రమాణ వాక్యం అవదు.

స్వామీ!

"తల్లిదండ్రుల శరీరాలు" అనే **కారణము** చేత "కుమారుని శరీరము" అనే **కార్యము** ప్రకృతిపరమై సిద్ధిస్తోంది. అంతేకాకుండా,

**పంచభూతములు** : పృథివి + ఆప: + తేజస్సు + వాయువు (ప్రసరణ శక్తి) + ఆకాశము- అనబడే పంచభూతముల సమన్వయమే ఈ భౌతిక దేహమునకు 'కారణము'. ఈ భౌతిక దేహమేమో - 'కార్యము'గా కనబడుచున్నది.

**పంచప్రాణాలు** : ప్రాణము + అపానము + వ్యానము + ఉదానము + సమానము... అనబడే పంచప్రాణాలు ఈ దేహమునకు ఇంధన రూపశక్తిగా కారణమగుచున్నాయి.

**పంచ ఉపవాయువులు** : నాగ + కర్మ + కృకర + ధనంజయ + దేవదత్త

**పంచజ్ఞానేంద్రియాలు** : చెవులు + చర్మము + కళ్ళు + నాలుక + ముక్కు

**పంచజ్ఞాన ఇంద్రియార్థములు** : శబ్దము + స్పర్శ + రూప + రస + గంధములు

**పంచ కర్మేంద్రియాలు** : వాక్ + పాణి (చేతులు) + పాదములు + పాయువు + ఉపస్థ.

**పంచకర్మేంద్రియ విషయములు** : వచనము + దానము + గమనము + ఆనందము + విసర్జనము.

**మనోచతుష్టయం (అంతరంగ చతుష్టయం) :** మనస్సు + బుద్ధి + చిత్తము + అహంకారము

**అరిషట్ వర్గములు :** కామ + క్రోధ + లోభ + మోహ + మద + మాత్సర్యములు

**త్రిగుణములు :** సత్వము + రజము + తమము

ఇవన్నీ కలిపి 'సూక్ష్మశరీరము' అని అంటూ ఉంటారు.

వీటన్నిటితో కూడిన **మనస్సు - 10** ఇంద్రియముల ద్వారా ఇంద్రియ వ్యాపారముల ద్వారా దృశ్యములో సంచారం చేస్తూ ఉన్నది. సంకల్ప - వికల్పములు అనే రెండు చేతులచే మనస్సు చలింపజేయబడుతోంది.

విజ్ఞులు పరిశీలించిచూడగా,.... **"ఇవన్నీ కూడా స్వయం చేతనములు కావు. అనగా, వాటికి స్వయంగా ఉనికి - కర్తృత్వములు లేవు. జడములే! వీటన్నిటినీ చలింపజేసేది ఆత్మ!"** అని గమనించబడుతోంది. చెప్పబడుతోంది. వీటన్నిటి కలగలపుగా తయారై కనిపించే దేహాలన్నీ ఒక్కతీరైనవే కదా మహాశయా!

**దేహము సకారణము. జడము. బ్రహ్మము కార్యకారణ రహితము.**

**బ్రాహ్మణుడు :** ఏది ఏమైతేనేం! నీ మాటలు నాకు ఎంతో వేడుకను కలుగజేస్తున్నాయమ్మా! చక్కటి పరిశీలనాత్మకమైన - శాస్త్రవిశేషములతో కూడిన వివేచన నీ మధురవాక్కుల నుండి వెలువడుతోంది. నీవు మాట్లాడు తుంటే, .... నాకు - ఈ సభకు వేంచేసిన పెద్దలకు- పిన్నలకు సంతోషము కలుగుతోంది.

పంచభూతములు - పంచప్రాణములు - ఉపవాయువులు - జ్ఞానేంద్రియాలు - కర్మేంద్రియము - వాటి వాటి విషయాలు - అంతరంగ చతుష్టయము - అరిషట్ వర్గాలు - త్రిగుణములు - ఇవన్నీ చెప్పుతూ "అవన్నీ జడము'' అని, "అద్వితీయ ఆత్మ మాత్రమే చైతన్యము'' అని నీవు అభివర్ణించటం అధ్యాత్మ శాస్త్ర సమ్మతమైన విషయమే! చాలా బాగా వున్నది కూడా!

అయితే, **'పంచకోశములు'** గురించి కూడా నీ తియ్యటి మాటల

ద్వారా వినాలని మాకందరికీ చెవులు ఉవ్విళ్ళూరుతున్నాయి. పంచకోశములు అనగాఏమిటి? అవి చైతన్య స్వరూపములా? జడములా? ఏదీ, శాస్త్రానుకూలమైన అభిప్రాయం ఏమిటో కూడా వివరించు!

## 18. పంచకోశములు - జడమే!

**గొల్లభామ :** మహాత్మా! మీరేమో వేద-వేదాంగ-వేదాంతవేత్తలు. యజ్ఞకోవిదులు. ఇక నేనో? స్వల్పజ్ఞురాలను. మీ వంటి కొందరు పెద్దలు చెప్పుచుండగా కొన్ని - కొన్ని అధ్యాత్మశాస్త్ర విషయాలు విని, కించిత్ యోచనచేస్తూ ఉన్నదానిని.

అయినా, "కథయామి అహమ్ అజ్ఞోపి! కో లంఘయతి సద్వచ:?"
"క: సమర్థ: సమర్థోపి సతాంలంఘయతుం వచ:?"

అని మహనీయవాక్యం కదా! మీవంటిమహనీయుల ఆజ్ఞను అజ్ఞానిని అయినప్పటికీ ఉల్లంఘించలేను. కనుక, తెలిసినంత వరకు చెపుతాను. వినండి!

'జీవుడు' అనగా ఏమి? మన భౌతికమైన కళ్ళకు ఈ రక్తమాంసమయమైన - ఇంద్రియములతో అలంకరించబడిన ఈ భౌతిక దేహము కనిపిస్తోంది కదా! ఇది వాస్తవానికి జడమైనది.

**జడము :** (Literally speaking, it is passive voice) తనకు తానుగా కదలనిది. ఉదాహరణకు, కదిలే దేహమును కదలించేది వేరుగా ఉన్నది. కదిలించబడేది కాబట్టి ఈ దేహము జడము.

**చైతన్యము :** (Literally speaking Active Voice) జడమైన దానిని కదిలించేది వేరుగా ఉన్నప్పుడు, ఆ 'కదిలించునది' అనునది 'చైతన్యము'. అది కాలమునకు అతీతము - సాక్షి కూడా!

ఇప్పుడు మనం పంచకోశముల గురించి, "వాటిలో ప్రతి ఒక్కటీ జడమా(Literally passive)? చైతన్యమా(Literally Active)?"... అను ప్రశ్నకు సమాధాన పూర్వకంగా మీరు అడిగిన విధంగా నాకు తెలిసినది చెప్పుచున్నాను. ఓ విప్రోత్తమా! ఓ సభాలంకారులారా! నాపై దయతో వినండి!

ఒకడు బ్రాహ్మణుడు కావచ్చు. శూద్రుడు కావచ్చు. మరొకడు కావచ్చు. ప్రతి జీవుని '5' ఆవరణలు" అనే పొరలవంటివి వస్త్రముపై వస్త్రమువలె ఆవరించినవై ఉన్నాయి.

అనగా,

స్వత:గా, సహజంగా ఆత్మ చైతన్య స్వరూపుడగు ఈ జీవుని వాస్తవస్వరూపము ఐదు ఆవరణలచే అజ్ఞానదృష్టికి కప్పబడినట్లు అనుభూతమవటం మాయా చమత్కారంగా జరుగుతోంది.

శాస్త్రములు ఆ ఆవరణలను (1)అన్నమయ కోశము, (2)ప్రాణమయ కోశము, (3)మనోమయ కోశము, (4)విజ్ఞానమయ కోశము (5)ఆనందమయ కోశముగా అభివర్ణించటం జరుగుతోంది.

(1) **అన్నమయ కోశము** (Zone of Matter) :

స్వామీ!

శ్లో॥ పితృభుక్తాన్నజాద్వీర్యాత్ జాతో అన్నేనైవ వర్ధంతే ।
దేహస్యాత్ 'అన్నమయో' న ఆత్మా ప్రాక్-పశ్చాత్ తత్ అభావత:॥

స్త్రీ పురుషులు భుజించే యవ - వీహ్య (వరి-గోధుమ, వంటి ధాన్యములు - పెసర, మినుము వంటి అపరములు) మొ॥వి భుజించటం చేత ఆ పదార్థముల సార విశేషంగా దేహములలో 'వీర్యము' జనిస్తోంది.

అటువంటి వీర్యము నుండి తయారైన ఈ దేహము మరల ఆ అన్నము మొ॥వి భుజించటం చేత వృద్ధి పొందుతోంది. 'అన్నము'తో తయారౌతోంది కాబట్టి ఈ భౌతిక దేహమును 'అన్నమయ కోశము' అని అంటున్నాము. ఇది ఆత్మదేవుని అలంకారంగా ఆవరించి ఉన్న స్థూల రూపము.

ఈ భౌతిక దేహము అనేక సరంజామాలతో ఇంద్రియ - ఉపకరణములతో 'యంత్రము' వలె ప్రవర్తిస్తోంది. తన యందు ఆయుర్వేద శాస్త్రానుసారంగా అనేక విశేషములను ఇముడ్చుకొని భిన్నాభిన్న వ్యవహారములకు ఉపయుక్తమయ్యే యంత్రపు బొమ్మలాగా వర్తిస్తోంది.

అయితే...,

ఇది 'బ్రహ్మము - బ్రహ్మచైతన్యము' అని అనిపించుకోజాలదు. అనగా, జీవుని యొక్క జడ రూపమే ఈ దేహము కాని, ఆత్మ రూపము కాదు. సహజ రూపము కాదు. మహా అయితే, ఈ దేహము సందర్భరూపము మాత్రమే!

**బ్రాహ్మణుడు :** ఎందుచేత?

**గొల్లభామ :** ఎందుచేతనో,.... వినండి!

**బ్రహ్మము -** బ్రహ్మము త్రికాలాబాధ్యము. భూత - వర్తమాన - భవిష్యత్తులలో ఏకరూపము. కాల: కాలము. కాలమును తన క్రీడకొర్కై నిర్మించుకొనేదే కానీ,... కాలబద్ధము కాదు. కాలమునకు సాక్షియే గానీ, కాలాంతర్గతము కాదు. కాలమునకు అప్రమేయము. అకారణము కూడా!

మరి ఈ అన్నమయకోశ భౌతిక దేహమో? ఇది కాల బద్ధము. కార్య-కారణ సహితము. అనగా, 'దేహము' అనబడే ఇయ్యది ఒక **కాలములో** 'అన్నము' అను కారణముచే ఉత్పత్తి అయి మరల **మరొక కాలంలో** నశించబోవుచున్నది.

ఒకప్పుడు రూపుదిద్దుకొని - మరొకప్పుడు రూపు మాసిపోయేది.

అందుచేత ఈ అన్నమయ కోశము 'బ్రహ్మము' అను శబ్దముకు అర్హమైనది కాదు. దేహము కదల్చబడునది. **దేహము** వేరు, **దేహి** వేరు. దేహి దీనిని కదలుస్తూ ఉపయోగిస్తున్నాడు. కనుక, 'అన్నమయ కోశము' అనునది 'జడమే!'' అని ఆర్య వచనం కదా స్వామీ!

**బ్రాహ్మణుడు :** అవును. నీవు అన్నది ఆర్యవచనమే! యుక్తి యుక్తమే! శాస్త్ర సిద్ధాంతానుకూలమే! ఆత్మజ్ఞుల యొక్క స్వానుభవమే!

ఇంకా చెప్పు! ప్రాణమయకోశం గురించి విశేషాలేమిటి! ప్రాణము జడమా? చైతన్యమా?

**(2) ప్రాణమయకోశము** (Zone of Energy):

గొల్లభామ :

శ్లో॥ పూర్ణోదేహబలోయశ్చ యక్షణాద్యః ప్రవర్తతే।
వాయుః ప్రాణమయో నా సావనాత్మా పతస్య వర్ధనాత్॥

ప్రాణము అనునది శక్తి రూపము. అట్టి ప్రాణశక్తి ప్రతి ప్రాణి యొక్క శరీరములోను - అరికాలి నుండి శిరస్సు వరకు అణువణువు వ్యాపించియే ఉన్నది.

అయితే.....,

'శక్తి' అనునది ఎవ్వరిదో .... అట్టి ఆత్మస్వరూపుడగు జీవునికి సంబంధించి కర్తృత్వము - అనుభవములు ఉంటాయి. అంతేగానీ 'శక్తి'కి స్వతఃగా క్రియ - అనుభవాలు ఉండవు కదా! దృష్టాంతానికి ....,

'కదలిక' అనేది జడము - 'కదలించువాడు' చైతన్య స్వరూపుడు కదా!

ప్రాణమయ కోశము ఒకానొక పరికరము వంటిది. ఆ ప్రాణమునకు ఈశ్వరుడే ఈ జీవుడు. అనగా "జీవుని యొక్క స్వతః (లేక) సహజ స్వరూపం దృష్ట్యా ప్రాణేశ్వరుడు"... అని చెప్పబడుచున్నాడు.

కనుక,

ప్రాణమయ కోశము జడమే! ప్రాణేశ్వరుడో,.... 'బ్రహ్మము' (లేక) 'బ్రహ్మ స్వరూపుడు'.

(Energy by itself is Passive Voice. One who owns(or)exhibits energy is Active Voice)

**బ్రాహ్మణుడు :** బాగున్నది. ఒప్పుకుంటున్నాను. ఓ విజ్ఞానీమణీ! మనస్సు విషయమేమిటి? మనోమయ కోశము గురించి చెప్పు! అది జడమా? చైతన్యమా? బ్రహ్మమేనా? కాదా? "నేఽతి" అంటావా?

**(3)మనోమయ కోశము** (Zone of thought & Feeling) :

**గొల్లభామ :** స్వామీ! "ఏదైతే స్వతఃగా ప్రవర్తింపజాలక, మరొక దానికి ఉ

**ప్రకరణము మాత్రమే అయిఉన్నదో ... అద్దానిని 'జడము' అంటాము".** అనే వేదాంత సిద్ధాంతాన్ని మరొక్కసారి మీ ముందు మననం చేస్తూ... ఇప్పుడు మనోమయ కోశము గురించి చెప్పుచున్నాను. వినండి.

**'ఆలోచన' జడము: : "ఆలోచించువాడు" చైతన్యము.**

శ్లో॥ అహం మమా౽యం దేహ: దేహాదౌచ కరోతియ: ।
కామాది అవస్థాయా భ్రాంతో నా సావాత్ ఆత్మా మనోమయ: ॥

మనస్సు అనగా ఆలోచనా రూపం. 'ఆలోచన' అనునది దృశ్య వ్యవహారమునకు సంబంధమై ఉంటోంది.

**మనోరూపం :** "ఈ దేహమే నేను. ఇది నాది. నాకు చెందినది. ఇల్లునాది. వీళ్ళంతా నా వారు." అనే దృష్టులతో కూడిన యోచనా సమూహములు.

అయితే....,

**'ఆలోచన'... అనేది ఆలోచించువాని చేతనే ఉనికి పొందుతోంది కదా! 'ఆలోచించువాడు' లేకుండా 'ఆలోచన' అనేది ఎక్కడా ఉండదు. కనుక,**

- **'ఆలోచించువాడు'** చైతన్యము.ఆలోచనకు మునుముందే ఉన్నాడు.

- **'ఆలోచన'** జడము.

- ఆలోచనల రూపమైన మనస్సు జడము. ఎందుచేత?

మనస్సు ఎవ్వరిదో,... అతడు మనస్సును ఉపయోగిస్తున్నాడు!

"దర్పణంలో కనిపించే దృశ్యము దర్పణముచే కల్పించబడినది" అనగలమా? దర్పణమునకు "అది చూపుతోంది" అనే కర్తృత్వము ఆపాదించగలమా? లేదు కదా!

అట్లాగే మనో దర్పణానికి కూడా "ఇది ఆలోచిస్తాను! అది ఆలోచించను" అనే రూపమైన కర్తృత్వము లేదు. పైగా....,

ఈ మనస్సు కాలబద్ధమైనది. త్రికాలములచే "అభాద్యము" కానే కాదు. ఎందుకంటే ఇది జాగ్రత్తులోను - స్వప్నములోను వేరువేరైన రీతిగా ప్రకటితం అగుచూ, సుషుప్తిలో శూన్యమై ఉంటోంది.

మనస్సు వల్లనే జీవులకు "అహమ్" .... అనునది రూపుదిద్దుకున్నదై ఉంటోంది.

**బ్రాహ్మణుడు :** 'మనస్సు' అనబడేదానియొక్క వాస్తవమైన రూపమేమిటి?

**గొల్లభామ :** జీవుని యొక్క భావ పరంపరల రూపమే 'మనస్సు' అనే శబ్దంచే ఉద్దేశ్యించబడుతోంది. అంతకు మించి మనస్సు - అనబడే దానికి రూపము లేదు. స్వతః సిద్ధమైన ఉనికి లేదు. స్వతఃగా ఉనికి లేనిది 'బ్రహ్మము' ఎట్లా అవుతుంది. కనుక "నేతి" అనే సిద్ధాంత పరంగా విచారణ చేస్తే మనోమయ కోశము బ్రహ్మము కాదు.

బ్రాహ్మణుడు: ఆహా! ఓ గొల్లభామా! నీవు చెప్పే వివరణ - సమీక్షలు నాకు ఎంతో సంతోషమును కలుగజేస్తున్నాయి. మరి ఇక "విజ్ఞానమయ కోశము" గురించి చెప్పు లలనామణీ!

**(4) విజ్ఞానమయ కోశము** (Zone of Discimination & Awareness) :

**గొల్లభామ :**

శ్లో॥ లీనాసుప్తావపుర్బోధే వ్యాప్నుయాత్ నఖాగ్రగా ।
చిత్ ఛాయోపేతధీః న ఆత్మా విజ్ఞానమయ శబ్దభాక్ ॥

ఆలోచనలకు ఆవల "ఏది ఆలోచించాలి. ఏది ఎట్లా ఆలోచించాలి. ఏది ఆలోచించవద్దు"... అని విచక్షణ - నిర్ణయము (Discrimination) చేస్తున్న విభాగమున్నది. అద్దానిని 'బుద్ధి' అని శాస్త్రములు పేరు పెట్టాయి. అట్టి 'బుద్ధి' అను ఆవరణచే నిర్మితమైనదే విజ్ఞానమయ కోశము.

అట్టి 'బుద్ధి' ఒక సమయంలో కొన్ని విషయాలను వేరు సమయంలో వేరు విషయాలను యోచించటము, మననం చేయటము, అర్థము చేసుకోవటము జరుగుతోంది. దీనినే 'బుద్ధి చాంచల్యము' అని అంటారు.

చిత్ యొక్క కించిత్ ఆభాసచే బుద్ధి చలనత్వం (Motion)

పొందుతోంది. అందుచేత బుద్ధిని "చైతన్యము యొక్క ఒకానొక చిత్‌కళ"గా విజ్ఞులు అభివర్ణిస్తున్నారు.

"ఒక విషయము ఒక రీతిగా అర్థము చేసుకోబడుతోంది" అనునదే బుద్ధి యొక్క రూపము.

**అర్థం చేసుకోబడటం (Interpretation) - వేరు,**

**అర్థం చేసుకొనువాడు (one who is interpreting) - వేరు కదా!**

'అర్థం చేసుకొనువాడు' లేకపోతే "అర్థం చేసుకోవటం" అనేది ఎక్కడుంటుంది?

కనుక,

- అర్థం చేసుకోవటం అర్థం చేసుకొనువాని ఉపకరణము,
- అర్థం చేసుకోవటం (లేక, బుద్ధి - విజ్ఞానమయ కోశము) **జడము.**
- అర్థము చేసుకొనుచున్న వాడో - **చైతన్యము, చైతన్య బ్రహ్మము.**

ఈ బుద్ధి జాగ్రత్‌లో శరీరంలో అంతరముగా నఖ-శిఖ పర్యంతరము (కాలి గోరునుండి - శిరస్సుపై పిలక ఉండే స్థానము వరకు) వ్యానవాయువుతో కూడినదై ఉంటోంది.

అంతే కాదు, మనస్సు లాగానే బుద్ధి కూడా జాగ్రత్తులో ఒక రీతిగా, స్వప్న సమయంలో మరొక రీతిగా ఉంటూ,... సుషుప్తి సమయంలో రూపము లేనిదై ఉంటోంది. అనగా, బుద్ధి కూడా మనస్సు లాగనే 'త్రికాలాబాధ్యము' కాదు.

అందుచేత, బుద్ధితో నిర్మితమైన విజ్ఞానమయ కోశము బ్రహ్మము కాదు!

**(5)ఆనందమయ కోశము** (Zone of pleasure and Enjoying):

**బ్రాహ్మణుడు :** మరి పంచకోశములలో ఐదవదైనట్టి ఆనందమయ కోశమో? అది కూడా జడమేనంటావా? బ్రహ్మము కాదంటావా? నారీమణీ!

**గొల్లభామ :** మనం చర్చిస్తున్న "నేతి - నేతి" అనే పూర్వ మీమాంసా విచారంగా గమనిస్తూ ఉంటే,... 'ఆనందో బ్రహ్మ' అనే వర్ణన వాక్యం

చెప్పబడుచున్నప్పటికీ,.... సిద్ధాంత పూర్వకంగా 'ఆనందమయ కోశము' (Zone of pleasure) కూడా జడమే గానీ, బ్రహ్మము కాదు.

'ఆనందించువాడు' ఉన్నప్పుడు కదా, ఆనందమునకు ఉనికి?

అనగా 'ఆనందము' అనుదానికి స్వత: సిద్ధమైన ఉనికి ఎక్కడున్నది?

అసలు 'ఆనందము' అనేది ఎట్లా రూపుదిద్దుకుంటోంది?

శ్లో॥ కాచిత్ అంతర్ముఖావృత్తి: ఆనంద ప్రతిబింబభాక్ ।
పుణ్యాభాగే భోగ శాంతౌ, నిద్రారూపేణ లీయతే ॥

ప్రతి జీవుడు ఆనందము కోరుకుంటున్నాడు. జీవులలో అనేకులు ఈ దృశ్యములోని "సంఘటనలు - సందర్భములు - సంబంధములు - సంపదావ్యవహారములు" ఇటువంటి వాటిలో "ఎక్కడ నా ఆనందము" అని వెతుకుతూ బహుదూరపు బాటసారి వలె సుదీర్ఘసంచారాలు చేస్తున్నాడు.

అయితే,

"ఏహి సంస్పర్శజా భోగా: దు:ఖయోనయ ఏవతే ।"

అని గీతాచార్యులవారు "ఆనందము కొరకై ఇంద్రియ విషయములలో వెతకటం బుద్ధి తక్కువ. దు:ఖములు తెచ్చిపెట్టుకోవటమే!".... అని ఒక్క ముక్కలో కొట్టిపారేశారు కదా!

"ఆనందమయ కోశము ఎట్లా రూపు దిద్దుకుంటోంది?" అనే విషయం పరిశీలించిన మహనీయులు, అద్దాని గురించి ఇట్లా అంటూ ఉంటారు.

ఈ బుద్ధి (లేక విజ్ఞాన కోశము) యొక్క వృత్తి ..... "ఈ పంచ భూతాత్మికమైన ప్రపంచములో ఏదేదో పొందితేగాని, ఇంకేదో తొలగించు కుంటేగాని ఆనందించలేను కదా"... అనే భ్రమ - మాయా పూర్వకమైన ఏదో అవగాహన కలిగి ఉండి ఇంద్రియ ప్రపంచంలో దేనిదేని కోసమో వెతుకుతోంది. "ఇప్పుడు నేను వర్తమానంలో దు:ఖినే! ఫరవాలేదు. ఈ కొన్నిటిని పొంది - ఈ పరిస్థితులు మార్చుకొని అప్పుడు మనం ఆనందం

పొందవచ్చులే...." అని భావించి అనేక లోకాలలో ఉపాధిపరంపరలను పొందటం జరుగుతోంది.

ఎప్పుడో ఒకానొకప్పుడు మహనీయుల - సద్గురువుల ప్రమాణ పూర్వక శాస్త్ర వాక్య సారాంశములు గ్రహించటం జరిగినప్పుడు ఇక ఈ బుద్ధి తన బాహ్య వృత్తిత్వము కించిత్ త్యజించి "అంతర్ముఖత్వము"ను ఆశ్రయించటం ప్రారంభిస్తోంది. అనగా సహజీవుల - దృశ్యముల బాహ్యావృత్తులను త్యజిస్తోంది. వాటన్నిటికీ ఆధారమైయున్న ప్రత్యగాత్మ - అంతర్యామియే - ప్రతి ఒక్కరి సహజ స్వరూపముగా అర్థం చేసుకోవడం - ఆస్వాదించటం ప్రారంభిస్తోంది.

అనగా, **సందర్భత్వమును** దాటి **సహజతత్త్వమును** ఆస్వాదించటం మొదలుపెట్టుచున్నది. అట్టి సమయంలో విషయవాసనలు 'మౌనము' వహించటం చేత విషయములకు సంబంధించని ఒకానొక మౌనస్వరూపమైన ఆనందవృత్తి బుద్ధిలో ద్యోతకం కావటం జరుగుతోంది.

అటువంటి "ఆనంద వృత్తి" కోపము - రాగము - ఆవేశము - ఏదో పొందలేదనే వ్యధ - ఏదో కావాలనే కామము మొ॥న పాప దృష్టులు, వాటికి సంబంధించిన కర్మ పరంపరలు సన్నగిల్ల చేస్తోంది. రూపుదిద్దుకుంటున్న "ప్రేమ - కరుణ- అమానిత్వము - అదంభిత్వము - అహింస - శాంతి - దానము - ధర్మము - పుణ్య కథా శ్రవణము - తీర్థములు" ఇత్యాది ఆయా పుణ్య కర్మల ప్రభావం చేత - ఆనంద వృత్తి ప్రవృద్ధం అవటం జరుగుతోంది.

బుద్ధిలో ప్రతిబింబించే నిర్విషయత్వమే ఆనందమయ కోశము యొక్క రూపము. అట్టి నిర్హేతుక - ఆనంద వృత్తి ఒకప్పుడు రూపుదిద్దుకున్నప్పటికీ,..... మరొక సమయానికి దృశ్యసంబంధమై - అభిప్రాయాలు - ఆశలచే కప్పబడి ఉంటోంది (A kind of Avocation).

ఆనందము కూడా ఒకానొక వృత్తియే కాబట్టి అది "ఆనందించు వాడు" అయిన ఆత్మ యొక్క విన్యాసమే అయి ఉన్నది.

ఆనందము - ఆనందవృత్తి = జడము

ఆనందించువాడు = చైతన్యము

ఆనందించువాడు ఉంటే కదా, ఆనందము యొక్క వృత్తి - ప్రవృత్తి కూడా!

కనుక,

**ఆనంద కోశము కూడా జడమే!** ఆనందము ఎవరిదో, అట్టి జీవాత్మ ఆనందమునకు కూడా పరమై, చైతన్య స్వరూపుడై, స్వయం బ్రహ్మస్వరూపుడై ఉన్నాడు - అని మనం గమనించవచ్చు.

**బ్రాహ్మణుడు :** అమ్మా! తరుణీమణీ! నీవు పంచకోశముల గురించి చక్కగా నీ భాషలో వివరించావు. "అవన్నీ జడమే" అని సిద్ధాంతీకరిస్తున్నావు. నీవు చెప్పినదంతా భారతీయ తత్త్వ శాస్త్ర సమ్మతమే! యుక్తి యుక్తమే! ఒప్పుకుంటున్నాను.

అయితే...,

## 19. కర్మణా జాయతే ద్విజః

ఇప్పుడు మరొక్కసారి బ్రాహ్మణులమగు మా విషయమై ప్రస్థావిస్తున్నాను. శాస్త్రనిర్ణయమైన బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్ర చాతుర్వర్ణ్య విభాగమును అనుసరించి విను. మేము జన్మతః బ్రాహ్మణులము అయి ఉన్నాము. ఇంకా శాస్త్రములు నిర్దేశించిన విధంగా ఉపనయనము - వేదపఠనము మొ॥న వాటిని నిర్వర్తిస్తూ 'ద్విజులు' అని కూడా పిలువబడుచున్నాము. ఇది ~~ఈ~~ సభకు వేంచేసిన మహనీయులు, అందరూ ఎరిగి ఉన్న విషయమే! పండితమ్మన్యులంతా ఒప్పుకుంటున్న విశేషమే!

**గొల్లభామ :** జన్మ మాత్రం చేతనో, జాతి మాత్రం చేతనో 'బ్రాహ్మణత్వము' అనునది సిద్ధించేది కాదు కదా, స్వామీ!

ఎందుకంటారేమో?

మనం పురాణ కథలు, మహనీయుల చరిత్రలు పరిశీలిస్తే.... జన్మతః విప్రుల కులంలో పుట్టి ఉండకపోయినప్పటికీ, తమ యొక్క ఉత్తమ కర్మలచే బ్రాహ్మణత్వము సిద్ధించుకున్నట్టి మహనీయులు

ఎంతమంది లేరు, చెప్పండి?

ఉదాహరణకు....,

మతంగ ఋషి పూర్వములో - మతంగకన్యా గర్భమందు జనియించెన్।

ప్రీతితో తపమొనరించియు - భూతలమున బ్రాహ్మణుడయ్యె బుధులు గణింపన్॥

మహనీయులగు మతంగ మహాముని విషయమే చూడండి. వారు పుట్టుకచే ఒక మాదిగ స్త్రీ గర్భాన జన్మించారు. **సద్గురువులను**, విజ్ఞులను, శాస్త్రములను ఆశ్రయించారు. పెద్దలు చెప్పిన మార్గంలో తపస్సు ప్రారంభించారు. మహనీయులయ్యారు. వేదజ్ఞుల చేత- బ్రాహ్మణ ప్రముఖుల చేత **"ఈయన బ్రాహ్మణత్వము సిద్ధింపజేసుకున్నారు"** అని ప్రశంసించబడ్డారు కదా! వారు మనందరికీ పూజనీయులు, ప్రాత:స్మరణీయులు అయ్యారు. అది మీకు తెలిసిన విషయమే కదా! ఇంకొక దృష్టాంతము!

శ్లో॥ ఊర్వశీ గర్భసంజాతో వశిష్ఠశ్చ మహాముని:।
తపసా బ్రాహ్మణోऽభవత్, కింజాతి: తత్ర కారణమ్?

అట్లాగే మహనీయులగు శ్రీవసిష్ఠమహర్షి గురించిన విశేషమేమిటి? వారు ఊర్వశి గర్భమున జన్మించారు. తమ యొక్క తపోబలంచేత ఆత్మజ్ఞులై శ్రీరామచంద్రమూర్తి ద్వారా మనకు "వసిష్ఠరామ సంవాదము - యోగ వాసిష్ఠము" అనే మోక్ష శాస్త్రాన్ని ప్రసాదించారు. బ్రహ్మర్షియై సప్తర్షిమండలంలో వెలుగొందుచూ లోక కళ్యాణమూర్తులయ్యారు. వారి పట్ల కుల - జాతి ప్రసక్తి ఏం చెప్పగలము?

అందుచేత,

జన్మత: సాంఘికంగా కనిపించే 'జాతి' అనబడు దానికి బ్రహ్మత్వమునకు అవినాభావ సంబంధము ప్రతిపాదించలేమని ఒప్పుకోక తప్పదు కదా! విప్రవర్యా!

**బ్రాహ్మణుడు** : అవును. నీవు చెప్పిన శ్రీమతంగ మహాముని, శ్రీవసిష్ఠ

మహర్షి వంటి మహనీయుల విషయాలన్నీ నేను ఒప్పుకుంటున్నాను. వారందరూ మాకు కూడా ఆరాధ్య పురుషులే!

అయితే,

బ్రాహ్మణకులజుల యొక్క ఆధిక్యత గురించి నేను ఎందుకు చెప్పుకుంటూ వస్తున్నానో..., ఆ విషయమును నీవు నీ యొక్క విజ్ఞతతో యోచించి, పరిశీలించి గుర్తించటానికి ప్రయత్నిస్తున్నావా? ప్రయత్నించి చెప్పు! ఆలోచించు!

**గొల్లభామ :** (కొంచెము సేపు కళ్ళు మూసుకొని, ప్రశాంతతతో కూడిన మౌనము వహించి) మహాత్మా! మీరు చెప్పిన "ఆధిక్యత" గురించి ప్రశాంతముగా యోచన చేశాను స్వామీ! ఒకానొక శాస్త్రార్థ విశేషం నా మనస్సుకు స్ఫురిస్తోంది. మీరు శాస్త్రవిహితమైన శబ్దబ్రహ్మోపాసన కులధర్మముగా కలిగి ఉంటున్నారు. "కర్మణా జాయతే ద్విజః"... అను వాక్యమును అనుసరించి 'ఉపనయనము' ఇత్యాది శాస్త్రవిహితమైన యజ్ఞ-యాగ - క్రతు - వ్రతములు అభ్యసించి లోకహితులై - పురోహితులై కర్మలు నిర్వర్తించటం చేత గౌరవించబడుచున్నారు. పూజించబడుచున్నారు. శ్లాఘించపడుచున్నారు. అదంతా ఉచితమే! మాకు అనుసరణీయమే! వేదశబ్దములతో మమ్ములను పునీతులుగా చేస్తున్నారు. మాకు సదాపూజనీయులే!

అయితే...,

"సర్వం ఖల్విదమ్ బ్రహ్మ", "ఇదమ్ మమాత్మ స్వరూపమేవ", "జీవోబ్రహ్మేతి నాఽపరః", "అహమ్ బ్రహ్మాస్మి", "అహమ్ సర్వస్య ప్రభవో", "మత్తఃపరతరమ్ నాఽన్యత్ కించిదస్తి" ఇట్టి వేద- వేదాంగ - ఉపనిషత్ - భగవద్గీతా మహావాక్యాల అనునిత్యానుభవమైన 'బ్రాహ్మీ స్థితి' అయినట్టి "బ్రాహ్మణత్వము"తో విప్రత్వము సరిసమానము కాదని, నా అభిప్రాయము, స్వామీ!

ఇంకొక విషయం!

ఆ.వె: పూర్ణభావమెరిగి పూజ్యులు గాక, మే

మెక్కువందురందుకొక్కటుండె,
న్యాయమొప్ప 'కర్మణా జాయతే ద్విజో''

అనెడి శాస్త్రవాక్కుననుసరించి ఈ కనబడేదంతా కూడా పరమాత్మ రూపమే (సర్వం ఖల్విదమ్ బ్రహ్మ) అని వేద- ఉపనిషత్తులు, మంగళశాసనం చేస్తూ గానం చేసి వినిపిస్తున్నాయి కదా!

అందుచేత,

నేనైనా - మీరైనా - మరెవ్వరైనా "సర్వ సమభావము" ను ఆశ్రయించి ఈ దృశ్యమును ఆస్వాదించటం సముచితం కదా!

"ఈ కనబడే నామ రూపాత్మకమైనదంతా, ఈ కళ్ళకు కనిపించే జీవులు - జీవ సమూహములు - అన్నీ కూడా..., స్వత:గా "బ్రహ్మమే" అయి ఉండి కూడా, నా యొక్క 'మనో వికారము' అనే కారణంగా, అభ్యాసవశంగా 'దృశ్యభావన'చే అనేకంగా అనుభూతమౌతోంది!" అని విజ్ఞతతో గమనించి ఉండటమే బ్రహ్మభావనకు త్రోవ.

క్రమంగా అట్టి భౌతిక - సాంసారిక దృష్టిని అధిగమించి స్వస్వరూపాత్మదృష్టి - 'మమాత్మా సర్వభూతాత్మా' దృష్టి - బ్రాహ్మీ దృష్టిని పెంపొందించుకోవటమే శాస్త్రముల - యజ్ఞ - యాగ - క్రతు - వ్రతాదుల ఆత్యంతికోద్దేశ్యం కదా! **"కనబడేదంతా అదే! ఇక కళ్ళమూతలెందుకు?"** అను అవగాహనతో **"సర్వము పరమాత్మ తత్త్వమే! - అని అనుకుంటూ ఉంటే - అనిపించకేంచేస్తుంది?"** అనే ఆత్మనమ్మకంతో మనందరి కర్మలు - కార్యక్రమములు సర్వేశ్వరుడు - సర్వాంతర్యామియగు శ్రీరామలింగేశ్వర స్వామికి సమర్పిస్తూ మనమన నియమిత కర్మలు - సాధనలు కొనసాగిస్తూ ఉంటే... మీరు - నేను - ఈ శ్రోతలు కూడా 'బ్రహ్మత్వము' సంతరించుకోగలము కదా!

అంతేగానీ,

జగన్నాటక చమత్కారంగా పంచేంద్రియములకు కనిపించే (లేక) ప్రాప్తిస్తున్న దృశ్య - వ్యవహార పరంపరలను తెలివి తక్కువగా నమ్మి - ఆశ్రయించటం, జన్మ - కర్మల సంబంధముగా మాయచే కల్పన చేయబడే

కుల - మత భేదములను నమ్మటం, నిరూపించటానికి ప్రయాసపడటం ఉచితమంటారా? అది అనవసరమైన - అసంగతమైన ఆయాసం కాదంటారా?

"మేము వారి కంటే జన్మత: గొప్పవారము - వీరి కంటే కూడా అధికులము" అని ప్రయాసగా చెప్పుకోవటం శాస్త్రముల ఉద్దేశ్యము కాదని నాకనిపిస్తోంది.

అందుకే...,

జన్మనా జాయతే శూద్ర:
కర్మణా జాయతే ద్విజ:

అని శ్రుతులు గానం చేస్తూ గుర్తు చేస్తున్నాయి కదా! "ఉత్తమ కర్మలు ఆశ్రయించువారే ద్విజులు. జన్మమాత్రం చేత కాదు" అని నిర్వచిస్తున్నాయి.

ఇక,

స్వకీయమైన - నిర్మలమైన ఆత్మ దృష్టిచే ఎవ్వరైనా బ్రహ్మత్వమును పుణికి పుచ్చుకోగలరు. అంతే కానీ బ్రహ్మత్వము జన్మల చేత గానీ - కర్మల చేత గానీ లభించేది కాదు. ఉత్తమమైన ఆత్మ సాక్షాత్కారమునకు సంబంధించిన అవగాహన చేతనే.

"దృష్టిమ్ జ్ఞానమయం కృత్వా - పశ్యేత్ బ్రహ్మమయం జగత్" అని కదా! పెద్దల అభిప్రాయము.

స్వామీ! మరొక్క విషయం కూడా ఈ సందర్భములో నా అవగాహన ఏమిటో చెపుతాను. వినండి.

బాల్యము నుండి కుల పెద్దలు - మనుశాస్త్రము ఇత్యాదులు చూపిన మార్గములో వేద విహిత కర్మలు సేవిస్తూ ఉండటం చేత మీరు విప్రులై, మావంటి వారికి పూజనీయులు అగుచున్నారు.

అందుచేత, మీరు విప్రులై ఉండటం చేత నిర్వహిస్తున్న వేరు వేరు కర్మల విశేషమేమిటో దయయుంచి నాకు - ఈ సభకు వివరించమని నా

కోరిక! విన్నపము!

**బ్రాహ్మణుడు :** ఓ పడతీ! విప్రులమగు మేము ద్విజులమై ఏమేమి కర్మలు - కార్యక్రమములు నిర్వర్తిస్తూ ఉంటామో చూచాయగా చెప్పియే ఉన్నావు కదా!

అయినా,

మా గురించి మేమే చెప్పుకోవటంలో విశేషమేమున్నది? అది స్వోత్కర్ష అయి శ్రోతలకు రుచి కలిగించకపోవచ్చు. అందుచేత, విప్రులమగు మేము ఏమేమి వివిధ కర్మలు చేస్తూ ఉంటామో, ఏదేది నిర్వర్తిస్తూ ఉంటామో... నీకు తెలిసినంత వరకూ నీవే చెప్పు.

**గొల్లభామ :** కొన్ని విషయాలు మీరు చెప్పియే ఉన్నారు. యజనము - యాజనము - అధ్యయనము - అధ్యాపనము - దానము - ప్రతిగ్రహణము.

ఇవికాక...., నివాసము, గర్భాదానము, సీమంతము, పుంసవనము, జాతక కర్మలు, నామకరణము, అక్షరాభ్యాసము, ఉపనయనము, వివాహము, శాంతి, పంచమహా యజ్ఞములు - ఇవన్నీ మీరు చేయిస్తూ ఉంటారు. వేద-వేదాంగాలు నేర్చటానికి - పఠించటానికి - నేర్పటానికి మీరు తగి ఉన్నారు.

ఆయా కాలము - సందర్భములను అనుసరించి ఏది ఎప్పుడు ఎట్లా మంత్ర - తంత్ర ముగ్ధంగా చేయాలో - అది చెప్పటం, చేయించగలగటం మీ బ్రాహ్మణులకే, విప్రులకే చెల్లుతుంది. ఇతరులకు ఆ అర్హత లేదు కదయ్యా! స్వామి వారు!

**బ్రాహ్మణుడు :** ఆహా! ఆహా! భామామణీ! ఇప్పటి దాకా "ఈ భూమిపై పుట్టిన మానవులంతా ఒక్కటే"... అని పలికావ్! ఇక ఇప్పుడేమో, "ఆయా సమయ - సందర్భాలకు ఉచితమైన శాస్త్రవిహితమైన మంత్ర - తంత్ర విధానములలో నేర్పరులు మీ బ్రాహ్మణులే!" అని పొగడుచున్నావ్. దైవోపాసన - శాస్త్రప్రవచితమైన వ్రతములు మొదలైనవన్నీ మేము మాత్రమే చేయిస్తాము. కనుక మా జన్మలు ప్రత్యేకమైనవే కదా!

**గొల్లభామ :** కర్మచేత ద్విజులు - బ్రాహ్మణులు అయినంత మాత్రము చేత గర్వించవచ్చునా మహనీయా! అయ్యా! ఉండండి! ఇప్పుడు కాదులేండి. కాసేపాగండి. 'మేమే అధికులము' అనే మాట 'సంసారరూప భ్రమవంటిదే' అని నిరూపిస్తాను.

**బ్రాహ్మణుడు :** భామామణీ! -"కర్మల విషయంలో మీరు శ్రేష్ఠులు. పెళ్ళిళ్ల - వ్రతాలు - పూజలు - పితృదేవోపాసనలు చేయించటానికి అర్హత మీకే ఉన్నది".... అని ఇప్పుడే అన్నావు. "అల్ప సంతోషీ బ్రాహ్మణః" అన్న తీరుగా ఆ మాటకే నేను సంతోషించాను. ఇంతలోనే "కాసేపాగండి! మీ ఆధిక్యత ఏమిటో తేలుస్తాను" అంటున్నావే! నీ మాటలు వింటుంటే, "ఈ ప్రశ్నకు ఈ సమాధానం ఆ ప్రశ్నకేమో, ఆ సమాధానం"... అన్న తీరుగా ఉన్నదే!

**గొల్లభామ :** అందరికీ ప్రియము - క్షేమము కలుగజేసే వేదయుక్తములైన మంత్రములు - వాటికి సంబంధించిన క్రియా విశేషములు పఠించే - చేయించే అధికారం మీకు మాత్రమే ఉన్నదిలేండి!

**బ్రాహ్మణుడు :** అవును కదా! యజ్ఞ - యాగ క్రతువులు నిర్వర్తించటానికి, నిర్వర్తింపజేయటానికి, తదితర అనేక వేదవిహిత కర్మలు చేయటానికి, వేదములు చదవటానికి నేర్పటానికి మేమే కదా అర్హులము!

- జన్మ చేత శూద్రులము
- కర్మ చేత ద్విజులము
- వేదాభ్యాసము చేత విప్రులము.

మేము వేదము చదవటానికి అర్హులమని నీవే చెప్పుచున్నావు కదా! అనగా మేమే కొంత ఎక్కువ - అని నీవే ఒప్పుకుంటున్నట్లే కదా!

**గొల్లభామ :** "వేదాలు పఠించటానికి - వ్యాఖ్యానించటానికి మేము మాత్రమే అర్హులము. మాకే అధికారము" అని మీరు అహంకరించవచ్చునా? "కర్మచే ద్విజులు, వేదాధ్యయనం చేత విప్రులు"... మీరు అయి ఉండవచ్చు గాక! అంతవరకు నేను ఒప్పుకుంటున్నాను. అంతమాత్రంచేత 'బ్రహ్మత్వము' సిద్ధిస్తుందా? లేదు కదా!

అందుచేత, "ద్విజులు - విప్రులు - జన్మత: బ్రాహ్మణులు"... ఇవన్నీ కూడా ఇహములో ప్రతిష్ఠ కలుగజేయవచ్చుగాక! అవన్నీ 'పరము' దృష్ట్యా - 'బ్రహ్మత్వము' సిద్ధించనంత వరకూ కూడా - నిష్ప్రయోజనములే అవుతాయి. సర్వ భేద దృష్టులు తొలిగిపోతే కదా, బ్రాహ్మణత్వము సిద్ధించేది.

**బ్రాహ్మణుడు :** పోనీ, మరొకమాట అనవచ్చునేమో. 'జన్మత: శూద్రులు' అనే చోట మీరు ఉండిపోతున్నారు. మేమో, ఆ స్థితి నుండి 'ద్విజులము - విప్రులము' అగుచున్నాము కదా! అనగా, మీకంటే మా బ్రాహ్మణ జన్మలు అధికమేనని నీవు ఒప్పుకోవాలి కదా! ఇక చెప్పవలసినదేమున్నది? వాదించవలసినదేమున్నది?

**గొల్లభామ :** "సర్వమ్ బ్రహ్మమేవ - ఇతియం సందర్శనం కురుతే తం బ్రాహ్మణమ్" అని కదా! బ్రాహ్మణ శబ్దార్థం.

బ్రహ్మము కానిదెవ్వరు? బ్రహ్మమునకు వేరై కనిపించేదంతా కేవలము స్వప్నసదృశమే కదా!

ద్విజులు - విప్రులు అయినంత మాత్రం చేతనే "మేము మరికొందరి కన్నా - తదితరులకన్నా కూడా అధికులము" అనే అభిప్రాయమును పూర్వపక్షం చేస్తూ నేను నా వాదనను విశదీకరించటానికి అనుమతి ఇస్తారా స్వామీ!

**బ్రాహ్మణుడు :** అట్లాగా? అందుకు సరిఅయిన విధంగా సమాధాన పరచటానికి నేనూ సిద్ధమే! "ద్విజులు - విప్రులు అధికులు కారు!" అని శాస్త్రీయంగా నిరూపించటానికి ఎవరై పండితులనో, వేదవేదాంగములను అధ్యయనము చేసిన వారినో నీవు తోడుగా తెచ్చుకోవటం కూడా నాకు అంగీకారమే!

**గొల్లభామ :** కోపము వచ్చిందా స్వామీ!

**బ్రాహ్మణుడు :** కోపమా? కోపమెందుకు? బుద్ధి కుశలతను అనుసరించి నీవు మాట్లాడుచున్నావు. అంతే! అన్ని విషయాలు నీకు తెలియకపోవచ్చు. నాకూ తెలియక పోవచ్చు.! అందుచేత మేము తప్పుపట్టుకోము.

వేదాధ్యయనం ద్వారా గురుముఖంగా పఠణబలంచేత మేము ఏ వేద- వేదాంత విద్యా చాతుర్యము - తత్సంబంధమైన వేద వాక్కు - చాతుర్వర్ణ్య ధర్మాలు ఎరుగుట జరుగుతోందో.... అవన్నీ (లేక) కొన్ని నీవు గమనించి ఉండకపోవచ్చు కదా!

ఓ పూబోడీ! మరల చెప్పుచున్నాను.

"విప్రులు- ద్విజులు అధికమైనవారు కారు" అని నాతో వాదించి గెలవాలనుకుంటే, అందుకు నాకు అభ్యంతరము లేదు. ఏమి చెప్పాలనుకుంటున్నావో, చెప్పు! నీ వాదనల పస ఏమిటో చూస్తాను.

**గొల్లభామ** : మహాత్మా! పండితోత్తమా! మీరు యజ్ఞ - యాగ కోవిదులు కాబట్టి నాకు మీ పట్ల గౌరవమే! అందుచేత కోపగించరు గాక!

ఎందుకంటే...., మన ఈ వాదోపవాదాలన్నీ ఉభయ శ్రేయస్సులను - దృష్టిలో పెట్టుకొని మన జ్ఞాన - విజ్ఞాన దృష్టులను మరింత ప్రవృద్ధము చేసుకోవటానికి మాత్రమే! "వాదోన అవలంబ్యః" అని నారద భక్తి సూత్రము కదా!

అంతేకానీ,

మనం మనం నమ్మినదాని మాత్రమే కట్టుబడి ఉండాలనో, ఒకరి తప్పులు మరొకరు ఎంచాలనో కాదు కదా! పండితమ్మన్యులగు మీకు ఈ విషయం చక్కగా తెలుసునని నా నిశ్చితాభిప్రాయము. అందుచేత మన ఈ ఆత్మయజ్ఞ పూర్వకమైన చర్చను మరింతగా కొనసాగిస్తున్నాము. మరల అడుగుచున్నాను. మరి నా వాదన వినమ్రతా పూర్వకంగా కొనసాగించమని అనుజ్ఞయే కదా!

**బ్రాహ్మణుడు** : భామామణీ! నీ యొక్క సహృదయతను నేను గమనిస్తున్నాను. సత్య దృష్టితో ముక్కుకు సూటిగా సంభాషించటం నాకు సంతోషమే కలుగజేస్తోంది.

అందుచేత....,

శుభాశయంతో, 'ఆత్మజ్ఞానము - ఆత్మదృష్టి' మరింతగా ఉభయులము సంపాదించుకుందాము. నీవు నిర్మొహమాటంగా చెప్పాలనుకొన్నది చెప్పవచ్చు. మాకు కోపం లేదు. రాదు.

## 20. బ్రాహ్మణః - కిమర్థమ్? కిముద్దేశ్యమ్?

**గొల్లభామ :** పండితోత్తమా! చాలా సంతోషము స్వామీ! ఇప్పుడు మిమ్ములను ఒక్కటడుగుతాను. అసలు 'బ్రాహ్మణులు' అనగా..... ఎవరు? ఎట్లా ఉంటారు?

- తెల్లగానా? నల్లగానా? ఎర్రగానా?
- కంటి - కడియాలు ధరిస్తూ ఉండేవారా?
- విభూతి - రుద్రాక్షలు ధరించి ఉంటారా?
- ఉంగరాలు - ప్రోగులు - మురుగులు ఇటువంటివి అలంకరించుకొని ఉంటారా?
- పట్టు ఎంచలు - శాలువా - పిలకలతో కనిపిస్తూ ఉంటారా?

'బ్రాహ్మణుడు' అనే శబ్దానికి అర్థమేమిటి? ఉద్దేశ్యము ఏమిటి? కాస్త వివరించరూ!

**బ్రాహ్మణుడు :** అవును. నీవు చెప్పే అన్ని రకాలుగానూ ఉంటారు. నీవనేదేమిటి? అట్లా ఉండేవారందరూ బ్రాహ్మణులు కాజాలరేమోనని నీ ఉద్దేశ్యమా? చెప్పుతల్లీ! చెప్పు!

నీవు ఏమని అనుకుంటున్నావో.... చెప్పవమ్మా!

**గొల్లభామ :** అయ్యా! అయ్యా! కోప్పడకండేం! నాకు-మీకు కూడా ఇష్టదైవమైనట్టి ఈ బాలాత్రిపురసుందరీ సహిత రామలింగేశ్వరస్వామి వారి నామ రూపాలు - మహిమా విశేషాలు హృదయంలో భక్తితో ఉపాసిస్తూ 'బ్రాహ్మణులు' అనగా ఎవ్వరో నాకు తెలిసినది నిఖచ్చిగా చెప్పుచున్నాను.

**బ్రాహ్మణుడు :** చెప్పుమనే కదమ్మా నేనంటున్నది! నేనుగానీ, ఈ సభాసదులుగానీ ఏమనుకుంటారోనని నీవు వెనుకాడనఖర్లేదు. అందరమూ

నీ వివేచనను చూచి సంతోషిస్తూ ఉన్నవారమే! నీవన్నట్లు శ్రీబాలా త్రిపురసుందరీ సహిత శ్రీరామ లింగేశ్వరస్వామిని భక్తితో నేను కూడా స్మరిస్తూనే నీకు సమాధానం చెపుతాను, ఓ లలనా తిలకమా!

**గొల్లభామ :** మీకూ - మన ఈ సంవాద పూర్వక సత్సంగ ప్రసంగమును ప్రేమగా వింటున్న ఈ ప్రేక్షకమహాశయులకు శ్రోతలకు నమస్కరిస్తూ నా అభిప్రాయాలు ఖరాఖండిగా చెప్పుచున్నాను వినండి.

తత్త్వశాస్త్రం దృష్ట్యా.....,

జన్మత: "బ్రాహ్మణకులము" ఇత్యాది కొన్ని కులాలలో జన్మించినవారు ఉపనయనముచే ద్విజులు, వేదములు అభ్యసించటంచేత విప్రులు అవుతారు. అంత మాత్రం చేత బ్రహ్మము యొక్క సిద్ధిని పొందినట్లు కాదు.

**వేదవిహిత కర్మలు :** ఒకానొకడు వేదవిహితమైన కర్మలు సశాస్త్రీయంగా, కాల నియమానుసారంగా చక్కగా నిర్వర్తించటం చేత 'స్వర్గము' ఇత్యాది సుఖప్రదమైన లోకాలు పొంది భోగములను అనుభవించటానికి అర్హుడౌతాడు.

అయితే.....,

పుణ్యవశంగా పొందిన ఆ భోగమయస్వర్గాది లోకాలలో నివాసం కాలక్రమేణా -పుణ్యము ఖర్చుకాగా, పోగొట్టుకొని ఆతడు మరల భౌతిక లోకాలలో శరీర ధారణ చేయవలసి వస్తోంది.

"తేతంభుక్త్వా స్వర్గలోకం విశాలం ।
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ॥" **- భగవద్గీత**

మరొక్కసారి చెప్పుతున్నాను. వినండి.

'స్వర్గము' మొదలైన భోగమయలోకాలే ఆశయంగా కలిగి ఉండి యజ్ఞ- యాగాది వైదిక కర్మలు నిర్వర్తించేవారు కొంతకాలం ఆయా స్వర్గలోక సుఖాలు అనుభవించి, ఆ పుణ్యము క్షీణించగానే మానవ లోకానికి తిరిగి రావలసిందే!

అనగా 'పునర్జన్మలు' అనే జాడ్యము స్వర్గాది లోకాలలో ప్రవేశించినంత మాత్రంచేత తొలగటం లేదని అనక తప్పదు. కనుక స్వర్గాది లోకాలు 'బ్రాహ్మీసుఖము'నకు మార్గము కాదు. ఈ విషయము భగవద్గీత, ఉపనిషత్తులు తదితర అధ్యాత్మశాస్త్రగ్రంథాలు నొక్కి - నొక్కి చెప్పుచున్న మాట! వ్యాఖ్యానిస్తున్న విషయమే!

**బ్రాహ్మణుడు :** అవును. అయితే కూడా, ఒకానొక ముఖ్య విషయం సుమా! ధర్మశాస్త్రములో నిష్ణాతులైన ధర్మకోవిదులు చెప్పుచున్నదేమంటే....,

- కర్మ - జ్ఞానము ఒక్క తీరైనవే!
- రెండూ కూడా మోక్షమునకు మార్గములే!

(సాంఖ్యయోగౌ పథక్ - బాలాప్రవదంతి! న పండితా: - గీతా)

అట్టి ధర్మ కోవిదుల పలుకు విని ఉండలేదా! విని కూడా సరిగ్గా యోచన చేయటం లేదా? మర్మమేమిటో తెలియక "కర్మమార్గం పునరావృత్తి స్వభావం కలిగి ఉన్నది (గతాగతం కామకామా: లభంతి) అని మాత్రమే వాఖ్యానిస్తున్నావే? మర్మము తెలియక కర్మ మార్గమును అల్పమైన దానిగా చిత్రీకరిస్తున్నావా?

నీకు సమగ్రమైన శాస్త్రపరిశీలన కొంచము కుంటుపడిందేమో? మరొక్కసారి చెప్పుచున్నాను విను.

ఆర్యప్రవచనములైనటువంటి జ్ఞాన- కర్మ విశేషాలలో చతురులైనట్టి పెద్దలు జ్ఞానమార్గమును, కర్మ మార్గమును ఒక్కతీరైనవిగానే సందర్శిస్తూ ఉంటారు. అంతేగానీ బాలురవంటి అజ్ఞులవలె వేరువేరైనవిగా చూడరు. శాస్త్రముల హృదయమేమిటో గమనించక, బాల్యచాపల్యము గలవారి కొరకై శాస్త్రములు చెప్పే కొన్నివిభాగములను మాత్రమే పరిగణలోనికి తీసుకొని "ఇది కర్మమార్గం. అల్పమైనది. అది జ్ఞానమార్గం. మహాగొప్పది."....అని వాదించటానికి ఉబలాటపడుచున్నావా? తల్లీ! శాస్త్రవాక్యాలు సరిగ్గా చదవక అట్లా మాట్లాడుచున్నావా? సరే! శాస్త్రములు బ్రాహ్మణుల గురించి ఏమి చెప్పాయో... అది కూడా చెప్పు! విందాము.

**గొల్లభామ :** బ్రాహ్మణుల గురించి శాస్త్రవాక్యాలేమిటో, ఉద్దేశ్యమేమిటో

చెపుతాను వినండి.

- సృష్టిలో 64 లక్షల జీవజాతులున్నాయి.
- వాటన్నిటిలో ఈ జీవునికి 'మానవజన్మ' లభించటమనేది అతి దుర్లభము.
- అందులో వేద-శాస్త్రప్రవచనాలు, ఉద్దేశ్యాలు పరిశీలించగల విద్యా బుద్ధులు అవకాశంగా లభించటం మరికొంత దుర్లభము.
- అవి ఏ కొంచము లభించినా సరే, ఇక ఈ జీవుడు ఏ మాత్రం తాత్సారం చేయరాదు!
- సాధన గురువును, ఆశ్రయించి ఉత్తమ సాధనకు ఉపక్రమించాలి. అటు తరువాత సాధన సామగ్రిని వెంటబెట్టుకొని 'సద్గురువు'ను సమీపించాలి. వారు చెప్పే స్వస్వరూపజ్ఞాన సంబంధమైన పాఠ్యాంశాలను సునిశితమైన బుద్ధితో వినాలి. విచారణ చేయాలి.
- మహనీయుల అనుభవాలను, అభిప్రాయాలను సేకరించాలి.
- సద్గురువు ఏం చేస్తున్నారు. "తత్ - త్వమ్‌అసి" (ఆ బ్రహ్మమే నీవు), సోఽహమ్ (అదియే నేను), అహమ్ బ్రహ్మాస్మి (నేను బ్రహ్మమే అయి ఉన్నాను), త్వమేవాఽహమ్ (నీవుగా కనిపించేది నేనే) ఇత్యాది మహావాక్యాల సారాన్ని నిరూపించి చూపుచున్నారు.
- అట్టి సద్గురువు చెప్పే మహావాక్య నిరూపణా రూపమైన బోధను **సునిశితమైన దృష్టితో, సంసార దృష్టులకు అతీతమైన అవగాహనతో వినాలి.**

**- నేనెవరు?**

- ఈ దేహమునా?
- ఈ దృశ్యాంతర్విభాగమునా?
- మనో - బుద్ధి - చిత్త - అహంకార పరిమితుడినా?
- దేహములకు - భావములకు మునుముందే ఏర్పడినదై ఉండి దృశ్య

- దేహ - మనో- బుద్ధి - చిత్త - అహంకారాలను స్వకీయ చమత్కారంగా చైతన్యపరచే బ్రహ్మమునేనా? ఆత్మస్వరూపుడినా? సర్వము తానైన పరమాత్మ తత్త్వమనేనా?

ఈ ప్రశ్నలన్నిటికీ సరి అయిన సమాధానము ఎంత కష్టపడైనా సరే,... సంపాదించుకోవాలి!

స్వవిచారణచే "మమాత్మా సర్వభూతాత్మా! అహమ్ సర్వస్య ప్రభవో" అనే వాక్యార్థాలను సద్గురు బోధ- స్వవిచారణలచే ధైర్య - సాహసములు గల యుద్ధ వీరునివలె అతిప్రావీణ్యతతో గ్రహించాలి.

ఇక **"కనబడే దృశ్యము - తదంతర్గతమైన సర్వజీవరాసులు మమాత్మానంద స్వరూపమే!"** అనే అవగాహన - అఖండానుభూతి పెంపొందించుకోవాలి.

తత్త్వరహస్యమును గమనించి సర్వమును స్వస్వరూపంగా ఆస్వాదించే అనుక్షణికానుభవమును క్రమక్రమంగా సిద్ధింపజేసుకోవాలి!

అనగా అఖండాత్మానందరూపమైనట్టి "అహమాత్మా, సర్వభూతా శయ స్థిత:" అను కృష్ణచైతన్యానందమును సముపార్జించుకోవాలి.

త్రివేణీ సంగమును - ద్రష్ట-దర్శన-దృశ్యముల ఏకత్వానుభవమును అనుభూతం చేసుకోవాలి. ఆరురుక్షుత్వము - యోగారూఢత్వముచే ప్రాపంచకమైన మనస్సును ఆత్మభావన యందు - (ఉప్పుబొమ్మ యొక్క పదార్థ - ఆకారములను నీటియందువలె) - లయింపజేయాలి.

శ్లో॥ ఆరురుక్షోర్ముమేర్యోగం కర్మకారణముచ్యతే ।
యోగారూఢైవ తస్యైవ శమ: కారణముచ్యతే ॥

ఆరురుక్షు యోగి : కర్మలద్వారా ఉపాసన కొనసాగిస్తూ మోక్ష మార్గములో అడుగులు వేస్తూ ఉంటాడు.

యోగారూఢుడు : కర్మలచే కర్మలను దాటి కర్మల నుండి ఉపశమిస్తూ ఆత్మజ్ఞానమును పునికి పుచ్చుకుంటాడు.

కొన్ని సిద్ధాంతాలు : జీవితాంతం కర్మలు వదలరాదు. కర్మలు కొనసా

గిస్తూనే జ్ఞానమును తీర్చిదిద్దుకోవాలి.

అని చెప్పుచున్నాయి.

మంచిదే! అయితే.....,

ఆ కర్మ నిర్వర్తించే కర్త - చాతుర్వర్ణ్యములలోను తనకుగా నియమించిన కర్మల నిర్వహణాపుష్పాలను ఈశ్వరార్పితం చేయాలి. **"నాకు నియమితమైన కర్మలే నాఉపాసన** (work is my workship)" అను బుద్ధితో - అవగాహనతో - శ్రద్ధతో భగవదర్పితంగా కర్మలు నిర్వర్తించాలి స్వామీ!

"స్వప్నకల్పితముల వంటి లోక విశేషాలు" అన తగినట్టి ఇక్కడి లౌకికవిద్య - ధనము - జాతి - ప్రతిష్ఠ - కర్మసామర్థ్యములకు సంబంధించిన అహంకారము దగ్గరకు రానీయకుండా **లోకానుకూలము - శాస్త్రానుకూలము - భగవదర్పితము - సహజీవులకు సుఖసంతోష ప్రదముగా స్వీయ ధర్మ- కర్మలను తీర్చిదిద్దుకోవాలి.** సాధన చతుష్టయ సమన్వితంగా స్వకర్మలను ఆచరించాలి.

**శమము** : ఇంద్రియ నిగ్రహము, ఇంద్రియములను సరిఅయిన మార్గంలో నియమించటం, ప్రాపంచిక విషయముల పట్ల రాగరాహిత్యము - మౌనము.

**సంతోషము** : లభించిన దానితో తృప్తిని పొందుతూ విషాదము - అసూయ - నిరాశ - కామక్రోధములు దగ్గరకు రానీయకపోవటం, సంతోషమును సర్వదా అభ్యసించటం. లభించిన దానితో 'తృప్తి'ని అలవరచుకోవటం. ఉత్సాహము- సాహసము- ధైర్యము పరిపోషించుకోవటం.

**సత్సంగము** : "మహత్సంగస్తు దుర్లభో - అగమ్యో - అమోఘశ్చ" అన్నట్లుగా మహనీయులతో సంగము అభ్యసించటం మహనీయ వాక్యాలు మననం చేస్తూ మార్గమును సరిచేసుకోవటం. సుగమం చేసుకోవటం.

**విచారణ** : స్వకీయమైన అవగాహన.

ఈ విధమైన సాధనచతుష్టయము సహాయంతో వేదానుకూలమైన కర్మనిర్వహణలచే చిత్తశుద్ధిని పెంపొందించుకోవాలి. క్రమంగా నేను ఈ జగత్తులో - జగత్తుచే బద్ధుడను"... అనే భావనా పరంపరలను మనస్సు నుండి వెడలగొట్టాలి. మొదలంట్లా తొలగించుకోవాలి.

- ఈ జగత్తంతా అస్మదాత్మయొక్క చిద్విలాసమే!
- అంతా నేనే! అందరూ (స్వప్నంలో కనిపించేవారంతా స్వప్నద్రష్ట యొక్క స్వప్నస్వరూపులే అయినట్లు) నేనే!
- జగత్స్వరూపుడను - జగత్ సాక్షిని.
- జగత్ రూపకల్పనకు కారకుడనై ఆనందించువాడను.
- అందరూ నావారే!

ఈ రీతిగా బ్రాహ్మీభావన - ఆత్మ తత్త్వజ్ఞానం హృదయంలో ఉదయింపజేసుకొని అద్దానిని అకృత్రిమమైన స్వభావంగా తీర్చిదిద్దుకోవాలి.

అదే 'బ్రహ్మత్వసిద్ధి' అంటే! బ్రహ్మత్వసిద్ధి యొక్క మహదాశయముచే ఈ జీవుడు 'బ్రాహ్మణుడు' అను పిలుపుకు అర్హుడగుచున్నాడు. అదియే 'అమరత్వసిద్ధి' అని కూడా పిలువబడుతోంది.

**ధారణ** : అట్టివారు మార్గాన్వేషణలో ఉన్న సమయంలో తమ చంచల బుద్ధిని "సుస్థిరము - నిర్మలము - సునిశితము - పవిత్రము"గా తీర్చిదిద్దుకోవటానికి

- త్రిగుణములకు అతీతమైన దృష్టి - అవగాహనలతో ఈ జగత్ సందర్శనము
- త్రిగుణ సాక్షిత్వము,

ఇత్యాదుల 'ధారణ' కు ఉపక్రమిస్తున్నారు.

సమయాసమయములను అనుసరించి ఒకచోట పద్మాసనాసీనులై ధారణయోగం అవలంబిస్తూ 'బ్రాహ్మీభావన'ను సుస్థిరపరచుకొనే ఆత్మయజ్ఞమునకు ఉపక్రమిస్తూ ఉన్నారు.

- క్రమంగా విషయేంద్రియములను ఆశ్రయించే బుద్ధిని "కర్మ - ధారణ

- జ్ఞాన"ములతో కూడిన సరోవరజలంలో ఉతికి అశుభ్రత తొలగించుకొంటున్నారు.

- నేను- నాది- నావారు - కానివారు - ఇటువంటి రాగ- ద్వేష- మమకార- అహంకార భావములతో కలుషితమైన బుద్ధివిభాగమును సాధనతో కూడిన బుద్ధితో పరిశుభ్రపరచుకుంటున్నారు.

**- నేను- నీవు.... మొదలైనదంతా అఖండమగు ఆత్మస్వరూపమే ! సర్వము మమాత్మకు అనన్యమే!"** .... అనే అవగాహనతో బ్రాహ్మణ్యులై, భూసురులై ప్రకాశిస్తున్నారు. అట్టివారే బ్రాహ్మణత్వపూర్ణులు. ఇంద్రియములను జయిస్తూ, బ్రహ్మమును ఆశ్రయిస్తూ ఈ జీవుడు - ఆనందజలధిలో స్నానం చేసి, సుజ్ఞానవస్త్రము కట్టి, త్రిగుణములను విభూతిగా ధరించి సర్వవేదాంత సిద్ధాంత భూషితుడు అగుచున్నారు. **ఇంద్రియములను విషయములనుండి ఉపశమింపజేస్తున్నారు.** నిరాహారం చేస్తున్నారు.

## 21. సకామ కర్మ - నిష్కామ కర్మ

**బ్రాహ్మణుడు :** అంటే? ఇంద్రియములను శోషింపజేస్తే బ్రాహ్మణ్యము సిద్ధిస్తుందంటావా? కేవలము ఆహారము మానివేసి ఇంద్రియములను శోషింపజేసినంత మాత్రం చేత దృశ్యసంబంధమైన జాడ్యము తొలగుతుందా?

"- నేను దృశ్యమునకు సంబంధించినవాడను.
- దృశ్యములోని ఒకానొక దేహపరిమితుడను.
- వీటిలో కొన్ని నాకు సంబంధించినవి. మరి కొన్నేమో కావు.
- నేను వేరు. నీవు వేరు. జీవాత్మ వేరు. పరమాత్మ వేరు. జగత్తు వేరు."

ఇత్యాది అభిప్రాయములనే మనము **'సంసారము'** అంటాము. ఇది తొలగించుకోవటానికే **'జన్మ'** అనబడేది మహత్తరమైన అవకాశము. అంతేకానీ, **జన్మ జీవునికి బంధము కాదు. కర్మ కూడా బంధము కాదు.**

అందుచేత ధీరులైనవారు కర్మలను ఆశ్రయిస్తూనే కర్మబంధముల నుండి విముక్తిని సంపాదించుకొని కర్మలకు అతీతులై బ్రాహ్మణనామధేయమునకు అర్హులై భూమిపై వెలయుచున్నారు.

కర్మలు వదలక, తమ కర్మలను ఉపాసనగా తీర్చిదిద్దుకుంటున్నారు. కాబట్టే ప్రజ్ఞాదురంధులగు విప్రవర్యులు కూడా తమకు నియమితమైన స్మార్త - యజ్ఞ - యాగాది కర్మలు వదలటం లేదు. వారు అవన్నీ నిష్కామ కర్మ రూపంగా అవలంబిస్తూ ఉంటారు.

ఎవ్వరైతే నిష్కామంగాఆశ్రమ - కుల - జాతి కర్మలను అవలంబిస్తూ ఉంటారో... అట్టివారు సర్వాత్మకమైన మోక్షభావనను పునికి పుచ్చుకోవటానికి అడ్డేముంటుంది?

అయితే...,

ఓ లలనా! ఎవ్వరి మనస్సు - కర్మ నిష్కామమో, ఎవరికర్మ - మనస్సు సకామమో ... ఎట్లా చెప్పగలం?

ఏది ఏమైనా నిష్కామమైన బుద్ధితో కర్మలను జీవితాంతం కొనసాగించటమే ఉచితం కదా? ఏమంటావు?

**గొల్లభామ :** అయ్యా! సకల కర్మలు నిష్కామ బుద్ధితో చేస్తూనే ఉండాలని మీరు ప్రతిపాదిస్తున్నట్లున్నారు. మంచిదే!

అయితే, ఒక ప్రశ్న!

ఎప్పుడైనా, ఎక్కడైనా కర్మలు ఫలములు ఇవ్వకమానుతాయా? మానవు కదా! అది సహజం కూడా !

"అవస్యమ్ అనుభోక్తవ్యమ్ ।
కృతమ్ కర్మ శుభ-అశుభమ్" ॥

అని కదా శాస్త్ర వాక్యం!

ఒకానొకడు - **"కర్మలు చేస్తూనే ఉంటాను. కానీ కర్మఫలములతో నాకు అవసరం లేదు."** అని అనుకోవచ్చుగాక! **ఏమి లాభం?** బీజము మొలవటం ఎంత స్వభావమో కర్మలు ఫలములను ఇవ్వటం అంతే స్వభావము - "ఓ బీజములారా! నేలలో పాతుతాను. నీళ్ళు పోస్తూ ఉంటాను. కానీ మొలవకండి!" అని చెప్పితే మాత్రం అవి

మొలవకుండా ఉంటాయా? అట్లాగే **"నాకు కర్మఫలాలు వద్దు"** అనుకుంటూ, **"అయినప్పటికీ నేను కర్మలు కొనసాగిస్తూనే ఉంటాను"**... అనుకున్నవానికి కూడా కర్మఫలములు ప్రాప్తించకమానవు కదా! స్వామీ!

**బ్రాహ్మణుడు :** కర్మలకు - బీజములకు చక్కటి పోలికయే తెచ్చావమ్మా! అయితే బీజములను అగ్నిలో వ్రేల్చితేనో? కర్మబీజములను నిష్కామకర్మ" అనే అగ్నిలో దగ్ధం చేసి ఉంటేనో? (జ్ఞానాగ్ని దగ్ధ కరాణు:). ఇక మొలవవు కదా! ఆ విధంగా చూస్తే, **"నిష్కామ కర్మయోగి విషయంలో కర్మలు కర్మఫల రహితములు కాగలవు కూడా!"** అని ఎందుకు సమన్వయించుకోకూడదు భామామణీ!

**గొల్లభామ :** విప్రవర్యా! లోకంలో ఎంతటి వెర్రివాడైనా విత్తనములు పాతి "ఈ విత్తనము వృక్షమై ఫలములు ఇస్తుందా? ఇవ్వదా - నాకు సంబంధం లేదు" ... అనుకుని ఊరుకొని ఉంటాడా? ఫలితంతో (ఫలములతో లేక ఫలసాయముతో) నిమిత్తం లేకపోతే బీజము నాటటమెందుకు? (లేక) పొలంలో దుక్కిదున్ని నాట్లు వేయుటమెందుకు? అదంతా వృథాశ్రమగా నిర్వర్తించాలా? ఎవ్వడైనా ఒకానొక సత్కర్మను ఏ ప్రయోజనమూ ఉద్దేశ్యించకుండా చేస్తాడా? అట్లా అంటే, అవి ప్రగల్భపు మాటలే అవుతాయి మరి! "ప్రయోజన మనుద్దిస్య మందోऽపి నప్రవర్తతే" అని కదా శాస్త్ర ప్రవచనం ?

ఒకానొకడు రాగము - ద్వేషము - లజ్జ - మోహము - భయము - అభిలాష -ఈషణ త్రయము...., వాటి వాటి వల్ల పుట్టే ఆయా దోషభూయిష్టమైన భావనా పరంపరలు, తత్సంబంధమైన దుర్గుణాలు త్యజించాడనుకోండి. దూషణ - భూషణ - తిరస్కార - పురస్కారా నుభవములు వచ్చి - పోయేటప్పుడు 'సమత్వము' వహించినవాడై ఉన్నాడనుకోండి.

ఆతనికి- విహిత కర్మలు లేవు. నిషిద్ధ కర్మలు లేవు. అట్టి ఆత్మజ్ఞానికి కర్మలతో పనేముంటుంది చెప్పండి? మమత్వముచేత మాత్రమే కర్మలు-దృశ్యము బంధం అగుచున్నాయి కదా!

# 22. స్వధర్మోనిధనం శ్రేయః

**బ్రాహ్మణుడు :** ఒకానొకడు ఆత్మకోవిదుడై, "ఈ కనబడేదంతా - నాకు కనబడేవారంతా నా ఆత్మయందే- ఆత్మకు సర్వదా అభిన్నమై వెలుగొందటం జరుగుతోంది. మమాత్మయే అందరియందు - అందరూగా సర్వదా ప్రకాశిస్తోంది." అనే అనుభూతి అనుక్షణికంగా, అకృత్రిమంగా ఆస్వాదిస్తూ ఉండటమే స్వస్వరూప జ్ఞానము. అంతవరకూ నేను ఒప్పుకుంటున్నాను.

అయితే .... ఏం?

అటువంటి స్వస్వరూపజ్ఞానము గల పండితుడు కూడా "నేను పూర్ణాత్మజ్ఞానిని కదా!"... అని అనుకుని కర్మల నుండి విరమిస్తాడా! లేదు. తాను నిర్వహిస్తూ ఇతరులను కూడా కర్మల విషయంలో ప్రోత్సహిస్తాడు. అజ్ఞానిని పిలచి "కర్మలు చేయవద్దులే".. అని బోధించడు. నిష్కామకర్మను గుర్తు చేస్తాడు.

శ్లో॥ ఏవం జ్ఞాత్వాకృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః ।
కురు కర్మైవ తస్మాత్త్వమ్ పూర్వైః పూర్వతరం కృతమ్ ॥

శ్లో॥ నానవాప్తమవాప్తవ్యమ్ । వర్త ఏవచ కర్మణి ।

శ్లో॥ యది హి అహమ్ న వర్తేయం జాతుకర్మణ్య తంద్రితః ॥
మమవర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ! సర్వశః॥

అని కదా! భగవద్గీతా గానం!

ఆత్మజ్ఞాని కూడా ఆ విధంగా కర్మలను నిందించడు. కర్మల నుండి విరమించడు. అంతేకాదు!

"తత్త్వజ్ఞుని విషయంలో లోక కళ్యాణ పూర్వకమైన గుణములు - ఆశయములు - కార్యక్రమ విధులు స్వభావసిద్ధమే అవుతాయిగాని, నిషిద్ధము కాదు" అని కొన్ని శాస్త్రములు (శాంతి పర్వము - భారతము, మనుధర్మశాస్త్రము ఇత్యాదులు) ఎలుగెత్తి బ్రహ్మజ్ఞుని కీర్తిస్తున్నాయి కూడా!

(యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్
అయుక్తః కామకారేణ ఫలేసక్తో నిబధ్యతే)

అజ్ఞులు కర్మఫలములందు ఆసక్తితో కర్మలు నిర్వర్తిస్తూ ఉంటే...., విజ్ఞులు "కర్మలు - కర్మఫలములు మాయా చమత్కారమే!" అని తెలిసియే "ఆత్మ సత్యమ్ - జగత్ మిథ్యా" అని ఎరిగి ఉండి కూడా ఆశ్రమధర్మానుసారమైన - లోకోపకారకమైన - శాస్త్రములకు సానుకూలమైన కర్మలు నిర్వర్తిస్తూ ఉంటారు. ప్రోత్సహిస్తూ ఉంటారు.

**ఇంకొక విషయం. కర్మలు ఆవశ్యకం! అనివార్యం!**

లోకంలో ఈ సర్వజనులచే ఆయా ఆశ్రమములకు ఉచితమైన కర్మలు నిర్వర్తించబడకపోతే,.... ఈ లోకము - లోకసంబంధమైన ఆహారాది ఆయా వ్యవహారాలు కొనసాగేదెట్లా?

"నేను కర్మలకు - కర్మఫలములకు ఆవల ఉన్నాను. ఆత్మ జ్ఞానోపాసన నా మార్గము. అందుచేత నేనొక్కడినీ ఆశ్రమమునకు సంబంధించి కర్మలు నిర్వర్తించకపోతే ఏమిలే?" అని ఒకడు తాను కర్మ త్యాగి అయి, ఇతరులకు కర్మత్యాగాన్ని ప్రోత్సహించటమో, భోదించటమో జరిగితే? ఆతడు కర్మ- జ్ఞానముల ఉభయములు కోల్పోయి ఉభయ భ్రష్ఠుడు అవుతాడని నీతి శాస్త్రం ప్రభోదిస్తూ హెచ్చరిస్తోంది కదా! **"కర్మ - జ్ఞానములలో ఒకటి నీవు వదిలితే రెండవది నిన్ను వదులుతుంది."** అని వశిష్ఠమహర్షి చెప్పియున్నారు కదా!

శ్లో॥ యత్ యత్ ఆచరీతి శ్రేష్ఠః తత్ తదేవతదితరోజనాః ।
సయత్ ప్రమాణం కురుతే లోకస్థదనువర్తతే ॥

అని గీతా శ్లోకం కదా! విజ్ఞుడైన వాడు ఆశ్రమ - వర్ణ సంబంధమైన నియమిత కర్మలు వదలితే, కొంత మంది అజ్ఞులు అది దృష్టాంతంగా తీసుకొని తమకు నియమించిన కర్మలు త్యజిస్తేనో...? ఆ దోషము విజ్ఞుడైన ఆ శ్రేష్ఠుడికి అంటుతుంది. తాను అందుకు కారణం కాకూడదనే ఉద్దేశ్యంతోనే శ్రీకృష్ణుడు అర్జునిని గీతాశాస్త్రం ద్వారా స్వకర్మనిరతిని సూచించారు, ప్రోత్సహించారు కూడా !

అందుచేత,

ఎవ్వరూ కర్మలు త్యజించి ఉండటం ఉచితం కాదు. సాంఘిక

జీవనానికి శ్రేయోదాయకం కాదు. అది సాధ్యపడేదీకాదు.

అందుచేతనే మేము మమ్ములను ఆశ్రయించ వచ్చిన జనులకు సాంఘికమైన - కుటుంబ సంబంధమైన - లౌకికమైన - శాస్త్రనిర్దేశితమైన కర్మలు నియతి పూర్వకంగా చేయమని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ ఉంటాము. పురోహితులమగు మేము బ్రాహ్మణులమై, బ్రహ్మజ్ఞులమై ఉండి కూడా **"ఆత్మజ్ఞానం ఒక వైపుగా ఆశ్రయిస్తూనే - మరొక వైపు నుండి మీమీ విహిత కర్మలు శ్రద్ధగా - చక్కగా - కుశలతతో నిర్వర్తించండి"** అని చెప్పుచున్నాము. "యజ్ఞ - దాన - తప:కర్మనత్యాజ్యం ! కార్యమేవతత్" మోక్షసన్యాసయోగం. - భగవద్గీత.

- మిత్రులారా! శ్రేయో: కర్మలు, శాస్త్రవిహితదైనందిక సత్క్రియలు వదలకండి.
- బద్ధగించకండి.
- యజ్ఞ-యాగాలు నిర్వర్తించండి.
- కర్మయోగముచే సంసిద్ధులు అవుతూ ఉంటే, ఇక మీ హృదయంలో తగు సమయంలో జ్ఞానపుష్పము స్వయంగా వికశించగలదు.

శ్లో॥ నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।
తత్ స్వయం యోగ సంసిద్ధ: కాలేన ఆత్మనివిందతి ॥

అని బ్రాహ్మణులమగు మేము శ్రేయోభిలాషులమై సకల జనులకు గుర్తు చేస్తున్నాము.

మాతృదేవో భవ ।
పితృదేవో భవ ।
ఆచార్య దేవో భవ ।
అతిథి దేవో భవ ।

అనే ఉపనిషత్ వాక్యాలు, వేదవాక్కు అందరికీ గుర్తు చేస్తున్నాము.

'కర్మలు మానండి' అని ఏ గురువు - శాస్త్రము- పురాణము చెప్పటం లేదే!

మరి నీవు యజ్ఞ - యాగ - క్రతు - వ్రతాదులతో సహా కర్మ విభాగములను తక్కువచేసి కబుర్లాడుచున్నావే? అట్లావెట్లా చెబుతావు?

## 23. క్రియా యజ్ఞము - అత్మయజ్ఞము

**గొల్లభామ :** మహనీయా! నేను కర్మలను - కర్మయోగమును తక్కువ చేయటం లేదు. **"యజ్ఞ - యాగ - వ్రత ఇత్యాది కర్మలు స్వర్గసుఖముల ఆశయంగా ఆచరించటమనేది పునర్జన్మ హేతువు కదా!"** ... అని మాత్రమే గుర్తు చేస్తున్నాను.

కర్మలను **"అసంగము- ఏకము - కేవలీస్థితి - అకర్మబద్ధము"** అగు మోక్షసంబంధమైన స్వస్వరూప జ్ఞానంలో (లేక) బ్రాహ్మీ స్థితితో సాదృశత్వము - సరిసమానత్వము - అవినాభావత్వము కల్పించజాలమని మాత్రమే నా విన్నపము.

నిత్యనైమిత్తిక, యజ్ఞ-యాగాది కర్మలు మాత్రమే బ్రహ్మత్వానికి (లేక) ఆత్మోపాసనకు మార్గమని అనలేమని మాత్రమే నా అభిప్రాయము. అనునిత్యఆత్మోపాసన (లేక) ఆత్మయజ్ఞము అందరికీ అందుబాటుగా ఉండగలదని నా మనవి.

ఆత్మజ్ఞానమును, ఈ కనబడే సర్వము ఆత్మ స్వరూపంగా సందర్శించటమును ఏమరచి కర్మమార్గంలో సంచారాలు సలపటం మహాశయమును ఏమరిచి ఉండటమేనని గుర్తు చేస్తున్నాను.

| **క్రియాయజ్ఞము** | **ఆత్మోపాసన/ ఆత్మజ్ఞానం/ ఆత్మయజ్ఞం** |
|---|---|
| పునర్జన్మ హేతువు | జన్మలకంటేముందే సర్వదా వేంచేసియున్న ఆత్మ యొక్క అనుభూతిని ప్రసాదించేది. "జన్మలకు మునుముందే నేనున్నాను" అనే జన్మరాహిత్యత్వమును అందింపజేసేది. |
| సంపదలు ఇచ్చేది | సర్వత్యాగరూపము |

| | |
|---|---|
| లౌకికమైనక్రియా దోషము లను పరిహరించగలదు | సర్వసాక్షిత్వము - అతీతత్వము - అప్రమేయ త్వము నిరూపించగలదు |
| కర్మఫలాలు మరికొన్ని కర్మ వ్యవహారాలకు దారితీసేది. పునరావృత్తి దోషము కలిగి ఉన్నది. | సర్వకాలములకు ఏకమై ఉన్న కేవల సాక్షిత్వము ప్రసాదించేది. పునరావృత్తి దోషరహితమైనది. |
| ద్వంద్వములను, లౌకిక | - ద్వంద్వాతీతము |
| సమాచారములను | - అలౌకికము |
| సరంజామాను,భేదత్వము ఆశ్రయించవలసివస్తుంది. | - అభేదము వైపుగా దారి చూపేది. |

"ఈ విధంగా కర్మల పరిమితిని - రహస్యాన్ని - ముఖ్యాశయాన్ని గమనించి మహాదాశయంతో నిర్వర్తించబడుగాక!" అని నా ఉద్దేశ్యము.

అట్టివానిని మహాశయుడు అనిపిలుస్తాం.

ఆత్మ యొక్క తత్త్వమేమిటో ఎరుగుచూ కర్మలలో ప్రవేశించాలి. అంతేగానీ, సర్వము - సమము- నిత్యము - అఖండము - అప్రమేయము అగు ఆత్మ యొక్క ముఖ్య సమాచారము ఏమరచి "మేము అధికులము - మరొకరు కారు" ఇటువంటి భేదదృష్టులను ఆశ్రయిస్తూ - ప్రోత్సాహిస్తూ కర్మలను ప్రతిపాదించటమనేది దారి - తెన్ను తెలియని కర్మారణ్యములో ప్రవేశించటము వంటిది కాదా! అడవిలో దారితప్పినట్లే - వివేచన చేయకుండా, సర్వసమభావమును బుద్ధిలో గుర్తుగా పెట్టుకోకుండా కర్మారణ్యములో ప్రవేశిస్తే ?

'ఆత్మ' అనే స్వగృహము తెలియరాక '14 లోకములు' అనే మహారణ్యంలో జన్మ-కర్మ-మృత్యు పరంపరలకులోనై దిక్కుతోచక తిరుగాడటమే కదా!

అందుచేత "కర్మనిరతి - తత్త్వజ్ఞానము తో(**తత్-త్వమ్** అసి :

నాకు ఎదురుగా కనిపించే నీవు ఆ పరమాత్మ యొక్క ప్రత్యక్ష రూపమే అయి ఉన్నావు - అనే జ్ఞానముతో ) సరిసమానమేనని సిద్ధాంతీకరించలేము. ఏకర్మఅయినా ఈశ్వరార్పితబుద్ధితో చేస్తే ఆత్మజ్ఞానమే అవుతుంది.

## 24.కర్మల ఆవస్యకత

**బ్రాహ్మణుడు :** ఓ పడతీ! భామామణీ! నీవు ఏమి చెప్పుచున్నావమ్మా? ఈశ్వరార్పిత బుద్ధితో కర్మలు చేయాలి. మంచిదే !

అయితే...,

ఏదో ఒక కర్మ చేసి, విధి-విధానాలు లేకుండా, ప్రయోజనాలేమిటో తెలియకుండా "ఈ కర్మ ఈశ్వరార్పితం" అంటే కుదురుతుందా? ఒక పిల్లవాడు "నేను చదువుకోను. అల్లరి-చిల్లరగా తిరుగుతాను. తోటి పిల్లలను బాధిస్తాను. ఆ కర్మ శ్రీరామలింగేశ్వరునికి సమర్పిస్తాను"... అని అంటే మా విప్రుల పెద్దవారుగాని, మీ గొల్లల పెద్దవారు గానీ ఒప్పుకుంటారా? మరొకాయన "దుర్మార్గంగాను, దొంగతనాలు చేసి, తదితరులను మోసగిం చి డబ్బు సంపాదిస్తాను. ఆ కర్మలు ఈశ్వరునికి సమర్పిస్తాను".... అని నీతోగానీ, నాతోగానీ అంటూ ఉంటే, అది నీవుగానీ-నేనుగానీ "ఈశ్వరార్పితకర్మ"... గా ఒప్పుకుంటామా? లేదుకదా!

అందుచేత.....,

కర్మలు భగవదర్పితముగా చేయాలనునది కర్మయోగ రహస్యమే! శుభప్రదమే! అయితే "ఏ కర్మలు చేయాలి? ఏవి చేయకూడదు?" అని ముందుగా ఎరిగి కర్మ చేయాలి కదా! "కర్మణోహ్యపి బోద్ధవ్యం! బోద్ధవ్యం చ వికర్మణః! అకర్మణశ్చ బోద్ధవ్యం! గహనా కర్మణోగతిః!" అని గీతాచార్యుల వారు అంటున్నారు.

శాస్త్రములు
- ఏ ఏ కర్మలు చేయాలి?
- ఎట్లా చేయాలి?
- ఏ ఏ మంత్ర-క్రియా విధానాలు పాటించాలి.

.... ఇవన్నీ జనులకు బోధిస్తున్నాయి. అవన్నీ పఠించి మేము పురోహితులమై

లోకులకు గుర్తు చేస్తూ ఉన్నాము. చేసే కర్మలు మంత్ర - క్రియా విధానాలు ఎరిగి చేయండి. అని గుర్తు చేస్తున్నాం! "మంత్రము - విధానము - దానము - సమర్పణ"... అను నాలుగు అంగములు శాస్త్రములచే నిర్దేశించినవి నిర్వర్తించబడటానికి కావలసిన కుశలతను మేము పరమాత్మ యొక్క సేవగా జనులకు అందిస్తున్నాము.

"శ్రద్ధగా మేము నలుగురికి ఉపయోగపడతాము. మంచి పనులు చేస్తాము. ఆకలిగొన్న వారికి అన్నము పెడుతాము. పేదవారికి ధన సహాయం చేస్తాము. ఇక శాస్త్రములు, మంత్ర- తంత్ర విధానాలతో సంబంధమైన పూజ-వ్రతాదులతో మాకేమిలే !"... అని అనుకుని సత్కర్మలు చేస్తే మంచిదే! అట్లా కాకుండా కేవలం శాస్త్రవిహిత కర్మలను - సాధనలను . పూజ - వ్రతము మొ॥వాటిని తిరస్కరించటానికి మాత్రమే సిద్ధపడుతూ, వారివారి అశ్రద్ధ - బద్ధకములకు కొనసాగించువారు, సాధనలను తిరస్కరించువారు పిడివాదులే గానీ ఉత్తమ సిద్ధి కొరకు కర్మలను ఉపయోగించుకునే నేర్పు కలవారు కాదు. కర్మచేస్తే కదా.... అది సమర్పించటం?

అట్లా కాకుండా....,

- లౌకికమైన సేవ-దానము-ధర్మము చేయము.
- శాస్త్రములు చెప్పే జప-వ్రత- యజ్ఞ యాగాదులు నిర్వర్తించే శ్రద్ధ కలిగిఉండము.
- ఎవ్వరైనా ఏదైనా కార్యక్రమము గురించి చెప్పితే వెంటనే తప్పులెన్నటానికి ప్రయత్నిస్తాము - అంటూ రోజులు గడుపుతుంటే ?

..... ఓ భామా! అట్టి వారిని మేము లెక్కలోకి తీసుకోము.

- మేము శాస్త్రహృదయము పరిశీలిస్తున్నాము.

శాస్త్రములు చూపే మార్గంలో జప - వ్రత - పూజ - దేవాలయ సేవ - దైవస్మరణ - ఉపవాస - నియమములు - వేకువజాము స్నానాది నియమములు - తీర్థ యాత్రలు..... మొ॥నవి ఇటువంటి వాటిలో అన్నిగాని, ఏవో కొన్ని గానీ, ఒకటి - రెండు గానీ అవకాశమున్నంత వరకు నిర్వర్తిస్తూ

ఉండటం, బద్ధకము దరిజేరకుండా చూచుకోవటం - ఇదే మా బ్రాహ్మణ జనులు అందరికీ గుర్తు చేసే కర్మ - నిష్కామ కర్మ మార్గము.

మరొక్క సారి చెప్పుచున్నాను.

జనులు ఎతెంత వరకు అవకాశముంటే అంత వరకు సర్వ బద్ధకములు త్యజించి శాస్త్రవిహిత కర్మలు నిర్వర్తించటమే ఉచితం. ఎంతవరకు నిర్వర్తిస్తే అంత వరకు అది శుభప్రదమే! "నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠతి అకర్మకృత్" అని గీతా శాస్త్రవాక్యం కదా! ఏదో కర్మ నిర్వర్తించకుండా ఏ జీవుడూ ఒక్క క్షణం కూడా ఉండజాలడు. కాలమును వృధా చేస్తూ బుద్ధిని దోషభూయిష్టం చేసే అల్ప కర్మల కంటే శాస్త్రీయమైన - పుణ్యప్రదమైన - భగవత్ ఉపాసనా సంబంధమైన కర్మలు చేయటమే ఉచితం. శుభప్రదము కూడా!

పైగా....., పురాణ - ఇతిహాసములు, ధర్మ శాస్త్రములు కర్మల రహస్యము బోధిస్తూ "పరిశుద్ధ కర్మలు జ్ఞానమునకు హేతువులు" ... అని బోధిస్తున్నాయి. శాస్త్రములు ఘోషిస్తున్నాయి.

"శాస్త్రములు ఎందుకు విజ్ఞులచే రచించబడ్డాయి?" అనే ప్రశ్నకు మహనీయుల సమాధానమేమిటో విను.

శ్లో॥ కర్మణా జాయతే భక్తిః భక్తిః జ్ఞానమ్ ప్రజాయతే ।
జ్ఞానాత్ ప్రజాయతే ముక్తిః ఇతి శాస్త్రేషు నిర్ణయః ॥

ఉత్తమ కర్మ భక్తికి, భక్తి ఆత్మజ్ఞానమునకు, జ్ఞానము ముక్తికి దారిచూపుతాయన్నది ఆర్య వాక్యము.

కాబట్టి ఓ గోపబాలికా! ఆత్మజ్ఞానాన్ని ప్రతిపాదిస్తూ కర్మ నిరతిని, శాస్త్రవిహిత కర్మ విధానములను నిందించటం, తక్కువ చేయటం ఉచితం కాదు.

గొల్లభామ : మహాశయా! విప్రవర్యా! "జ్ఞానము - కర్మ... ఈ రెండూ సమానమే! ఒకే ఫలాన్ని ప్రసాదిస్తాయి... కనుక రెండింటి తీరూ ఒక్కటే"... అని మీరు ప్రతిపాదిస్తున్నారు కదా! ఈ విషయంలో దయచేసి ఏదైనా ఉ

ప్రమాణం సహాయంతో విశదీకరిస్తే నేను, ఈ సభికమహాశయులు మరి కొంత సంతోషము పొందుతాము.

**బ్రాహ్మణుడు :** చెట్టుకు ముందుగా పుష్పము కాస్తోంది. ఆ పుష్పము వికసిస్తోంది. క్రమంగా ఆ పుష్పము నశించి కాయగా, పండుగా అగుచున్నది. పుష్పము ఫలముగా అగుచున్నప్పుడు ఆ పుష్పము స్వయముగా నశిస్తోంది కదా!

అట్లాగే..,

ఆత్మజ్ఞానము వికశించిన తరువాత కర్మ తనను తానే నశింప జేసుకోగలదు. ఆత్మజ్ఞానము వికసించనంత వరకు ఈ జీవునికి 'కర్మలు' అత్యంతావస్యకం. విహిత కర్మలు - శాస్త్రప్రవచిత ఉపాసనా కర్మలు త్యజించకూడదు. నిర్వహించవలసిందే !

**గొల్లభామ :** మహాత్మా! కర్మలు భక్తి - జ్ఞానములకు ముక్తికి దారి చూపుతాయని అన్నారు కదా! దయచేసి ఈ విషయం చెప్పండి.

ఏఏ కర్మలు ఏ విధంగా నిర్వర్తిస్తే అవి పరిశుద్ధము - ఉత్తమము అయిన ఆత్మజ్ఞానానికి, ముక్తికి దారితీయగలవు? వివరించమని నా విన్నపము.

**బ్రాహ్మణుడు :** కర్మలు 3 రకాలు.

1. విహిత (లేక) మనకు నియమించబడిన కర్మలు.
2. ఇంద్రియ చాపల్యముతో అజ్ఞానమును జోడించి చేసే కామ్య కర్మలు. **"ఏదో నేను పొందాలి. నాకు కావాలి"** అనే కామ - రాగములను పెంపొందించుకొని **వ్యక్తిగత దృష్టితో** చేసే కర్మలు.
3. సర్వగతమైన పరబ్రహ్మ దృష్టితో సర్వులకు శుభప్రదమై ఉండే మహదాశయంతో నిర్వర్తించే కర్మలు. వీటిని 'యజ్ఞార్థాత్ కర్మలు' అని కూడా అంటారు.

విహిత కర్మలు, యజ్ఞార్థాత్ కర్మలు జీవుని బుద్ధిని పరిశుద్ధ పరచి భక్తి

జ్ఞాన - ముక్తి భావ తరంగాలను ప్రసరింపజేస్తాయి.

"యజ్ఞార్థాత్ కర్మణో అన్యత్ర ।
లోకో౭యం కర్మ బంధన: ॥"

దృశ్య తాదాత్మ్యముచే ఇంద్రియ చాపల్యముతో చేసే కామ- రాగ పూరితమైన కర్మల బంధము - పునర్జన్మ హేతువులు అగుచున్నాయి.

విహిత - ఉపాసనా కర్మలు వేదముల చేత నిర్దేశించబడుచున్నాయి. వేదములో ... అక్షర పరబ్రహ్మము నుండే బయల్వెడలుచున్నాయి.

ఈ విధంగా సర్వ వ్యాపకుడగు ఆ పరబ్రహ్మమూర్తి యజ్ఞరూపుడై యజ్ఞకర్మల యందు ప్రకాశిస్తూ ఉంటారు. వేంచేసి ఉంటారు.

తస్మాత్ సర్వగతమ్ బ్రహ్మ ।
నిత్యమ్ యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥ - గీతా శాస్త్రం.

కాబట్టి యజ్ఞము పరమేశ్వర స్వరూపమే! ఇందులో సందేహము లేదు.

అందుచేతనే మా వర్ణాశ్రమ ధర్మాన్ని అనుసరించి ఉపనయనము చేత ద్విజులమై వేదములచే సూత్రీకరించబడుచున్న యజ్ఞ - యాగ - క్రతు - మంత్ర - తంత్ర విధానములన్నీ గురు సమక్షంలో శ్రద్ధగా అనేక సంవత్సరాలు అభ్యసించి విప్రులమై శ్రద్ధాసక్తులు గలవారిచే యజ్ఞము చేయిస్తూ ఉన్నాము. మేమే నిర్వర్తించి సోమయాజులమగుచున్నాము కూడా! యజ్ఞముల మంత్ర బలముచే బ్రహ్మమును పూజించి, ఉపాసించి బ్రహ్మజ్ఞానము సంపాదిస్తున్నాము. బ్రహ్మభావనచే బ్రాహ్మణులమై జనులచే గౌరవించబడుచున్నాము.

**గొల్లభామ** : మహనీయా! ద్విజోత్తమా! విప్రవర్యా! మీరు చెప్పినదంతా బాగానే ఉన్నది. అయితే మీరు జనులచే చేయిస్తున్న యజ్ఞముల విషయమై నాకు కొన్ని విమర్శనా పూర్వకమైన అభిప్రాయములు ఉన్నాయి. నేను ఎవ్వరైనా -ఎప్పుడైనా- ఎక్కడైనా ఏ బాహ్య-ఉపకరణములు లేకుండానే నిర్విఘ్నంగా నిర్వర్తించగల "ఆత్మయజ్ఞము" గురించి ప్రతిపాదించదలచు కున్నాను. అందుకుగాను అగ్ని కార్యముల తోనూ - హోమము - జీవహింస

లతో కూడి సంపదలు వెచ్చించి చేస్తున్న యజ్ఞముల గురించిన విమర్శనా పూర్వకమైన చిన్న చర్చ మీరు అనుజ్ఞ ఇస్తే మీముందుంచుతాను.

## 25. ద్రవ్యమయాత్ యజ్ఞం

**బ్రాహ్మణుడు :** ఓ తప్పకుండా! సత్సంగపూర్వకంగా సద్విమర్శలు స్వీకరించటానికి నేను సంతోషంగా సిద్ధమే! చెప్పవమ్మా! చెప్పు!

**గొల్లభామ :** యజ్ఞయాగములు జరగాలంటే సంపద ఉన్నవారికే సాధ్యము. ఒక యజ్ఞము నిర్వర్తించాలంటే.....,

- అనేక వస్తువులు - విత్తము ఒక చోటికి చేర్చవలసి ఉంటుంది.
- కనుక ద్రవ్యము-జనబలము లేకుండా భౌతిక రూపమైన యజ్ఞము ఎవ్వరైనా నిర్వర్తించలేరు.
- శారీరకంగా ఎన్నో రోజులు పరిశ్రమించవలసి వస్తుంది.
- అనేకమంది జనులు - మంత్ర ద్రష్టలు పాల్గొనవలసి వస్తుంది.
- యజ్ఞవిధానాలను అనుసరించి కొన్ని మూగజీవులను శారీరకంగా బాధించవలసివస్తుంది.
- ఇక ఆ యజ్ఞము యొక్క ప్రయోజనమో! 'స్వర్గము' మొదలైన భౌతిక - ఇంద్రియ సంబంధమైన సుఖలోకముల ప్రాప్తి మాత్రమే!

అట్టి యజ్ఞము 'ఆత్మోపాసన' లేక ఆత్మయజ్ఞముతో సమానం కాజాలదు. అట్టి యజ్ఞము వలన జీవునకు స్వర్గలోక ప్రాప్తికి, కొన్ని స్వర్గసుఖాలకు అర్హత కలుగవచ్చు గాక! కానీ...,

**అటువంటి స్వర్గలోకాలలో కూడా** - (భూమిపై ధనికులు, పేదవారి భేదములవలె) **అల్పసుఖాలు - ఉత్తమసుఖాలు పొందువారు** ఉంటారు. తత్ఫలితంగా కలహము, భేదదృష్టి, అసూయ ఉండనే ఉంటాయి. ఇక మన శ్శాంతి ఎక్కడిది? ఇంకొక విషయం కూడా !

తే తమ్ భుక్త్వా స్వర్గలోకం విశాలమ్ ।

క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ॥ - భగవద్గీత ।

స్వర్గలోకాల అనుభవ సందర్భంలో క్రమంగా యజ్ఞపుణ్యము ఖర్చు అగుచుండగా ఆ జీవుడు తిరిగి తలక్రిందులుగా భూ(భౌతిక) లోకాలకు వచ్చిపడవలసి వస్తుంది.

అనగా, ఆ యజ్ఞకర్త పుణ్యఫలానుభవము తరువాత తిరిగి "జన్మ-కర్మల, దేహపరంపరల చక్రము" లోకి నెట్టివేయబడుచున్నాడు.

అందుచేత హే మహాత్మా!

మీరు చెప్పే 'యజ్ఞము' మొదలైన ఆయా కార్యక్రమములు "పరిమితము - దేశ కాలబద్ధము" అయినట్టి ఫలితములకు మాత్రమే కారణము కాగలుగుచున్నాయని మనము గమనించవచ్చు కదా స్వామీ!

అట్టి యజ్ఞములు ఉత్కృష్టములని - ఆత్యంతికములని (very great - Finest) ఎట్లా అనగలము చెప్పండి?

**బ్రాహ్మణుడు** : ఓ లలనా! నీ మాటలలో కొంత అల్పావగాహనతో కూడిన అభిప్రాయాలు వినిపిస్తున్నాయమ్మా! సర్వోత్కృష్టమై - చతుర్వేదములు మనందరికి ప్రతిపాదిస్తున్న 'అగ్నిష్టోమము', 'విశ్వజిత్', 'అశ్వమేధ', 'పుత్రకామేష్టి', 'విశ్వశాంతి' ఇత్యాది యజ్ఞ-యాగముల మహిమను కర్ణకఠోరంగా, చెవులకు బాధ కలిగించే విధంగా నిలదీస్తున్నావే? నిందిస్తున్నావే?

అసలు శాస్త్రార్థములు సమగ్రంగా నీవు పరిశీలించావా? లేదా? .... అని నాకు నీ గురించి అనిపిస్తోంది.

లోకంలో కొందరు కొంటెవారెవ్వరో ఏదో ఒక వైపును మాత్రమే చూచి ఏదేదో అంటే... అవన్నీ ఇక్కడికి పట్టుకువచ్చి, యజ్ఞశాస్త్రదూషణకు ఉద్యమిస్తున్నావా ఉపక్రమిస్తున్నావా? ఏమి?

అది సరికాదమ్మా!

అసలు శాస్త్రసాంప్రదాయాలు - వాటి వెనుక ఉండే ఆశయాలు

నీవు గమనిస్తున్నావా? ఏదో వింటున్నాను కదా అని - వేదశాస్త్ర దూషణచేస్తే నేనెలా అంగీకరించగలను? చెప్పు తల్లి!

**గొల్లభామ :** మహాత్మా! నా అభిప్రాయాలు మిమ్ములను కించిత్ బాధిస్తే, క్షమోఽస్మి! నన్ను క్షమించగల క్షమాశీలురైన సద్బ్రాహ్మణులు మీరు. అందుకే 'ఆత్మయజ్ఞము' గురించి ప్రతిపాదించబోతూ కించిత్ మీమాంస వాక్యాలుగా నా అభిప్రాయాలు మీ ముందు ఉంచుతున్నాను.

మహాత్మా! మనము సత్యాన్వేషకులమై సత్సంగ పూర్వకంగా మహనీయులు వేంచేసిన ఈ సభాప్రాంగణములో సంభాషించుకుంటున్నాము కదా!

ఇక క్షమాగుణంతో శాంతశీలురై వినండి.

'నిజం పలికితే నిష్ఠూరము' అనునది సామాన్యుల పట్ల చెల్లుతుంది కానీ, నిత్యానిత్యవివేకులగు మీవంటి విప్రవర్యులపట్ల కాదు కదా! అందుచేత దయయుంచి, కోపగించకుండా నా మాటలు ఆలకించండి. చిత్తగించండి.

'వేదాంతార్గత విభాగములు' లేక వేదాంగములు అయినట్టి ఉపనిషత్తులు "జ్ఞానాదేవతు కైవల్యమ్" అని సమీక్షిస్తున్నాయి కదా! అనగా, "పరమాత్మను పొందటానికి అంతిమంగా జ్ఞానమే మార్గము" అని చేతులెత్తి ప్రకటిస్తున్నాయి. అది మీరు చదివారు. మీరు ఎరిగిన విషయమే! మరి అట్లా అంటారేమిటి? చెప్పండి.

**బ్రాహ్మణుడు :** ఓ గజగామినీ! ఏనుగువలె గాంభీర్యము - హొయలు గల నడకగల బాలామణీ! ఉపనిషత్ వాక్యములు 'అసత్యము' అని ఎవ్వరంటారు? ఎవ్వరమూ అనము. అవి సత్యవాక్కులే! ఋషివాక్కులు కదా!

ఇక్కడ ఒక విషయం!

సత్పురుషుల దృష్టిలో "కర్మమార్గము - జ్ఞానమార్గము" లకు భేదము లేదని, ఒక్కటే అర్థమని, ఒకదానితో రెండవది ఏర్పడి ఉన్నదని, ఒక్క లక్ష్యార్థమే కలిగి ఉన్నదని నేను ఇంతకు ముందు కూడా చెప్పుకున్నాము కదా!

"ఏకమప్యాస్థితసమ్యక్ - ఉభయోర్విందతే ఫలమ్" అని జగద్గురు శ్రీకృష్ణుని ఆప్త వాక్యము కదా! అది అట్లా ఉండగా...,

శ్రీకృష్ణపరమాత్మ అర్జునుని ద్వారా మరొక్క విషయం వ్యాఖ్యానించారు.

"కర్మ బ్రహ్మోద్భవమ్ విద్ధి
బ్రహ్మాక్షర సముద్భవమ్ ।
తస్మాత్ సర్వగతమ్ బ్రహ్మ
నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥"

అని ఇది వరకు చెప్పిన విషయమే మరొక్కసారి సందర్భం వచ్చింది కనుక గుర్తు చేస్తున్నాను.

సర్వగతమగు-నిత్యమగు బ్రహ్మము యజ్ఞపురుషుడై - యజ్ఞము నందు ప్రతిష్ఠితుడై మనయొక్క ఉపాసనాసౌలభ్యము కొరకై సర్వదా ఏర్పడి ఉన్నారు.

- "నియతమ్ కురు కర్మ త్వమ్ ।
కర్మజ్యాయోపి అకర్మణః ॥"
- "న కర్మణామనారంభాత్ ।
నైష్కర్మ్యమ్ పురుషోఽశ్నుతే ॥"
నచ సన్యాసనాదేవ సిద్ధిం సమధి గచ్ఛతి ॥

ఇత్యాది మహత్తరమైన శ్రీకృష్ణస్వామి భగవద్గీతావాక్యముల ద్వారా - "జ్ఞానమార్గమైన ఆత్మసమాచార సేకరణ మాత్రము".... కంటే "కర్మయోగము" గొప్పది - అని చెప్పియున్నారు కదా! "పరబ్రహ్మమూర్తి" - "భగవన్ స్వయమ్"అగు శ్రీకృష్ణపరమాత్మ మనందరినీ దృష్టిలో పెట్టుకొని చెప్పిన వాక్యాలు కల్లలంటావా? బుజ్జగింపు మాటలు మాత్రమే అంటావా?

**గొల్లభామ** : "నియతమైన కర్మ తప్పకచేయాలి. వదలనే వద్దు. అకర్మ కంటే కూడా కర్మనిర్వహణయే గొప్పది. ఈ సర్వదేహుల దేహయాత్ర సక్రమంగా కొనసాగాలంటే కర్మనిర్వహణ అత్యావస్యకం".... అను శ్రీకృష్ణ భగవానుని ఆప్త వాక్యాలు సర్వదా ఆచరణీయమే! **"సహజీవులందరినీ దృష్టిలో పెట్టుకొని, త్యాగభావంతో నలుగురిని కలుపుకుని పది మంది**

ప్రయోజనాలను ఉద్దేశ్యించి 'కార్యమేవ ఇతి' అని శాస్త్రీయంగా నిర్ణయించు కొని తనకు ఉద్దేశించబడిన కర్మను సామర్థ్యముతో నిర్వర్తించటమే యజ్ఞార్థాత్ కర్మ" - అని వారు ప్రవచించారు.

అట్టి స్వధర్మ నిరతితో కూడిన కర్మ కర్మయోగమే అవుతుందని నేనూ ఒప్పుకుంటున్నాను.

అయితే....,

మనం మాట్లాడుకుంటున్న 'యజ్ఞము - హోమము' ఇత్యాది విషయము గురించి ఆ మహావాక్యముల అర్థమును ఆపాదించలేమని నా అభిప్రాయము.

కనుక ఇప్పుడు అశ్వమేథము - జ్యోతిష్టోమము - విశ్వజిత్... ఇత్యాది యజ్ఞముల గురించి మాట్లాడుకుంటున్నాము కదా!

స్వామీ! ఒక్క విషయము.

"అహింసాపరమో ధర్మః" అనే శాస్త్రవాక్యము మనందరికీ సుపరిచితము - సర్వదా స్మరణీయము కదా! ఏ ప్రాణినైనా బాధించటము పాపకర్మయేనని, దోషమని మనందరమూ ఒప్పుకొనే విషయమే!

**బ్రాహ్మణుడు :** అవును. అందులో సందేహము ఏమున్నది?

**గొల్లభామ :** మరి ప్రాణి హింసతో కూడిన యజ్ఞము విషయంలో మాత్రము పరమధర్మము - అని మీరు ఎట్లా ప్రతిపాదిస్తారు చెప్పండి!

అదీ కాక,

"ఘాతన్ న ఘాతో విప్రః ।"

అని కదా! ఒక విప్రుడు తనను గాయపరిచిన వాని పట్ల కూడా క్షమయే కలిగి ఉంటాడు. తిరిగి గాయపరిచే ఉద్దేశ్యము, ఆవేశము కూడా అతనికి ఉండవు... అని కదా, పెద్దలు అంటూ ఉండేది!

మీరు విప్రమహాశయులు. శాంతమూర్తులు. అహింసా స్వభావులు. మీరు కూడా అమాయక జంతు హింసలో కూడిన యజ్ఞము ఉత్తమోత్తము

మని, అవి మోక్షమార్గములో అత్యావశ్యకమని, అత్యవసరమని అంటున్నట్లు నాకనిపిస్తోంది స్వామీ!

**బ్రాహ్మణుడు :** ఓ నారీమణీ! వేదప్రవచితము, భగవదనుజ్ఞా రూపము అయినట్టి యజ్ఞములలో అంతర్భాగంగా - విధి విధాన రూపంగా జరిగే ఒక్క పశువు యొక్క హింసను 'హింస' అని అనకూడదు. యజ్ఞములో - యజ్ఞము కొరకై కాకుండా మరొక చోట - మరొక రీతిగా - స్వార్థ పూరితమైన జంతు హింసను ప్రోత్సహిస్తే... అప్పుడు మాత్రమే అది 'హింస' అని అనిపించుకుంటుంది. "సహమానవులనుగానీ, సహజీవులను గానీ బాధించండి..." అని ఎవ్వరైన చెప్పితే అట్టి ద్వేషము, జాత్యహంకారము హింసతో సమానమే! "అహింసో పరమో ధర్మః" అనునది తప్పక ఆచరించవలసినదే!

లోక కళ్యాణమే ధ్యేయంగా విధి విధానములను అనుసరించి యజ్ఞ-యాగములలో వేదవిహితంగా చేసే జంతు హింసను 'హింస' అని నీ ప్రజ్ఞావాదముతో దూషించటం అల్పదృష్టియే అవుతుంది. నీవు చెప్పినట్లు మిగతా అన్ని విషయములలో "అపకారికి ఉపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి"... అని లోకములకు నేర్పుచున్నది మేమే కదా!

"ఏకాదశి ఉపవాసము శుభప్రదము" అని మేము శాస్త్రనియమాలను జనులకు గుర్తు చేస్తూ ఉంటే ... నీ బోటి వారు వచ్చి "స్వశరీర హింస కదా!"..... అని అంటే మేమేమి చెప్పేది? నీ మాటలు అట్లా ఉన్నాయి. ఉద్దేశ్యము - సంకల్పము అనుసరించి ఒక క్రియ "హింసయా - అహింసయా' అని నిర్ణయించాలి. తల్లి పిల్లవాడికి చెంపదెబ్బ ఇస్తే "అది జీవహింస" అని వ్యాఖ్యానిస్తామా?

**గొల్లభామ :** హే మహనీయా! మీరు ఇతర క్షేమము కోరేవారిని, లోకక్షేమమే ఆశయముగా కలవారని, మా అందరి హితమును కోరి వర్తించేవారేనని, అహింసా స్వభావులని మాకందరికీ బాగా తెలుసు. అందుచేతనే మీరు మా అందరి చేత పూజింపబడుచున్నారు.

ఇప్పుడు మనము అందరికీ సులభసాధ్యం అయినట్టి 'ఆత్మజ్ఞానము' విషయమై సంభాషించుకోబోతున్నాము.

యజ్ఞయాగాదుల విషయమై మనం కొన్ని విషయాలు విశ్లేషణం చేస్తున్నాము. అందుచేత మరికొన్ని విషయాలు చెప్పటానికి అంగీకరించెదరు గాక!

మహాత్మా!

ఈ సృష్టి అంతా పరమేశ్వర రూపమే !

పరమేశ్వర సంకల్పముగా పుట్టనిది ఎక్కడా కూడా అణుమాత్రమైనా లేదని మనందరికీ తెలిసిన విషయమే కదా! అటువంటప్పుడు ఈ స్థావర - జంగములలో 'కొన్ని గొప్పవి - మరికొన్ని తక్కువవి' ఎట్లా అవుతాయి? ఆ మాట అనుచితమే కదా!

ఈశ్వరుడు స్థూలము కంటే స్థూలుడు. సూక్ష్మము కంటే సూక్ష్ముడు.

- సర్వభూతములును తానై
- సర్వసాక్షి అనగా వేరై
- సర్వ బ్రహ్మాండములకు తానే సూత్రధారియై
- సర్వజీవ బుద్ధులందు సంకల్ప - వికల్పములను సర్వత్రజేయుచు, నిర్వికల్పుడగుచు''

అని ఈ కూచిపూడి వాసులైన యేలేశ్వరపు రామకృష్ణయ్యగారు సర్వలోక మంగళాంగుడగు అంగజ జనకునకు (బ్రహ్మదేవుని తండ్రియగు విష్ణు భగవానునకు) మంగళగానం చేయటం లేదా?

అటువంటి ఈశ్వరుని కంటే యజ్ఞయాగాదులు గొప్పవి. అధికమైనవి - అని అనటం యుక్తియుక్తం అవుతుందా చెప్పండి? అంతా మీరు ఎరిగిన వారే కదా!

## 26.తారతమ్యములు

**బ్రాహ్మణుడు :** ఓ భామా! సృష్టికర్తయగు బ్రహ్మదేవుని నుండి సృష్టిలోని స్తంభము వరకు ఆ బ్రహ్మస్తంభ పర్యంతము ఈ చరాచర ప్రపంచమంతా ఈశ్వరమయమే! ఈశ్వర స్వరూపమే! ఇందులో ఏ కించిత్ కూడా అనుమానమే లేదు.

అది సహజ సత్యము.

ఈ జగత్తో?.. సందర్భసత్యము.

అటువంటి ఈ జగత్తు విజ్ఞత గలవారికి ఆత్మజ్ఞానము సిద్ధించుకోవటానికి మహత్తరమైన ఉపకరణము కూడా ! అటువంటి సందర్భ చమత్కారమైనట్టి ఈ సృష్టిలో

- మహనీయులను అనుసరిస్తాము. దృష్టాంతాలుగా, మార్గదర్శకులుగా స్వీకరిస్తాము.
- మూర్ఖులను, మూర్ఖభావాలను అనుసరించము కదా!

ఈ విధంగా అనుసరణీయులు, అనుసరించకూడనివారు విశ్వవిద్యాలయము (విశ్వమే విద్యాలయము)లో ఉంటారు కదా!

అదే రీతిగా

**అంతా బ్రహ్మమే కాబట్టి"జగత్ సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు, నిద్రా-మైధున-ఆహారములలో నిమగ్నమై ఉండే ఒక పురుగు సరిసమానమే!"** అన్న లౌకిక దృష్టితో ఈ దృశ్యమును చూస్తామా? అట్లా అంటామా? అనము కదా!

జగత్ వ్యవహారముల దృష్ట్యా 'తారతమ్యములు' అనేవి ఉండియే ఉంటాయి.

శాస్త్రీయమైన మరొక దృష్టాంతము, సోదాహరణ పూర్వకంగా ఉదహరిస్తాను. చెపుతాను. విను. శ్రీకృష్ణపరమాత్మ గీతాచార్యులై 'విభూతి యోగము'లో "నేను మిమ్ములను ఏ ఏ రూపాలలో ఉపాసించవచ్చు?" అనే అర్జున ప్రశ్నకు సమాధానంగా....,

"దేవ - మనుష్య - స్థావర - జంగములలో
ఈ ఈ కొన్ని కొన్ని రూపాలు నేనే"

అని చెప్పటం జరిగింది కదా! అది నీవు వినలేదా? పరిశీలించలేదా? యోచించనే లేదా? సర్వము బ్రహ్మమ్, అను సిద్ధాంతమునకు అదంతా

పొసగనిదని నీవు అనగలవా?

**గొల్లభామ :** ఓ విప్రోత్తమా! సూచించిన విషయమే మరొక్కసారి చెప్పుచున్నాను.

ఒకానొకడు 'ద్విజుడు' అయి అగ్నిహోత్రము మొ॥నవి అయా దైవయజ్ఞములను నిరంతరము నిర్వర్తిస్తూ ఉండవచ్చును గాక!

లేక....

'విప్రుడు'అయి వేదాధ్యయనంలోను, వేదోచ్ఛారణను శిష్యులకు నేర్పటం లోను నిష్ణాతుడై ఉండవచ్చును గాక!

ఎవ్వరైనా...., ఎట్టివారైనా కూడా....,

తన హృదయంలోను - సర్వుల హృదయాలలోను సదా - సర్వదా వేంచేసియుండి సర్వమునకు 'ఆది' అయి, కాలమునకు - గుణములకు సాక్షి అయి, అఖండము - అప్రమేయము అయిన 'ఆత్మ' గురించి తెలుసుకొని లోక విశేషముల పట్ల 'మౌనము' అను భూషణంతో అంతరంగ స్వరూపము అలంకరించుకొని ఉండి ఉండటవే బ్రహ్మణ్యము, బ్రాహ్మణత్వము, బ్రహ్మత్వము.

అట్టి ఈజగత్తుగా కూడా కనిపిస్తున్న 'ఆత్మ' యొక్క స్వరూప -స్వభావాలు తెలుసుకోకుండా కేవలము యజ్ఞ - యాగాదులచే 'సర్వాంతర్యామి', 'సర్వతత్త్వ స్వరూపుడు' అగు శ్రీరామలింగేశ్వరస్వామిని మెప్పించలేము. అవును కదా మహనీయా!

**బ్రాహ్మణుడు :** ముమ్మాటికీ అవును.

అయితే...,

"స్వహృదయస్థుడు - మనో విలాసుడు - జగత్ కల్పన క్రీడావిలాసుడు" అగు ఆ పరమాత్మను తెలుసుకొనియుండి కూడా ఎందరో మహనీయులు కర్మలను తిరస్కరించటం లేదు. నిరశించటం లేదు. ఏవమ్ జ్ఞాత్వా కృతమ్ కర్మ పూర్వైరపి ముముక్షుభిః, కురు కర్మైవ తస్మాత్ త్వమ్,పూర్వైః పూర్వతరమ్ కృతమ్".... అని కృష్ణపరమాత్మ వ్యాఖ్యానించుచున్నారు కదా!

"ఆత్మతత్త్వమును తెలుసుకొంటూ కూడా ముముక్షువులు కర్మలను నిర్వర్తించుచూ ఉండుగాక!" అని శాస్త్రకారుల అభిప్రాయం!

విజ్ఞులైనవారు కర్మలను వదలరు. అశ్రద్ధచూపరు. ప్రావీణ్యతను కొనసాగిస్తూనే ఉంటారు. పూర్వము జనకమహారాజు, దిలీపుడు, రఘువు, హరిశ్చంద్రుడు, శ్రీరాముడు, ధర్మరాజు మొ॥న దివ్య జ్ఞానులు ఏం చేశారు? ఆత్మతత్త్వమును "స్వస్వరూపాత్మాపమేవ్యేవసర్వత్ర" అని ఒకవైపు ఆస్వాదిస్తూనే,... మరొకవైపు అశ్వమేధము ఇత్యాది క్రతువులు, వ్రతములు నిర్వర్తించారని గ్రంథాలలో చెప్పినది వినియుండలేదా? వారందరూ తెలివి తక్కువవారై యజ్ఞయాగాది లోక కళ్యాణ పూర్వకమైన కర్మలు ఆచరించారని నీ ఉద్దేశ్యమా? వారికంటే మనం మేధావులమా? ఓ భామారత్నమా!

**గొల్లభామ :** హే మహానుభావా! కేవలము యజ్ఞములు - యాగములు - వ్రతములు - దానములు చేసి - అంతమాత్రం చేత ఈశ్వరుని హృదయములోను, దృష్టిలోను నిలుపజాలమనేదే నా ఉద్దేశ్యం.

**బ్రాహ్మణుడు :** మరి ఈశ్వరుని హృదయస్థం చేసుకోవడం ఎట్లా అని నీ అభిప్రాయం?

**గొల్లభామ :** భయము - విస్మయము - ఇటువంటివి పొందటంగానీ, ఇతరులకు కలిగించటం గానీ లేనివారై (భయ - విస్మయ రహితంగా), **"ఈ కనబడే విశ్వమంతా పరమాత్మ రూపమే"**..... అను భావనతో అనన్యమనస్కులై, ఎవ్వరిని చూచినా "వీరు పరమాత్మ యొక్క ప్రత్యక్షరూపమే కదా!" - అనే 'మననమును' పెంపొందించుకుంటూ, ప్రవృద్ధం చేసుకుంటూ, సుస్థిరము - అనునిత్యము చేసుకుంటూ....., "నిశ్చలమైన భక్తి" కలిగి ఉంటే ఈశ్వరుడు ప్రసన్నుడౌతాడు.

"సతతయుక్తులై ప్రేమాస్పదంగా భజిస్తూ ఉంటే - స్వయంగా హృదయంలో ప్రవేశించి జ్ఞానదీపాన్ని వెలిగిస్తాను" అని కృష్ణపరమాత్మ మాట ఇచ్చి ఉన్నారు కదా!

సర్వజీవుల పట్ల " పరా స్వభావసిద్ధమైన ప్రేమ - భక్తి - భగవత్ భావన"ల అభ్యాసము లేకుండా కేవలము యజ్ఞ-యాగాదులతోను, దాన-తపస్సులతోనూ భగవంతుని మెప్పించాలనుకుంటే, అది ఎవ్వరివల్లా

అయ్యేది కాదని నా ఉద్దేశ్యము, అభిప్రాయము.

**బ్రాహ్మణుడు :** (కాసేపు యోచనగా కళ్ళు మూసుకుని - నెమ్మదిగా కళ్ళు తెరచి)

"ఈశ్వరుడు యజ్ఞపురుషుడు" అని చెప్పగా మనం విన్నాముకదా?

"తస్మాత్ సర్వగతమ్ బ్రహ్మ
నిత్యమ్ యజ్ఞే ప్రతిష్ఠితమ్"

అనే గీతావాక్యం మరల గుర్తుచేస్తున్నాను.

మరొక్క విషయం కూడా...,

మనకు ఎవ్వరైనా అంటే చాలా చాలా ఇష్టమనుకో. అప్పుడేమి చేస్తాము? వారికి ఏది చాలా ఇష్టమో అది నిర్వర్తించి మన గొప్ప ఇష్టాన్ని ప్రదర్శించటానికి ప్రయత్నిస్తాము కదా!

అట్లాగే....,

భగవంతునికి యజ్ఞపురుషుడు అనిపేరు. "యజ్ఞము-దానము - తపస్సు - శౌచము" ఇవి భగవానునికి చాలా ఇష్టమైనవని. ఇది పురాణాలు - జ్ఞానులు చెప్పగా మనం వింటున్న విషయమే ! అవంటే పరమాత్మకు చాలా ప్రియమని విప్రవర్యులు కూడా గుర్తుచేస్తున్నారు. వాటిచే ఈశ్వరుడు సంతుష్టుడు కారా? అవుతారు. అందుచేత ఏమాత్రం అవకాశమున్నా యజ్ఞములు తప్పక నిర్వర్తించ వలసినదే! విడువకూడదు.

## 27.యజ్ఞము-అనేకమంది పాత్రలు

**గొల్లభామ :** - 'యజ్ఞము' ఏ మాత్రము ఎన్నటికీ విడువనేకూడదు, యజ్ఞము ఈ కూచిపూడిలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి యొక్క రూపాంతరము-అని మీరు అభిప్రాయపడుచున్నారు. అత్యావశ్యకమని కూడా ప్రతిపాదిస్తున్నారు. సరే!

ఇప్పుడీవిషయం చెప్పండి.

పాలు - పెరుగు - గోవు - మేకపోతు - దర్భలు ... ఇవన్నీ కూడా

ఒక (ద్రవ్యమయ- భౌతిక) యజ్ఞము నిర్వహించటానికై తప్పక ఉండాలి కదా! అవన్నీ మీకు సమకూర్చుచున్నది ఎవరు? అహర్నిశలు (రాత్రింబవళ్ళు) "పశువులను పోషించటం" అనే వృత్తిలో నిమగ్నమై ఉండే మా గోపబాల కులమే కదా! గొల్లలమగు మేము అవన్నీ అందజేస్తే కదా మీరు యజ్ఞము చేసేది, చేయించేది? ఇది మాన్యులగు పెద్దలకు తెలుసు! మీకూ తెలుసు. ఔనా? "ఏదో ఆడది కదా! గొల్లభామ కదా! మాట్లాడుతోందిలే!"... అని కొంచము చులకన చేసి నా మాటలపట్ల లక్ష్యము ఉంచటం లేదు కానీ!

**బ్రాహ్మణుడు** : ఓ కంజాయత నేత్రీ! యజ్ఞక్రియలు నిర్వర్తించే కార్యక్రమములో అంతర్భాగంగా మీ గొల్లలు - తదితరులు, మాకు అందిస్తున్న పదార్థములకు - తదితర శ్రమదానమునకు మేము ఎల్లప్పుడూ ఎంతో సంతోషిస్తూ ఉంటాము. నీవు చెప్పినది నిజమే! ఆ గౌరవం చేతనే ఈ రామలింగేశ్వరస్వామి దేవాలయం ప్రక్కన గల ఈ రచ్చబండపై ఆసీనుడనై నీతో ఆప్యాయతగా సంభాషిస్తున్నాను సుమా! ఆ కృతజ్ఞత మాకు ఉన్నది.

సరే! ఇప్పుడు అసలు విషయానికి వద్దాము. మీరు యజ్ఞనిర్వహణ కొరకై ఏఏ పదార్థాలు అందిస్తున్నారు? అవన్నీ సవివరంగా చెప్పు! అందరమూ విని సంతోషిస్తాము.

**గొల్లభామ** : మేము మీ యజ్ఞకార్యక్రమముల కొరకై సేవకులమై పాలు - పెరుగు - వెన్న - నేయి - మేకపోతు - గోవుపేడ - గంగిగోవుపాలు - జున్ను - ఆవుదూడలు ..... ఇవన్నీ అందజేస్తున్నాము. ఇవన్నీ లేకుండా, యజ్ఞనిర్వహణ మీరు చేయలేరు కదా!

**బ్రాహ్మణుడు** : ఏమమ్మా! చాలా చమత్కారంగా మాట్లాడుచున్నావే!

- మా దగ్గరి మాత్రం ఆవులు లేవా?
- అవి పాలు ఇవ్వవా?
- అవి ఇచ్చే పాలతో పెరుగు - వెన్న తయారవ్వవా?
- అవి యాగములకు పనికిరావా?
- మా గోమాతలు గోమూత్రము - ఆవుపేడ ప్రసాదించవా?

**గొల్లభామ** : మీరు ఏదో మాటకు - మాట అంటున్నారే గానీ, నేను

చెప్పేదేమిటో - నా ఉద్దేశ్యము ఏమిటో మీరు అసలు గమనించకున్నారేమి? అసలు భావము ఏమిటో, విషయమేమిటో శ్రోత గమనించకపోతే వక్తగా నేను ముఖ్యవిషయం చెప్పలేకపోతే,..... ఇక ఈ మన సంవాదమునకు ప్రయోజనము ఏమున్నట్లు చెప్పండి. మీవి ఎగతాళి మాటలు కాదా స్వామీ!

ఇందరు సభాసదుల ఎదుట " తదితరుల కన్నా మేము గొప్ప" అను రూపము గల స్వాభిమానము - కులాభిమానములకు సత్యవస్తు నిరూపణ విషయానికి మనము వచ్చినప్పుడు ఏ మాత్రం స్థానము ఉండదు కదా మహనీయా? స్వకులాభిమానము చేతనే "ఆవు పాలు - ఆవు పెరుగు - ఆవు నేయి మీరిచ్చేదేమిటి? మా ఇళ్ళలో ఆవులు ఉండవా? అవి పాలు ఇవ్వవా?".... అని కించిత్ ఎగతాళిగా మాట్లాడుచున్నారు కదా! 'యజ్ఞము' నిర్వర్తించే సమయంలో గొల్లవారు సమర్పించే యజ్ఞ సామగ్రి - మొదలైన సేవలు తృణప్రాయముగా (గడ్డిపరకతో సమానంగా) కొట్టిపారవేస్తున్నారే! ఊరికే ఏదో అంటున్నారు గానీ,

యజ్ఞము జరగాలంటే పాలు - పెరుగు - వెన్న - నేయి - జంతువు - సమిధలు - అనేకమందికి సమర్పణ చేయటానికి ఆహారపదార్థములు - డేరాలు (షామియానాలు), విశాల ప్రాంతాలను చదును చేయటం.... ఇటువంటివి ఎన్నో కదా!

అయినా యజ్ఞములో యజ్ఞ పసువును సమర్పిస్తారు కదా! మేకపోతు వగైరా మీ ఇళ్ళల్లో పెంచుతారా? పెంచరు కదా! మేమే కదా ఇవ్వవలసింది.

**బ్రాహ్మణుడు :** "యజ్ఞమునకు సహకరించేది మేమే కదా!" అని అభిమానం కనపరుస్తున్నావా భామామణీ! చిరుకోపం ప్రకటిస్తున్నావు కూడానే! అదంతా లాభం లేదమ్మా! మా సామర్థ్యమేమిటో కూడా, చెప్పేది వినుమరి!

మీరు మేకపోతును 'ఇవ్వము' అని అంటే.... మేము బియ్యపు పిండి (పిష్టము)తో పశువును తయారుచేసుకుని ఆ పిండి పసువుతో యజ్ఞము చేసుకోగలము తెలుసా? అట్లా మేము చేస్తే ఇక మీరు ఆ వైపుకు కూడా రావలసిన పని ఉండదు. మా ఇండ్లలోని పాలు - పెరుగు - వెన్న - నేయిలతో మేము యజ్ఞము నిర్వర్తించగలము. కానీ, మేము అట్లా ఆలోచించము.

సకల జనులు వారి వారి వృత్తులకు సంబంధించిన వస్తుజాలము సమర్పిస్తూ ఒక కుమ్మరి - మేదరి - గోపబాలకులు - ఆటవికుడు - గుడారాలుకట్టువారు - వంటవారు .... అందరము యజ్ఞఫలం పొందాలని, అందరికీ వారివారి పాత్రల ద్వారా యజ్ఞపురుషుడు వరములు ప్రసాదించాలని మేము ఉద్దేశ్యిస్తాము.

అందుకే పిష్టపశువు (బియ్యపు పిండి మేక)తో కాకుండా మీ వద్ద నుండి మేకను తెప్పించుకోవటం. మా ఇళ్ళలోపాలు - పెరుగుతో సరిపెట్టుకోవటము మేము చేయము.

**గొల్లభామ :** ఓ ద్విజవర్యా! 'అధిక ప్రసంగం చేస్తోంది' అని కోపగించకుండా చెప్పేది వినండి. చిత్తగించండి. యజ్ఞమునకు సంబంధించిన విధి - విధానములలో అతి ముఖ్యమైనది 'భాగపశువు' (మేకపోతు) కదా! అటువంటి ప్రత్యక్ష పశువును వదలి "మేము బియ్యపుపిండితో పశువును తయారుచేసుకొని యజ్ఞాలు, యాగాలు చేస్తాము'' అని అంటున్నారా? పిండి పశువుకు 'వప' ఉంటుందా? అటువంటి వప యాగహోమమునకు అతి ముఖ్యమైనది కదా! వప సమర్పించకుండా మరి ఏమి ఇచ్చి అగ్నిహోత్రుని సంతోషింపజేస్తారు? ముందుగా అగ్నిహోత్రుని సంతోషించకుంటే ఆయన యజ్ఞకర్త కొరకై హవ్యవాహనుడు అవుతారా? మీరు సమర్పించేవన్నీ ఆయా యాగదేవతలకు చేర్చేది ఆ అగ్నిదేవుడే కదా! ఓ భూసురోత్తమా! ఈ విషయం ముందు చెప్పండి.

**బ్రాహ్మణుడు :** అదా, ఓ చంచలనేత్రీ! అగ్నిహోత్రుడు వేదనాదప్రియుడు. మేము అతికఠినములైన వేదమంత్రములను ఉచ్ఛరిస్తూ - గానం చేస్తూ మా యొక్క శబ్దోచ్చారనా బలంతో - నాదబలంతో అగ్నిహోత్రుని ప్రసన్నం చేసుకోగలము సుమా!

వేదనాదస్వరాలతో "జాతవేదసే సునవామ సోమజాతీయతో ॥ నిదహాతి వేద:''.... అని కొంత మంది విప్రులము కలసి గానం చేస్తూ ఉంటే దేవబ్రాహ్మణ స్వరూపుడైన అగ్నిహోత్రుడు మహా సంతోషంతో మా యజ్ఞములకు సహకరిస్తారు తెలుసా?

అగ్నిహోత్రుడు త్రిలోకములలో మహనీయుడు. పరమ పవిత్రుడు.

సర్వ దేహాలలో ప్రవేశించి 'జీవనము'నకు కారకులై రక్షిస్తూ ఉంటారు.

అటువంటి మహాత్ముని ఏవో కొన్ని పదార్థాలు ఇచ్చి సంతోషింపజేయు గల శక్తి మానవులకు ఉంటుందా చెప్పు? కాళ్ళు - చేతులతో ప్రకృతి యొక్క కనికరముచే జీవించే మనమెంత? సర్వ లోకాలను తన తేజస్సుచే రక్షిస్తూ అవసరమైతే సర్వమును భస్మము చేయగల అగ్నిహోత్రుడికి ఏమి ఇచ్చి సంతోషింపజేయగలము?

అయితే, మహనీయులు అల్పసంతోషులై ఉంటారు! ఏ కొంచమైనా వినయముతో కూడిన మాటలతో - స్తోత్రములతో సమర్పిస్తే అగ్నిదేవుని వంటి మహానుభావులు సంతోషిస్తారు. అంతేగానీ, కొండంత దేవునికి కొండంత పత్రి తేగలమా? లేదు కదా!

శ్లో ॥ పత్రం పుష్పం ఫలం తోయమ్
యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహమ్ భక్త్యుపహృతమ్
అశ్నామి ప్రయతాత్మన: ॥

"ప్రేమతో ఒక ఆకు - పువ్వు - పండు - గ్లాసుడు నీళ్ళు ఏది ఇచ్చినా సరే, భక్తితో కూడి ఇచ్చేదాన్ని నేను స్వీకరించి సంతోషిస్తాను".

అని కృష్ణస్వామి అనలేదా?

కాబట్టి.....,

మహాత్ముడగు అగ్నిదేవుని మేము మంత్రములతో, స్తోత్రములతో సంతోషింపజేస్తూ ఉంటాము. ఇక నీవు పిష్టపశువు (బియ్యపు పిండితో తయారు చేసిన పశువు) గురించి చెప్పిన విషయానికి వద్దాము.

ఓ పల్లవపాణీ! "పిష్టపశువుతో యాగము నిర్వర్తించవచ్చు" అని వేదములలో చెప్పియున్న మాటయే గానీ, అది నా మాట కాదు సుమా!

**గొల్లభామ :** ఓహో! "అర్థ పటుత్వము - శబ్దస్వరము - నాద సౌందర్యము గల మంత్రముల ఉచ్చారణ చేతనే మేము పరమాత్మయగు అగ్నిదేవుని సంతోషింపజేయగలము" అని వ్యాఖ్యానిస్తున్నట్లున్నారే? కేవలము

మంత్రోచ్చారణ చేతనే అగ్నిదేవుడు తృప్తి చెందుతారా?

ఒక మహానుభావుని మన ఇంటికి ఆహ్వానించామనుకోండి. ఆయన కు అన్నపానీయాలు ఏమీ ఇవ్వకుండా "మీరు అంతటివారు. ఇంతటివారు. మీకు మేము విధేయులం"..... అని స్తోత్రపాఠాలు గంటలకొద్దీ వల్లిస్తే సరిపోతుందా? ఆ మహాత్ముని ప్రయాణబడలిక తొలగుతుందా? వారి ఆకలి తీరుతుందా? చెప్పండి. లేదు కదా!

ఆ మహాత్ముని వారు ప్రియముగా ఇష్టపడే ఆహార పదార్థాలు సమర్పిస్తాము. పానీయమిస్తే కదా, వారి దాహం తీరేది. కేవలం వినయ విధేయతలతో ప్రయోజనం ఏముంటుంది చెప్పండి?

అది అట్లా ఉంచి.....,

యజ్ఞయాగాలకు "మిగతా సరంజామా అవసరమేగానీ ఒక్క పశువు విషయంలో పిష్టపశువు సరిపోతుంది కదా!".... అని వాదిస్తే సరిపోతుందా స్వామీ! ప్రత్యక్ష పశువు బదులుగా పిష్టపశువును వాడతారు సరే! మరి, పెరుగు - పాలు - పుష్పాలు - కట్టెలు ... ఇత్యాదులకు కూడా సంజ్ఞావిశేషాలుగా సమకూరుస్తారా?

మీ వాక్యాలు కొంచము చమత్కారంగా లేవా? చెప్పండి.

## 28 యజ్ఞపట్టు

**బ్రాహ్మణుడు :** ఓ భామామణీ! నీవు చెప్పిన మాటలు యుక్తియుక్తంగానే ఉన్నాయి. మీ అందరి సహాయ- సహకారాలు లేకుంటే యజ్ఞము ఒకరి వల్లో - ఇద్దరి వల్లో అయ్యేది కాదనుమాట అక్షర సత్యం! బాగానే మాట్లాడావు. సరే, ఆ విషయాల గురించి మనము మరొకప్పుడు సంభాషించుకుందాములే గానీ....,

మనకు లభించిన ఈ కొద్ది సమయం సద్వినియోగపరచుకుందాము. మీ గొల్లవారు "గొల్లవారమూ... సద్గురు కృపచే పాలవారము".... అనే రీతిగా యజ్ఞకథను పాటగా అల్లి పాడుకుంటూ ఉంటారు కదా! ఆ యజ్ఞ కథను నీ నుండి వినాలని నాకు కుతూహలం కలుగుతోందమ్మా!

**గొల్లభామ :** అట్లాగా స్వామీ! యజ్ఞ కథ మీ కృప - ఈ స్వామి కృప ఉంటే గానం చేస్తూ వివరించి చెప్పుతాను.

**బ్రాహ్మణుడు :** నీకు - నాకు ఇష్టదైవమై, ఈ మన కూచిపూడిలో వెలసిన ఈ బాలత్రిపుర సుందరీ సహిత రామలింగేశ్వరస్వామిని భక్తితో హృదయంలో తలచుకొని 'యజ్ఞపట్టు' చెప్పు.

నాకు ఈ సభలోని శ్రోతలకు సంతోషము కలిగించే విధంగా నీ మృదువైన తీయటి మాటలలో యజ్ఞపట్టు కథ వినిపించవమ్మా!

**గొల్లభామ :** మీవంటి మహనీయులగు కూచిపూడి విప్ర బ్రాహ్మణులచే వర్ణించబడి, మా గొల్ల పెద్దలచే గానం చేయబడగా గొల్లభామలమగు మేము నేర్చుకున్నాము. వీధులలో పాడుకుంటూ తిరుగుతామే గానీ, యజ్ఞకథను వ్యాఖ్యానిస్తూ వివరించి చెప్పగల విజ్ఞత నాకు లేదు.

**బ్రాహ్మణుడు :** ఏమీ పర్వాలేదు. నీ మాటలలో ఆత్మజ్ఞానానికి సంబంధించి విజ్ఞత మా చెవులకు వినిపిస్తూ ఉన్నదమ్మా! అందుచేత నీ మాటలలోనే వ్యాఖ్యాన పూర్వకంగా యజ్ఞపట్టు వివరించు.

**గొల్లభామ :** గురుతుల్యులు - వేదజ్ఞులు అగు మీరు ఆజ్ఞాపిస్తున్నారు. దేవతా స్వరూపులైన ఈ సభాసదులు చక్కగా - శ్రద్ధగా మన ఇరువురి సంభాషణ వింటున్నారు.

మీరు - ఈ సభాసదులు - శ్రోతలు సంతోషించే విధంగా 'యజ్ఞకథ'ను వినిపించటానికి ప్రయత్నం చేస్తాను.

మొట్టమొదట.....,

వేదమాతా స్వరూప లావణ్యులగు మీకు పాదాభివందనములు. అనేక శరత్కాల పూర్ణ చంద్రులు ఒక్కచోట ఉన్నట్లుగా, ఈ సభకు వేంచేసి, ఆసీనులై మన ఇద్దరి ఈ సంవాదమును ఉత్సాహంతో విజ్ఞాన దృష్టితో వింటున్న - శ్రుతం చేస్తున్న సభాసదులకు పెద్దలకు సాష్టాంగ దండ ప్రణామములు.

లోకమంతా విస్తరించి, శరత్కాలమేఘము వలె 'బ్రహ్మజ్ఞాన వచన

ములు' అనే చల్లని పిల్లగాలులు సర్వజనులపై ప్రసరింపజేసే సద్బ్రాహ్మణులకు నమస్కారము. శబ్ద బ్రహ్మమును - నాద బ్రహ్మమును - మంత్ర బ్రహ్మమును - జ్ఞాన వచన బ్రహ్మమును తరతరాలుగా అందిస్తున్న బ్రాహ్మణవరేణ్యుల కరచరణములను భక్తితో - ప్రేమతో నుదురుతో స్పృశిస్తూ నమస్కరిస్తున్నాను.

సర్వాంతర్యామి, లోక శుభంకరులు, ఆర్తత్రాణ పరాయణులు, సర్వ తత్త్వాత్మకులు, సర్తతత్త్వ విదూరకులు మాయమ్మ బాలత్రిపురసుందరీ తల్లితో కూడుకున్న వారు అయిన శ్రీరామలింగేశ్వర స్వామికి ఆత్మ ప్రదక్షిన నమస్కారాలు. శతసహస్ర ప్రదక్షిణ దండ ప్రణామములు.

ఓ మహనీయా! నేను పలుకుచున్న ఈ 'యజ్ఞ పట్టు'లో ఏమైనా తప్పొప్పులు ఉంటే, అని క్షమార్హమగునుగాక! నాపై అనుగ్రహం వర్షిస్తూ నన్ను మెచ్చి - పోషించవలసినదిగా శివతత్త్వస్వరూపులగు శ్రోతలకు - పాఠకులకు విన్నపము. విద్వాంసులైన వారందరినీ స్తుతిస్తున్నాను. నమస్కరిస్తున్నాను. పుష్పసహస్రాలు సమర్పిస్తున్నాను. ఈ విప్రవర్యుల ఆజ్ఞను అనుసరించి వివరణ పూర్వకంగా 'యజ్ఞపట్టు'ను వినిపించటానికి ఉత్సాహంతో సంసిద్ధురాలను అగుచున్నాను. ఓ బుధులారా! వినండి! చిత్తగించండి!

## 29. ప్రాయశ్చిత్తము

మొట్టమొదటగా..... శాస్త్రీయంగా గమనిస్తూ వస్తే...., 'యజ్ఞము చేయాలి' అని తలచిన యజ్ఞ కర్త "నా తాత - తండ్రులు యజ్ఞము చేయలేక పోవడం చేత దౌర్బ్రాహ్మణ్యము పొందుచున్నాను కదా! వారు యజ్ఞం చేయనందు చేత నాకు యజ్ఞము చేసే అర్హత స్వత:గా ఉండదు" అని తలుస్తాడు. ఒకవేళ పిత్రు - పితామహులు యజ్ఞాలు చేసి ఉంటే యజ్ఞము చేయటానికి అర్హత ఉంటుంది.

అట్టి 'దౌర్బ్రాహ్మణ్యము'ను దృష్టిలో పెట్టుకొని శాస్త్రములు యజ్ఞమును నిర్వర్తించటానికి సిద్ధమగుచున్నవాడు యజ్ఞార్హత పొందటానికి కొన్ని మార్గములు సూచన చేస్తున్నాయి. అది 'ప్రాయశ్చిత్త విభాగము' అంటారు.

'ప్రాయశ్చిత్తము' యొక్క విధి-విధానములలో అంతర్విభాగంగా మహాత్మా! మీ పెద్దలు 'ప్రాయశ్చిత్త పశువు' కొరకై మా గొల్లగ్రామాలకు వస్తున్నారు. మాదగ్గర ఉండే మేకపోతులన్నీ పరీక్షించి ఒకానొక మేకపోతును ఎన్నుకుంటున్నారు. ఆ మేకపోతు నల్లనిదై ఉండాలి. ఒక్క తెల్ల వెంట్రుక కూడా ఉండకూడదని అంటారు. మా గొల్ల పెద్దలతో సంప్రదిస్తారు. బేరం ఆడతారు. అంతేకదా, అయ్యవారూ!

**బ్రాహ్మణుడు :** నిజమే! నిజమే! ఇక చెప్పు!

**గొల్లభామ :** ఒక వేళ మీరు మేకపోతును తీసుకువెళ్ళి మీ గృహ పెద్దలు ఒక్క 'తెల్ల వెంట్రుక' కనిపించటం జరిగినా, మీ వారు తిరిగి ఆ మేకపోతును మా గొల్ల గ్రామం తెచ్చి ఇచ్చివేసి మరల మరొక దానికోసం వెతుకుతారు.

అయ్యా!

- ఆ ప్రాయశ్చిత్తమేదో .... ఎవరికివారే చేసుకోవచ్చునుకదయ్యా! మరి మీరు చేస్తున్నదేమిటండీ! తెల్లవెంట్రుక ఒక్కటి కూడా లేని నల్లని మేకపోతును ఎన్నుకుంటున్నారు. మా పెద్దలకు కొంత ద్రవ్యము ఇచ్చి తీసుకుపోతున్నారు. ఆ మేకపోతును 'యూపస్తంభము'నకు కట్టుచున్నారు. కట్టి మంత్రోచ్చారణతో పూజించి దానిని వధిస్తున్నారు. ఆ మేకపోతు శరీరమును ఛేదిస్తున్నారు.
- ఒక్క తెల్ల వెంట్రుక ఉన్నా కూడా ఆ మేకపోతు పనికిరాదట. అదే మిటో? తెల్లవెంట్రుక లేకపోవటం ఆ నల్లమేకపోతు దురదృష్టమా!
- చెవులు - నోరు మూసి చంపబడి - ఛేద్దింపబడిన ఆ మేకపోతు దేహములో నుంచి పలలము (మాంసమును) నేతితో వండి పక్వము చేస్తున్నారు.
- పక్వమైన పలలములో కొంత భాగమును 'హోమద్రవ్యము' అను పేరుపెట్టి అగ్నిలో మంత్రముగ్ధంగా హోమము చేస్తున్నారు.
- మిగిలిన పలలమును 'పురోడాశము' అనే పేరుతో యజ్ఞకర్త

యజ్ఞము చేయించు కొందరు బ్రాహ్మణులు భక్షిస్తారు.

- అంతటితో యజ్ఞకర్త యొక్క దౌర్బ్రాహ్మణ్యము తొలగి యజ్ఞార్హత లభిస్తుంది!

**బ్రాహ్మణుడు :** ఆహా! బాగున్నది. ఇంకా! ఇంకొన్ని యజ్ఞ కార్యక్రమ విశేషాలు అభివర్ణించవమ్మా!

## 30. ప్రవర్గహోమము

**గొల్లభామ :** మీ ఆర్యులు (యజ్ఞ కార్యక్రమము ఎరిగిన పెద్దలు) అగ్నిష్టోమము నిర్వర్తించటానికి అనేక సంబారాలన్నీ మునుముందుగానే అనేక రోజుల యత్నంగా తెచ్చి సిద్ధం చేసుకుంటారు కదా!

'ప్రవర్గహోమము' కొరకై మా గొల్లల దగ్గర నుండి మేకల - ఆవుల పాలు, పెరుగు, నేయి, వెన్న చక్కటి పరిశుభ్రమైన పాత్రలతో తెప్పించు కుంటారు. వాటిని వేరు వేరు వెండి పాత్రలలో హోమ కార్యక్రమ ప్రారంభంలో సిద్ధం చేసుకుంటారు.

తిథి - నక్షత్ర - వార - యోగములను పరిశీలించి సరి అయిన సమయంలో 'సృక్కు - సృవము' మొ॥న పరికరాలతో ఆహావనీయాగ్నిని రాజిల్ల చేస్తారు. మా నుంచి తెచ్చిన నేయి - వెన్న - పాలు సంసిద్ధం చేస్తారు.

ఆ సమయంలో తమవంటి మహనీయులైన ఋత్విజులు వేదమంత్రములు ఉచ్చరిస్తూ ఇంద్రుడు, అష్టదిక్పాలకులు, నవగ్రహములు, ద్వాదశాత్యులు మొదలైన దేవతలను సాంగ-సవాహన స ఆయుధ సపత్ని - సపరివార సమేతంగా **"మాపై కరుణతో వేంచేయండి. ఈ యజ్ఞమును శుభప్రదము, దిగ్విజయవంతము లోక కళ్యాణ దాయకము చేయండి"....** అని ప్రేమతో - భక్తితో - సగౌరవంగా ఆహ్వానిస్తారు.

అప్పుడు ఆ మంత్రోచ్చారణకు - మానసికమైన ప్రేమ పూర్వక ఆహ్వానమునకు ముగ్ధులై "నాయనా! ఇదిగో! వస్తున్నాం!" అని బదులు పలుకుతూ వారంతా వేంచేస్తారు.

ఆ ఇంద్రాది దేవతలంతా సంతోషించే విధంగా పేరుపేరునా 'ఆవునేయి' మొదలైన ఉత్తమ ద్రవ్యాలతో ద్వితీయహోమం నిర్వర్తిస్తారు.

ఇంతకు ముందే నేను చెప్పి ఉన్నట్లుగా ...., కొందరు విప్రులు మా పల్లెవారిని కలిసి - సంప్రదించి తెచ్చినటువంటి, మేకపోతు ఇంద్రనీలమణి వలె నల్లగా - చక్కగా - ఆరోగ్యముగా మెరిసే కళ్ళతో 'మేమే' అంటూ ఎక్కడో కట్టబడి ఉంటుంది.

ఆ మేకపోతును అందరూ చూస్తూ ఉండగా...., మెడకు తగిలించిన త్రాడు సహాయంతో బలవంతముగా ఈడ్చుకుంటూ వస్తారు. ఆ మేకపోతు దీనంగా "మే! మే!" అని అరుస్తున్నా వినిపించుకోరు. జాలి-మాలి ఉండదు.

ప్రవర్గ్యహోమము చేయటానికి అప్పటికే అన్నీ సిద్ధం చేసుకొని ఉంటారు. ఆ మేకపోతును యజ్ఞగుండమునకు సమీపముగా లాగుకుంటూ వచ్చి దానిని నీళ్ళతో తడిపి స్నానం చేయించి శుచి చేస్తారు. పూలదండను మెడకు తగిలిస్తారు. ఆ సమయంలో కొందరు ఋత్విజులు దక్షిణాగ్నికి తూర్పుదిశగా నిలబడి చేతిలో దర్భలు పట్టుకొని ఉండి మంత్రాలు చదువుతూ ఉంటారు.

## 31. దక్షిణాగ్ని

**బ్రాహ్మణుడు :** దక్షిణాగ్నియా? అంటే?

తూర్పు దిక్కులో ఒక అగ్ని, పడమరలో మరొక అగ్ని, ఉత్తర దిశలో వేరొక అగ్ని,వీళ్ళ ఇంట్లో ఒక అగ్ని- వాళ్లింట్లో మరొక అగ్ని ...... ఇట్లా ఉంటాయా, చిగురుబోడీ!

**గొల్లభామ :** యజ్ఞ సంబంధమైన అన్ని ప్రక్రియలు మీకు తెలిసినవే కదా స్వామీ! ఏదో తెలియనట్లు పరిహాసము చేస్తారు? ఎగతాళి ఎందుకు మహాత్మా!

యజ్ఞశాలలో వెలిగించబడే

అవహనీయాగ్ని
గార్హపత్యాగ్ని

దక్షిణాగ్ని

అని పిలువబడే త్రయాగ్నులు (త్రేతాజ్ఞులు) మీకు తెలియనివా, చిత్రంగానీ! ఇంకా వినండి!

అవనీయ - దక్షిణాగ్నులకు సమీపంగాను - తూర్పు దిక్కుగాను సుందరమైన 'యూపస్థంభము'ను పాతుతారు. మేకపోతును ఆ యూపస్థంభము దగ్గరకు ఈడ్చుకొనిపోయి చేతిలోని దర్భత్రాళ్ళతో గట్టిగా ఆ స్థంభమునకు కట్టుతారు.

## 32. యూప స్తంభము

**బ్రాహ్మణుడు :** లోకంలో 'దీపస్థంభము' అనే మాట వాడుకలో ఉన్నది. మరి 'యూపస్థంభము' అను మాట ఏమిటి? ఒక వేళ 'దీప' అనే మాట నీ నోరు తిరగక 'యూఫ' అని అనటం లేదు కదా కొంపతీసి? లేక దీపస్థంభమునకే 'యూప స్థంభము' అనే పేరు కూడా ఉన్నదా ఏమిటి?

**గొల్లభామ :** "యూపం వినా యాజనం అప్రశస్తమ్" అని కదా యాగసూత్రము! యూపస్తంభము లేకుండా యాగము ఎలా చేస్తారు? కనుక నేను చెప్పేది యూపస్థంభము గురించే గానీ, దీపస్థంభము గురించి కానే కాదులేండి!

ఓ విప్రమహాశయా ! 'యజ్ఞము' యొక్క విధిగా ఇంకా-ఇంకా ఏమేమి చేస్తూ ఉంటారో,.... వినండి!

## 33. చత్వాల దేశము

యజ్ఞ పసువు అయినట్టి మేకపోతును దర్భత్రాళ్ళతో తీసుకొని వచ్చేది చాత్వాల దేశమునకు కదా!

**బ్రాహ్మణుడు :** చాలా చాలా దేశాల పేర్లు మేమందరమూ విన్నాములే గానీ, భామామణీ! ఈ 'చత్వాల దేశము' ఏమిటమ్మా? అక్కడేమైనా క్రొత్త క్రొత్త ప్రకృతి దృశ్యాలు ఉంటాయా?

**గొల్లభామ :** అదేమీ లేదులేండీ! విప్రులంతా కలిసి యజ్ఞ పసువు అయినట్టి

నల్ల మేకపోతు యొక్క ప్రాణములు తీయటానికి నిర్ణీతమైనట్టి స్థలము కదా!

**బ్రాహ్మణుడు :** అవును. చత్వాలదేశము అంటే అదేలే! అది సరేకానీ, "మీ విప్రుల ప్రాణాలు తీసే చోటు" అని చమత్కారంగాను, వ్యంగ్యముగాను అంటున్నావే? లోకంలో వాడుక ఏమిటో తెలుసా? బ్రాహ్మణులకు సంబంధించిన కార్యక్రమములలో ఏవైనా నచ్చనివి ఉండినప్పటికీ వాటిని తప్పుపట్టుకోరు. తప్పుగా చూడరు. ఇది లోకరీతి. మరి నీవేమో పరుషంగా ఏదో అంటున్నావేమమ్మా? విప్రులు విప్రుల ప్రాణములు తీసి బ్రహ్మ హత్యకు పాల్పడుతారంటున్నావా?

**గొల్లభామ :** (చిరుకోపంగా) నేను ఏ ఉద్ధేశ్యంతో ఏమేమి చెప్పుచున్నానో వినకుండా నేను చెప్పేది తప్పుత్రోవ పట్టిస్తారేం, మహాశయా! విప్రులంతా కలిసి యజ్ఞపసువు అయినట్టి మేకపోతు యొక్క ప్రాణాలు తీస్తారని అన్నానేగానీ "విప్రుల ప్రాణాలు తీస్తారు" అని నేను అన్నానా? స్వామీ!

**బ్రాహ్మణుడు :** అలా నీవు అనలేదులే అమ్మా! ఏదో కించిత్ వినోదం కలగాలని అన్నానులే! నీవు చెప్పేదంతా సశాస్త్రీయములే! ఒప్పుకుంటున్నాను.

మరి, ఇంకా చెప్పు! నీకు-నాకు ఇష్టదైవమైనట్టి శ్రీబాలత్రిపుర సుందరీ సహిత శ్రీరామలింగేశ్వర స్వామిని హృదయంలో భక్తిగా తలుచుకుంటూ మనం యజ్ఞపట్టు గురించి చెప్పుకుందాము! మరికొన్ని యజ్ఞ విశేషాలు చెప్పు!

## 34. ఇడా పాత్ర-వప-అగ్ని సమర్పణము-పురోడాశము

**గొల్లభామ :** అప్పుడేమి జరుగుతుందో వినండి! ఆ విప్రులు ఒక శాలివాహనుణ్ణి (కుమ్మరి వాడిని) పిలిపిస్తారు. బలిష్టుడైన ఆ కుమ్మరిచే ఆ మేకపోతు యొక్క నవరంధ్రాలు మూయిస్తారు. ఆ మూగ జంతువుకు ఊపిరాడకుండా చేస్తారు. బలవంతముగా ఆ మేకపోతు ప్రాణాలు పోయేంతవరకు ఉండి, ఆ కుమ్మరివాడు తాంబూలం పుచ్చుకొని అక్కడి నుండి తొలగుతాడు.

అప్పుడు అధ్వర్యుడు (యజ్ఞము చేయిస్తున్న విప్రుడు) ఒక పదునైన - పొడవైన చురకత్తితో చచ్చిన మేకపోతు యొక్క కడుపును కోసి అందులో

ఉన్న వప (క్రొవ్వుతో కూడిన మాంసపు తిత్తి)ని బయటకు తీస్తారు. దానిపై నేయి పోస్తారు. ఆ మేకపోతు యొక్క హృదయము మొదలైన ఉత్తమమైన అంగములను ముక్కలుగా కోసి ఒక బానలో ఉంచుతారు. ఆ బానను ఇడాపాత్ర అంటారు. ఆ ఇడాపాత్రను అగ్నిగుండముపై ఉంచివండుతారు. ఆ విధంగా వండిన వప- మృగహృదయ ఛిద్రములలోని కొంత భాగమును అగ్నిలో వదులుతూ సమర్పిస్తారు. ఆ సమయంలో శాస్త్రపఠణం, సామవేద గానం చేస్తూ ఉంటారు కదా కొందరు వేదవిజ్ఞులైన బ్రాహ్మణులు!

ఆ ఇడాపాత్రలోని కొంత మాంస-క్రొవ్వు భాగములను అగ్నికి సమర్పించగా మిగిలిన భాగమును పురోడాశము అని అంటారు.

యజ్ఞకర్తతో సహా ఆరుగురు విప్రులు చుట్టూ కూర్చుని ఆ యామిషమును (పురోడాశమును) గోధుమ గింజంత - పెసరగింజంత - మినపగింజంత - నువ్వుగింజంత (యవ - ముద్గ- మాషతిల) ప్రమాణాలుగా భక్షిస్తారు. ఆ విధంగా భక్షిస్తూ "ఈ యజ్ఞకార్యములో అందరికంటే మేమే కీర్తిని పొంది ప్రకాశిస్తున్నాము కదా!" అని అనుకొని లోలోన మురిసిపోతూ ఉంటారు.

యజ్ఞకర్త తన భార్యతో కూడి పురోడాశమును భక్షిస్తారు. ఆ తరువాత సోమపానము కూడా చేస్తారు కదా! ఇంతకన్నా ఏమి చెప్పమంటారు?

## 35. సోమపానము

**బ్రాహ్మణుడు :** ఆహా! సభలోని పెద్దలందరు వింటూ ఉండగా యజ్ఞకర్త - వారి ధర్మపత్ని సోమపానం చేస్తారని అంటున్నావే? సరే! సోమపానము - అంటే ఏమిటో మోమాటము లేకుండా వివరించి చెప్పు, ఓ పూబోణీ!

**గొల్లభామ :** ఓ భూసురేంద్రా! యజ్ఞము యొక్క విశేషాలు మీకు తెలియనివి ఏమైనా ఉంటాయా? మీకు అంతా తెలుసులేండి. అయితే కూడా, ఉపాధ్యాయునిచే పరీక్షచేయబడుచున్న విద్యార్థినిగా భావించి నాకు తెలిసిన యజ్ఞ విధానమునకు సంబంధించిన మరికొన్ని విశేషాలు చెప్పుచున్నాను వినండి.

"సోమరసపానము" అంటే?

సోమయాజిగారు (యజ్ఞకర్త) యజ్ఞదీక్ష వహించటానికి కొన్ని రోజులు ముందుగానే తన సేవకులనో, స్నేహితులనో అడవికి పంపుతారు. సోమలత కోసము వెతికిస్తారు. వేళ్ళతో సహా సోమలతను ఇంటికి తెప్పిస్తారు.

అప్పుడు ఊరిలోని పెద్దముత్తైదువులను బొట్టుపెట్టి ఆహ్వానిస్తారు. చీరలు కట్టిన ఆ పుణ్యస్త్రీలు

"కావరా! సేతు మాధవా
కరిరక్షక సమయమిదే!
దేవ! ఆది దేవా! వసుదేవ నందన.... సమయమిదే
కావరా, సేతు మాధవా.... కరిరక్షక సమయవిధే ! కావరా ॥
భావజారిమిత్ర పరమపవిత్ర .... కావరా ॥
సురనుత రామకృష్ణ భూసురుని ప్రోవా .... కావరా సమయమిదే
కావరా సేతు మాధవ !"

ఇటువంటి దైవ స్తోత్రములు పాడుతూ పాడుతూ ఉండగా మీ గృహదేవతాస్త్రీలు రోటిలో రోకలితో ఆ సోమలతలను దంచి రసము తీస్తారు. ఆ రసమును ఒక అందమైన పాత్రలో ఉంచుతారు. మీ యజ్ఞకర్త సోమయాజి ఆ సోమరసమును త్రాగుతారు. అయితే ఒక గోధుమ గింజంత, పెసరగింజంత, మినపగింజంత, నువ్వుగింజంత ప్రమాణంగా సోమరసమును స్వీకరిస్తారు. వారి జీవిత భాగస్వామి కూడా అంతంత మాత్రంగానే స్వీకరిస్తారు. "అంతకు మించి సోమయాజి దంపతులు స్వీకరిస్తే అది సురాపానముతో సమానము".... అని వేదవేత్తల- యజ్ఞశాస్త్రపు విధాయక నిర్ణయము కదా!

## 36. దీక్ష

అటుపై సోమయాజి యజ్ఞదీక్షను ప్రారంభిస్తారు. మంత్రాలు - తంత్రాలు - హోమాలు - వేద పఠణం- బృందగానాలు - దేవతల స్తోత్రగానాలు - ప్రదక్షిణలు- సమర్పణలు - సంతర్పణలు ఇటువంటి అనేకానేక విశేషాలలో మహనీయుల పవిత్ర పాదస్పర్శతో, కార్యకర్తల సరంజామా కోసం చేసే పరుగులతో నేయి- గంధపు చెక్కలు - నూతన వస్త్రములు ఇత్యాది అగ్ని సమర్పిత కారణంగా జనించే పొగతో, మహా పండితుల వేద-వేదాంత శ్రవణ

సౌర్యాంశాలతో వేదశాల నిండిపోతుంది.

క్రమంగా ఆయా అనేక విశేషాలతో యజ్ఞమును పరిసమాప్తి చేస్తారు. అన్నదానాలు, వస్త్రదానాలు, సంబరాలు, మేళాలు, డప్పులు, సంభావనలు, తాంబూల-ఫలదానాలు, పుణ్యస్త్రీలకు పసుపు- కుంకుమ- రెవికల సమర్పణలు ఇత్యాదులన్నీ పెద్దపండుగగా జరుగుతాయి.

## 37. అవబృథ స్నానము

యజ్ఞము సంపూర్తి అయిన తరువాత సోమయాజి దంపతులు అవబృథ స్నానం చేస్తారు. అట్టి అవబృథ స్నానం అయ్యే వరకు యాగ దీక్ష కొనసాగుతూ ముగించబడుతుంది. యాగ దీక్ష ముగించబడేవరకు సోమయాజి దంపతులు, మంత్రవేత్తలు పరమశాంతి స్వభావము వహిస్తారు. అత్యంత భక్తి-శ్రద్ధ- ప్రపత్తులు కలిగిన వారై ఉంటారు. మనస్సును రోజు-రోజు యజ్ఞకార్యము నందే నియమించినవారై ఉంటారు.

యజ్ఞము చూడటానికి వచ్చిన వారినందరిని దేవతా స్వరూపులుగా భావిస్తూ వారి పాదపద్మములను విష్ణుపాదాలుగా దర్శిస్తూ ఉంటారు.

చివరి రోజు శక్తి కొలదీ ఆయా దానాలు - ధర్మాలు నిర్వర్తిస్తారు. శాంతి పాఠాలతో యజ్ఞము ముగించబడుతుంది. అదంతా బాగానే ఉన్నది కానీ, మహాశయా!

మీరు యజ్ఞవేదములో చెప్పినంతగా శాంతిని నిర్వర్తిస్తున్నారని అనుకుంటున్నారా చెప్పండి? ఎందుకంటారా?

"బలి ఇవ్వబడిన యజ్ఞపశువు (మేకపోతు) దేహముపై ఎన్ని వెంట్రుకలుంటే అంతమంది అతిథులకు మృష్టాన్నము సంతర్పణ చేయాలి".... అని గదా యాగసిద్ధాంతము!

అలా చేయకుండా.....,

కేవలము డంబము కొరకై బంధువులు - స్నేహితులు కొంతమందిని పిలచి అన్నదానం చేస్తే సరిపోతుందా? అడిగినవారందరికీ అన్నదానం చేయకపోతే, కొందరు వచ్చిన వారిని "వెళ్ళిరండి - వెళ్ళిరండి" అని త్రోలివేస్తే

యజ్ఞము దిగ్విజయమైనట్లా? కాదు. "అంత మందివస్తే అన్ని కులాలవారికి మేమెక్కడ అన్నదానం సంతర్పణ చేయగలం?".... అని మూతులు విరుచుకుంటూ వుంటే సరియా? అటువంటప్పుడు యజ్ఞము చేయకపోవటమే మంచిదేమో? ఊరుకుంటే పోలా?

యజ్ఞము ప్రారంభించిన తరువాత సంఖ్యాయుతంగా (మేకపోతు దేహముపైగల వెంట్రుకలంత మందికి) సకలకులాలకు సంతర్పణ చేయకపోతే ఏదో కొద్దిమందికి మాత్రమే సంతర్పణ చేసి ఊరుకుంటే, ఆతనిని 'కటిక సోమయాజి' అని పిలుస్తారు కదా!

**బ్రాహ్మణుడు :** ఓ పడతీ! నీవన్నది బాగానే ఉన్నది. కానీ, అసంఖ్యాకంగా సంతర్పణ చేయాలంటే మాటలా? అంతంత ద్రవ్యాలు సోమయాజి దగ్గర ఉండవద్దా చెప్పమ్మా!

**గొల్లభామ :** మరి! యజ్ఞము పేరుతో మేకపోతును చంపటానికి, జీవఘాతుకానికి వడికట్టటానికి మాత్రము సిద్ధమా? బాగుబాగు!

**బ్రాహ్మణుడు :** మేకపోతు శరీరంపై ఎన్ని వెంట్రుకలుంటే అంత మందికి మృష్టాన్నసమర్పణ చేయాలంటే ఇక దేవతలంతటి వారికి కూడా యజ్ఞములు చేయటం సాధ్యమయ్యేది కాదు. ఏతా-వాతా యజ్ఞములు మానమని నీ మాటలు సూచిస్తున్నాయి సుమా!

"సహస్రాధిక బ్రాహ్మణ మృష్టాన్న భోజన సమర్పణ" అనే మాట శాస్త్రములు వాడిన మాట నిజమేననుకో! అయితే శాస్త్రహృదయము, వేదముల ఉద్దేశ్యము జాగ్రత్తగా గమనించాలి తల్లీ!

అన్నిటికన్నా వేదమాత పట్ల, భక్తితో - ప్రేమగా యజ్ఞము నిర్వర్తించటము ముఖ్యము. అవునా? "పత్రం - పుష్పం - ఫలం - తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి!" అని కదా గీతావాక్యము! "శ్రేయాత్ ద్రవ్యమయాత్ యజ్ఞః జ్ఞానయజ్ఞమ్" అని కూడా కదా వాక్యము.

మేము యజ్ఞాలు నిర్వర్తిస్తాము. నిర్వర్తింపజేస్తాము. అయితే భగవంతుని స్మరిస్తూ, స్తోత్రాలు సమర్పిస్తూ, వేమంత్రాలు చదువుతూ యజ్ఞకార్యమును ఉపాసిస్తాము. మంత్రములు చదివేటప్పుడు, యజ్ఞక్రియలు

నిర్వర్తించేటప్పుడు మేము యజ్ఞభోక్తయగు విష్ణుభగవానుని పాదపద్మాలు సదా స్మరిస్తూ ఉంటాము. మనసా-వాచా విష్ణు తత్త్వాన్ని భావన చేస్తూ ఉంటాము. లోకహితైషులమై సర్వలోక నివాసుడు - సర్వతత్త్వ స్వరూపుడు, వేదపురుషుడు అగు విష్ణునామము సంకీర్తన చేస్తూ ఉంటాము.

భగవన్నామస్మరణ చేస్తూ నిర్వర్తిస్తున్న కర్మ కొంచమే అయినప్పటికీ, కొన్ని లోపాలు ఉన్నప్పటికీ ఆ విష్ణుభగవానుని కరుణచే తప్పక ఉత్తమఫలము ప్రాప్తిస్తుంది కదా!

ఆ విధంగా 'యజ్ఞము'ను జరిపింపజేసే వేదకోవిదులమగు మా కార్యక్రమములను దూషిస్తూ, మమ్ములను 'ఘాతకములు చేసేవారు' అని నిందిస్తావా? నిష్కారణమైన దూషణ మహాపాపమని నీకు తెలియదా? ఎందుకని "మీరు చేసేది ఘాతుకము" అని అంటున్నావో.... కాస్త చెప్పుతావా, భామారత్నమా!

**గొల్లభామ :** ఎందుకంటారా? ప్రకృతిచే పుట్టి- అవయవ సౌష్టవము - ఆయుష్షు ప్రసాదించబడిన నిండు ప్రాణి అయిన ఒక మేకపోతును మీరు 'యజ్ఞకార్యము' అనే పేరుతో బలవంతంగా త్రాళ్ళుకట్టి ఈడ్చుకునివచ్చి, ఆ మేకపోతు యొక్క నవరంధ్రాలు మూసి చంపటమా? దాని నాభి ప్రదేశాన్ని చురకత్తితో కోసి 'వప' (క్రొవ్వు-మాంసమును) బయటకు తీసి అగ్నిలో వ్రేల్చటమా?

ఇది దృష్టిలో పెట్టుకొని "ఘాతుకము కదా" అని మాటవరుసకు అన్నాను. అంతేకానీ, మహనీయులు - వేదవేదాంగవేత్తలు మిమ్ములను అకారణంగా దూషించాలని కాదు స్వామీ! మీరు చేసే ఆ పనులు ఘాతుకం కాదా? మీ దైవము ఘాతుకుడు కాడా?

**బ్రాహ్మణుడు :** అయ్యో! అయ్యో! ఎంతమాట అన్నావ్? మా దైవముకూడా ఘాతకుడా? అయినా, మాకొక దైవము, మీకొక దైవము, మరొకరికి మరొక దైవము ఉన్నారా? ఇంతకుముందు ఎవ్వరూ నాతో ఈ విధంగా కటువుగా మాట్లాడలేదు. తప్పు! తప్పు!

**గొల్లభామ :** స్వామీ! చెపుతాను వినండి. "అగ్నిర్దేవో ద్విజాతీనాం!".... అని

కదా శాస్త్ర ప్రశస్త వాక్యము! వేద ప్రతీతి! బ్రాహ్మణులకు అగ్నిదేవుడు ముఖ్యదైవము కదా!

అటువంటి మహితాత్ముడగు అగ్నిదేవుడు తన ఉష్ణత్వమునకు తగినట్లుగా.... సర్వప్రాణులకు భయమును కలిగించే ఒక సింహమును కోరుకోవచ్చునుకదా! లేదూ, చిన్న మృగములకు రాజుగా ప్రవర్తించే పెద్దపులిని అభిలషించవచ్చే? కాదా, "సర్వము హస్తిపదే మగ్నం" అనేవాక్యానుసారంగా సకల జంతు జాతులలోకెల్లా పెద్ద శరీరము గల ఏనుగును కావాలని అనుకో వచ్చు కదా! అట్లా కోరుకుంటున్నారా? లేదు. అవన్నిటినీ వదలివేసి మేకపోతు ను సమర్పించాలని ఎందుకు కోరుకోవటం? అది సాత్వికజంతువనియా? ఆ అమాయకమైన మేకపోతును చంపిస్తున్నారే? మరి మీ అగ్నిదేవుడు ఘాతకుడు కాడా? అయ్యా! సర్వజీవులపట్ల సమభావము కలిగినవారై మీరు నా మాటల గురించి కొంచము యోచించండి!

హే మహానుభావా! అటువంటి అమాయక జంతుహత్య చేసే యజ్ఞకోవిదుల కంటే కూడా బోయవాళ్లు - ఆటవికులు నయం కదా! 'సాత్విక ప్రాణులను మేము చంపము' అనన్నా అనుకుంటారు. పాపభీతి కలిగి ఉంటారు. ఇక మీరో? క్రూరమృగాలను ఏమీ చేయలేక, ఒక అమాయక-శాఖాహారియగు మేకపోతు జోలికే వెళ్ళుచున్నారేం?

**బ్రాహ్మణుడు** : మరి మాంసాహారులైన జనులు మేకలను చంపటము లేదా? యజ్ఞసమయంలో మాత్రమే కదా, మేము ఒక మేకపోతు జోలికిపోయేది?

**గొల్లభామ** : వాళ్ళంటే ఆహారము కొరకు అట్లా చేస్తున్నారు. మీరు ఆహారంగా స్వీకరిస్తున్నారా! లేదు. కొన్ని పెసరగింజలంత 'వప' కోసం ఆ మేకపోతును చంపి ప్రక్కన పారవేస్తున్నారే? అంతేకాదు, అస్పృశ్యదైవ స్వరూపుడు - పరమపవిత్రుడు అగు అగ్నిదేవునికి సమర్పిస్తున్నారు! మీరు తిని తృప్తి పొందినా ఫరవాలేదు. "స్వయం తీర్ణ: పరాంతారయతి" - మీరు తృప్తిగాతిని పది మందికి పెట్టటం ధర్మము. అదీ చేయటం లేదు. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అనే నీతి కూడా పాటించటం లేదు కదా!

ఇంకొక విషయం!

"పరోపకారార్థమ్ ఇదమ్ శరీరమ్" అని లోకానికి ప్రవచిస్తున్నది మహనీయులగు మీ విప్రులే కదా! అట్టువంటి మీరే హింసకు పాలుపడితే?

ఘోరమైన కర్మతో ప్రారంభమయ్యే కఠినమైన యజ్ఞకర్మను నిర్వర్తించి "మేము ఇప్పుడు సోమయాజులమయ్యాము. స్వర్గద్వారాలు మాకోసమై తెరుచుకొని ఉంటాయి" అని గర్వపడటం మీ వంటి సాత్విక మహాశయులకు ఉచితమా?

మరొక్క మాట!

మీరు మాకు కర్మ విశేషాలు బోధిస్తున్నారు. వినమ్రతతో ఆ విషయం కూడా, సందర్భం వచ్చినది కాబట్టి చెపుతాను. "మనము చేస్తున్న కర్మలు కామ - క్రోధ - లోభ - మోహ - మద - మాత్సర్యాలను జయించటానికి ఉపకరణాలు - సుమార్గాలు కావాలి. వృద్ధి కావటానికి కాదు. అందుకు భగవదర్పితంగా నిర్వర్తించాలి. భగవంతుని సంతోషింపజేస్తున్నవై ఉండాలి. సహజీవులందరికీ తండ్రి పరమాత్మయే కాబట్టి సహజీవులపై చూపే ప్రేమ - కరుణ - వాత్సల్యము - త్యాగము - ఓర్పు - క్షమ .... ఇవన్నీ పరమాత్మ సాన్నిహిత్యానికి త్రోవలను సుగమం చేస్తాయి"..... అని మీవంటి పెద్దలందరూ సర్వలోక జనులకు హితైషులై గుర్తు చేస్తున్నారు కదా! పరమాత్మకు సమర్పించగల నవనీత హృదయమును తీర్చిదిద్దే కర్మలు కదా మానవుని కడతేర్చేది! హింసతో కూడిన కర్మలు ప్రేమానందస్వరూపుడగు పరమాత్మకు మనలను దూరం చేయవా చెప్పండి?

అది అట్లా ఉంచగా......,

"ఇక యజ్ఞఫలం ఏ విధమైనది?" అనే విషయం పరిశీలిస్తే....,

అది ఇచ్చే ఫలము? స్వర్గలోక నివాసము. స్వర్గలోక సుఖాలు మానవలోకంలోని స్థితుల కంటే చాలా గొప్పవి అని చెప్పుకుంటూ ఉంటారు. కానీ, అవన్నీ దృశ్య-ఇంద్రియ సంబంధమైనవే కదా! పైగా కాలము చేత లభించి, కాలము చేత పోగొట్టుకోవలసినవే కదా!

శ్రీమత్ గీతావాణి ఈ విషయం నిర్మొహమాటంగా గుర్తు చేస్తోంది.

శ్లో॥ తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం,
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ॥

పుణ్యము క్షీణించగా, ఆ సోమయాజి అవన్నీ చేజార్చుకొని రిక్త హస్తాలతో తిరిగి మానవ లోకంలో దేహధారణ చేయవలసిందే కదా! "గతాగతమ్ కామ కామా లభంతి"! "రావటం - పోవటం.... ఇదే పని, కోరికలతో యజ్ఞాలు చేసేవారికి! ఏమి లాభం?" ... అని గీతాచార్యులు ప్రశ్నించారా? లేదా? ఆత్మజ్ఞుల ఆప్తవాక్యాలు మనం వినవలసిందే కదా!

## 38. సమీక్ష

యజ్ఞముల విషయమై నేనిప్పుడు ఏమేమి మీ ముందు మనవి చేయటం జరిగిందో.... అవి సమీక్షిస్తూ కొద్ది విషయాలు విన్నవిస్తాను.

(1) యజ్ఞము అందరూ చేయగలిగినవి కావు. సంపద - మంది - మార్బలము ఉన్నవారే అవి చేయగలుగుతారు.

(2) యజ్ఞవిధానమును గురించి వేద - వేదాంగ విధానాలన్నీ నూటికి నూరుపాళ్ళు పాటించటం చాలా వరకు అసాధ్యము - కొంత కొంత వరకే నిర్వర్తించగలము.

(3) అనేక రోజులుగా అనేక యత్నములు, నియమములు, నిష్ఠలు, శాస్త్రవిధానము తెలుసుకొని ఉండటం, ఇత్యాదులన్నీ సమకూరటం అంత తేలికైన పనులుకావు.

(4) యజ్ఞములో జీవహింస తప్పనిసరి ఘట్టం.

(5) యజ్ఞఫలమైన స్వర్గాదులు - ఆయా సుఖానుభవాలు కాలబద్ధము. కాలముతో వచ్చి - కాలముతో పోయేవే!

(6) ఇహ లోకంలో 'సోమయాజి' అనే బిరుదు, పేరు-ప్రతిష్ఠలు .... ఇవన్నీ స్వప్నసదృశమైన వస్తువులు.

(7) ఆత్మానుభవము - ఆత్మసాక్షాత్కారము ఆత్మజ్ఞానము వలన

లభిస్తుంది. ఆత్మానందమునకు అందరూ అర్హులే! అది సులభం కూడా! ఆత్మజ్ఞాన - ఆత్మానంద మార్గంలో ప్రేమ- సహజీవుల పట్ల దాక్షిణ్యము, వాత్సల్యము, లోక శ్రేయస్సు ఇవన్నీ అంతర్గతమై, స్వభావసిద్ధమై ఉంటాయి. కనుక భౌతికమైన పదార్థాలతో చేసే యజ్ఞము కంటే ఆత్మ యజ్ఞమే కొంత సులభము - శుభప్రదము - బహు ప్రయోజన కారకము.

**బ్రాహ్మణుడు :** ఓ లలనామణీ! నీవు చెప్పిన విషయాలన్నీ చర్చనీయాంశాలే! వాటిలో కొన్ని ఒప్పుకోదగినవే! మరికొన్ని ఒప్పుకోలేము.

యజ్ఞ - యాగ - హోమాదులు శాస్త్రములచే మానవజాతికి ప్రకృతి దేవోపాసనా రూపంగా ప్రసాదించబడ్డాయి. వేదములు ప్రబోధిస్తున్నాయి. అవి లోక ప్రసిద్ధాలు. వేదములు సృష్టికర్తయగు బ్రహ్మదేవుని ముఖకమలము నుండి బయల్వెడలుచున్నాయి. కనుక అందులోని కొన్ని విషయాలను - మనము తప్పుపట్టుకొని యజ్ఞదూషణ చేయటం మనిద్దరి పరిధి కాదు. "ఆర్య వ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబు" అని మనం అనుకోవటమే ఉచితము. శాస్త్రసదాచారాలను తప్పుపట్టుకోవటం ప్రారంభించి శాస్త్ర-ఆర్య ప్రవచిత మార్గాల గురించి వాదనలకుఉపక్రమిస్తే..... అప్పుడు శాస్త్రరక్షణ లేకపోవటం చేత లోకం ధర్మభ్రష్టమై, బలహీనులను బలవంతులచే బాధింపబడటానికి లోకానికి త్రోవ చూపినవారమవుతాము.

శ్లో॥ న బుద్ధి భేదం జనయేత్ అజ్ఞానం కర్మ సంగినామ్,
జోషయేత్ సర్వ కర్మాణి, విద్వాన్ యుక్త: సమాచరన్

ప్రతి కర్మలోను ఏదో ఒక దోషం ఉండనే ఉంటుంది.

విద్వాంసుడైనవాడు యక్త విచారణతో శాస్త్ర-లోకహిత కర్మలు నిర్వర్తిస్తూ పోవటమే ఉచితం.

కనుక **మనం యజ్ఞవిధానంలో ఆయా విశేషాలు తప్పు పట్టుకోవడానికి ఇక సిద్ధపడవద్దు.** శాస్త్రములు పెద్దలు చెప్పిన మార్గం అనుసరిద్దాం. విశాలమైన దృక్పథంతో-లోక కళ్యాణ దృష్టితో మన-మన శాస్త్ర ప్రవచిత మార్గాలు స్వీకరిద్దాం. సరేనా!

**గొల్లభామ :** అట్లాగే మహాత్మా! మీ ఆజ్ఞ నాకు శిరోధార్యము. స్తుతో మయా, వరదా, వేదమాతా!

★

**బ్రాహ్మణుడు :** ఇక నీవు చెప్పిన మరికొన్ని విశేషాలకు వద్దాము.

యజ్ఞ - యాగ - క్రతు - హోమములు - ఇత్యాదులు అందరికీ సుసాధ్యము కాదు. కష్టతరమై అనేక అంతర్గత వ్యవహార సరళితో కూడుకున్నవి.

యజ్ఞ హృదయ రహస్యమైన **ఆత్మయజ్ఞము** సర్వులకు సులభసాధ్యము.

ఎప్పుడైనా ఒకానొక సిద్ధాంతమును, విధి-విధానమును విమర్శనా పూర్వకంగా పూర్వపక్షంచేస్తున్నప్పుడు అంతకు మించిన మరొక త్రోవ (లేక) విధానమును ప్రతిపాదించగలగాలి. లోక జనుల ముందు పెట్టగలగాలి.

అంతేగానీ......,

ఒక విధానమును విమర్శించి ఊరుకునే వారి వలన లోకమునకు ప్రయోజనము ఉండదు. వారి దృష్టిలో ఏది ఉత్తమోత్తమమని వారు అనుకుంటున్నారో, అది లోకానికి చెప్పాలి కదా!

అందుచేత.....,

నీ దృష్టిలో భౌతికమైన పదార్థాలతో నిర్వర్తించే యజ్ఞముకన్నా కూడా ఉత్తమమైన ఆత్మయజ్ఞ విశేషమేదో.... అద్దాని గురించి ఇక చెప్పటము ప్రారంభించు. అప్పుడు సంతోషిస్తాము. తరతరాలకు శుభము కలుగుగాక!

## 39. ఆత్మయజ్ఞము-పరిచయ విశేషాలు

**గొల్లభామ :** ఓ విప్రమహాశయా! మీరు జ్ఞానులు. క్షమాగుణ సంపన్నులు. అందుచేతనే నేను యజ్ఞవిశేషాలలో ఒక్క చిన్న విషయం తీసుకొని "ఇది అనుచితం కదా!" అని చెప్పినా కూడా మీకు కోపం కూడా రాలేదు. పైగా, చెప్పేదంతా విని వాదోపవాదములు ప్రక్కన పెట్టి నాకు దోష నివృత్తి కలిగిం

చారు. అంతేకాకుండా, ఒకానొక ఉత్తమమైన 'ప్రశ్న'ను ప్రతిపాదించారు. నేను మీ దివ్యమైన ద్విజత్వాన్ని, విప్రత్వాన్ని, బ్రాహ్మణత్వాన్ని గమనించి నమస్కరిస్తున్నారు.

'ఆత్మయజ్ఞము' అనబడే మహత్తరమైన విశేషాన్ని ప్రకటించిన 'భాగవతము' మొదలైన గ్రంథరాజములకు, లోకమునకు ఆత్మజ్ఞానము గుర్తుచేస్తున్న సద్గురువులకు, భక్తమహాశయులకు నమస్కరిస్తూ....., 'ఆత్మయజ్ఞము' అనే విశేషాన్ని పెద్దలు చెప్పిన రీతిగా మననము చేస్తూ పలుకుచున్నాను. వినండి.

★

ఒకానొక రాజు తనయొక్క రాజసమును ప్రదర్శించటానికి ఒక మహారణ్యములో ప్రవేశించి, జనులను భయపెట్టుచూ సంచరించే సింహము - పులి మొదలైన క్రూర మృగములను వేటాడుతూ ఉంటాడు కదా!

అట్లాగే.....

'అంతరంగము' అనే మహారణ్యములో విచ్చలవిడిగా సంచారాలు చేస్తున్న కామము- క్రోధము మొదలైన క్రూరమృగాలను వేటాడటానికి ఈ జీవుడు ఎందుకు ప్రయత్నించరాదు చెప్పండి? అటువంటి అరిషట్ వర్గ పశువులను వశం చేసుకొని యజ్ఞభోక్త అయిన పరమాత్మకు సమర్పించే ప్రయత్నమే ఆత్మయజ్ఞమునకు నాందీ ప్రస్థావన!

## 40. అరిషట్ (6 - శత్రు) వర్గములు

**బ్రాహ్మణుడు :** 'అరిషట్ వర్గములు' అనగా ఏమిటో వివరించవమ్మా!

**గొల్లభామ :** ఆరు శత్రు వర్గములు ఈ జీవుని అంతరంగమునందు తిష్టవేసుకొని ఉంటున్నాయి. గుడారాలు కట్టుకొని నివసిస్తున్నాయి. ఈ జీవుని 'ఆత్మానుభూతి'కి అడ్డుగా నిలుస్తున్నాయి.

**(1) కామము :** "ఏదో కావాలి - ఇంకేదో పొందాలి. అప్పటిదాకా నాకు సుఖము లేదు కదా!" అనే ఆవేదనతో కూడిన ఆవేశము. "పొందవలసినదేదో ఇంకా పొందలేదు" అనే వాంఛారూపమైన అసంతృప్తి

- ఈ స్థలం కాదు... ఇంకేదో స్థలం పొందితేనే, వెళ్ళితేనే.... అక్కడ శాంతి!
- ఈ సంపదలు చాలవు! ఇంకేవో కావాలి.
- ఈ ఆశ్రమం కాదు! మరొక ఆశ్రమం కావాలి.
- మరెప్పటికో - ఎన్నడో - ఏదో చేస్తేనే గానీ సంతోషం లేదు.

ఇటువంటి భావావేశాలను 'కామము' అంటారు.

**(2) క్రోధము :** "పొందవలసినది పొందకుండా వాళ్ళు - వీళ్ళు నాకు అడ్డు" ..... అనే రూపముతో కూడిన కోపము. తనతప్పులు ప్రక్కనపెట్టి ఇతరుల తప్పులను ఎన్నటము, దూషించటము, ద్వేషించటము.

"తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు"

అనే మాట మరచి 'పరులు - నావారు' అనుకుంటూ అహంకరించటము.

**(3) లోభము :** 'నాది - నాది' అనుకుంటూ "నాకున్నది పోతుందేమో" అనే అనుమానము. భయము. "లాక్కునిపోతారేమో! అందుకే ఎవ్వరినీ నమ్మకూడదు".... అనే అనాత్మదృష్టి.

- ఈ దేహము నాది.
- ఈ బంధువులు నావారు. వారు పరాయివాళ్లు.
- ఈ సంపద నాది. నాకే ఉండాలి.
- ఈ నన్ను పొగిడేవాళ్ళు నా వాళ్ళు.

నా సంపద పోతుందేమో! నా ఈ గుర్తింపులు నన్ను వదులుతాయేమో?"

"అప్పుడు నాగతి?"..... ఇటువంటి గుణ-భావ-ఆవేశ సముదాయాలు.

**(4) మోహము :**

- లేనిది ఉన్నదనుకోవటము.
- ఉన్నది లేదనుకోవటము.
- ఇక్కడి పాంచభౌతిక రూపాల పట్ల 'సత్యమే' అనే భ్రమ. దేహాలను చూస్తూ సర్వదేహాలలోని సమరస స్వరూపుడగు 'దేహి'ని ఏమరచటం.

- కలలోని దృశ్యాలు - కథలోని సంఘటనలు వంటి ఈ జగత్ విశేషాల పట్ల మమకారము - అహంకారము పెంపొందించుకొని ఉండటము.

"ఈ దృశ్యములోని సంఘటనలు ఎవ్వరివల్లనో ఏర్పడి నన్ను దు:ఖింప జేస్తున్నాయి. చావు - పుట్టుకలే నా షరిధులు. నేను దృశ్యపరిమితుడను. దేహమునకు చెందిన వాడను. దేహములోని విభాగమును" .... ఇవన్నీ మోహము కల్పించే భ్రమ పరంపరలు.

**(5) మదము :** గర్వము. తనకు ఉన్నది - కలిగినది చూచుకొని గర్వము కలిగి ఉండటము. "నేనొక ప్రత్యేకమైన వాడిని - వారికంటే, వీరికంటే కూడా!" అనే లోక సంబంధమైన ఆత్మస్తుతి.

- నేను ధనవంతుడిని. బలవంతుడిని. తెలివి కలవాడిని. గొప్ప కులమువాడిని.
- మా జాతి - మాయింటిపేరు - మావారు - మా పిల్లలు అందరి వంటివారు కారు. నేను చేసే పనులు గొప్పవి.

..... ఇటువంటి వాటిని మననము చేస్తూ గర్వించటము.

**(6) మాత్సర్యము :** తనది చూచుకొని ఇతరులను ద్వేషించటము. పరనింద - పరహింస.

- నా గొప్పతనం నాది! నాకు చెప్పేవాడెవ్వడు? అని భావించి ఇతరులను లోకువ చేయటం.
- ఇతరులను బాధించటము. అవమానించటము. ద్వేషించటము. శారీరకంగానో- మానసికంగానో హింసించటము. దూషించటము.
- జాత్యహంకారము. మతాహంకారము.

ఈ విధంగా అరిషడ్వర్గాలు హృదయంలో ప్రవేశించి ఆత్మదృష్టిని ఏమరిపిస్తున్నాయి. కప్పివేస్తున్నాయి.

అవి స్నేహితులు కాదు. అంతర్ శత్రువులు.

"ఈ జీవునికి కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్యాలు"-పైకి మిత్రులుగా కనిపిస్తాయి."ప్రారంభే అమృత మివ-పరిణామో విషమో భవతి," - అన్నట్లుగా.

ఓ బ్రాహ్మణోత్తమా! హృదయంలో ప్రవేశించి కాపురముంటున్న ఈ అరిషట్ వర్గాలను పట్టుకొని బలిఇవ్వాలి. అంతేకానీ అమాయకమైన బాహ్యాజంతువును బలి ఇస్తే సరిపోతుందా?

**బ్రాహ్మణుడు :** ఓహోహో! హృదయారణ్యములో ప్రవేశించే - సంచరించే అరిషట్ వర్గాలను ఆత్మభగవానునికి బలిఇచ్చి ప్రసన్నం చేసుకోవాలా? బాగున్నది. ఈ అరిషట్ వర్గాలు ఎట్లా రూపుదిద్దుకుంటున్నాయో, ఆ విశేషాలు మరికొన్ని వివరించి చెప్పు!

**గొల్లభామ :** ఈ శరీరి ఆత్మత్వమునకు ప్రయత్నించాలి గానీ, 'ఇంద్రియ విషయములు' అనే పశువులకు కాపలాదారుడు మాత్రమే అయి మానవ జన్మను వృధా చేసుకోకూడదు.

"పశువుల కాపరికేల పరతత్త్వబోధ"

అని పెద్దలచే అనిపించుకోవటము ఉచితము కాదు!

స్వతఃగా సహజంగా "ఆత్మస్వరూపుడే" అయి ఉన్న ఈ జీవుని స్వకీయమైన అవిచారణయే ఇంద్రియబద్ధుని చేస్తున్నాయి. ఈ జీవుని పట్ల అల్పత్వము కల్పిస్తున్న ఇంద్రియ మృగాల గురించి, ఇంద్రియ విషయమేఘాల గురించి వేదాంత శాస్త్రము ఎట్లా గుర్తుచేస్తూ విశ్లేషిస్తూ వివరిస్తోందో .... అది చెప్పుచున్నాను. వినండి.

ఈ దేహవిశేషాలు ఈ విధంగా ఉంటున్నాయి.

## 41. క్షేత్ర విభాగములు

**(1) పంచ జ్ఞానేంద్రియాలు :**

| | |
|---|---|
| చర్మము | (త్వక్కు) |
| కళ్ళు | (చక్షువులు) |
| చెవులు | (శ్రోత్రము) |

నాలుక (జిహ్వ)

ముక్కు (ఘ్రాణము)

**(2) పంచ కర్మేంద్రియాలు :**

వాక్కు (మాట్లాడటం)

పాణి (చేతులు - చేతలు)

పాదము (నడక - ప్రవర్తనము)

పాయువు (మల విసర్జనావయవము)

ఉపస్థ (మూత్ర విసర్జనావయవము - కామావయవము)

**(3) పంచజ్ఞానేంద్రియ విషయములు :**

శబ్దము

స్పర్శ

రూపము

రసము

గంధము

**(4) పంచ కర్మేంద్రియ విషయములు:**

వచనము

దానము

గమనము

విసర్జనము

ఆనందము

**(5) పంచవాయువులు :**

ప్రాణము

అపానము

వ్యానము

ఉదానము

సమానము

**(6) అంతరంగ చతుష్టయం :**

మనస్సు
బుద్ధి
చిత్తము
అహంకారము

'ఇంద్రియారణ్యము' అనే స్థానములో భావనారూపమైన ఈ 29 వ్యవహారిక అనుభవ మృగాలు సంచరిస్తున్నాయి - అని పెద్దలు 'సంసారము' గురించి విభజించి - విశ్లేషించి చెప్పుచున్నారు.

## 42. మహాద్భుత సంసార వృక్షము-సంసార అరణ్యము

**'(భాగవతము' (దశమ స్కంధము)లో చెప్పబడిన "సంసార వృక్షము' యొక్క అభివర్ణన)**

- ఈ సృష్టిలో **"సంసారము"** అనే వృక్షము ఒకటున్నది.
- ఆ వృక్షము యొక్క పాదు **"ప్రకృతి"**.
- **సత్త్వము - రజము - తమము** ఆసంసారము యొక్క 3వేళ్ళు.
- "ధర్మము - అర్థము - కామము - మోక్షము'' అనే **4** పురుషార్థాలు సంసార వృక్షము యొక్క రసాలు.
- **"శబ్దము - స్పర్శ - రూపము (రసము)- రుచి - గంధము"** ఆ సంసారము యొక్క ఇంద్రియాలు గ్రహించే '5' విధానాలు - విశేషాలు (ఇంద్రియార్థాలు).
- **కామ - క్రోధ - లోభ - మోహ - మద - మాత్సర్యాలు** అనే '6' ఆ సంసార వృక్షము యొక్క బహువిస్తరించి యున్న కాండములు.
- **ఆకలి - దప్పిక - శోకము - మోహము - ముసలితనము - మరణము** ఆ సంసార వృక్షము యొక్క షట్ ఊర్ములు. ఊడలు.
- **సంసార వృక్షమునకు '7' ధాతువులు అవి - రసము- రక్తము - మాంసము-మేధస్సు- అస్థి (బొమికలు) మజ్జ (కొవ్వు) - శుక్రము**
- **పంచభూతములు - మనస్సు - బుద్ధి - అహంకారము** ఆ సంసారవృక్షముల యొక్క కొమ్మలు - ఉపకొమ్మలు.
- **కన్నులు (2), చెవులు(2), ముక్కుపుటాలు(2), నోరు(1),**

**మల-మూత్ర ద్వారాలు(2)...** ఈ తొమ్మిది ఆ సంసార వృక్షము యొక్క నవరంధ్రాలు.

- ఆ వృక్షము యొక్క

**పంచప్రాణములు** : ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము.

**పంచ ఉపప్రాణములు:** నాగము - కూర్మము - కృకరము - దేవ దత్తము - ధనంజయము.

రెండు పక్షులు ఆ సంసార వృక్షముపై సుదీర్ఘకాలముగా నివాసముంటున్నాయి. అవి

**(1) ఈశ్వరుడు** : మౌనముగా, దృశ్యమునకు సాక్షిగా, అతీతుడుగా చూస్తూ ఉన్నాడు. ద్రష్టను సందర్శిస్తూ ఉన్నాడు.

**(2) జీవుడు** : శబ్దాలు - సంచారాలు చేస్తున్నాడు. విషయలీనుడై ఉంటున్నాడు. ద్రష్ట - దృశ్యాంతర్విభాగి.

ఇటువంటి మహాద్భుతమైన సంసారవృక్షాన్ని పుట్టించి - పరిపోషించి - రక్షించి - ఎప్పుడో నశింపజేయువాడు ఆ పరమాత్మయే! శ్రీకృష్ణభగవానుడే! (భాగవతము).

వింటున్నారు కదా బ్రాహ్మణోత్తమా! 'అంతరంగము' అనే మహారణ్యములో మనం ఇప్పుడు చెప్పుకున్న సంసార వన్య మృగాలు విచ్చలవిడిగా సంచారాలు చేస్తూ ఈ జీవుని నిబద్ధునిగా చేసి ఉంచుతున్నాయి.

ఈ జీవుడు అట్టి సంసారాణ్యములో ఒక్కచోట కూడా నిలువలేక పోతున్నాడు. లోన ఉండలేకపోతున్నాడు. బయటకు రాలేకపోతున్నాడు.

అటువంటి ఇంద్రియమృగాలను ఏదో ఉపాయంతో ఒక్కచోటికి తెచ్చి అటు-ఇటు తిరుగాడకుండా కట్టి ఉంచాలి. ఎట్లా?

ఒకానొక గంటచప్పుడు వినిపిస్తేగానీ, అవన్నీ ఒకచోట నిలువవు!

# 43. బ్రహ్మ బిలము - గంటానాదము

బ్రాహ్మణుడు : జీవులమగు మన హృదయారణ్యములో అనుక్షణము భయంకరగర్జనలతో విచ్చలవిడిగా సంచారాలు చేస్తూ క్రూరాతిక్రూరంగా మనకు ఎంతో భయమును-ఉద్వేగమును - దేహముల, దేహదశల పరంపరలను కల్పిస్తున్న - ఆ ఇంద్రియమృగాల విచ్చలవిడి సంచారాలను ఆపాలి.

**"గొల్లవారమూ ..... సద్గురు కృపచే పాలవారము .... చీకటనియే ఏ కోనలోన ..... చిట్టడవిలో మేసే పసువుల ..... చిత్తమందు దొడ్డికట్టి చెదరకుండా తాయారునచే గొల్లవారము!"**

అని మీ గొల్లవారు పాడుతారు కదా! సరే! సరే! ఇప్పుడు, చెప్పు! ఆ నీవు చెప్పిన 29 ఇంద్రియ మృగాలను ఒక్కచోటికి ఆకర్షించి తీసుకురాగల 'గంటానాదము' ఏది?

గొల్లభామ : అయ్యగారూ! వినండి! అప్రమేయ - పర - ఆనంద - అఖండాత్మయే ఈ జీవుని **సహజ స్వరూపము** కదా! ఇక 'జీవుడు' అనునదో? **'సందర్భ స్వరూపము'** అని అనవచ్చు.

'సంసారబంధము - దు:ఖము'నకు మూలకారణము ఏమిటి?.... అనే విషయము మహనీయులు పరిశీలించారు.

- "ఇంద్రియ విషయముల పట్ల జన్మ-జన్మలుగా ఏర్పడిన దృష్టియే - ధ్యాసయే సంసారారణ్యమును స్వప్న సదృశముగా - కల్పన చేస్తోంది!" అని గమనించారు.

కనుబొమ్మల నుండి బయల్వెడలే "చూపు(ధ్యాస)" అనే బాణమును అంతరంగము వైపుగా సంధించాలి! ఏ మాత్రము తాత్సారము చేయకుండా, బద్ధకమును వదలి 'చూపు' (లేక) 'ధ్యాస'ను నట్టనడిమిస్థానము వైపుగా మరల్చాలి.

బ్రాహ్మణుడు : నట్టనడిమిస్థానమా? అది ఏమి? ఎక్కడున్నది? వివరించవూ, భామామణీ!

గొల్లభామ : అవును! ఆ నట్టనడిమి స్థానము అత్యంత ఆశ్చర్యముగా

నిర్మించబడిన ఈ భౌతిక దేహములోనే ఏర్పడినదై ఉన్నది. వినండి.

ఈ దేహములో 'శక్తి ప్రవాహములు' అనదగిన రెండు ముఖ్య నాడులు రైలు పట్టాలవలె విస్తరించినవై ఉన్నాయి. "ఇడ, పింగళ"

కుడివైపునాడిని ..... 'ఇడ' అంటారు.
ఎడమవైపు నాడిని ..... 'పింగళ' అంటున్నారు.

ఇవి రెండు శక్తి ప్రవాహాలు. అటువంటి ఇడ-పింగళ అనబడే శక్తి రూప నాడీ ప్రవాహాల మధ్యగా మరొక 'సూక్ష్మనాడి' మహత్తరశక్తి రూపమై వెలుగొందుతోంది!

దానినే కొందరు "సుషుమ్నానాడి" అని అంటారు. మరికొందరు "బ్రహ్మనాడి" అనికూడా అంటున్నారు. ఈ విధంగా ఈ దేహాంతర్గతమైన సుషుమ్నానాడి గురించి దేహతత్త్వాన్ని గమనించినట్టి పండితులు - యోగేశ్వరులు మనందరికి గుర్తు చేస్తున్నారు.

ఆ సుషుమ్నానాడికి ఊర్ధ్వముగా చివరి భాగముగా అగ్రస్థానములో ఒకానొక 'బిలము' వంటి మహాశక్తి స్థానము ఉన్నది. దానిని 'బ్రహ్మబిలము', 'సుషిరగమ్' అని యోగశాస్త్రము పేర్లు పెట్టింది. అదియే 'మోక్షద్వారము' అని కూడా వర్ణించబడింది! ఒకానొక చమత్కారమేమిటో వినండి!
"సుషిరగమ్ సూక్ష్మమ్-తస్మిన్ సర్వము ప్రతిష్ఠితమ్ !" - మంత్ర పుష్పం.

"ఆ బ్రహ్మబిలము (లేక) సుషిరగము లేక మోక్షస్థానము నందే ఈ బ్రహ్మాండమంతా ఏర్పడినదై ఉన్నది."

అనగా.....,

ఈ సూర్య - చంద్ర - అగ్ని - దిక్పాలక - భూతగణ - సముద్ర - పర్వత-దేవ-దానవ-మానవ-జంతుఇత్యాదులతో కూడి తెలియబడునదంతా కూడా (లేక) బ్రహ్మాండమంతా కూడా ఆ బ్రహ్మబిలమునందే కల్పితమైన ఉనికిని కలిగియున్నది.

**అటువంటి.... "బ్రహ్మనాడి - బ్రహ్మబిలము" లోనికి 'చూపు - ధ్యాస' అనే బాణమును బుద్ధితో సంధించి వదలాలి.**

ఆ విధంగా 'అవిషయము - అనాహతము' అని యోగపుంగవులు వర్ణించి చెప్పే బ్రహ్మబిలము లోనికి లోచూపు (లేక) అంతర్ధ్యాస ప్రవేశము చేస్తూ ఉండగా ఒకానొక "నాదము" బుద్ధికి వినబడుతూ ఉంటుంది. ఎడతెగకుండా వినబడుతూ అనుభూతమౌతూ ఉంటుంది.

**బ్రాహ్మణుడు :** అట్లాగా? ఏమిటి ఆ నాదము? దయచేసి విశదీకరించు!

**గొల్లభామ :** ఆ నాదము మాటలలో చెప్పాలనుకుంటే 'గొప్పవిశేషము గురించి చిన్న సంజ్ఞావర్ణన' మాత్రమే అవుతుంది. అది "అనుభవైకవేద్యము" అని యోగులంతా చెప్పేదే కదా!

అయినా కూడా.....,

గొప్ప అనుభూతికి దారి తీయగలిగినది - చిన్న ఉపకరణము అగు ఈనోటితో చెప్పుకునే మాటలే కదా! భాషయే కదా! అందుచేత ఆ నాదము గురించి భాషాయుక్తముగా, సంజ్ఞామాత్రముగా చెప్పటానికి ప్రయత్నము చేస్తున్నాను. వినండి!

అది తెంపులేని తైలధార వంటిది.

"ఓ ...... మ్...... మ్........"

అని పెద్ద గంటానాదము వలె ఎడత్రెగకుండా మ్రోగుతూ ఉంటుంది.

ఆ విధంగా ధ్యాస బ్రహ్మబిలములో ప్రవేశిస్తూ ఉండగా వినబడే - ఆస్వాదించబడే అనుభవమయ్యే ప్రణవ నాదము దశ (10) విధములైన ప్రణవ నాదములతో అత్యంత శ్రేష్ఠమైనది.

**బ్రాహ్మణుడు :** ఓహో! ఆశ్చర్యము! దశవిధములైన ప్రణవముల కంటే అత్యంత విశేషమైనదా! ఏదీ! దశవిధ (10 రకాల) ప్రణవములు అనగా? సందర్భం వచ్చింది కనుక - దయచేసి చెప్పు!

## 44 దశ విధ ప్రణవనాదోపాసనలు

**గొల్లభామ :** 10 విధములైన ప్రణవనాదము యోగవక్తలు ఎట్లా వర్ణిస్తున్నారో.... చెపుతాను, దయతో వినండి!

(1) **ఉచ్ఛారణ ప్రణవోపాసన :** పెదవులతో ఉచ్ఛరించే "ఓ.....మ్మ్" కారము.

(2) **శ్రవణ ప్రణవోపాసన :** మనస్సుతో 'ఓం' శబ్దభావన కల్పించుకొని చెవులతో స్రవంతిగా వినే 'ఓ....మ్మ్'కారము.

(3) **నయన ప్రణవోపాసన :** కనులతో 'ఓం' ను ఆకార సహితంగా అక్షర రూపంగా చూస్తూ ఆస్వాదించే 'ఓ....మ్' కారము. దృశ్యమంతా 'ఓం' కార భౌతికరూపంగా చూడటం.

(4) **స్పర్శా-ప్రణవోపాసన :** చేతుల వద్ద - తదితర నడుము - హృదయము మొదలైన ప్రదేశాలలో యోగులు స్పర్శా అనుభవమును ఓం కారముగా భావించి ఉత్సాహపరచి అనుభూతము చేసుకునే 'ఓ...మ్' కారము.

(5) **శ్వాస ప్రణవోపాసన :** ఉచ్ఛ్వాస - నిశ్వాసలను ఉద్దేశ్యపూర్వకంగా - అనుక్షణికంగా నిర్వర్తిస్తూ ఓంకార శబ్దరూపాన్ని ఊపిరితో జోడించి నిర్వర్తించే 'ఓ....మ్'కారము.

(6) **కేవలీ భావనా ప్రణవోపాసన :** కనులు మూసుకొని "స్పర్శాన్ కృత్వా బహిర్ బాహ్యాన్" అనే విధంగా, బయట విషయాలన్నీ బయటనే వదలి - ఊహాసదృశమైన - స్వప్న సదృశమనదగిన ఈ దృశ్యమును 'ఓం' తత్వ రూపమగు ఒకానొక భావనా తరంగముగా నిరింద్రియంగా (ఇందియాలకు సంబంధము లేకుండా) ఆస్వాదిస్తూ - అనుభూతం చేసుకునే 'ఓ....మ్'కారము.

(7) **బుద్ధి ప్రణవోపాసన :** బుద్ధిని ఓంకార తత్త్వముగా - ఇష్టదైవము యొక్క పఠములాగా మరొక బుద్ధి విభాగంతో ప్రణవరూపంగా (బుద్ధితో) సందర్శిస్తూ బుద్ధితో ఓంకారనాదమును ఆస్వాదించటము.

(8) **చిత్త - ప్రణవోపాసన :** స్వకీయమై చిత్త - అహంకారములను బాహ్యా సాధనవస్తువులవలె, ఉపాసనా రూపములుగా భావనచేస్తూ ఓంకార నాదానుభవములో లయము చేసి అనుభూతము చేసుకోవటము.

**(9)** **తపో ప్రణవోపాసన :** తపస్సు చేస్తూ క్రమంగా తపస్సుచే రూపు దిద్దుకునే బుద్ధి యొక్క ఏకాగ్రతచేత ఊర్ధ్వలోకాల రూపంలో వినబడే - అనుభూతమయ్యే రూప-మనో బుద్ధులను వాటి విషయాలను ఓంకార రూపంగా చూడటం. ఓంకారనాద తత్త్వాలను మౌనంగా బుద్ధితో ఆస్వాదించటం.

**(10)** **త్రయీ ఏక ఓంకారోపాసన :** ద్రష్ట - దృశ్యము దర్శనములను ఏక రూప భావన చేస్తూ, బ్రహ్మాండములన్నీ స్వకీయ శబ్దబ్రహ్మభావనా చమత్కారంగా ఉపాసిస్తూ - సందర్శించే ఓంకారాభ్యాసము.

**ఈ 10వదే బ్రహ్మబిలోద్భవమైన ఉత్కృష్టమైన ఓంకారోపాసనగా వర్ణించబడుతోంది.**

ఓ విప్రోత్తమా! అటువంటి బ్రహ్మబిలదశమ ఓంకారనాదాన్ని బుద్ధి యొక్క ఏకాగ్రత చేత వినుచుండగా....., **ఇక మనం వర్ణించి చెప్పుకున్న 29 ఇంద్రియ మృగములు తమయొక్క దృశ్యసంబంధమైన - లోకసంబంధమైన వ్యాపారములన్నీ అధిగమించినవై ఉంటాయి. దివ్యత్వాన్ని సంతరించుకున్నవై ఉంటాయి.**

స్వామీ! ఆ సమయంలో ఒకానొక ఆత్మసంబంధమైన దివ్య-పరం జ్యోతి అనుభవ సిద్ధమగుచున్నది. ఆ జ్యోతి (1) దృశ్యమును చూస్తున్న మనస్సును (2) మనోసందర్శన చమత్కారమైన దృశ్యవ్యవహారమును ఈ రెండింటినీ కూడా తనయందు లయింపజేసుకొన్నదై ప్రకాశమానమగుచున్నది. అనగా, సర్వసహజీవులు అట్టి దివ్యజ్యోతి స్వరూపులుగా అనుభూతమౌతారు.

ఓ విప్రమహాశయా! ఈ లోకంలో విషయసంబంధము - బాంధవ్యములతో సంచారాలు చేస్తున్న మనస్సు మనము వర్ణించి చెప్పుకున్న 'పరంజ్యోతిరసము'ను పొందని కారణంగా - ఏదేది ఎక్కడెక్కడ పొందినా కూడా - తనయొక్క అతిదీనత్వమును వదిలించుకోలేక పోతున్నది. అటువంటి మనస్సు యొక్క దీనస్థితులు ఏ ఏ రీతులుగా ఉంటాయో ఒకటి రెండు విషయాలు ఇక్కడ ప్రస్తావిస్తాను.

ఈ మనస్సు ఒక మదించిన ఏనుగులాగా "శబ్దము - స్పర్శ - రూపము - రసము - గంధము" అనబడే ప్రపంచము (The Combination of Subtre '5') (లేక) ఇంద్రియ విషయారణ్యములో సంచారాలు చేస్తోంది. ఈ జీవునకు అల్ప సమాచారాలు - అసంఖ్యాక వేదనలు తెచ్చిపెడుతోంది.

అటువంటి మనస్సును మునుముందుగా బంధించాలి.

## 45. మనో నిగ్రహము

**బ్రాహ్మణుడు :** "మనస్సును బంధించటము" - అంటే?

**గొల్లభామ :** మనస్సును (లేక) మననము అనే స్వభావము (లేక) అలవాటును ఇంద్రియ/ దృశ్యవిషయముల నుండి వెనుకకు మరల్చాలి. "ఒక విషయము - ఆ తరువాత మరొక విషయము" ఈ విధంగా అనుక్షణికంగా చంచలమును పొందుతున్న మనస్సును కదలకుండా బంధించాలి. అత్యంత మెళుకువతో, 'శ్రద్ధ'తో మనస్సును నిశ్చలము - నిర్విషయము చేయకపోతే అది ఎన్నటికీ సుషుమ్నానాడి యొక్క ఊర్ధ్వస్థానమగు బ్రహ్మనాడిలో వినబడే 'నాద బ్రహ్మము' విననీయదు. అటువైపు ధ్యాసను వెళ్ళనీయదు.

గాలివీస్తూ ఉంటే దీపము చంచలము పొందుతూ ఉంటుంది కదా! అప్పుడేమి చేస్తాము? గాలి తీవ్రత దీపమును తాకకుండా గది తలుపులను - కిటికీలను మూసివేస్తాము కదా!

**బ్రాహ్మణుడు :** అవును! గాలిలో దీపం వంటిదే ఈ మనస్సు. మరి మనో చాంచల్యమును నిరోధించటము ఎట్లా? మనోగజాన్ని సంసారారణ్యములో పిచ్చిపిచ్చి పరుగులు తీయకుండా కట్టి ఉంచటం ఏ విధంగా?

**గొల్లభామ :** అయ్యా! ఈ ప్రపంచంలో ఏ విషయములోనైనా సరే... ఒకానొక ప్రావీణ్యత సంపాదించుకోవాలంటే ఏమి చేయాలి? ఓర్పు-నేర్పుతో కూడిన అభ్యాసమే శరణ్యము. ఉత్తమమైన సాధన-ధారణచేతనే కదా తమరు అనర్గళంగా వేదమంత్రాలు - వేదనాదము మాకందరికి వినిపించగలుగుచున్నారు !

దైనందికమైన అభ్యాసము చేతనే నేను కూడా ఈ మూడు పాలు

- పెరుగు - వెన్న పాత్రలను తలపై ధరించి దూరదూరగ్రామాల వీధుల్లో వేగంగా నడుస్తూ మా గోపబాలక వృత్తిని నిర్వర్తించగలుగుచున్నాను!

అట్లాగే.....,

ఓర్పు నేర్పులతో కూడిన అభ్యాసముచేత, ధారణాయోగము చేత క్రమక్రమంగా ఈ మనస్సును నిరోధించవచ్చు. అనగా, జగత్ సంబంధమైన భావావేశపరంపరలను ఏకాగ్రతయొక్క అభ్యాసము చేత తప్పక జయించవచ్చు!

"అభ్యాసేనతు, కాంతేయ! వైరాగ్యేనచ గుహ్యతే!" అని గీతా గోవిందుడు మనందరికీ గుర్తుచేయటం లేదా?

(1) ధారణ
(2) విచారణ
(3) వివేచన

**మనస్సు అనే ఏనుగును.......,**

జప... - తపము - అవతార మహిమల పఠణము - నామ సంకీర్తనము ఇత్యాది కార్యక్రమముల సహాయంతో ధ్యాసను పవిత్రం చేసుకొనుచుండగా రూపుదిద్దుకోగల **'ధారణయోగము'** అనే త్రాటితో.....,

సద్గురువులు బోధించే **"తత్ త్వమ్ అసి"** అనే అర్థాన్ని నిర్ద్వంద్వముగా ఎలుగెత్తి చెప్పే **'తత్త్వార్థవాక్యము'** అనే అంకుశముతో.....,

**"దృశ్యరూపభావన - దృశ్యావేశము - దృశ్యతాదాప్యము"** అనే **మస్తకముపై పొడుస్తూ.....,**

**నిశ్చలజ్ఞానము - సదాశివజ్ఞానము** (మాయలో ఉన్నా - మాయా తీతుడైనా జీవుని సహజరూపమే పరమశివత్వమే - అనే జ్ఞానము) అనే **బుద్ధిత్రాడుతో ......,**

క్రమంగా ఈ **'మనస్సు'** అనే ఏనుగును **'కేవల సాక్షిత్వము'** అనే కట్టుకొయ్య దగ్గరకు తీసుకొనిపోవాలి.

క్రమంగా ఈ మనోగజమునకు - ఒక నటుడు తాను నటించేటప్పుడు

తన పాత్ర యొక్క అలంకారాలకు - స్వభావాలకు సాక్షిగానే ఉంటున్నట్లుగా - చెదరని **కేవల - సాక్షిత్వమును** అభ్యసింపజేయాలి.

**"నేను మనస్సుకు ఆవల ఆలోచన - ఆలోచనల మధ్య ఏర్పడి ఉంటున్నట్టి మనో_తీతమైన అఖండ - శాశ్వత - ఆనందరూపుడనే కదా! ఈ దృశ్యమునకు అప్రమేయుడనే కదా!"**..... అనే అమనస్కము సహాయంతో.....,

**'పరబ్రహ్మతత్త్వము'** అనే ఆహారమును ఈ మనస్సు అనే ఏనుగు స్వీకరించునట్లు చేయాలి.

"మట్టితో తయారైన అనేక మట్టి బొమ్మలలో ఆకారాలు - కథా విశేషాలు సత్యమా? కాదు. "మృత్తికేవ సత్యమ్". మట్టియే సత్యము! అట్లాగే **"ఈ కళ్ళకు కనబడే నామ - రూపాత్మకమైనదంతా సర్వాత్మకమగు పరబ్రహ్మ తత్వమే!"** అనే సుధా (తేనె - అమృతము) జలముతో మనోగజము యొక్క దాహమును తీర్చాలి. మనస్సు తో అనుక్షణికంగా - అన్ని వేళల - అన్ని సందర్భములందు **"ఇదంతా పరమాత్మయొక్క ప్రత్యక్ష రూప విశేషమే"**... అనే ఎరుకను మనో గజమునకు నేర్పాలి.

ఆపై ఇక ఈ జీవుడు....., సర్వాత్మకుడై, ఇహస్వరూపాతీతుడై, పరస్వరూపుడై, "జాగ్రత్-స్వప్న-సుషుప్తులకు కేవలీద్రష్ట స్వరూపుడై, 14లోక విశేషాలకు **కేవలసాక్షి**".... అనే **జ్యోతి స్వరూపుడై** వెలుగొందాలి.

## 46.ఆత్మ యజ్ఞోపాసన - ఆవశ్యకత

ఓ అయ్యవారూ!

అటువంటి ఆత్మానుభూతికి మనస్సును సంసిద్ధము చేసే ప్రయత్నము చేయాలా? అఖర్లేదా? అదే ఆత్మయజ్ఞము కదా!

అటువంటి **'ఆత్మయజ్ఞము'**ను ఏమరిచి ......,

ఏవేవో కొన్ని వస్తు సముదాయములను సంపాదించి తెచ్చి ఒకచోటికి జేర్చి "సాత్వికమూగ జీవి యగు ఒక మేకపోతు యొక్క నవనాడులను మూయుటము"తో ప్రారంభించి, కొన్ని వస్తువులను అగ్నిలో వ్రేల్చి, కొన్ని కార్యక్ర

మములు నిర్వర్తిస్తూ "సర్వాత్మకుడగు హరి"ని మననం చేయకుండా "మేము సోమయాజులమయ్యాము" అని అనుకున్నంత మాత్రము చేత అది నిత్యానంద స్వరూపమగు 'ఆత్మ సాక్షాత్కారము'తో సరిసమానమౌతుందా, చెప్పండి?

- మనస్సును నిలువరించటము ఎట్లాగో యోచించక....,
- మనస్సును నిరోధించటము చేతగాక......,
- క్షణక్షణం రూపుదిద్దుకుంటున్న దృశ్యతాదాత్మ్యమును, సంకల్ప - వికల్పములను ఎట్లా జయించివేయాలో గమనించక....,

ఏవేవో కొన్ని పండిత సంజ్ఞ కలిగిన దుస్తులు ధరించి కొన్ని కొన్ని రోజులు కొన్ని యజ్ఞ కార్యక్రమములు నిర్వర్తించినంత మాత్రముచేత సంసారజాడ్యము - భేదదృష్టి తొలగుతాయా? **లేదే!**

అందుకే అవన్నీ కూడా సర్వము ఆత్మతత్త్వముగా సందర్శించే ప్రయత్నంలో విభాగం - అవుతూ ఉండాలి. అవి ఆత్మతృప్తిని ప్రస్ఫుటం చేసుకొనే ప్రయత్నంగా వేదాంగాలు ఉద్దేశ్యిస్తున్నాయనునది ఉపనిషత్హృదయం కదయ్యా!

విజ్ఞాన దృష్టి - సర్వాత్మకమైన భావనలను ఆశయంగా కలిగి ఆత్మ యజ్ఞము నిర్వర్తించేవారే... నిజమైన సోమయాజులు! యజ్ఞకోవిదులు! వేదవిదులు! విప్రులు! ....కదా!

స్వామీ మరొక్కసారి సమీక్షిస్తూ గుర్తు చేస్తున్నాను.

- ఇడ-పింగళ నాడుల మధ్య
- తెంపులేని శక్తిస్రవంతివలె ఊర్ధ్వంగా ప్రవహిస్తున్న
- 'సుషుమ్నానాడి' ని గమనించి.....,
- అద్దానితో ధ్యాసను మమేకము చేస్తూ....,
- ఊర్ధ్వముఖముగా సహస్రారాన్ని తాకి ఉంటున్నట్టి బ్రహ్మరంధ్రాన్ని (లేక) బ్రహ్మబిలాన్ని సమీపించాలి.
- ఆ బ్రహ్మబిలములోనే సర్వలోకాలు ఉన్నట్లు గమనించాలి!
- అట్టి బ్రహ్మాండాలకు ఆధారమైన స్వకీయ బ్రహ్మత్వాన్ని వీక్షించాలి!
- 'ఓంకారము' అనబడే అనుక్షణికమైన 'ఘంటానాదము' అనే నిశ్శబ్ద

శబ్దములో - మంచుగడ్డను చల్లని నీటిలో వేసి కరిగించునట్లు, ఉప్పుబొమ్మను సముద్రజలంలో లయింపజేసినట్లు - ఈ లౌకిక మనస్సును లయింపజేయాలి.

- లౌకికాన్ని పారలౌకికములో కరిగించి లౌకికమును (World related avocations) 'రహితము' చేసివేయాలి!

- బ్రహ్మమే తానై "బ్రహ్మైవ - న బ్రహ్మవిత్" - గా ప్రకాశించాలి.

అటువంటి "బ్రహ్మమే నేను కదా!" అను రూపమైనట్టి రాజాధిరాజత్వమును అధిరోహించి ఇక స్వదేహముతో సహా సకల దేహములను, ఇంద్రియ - ఇంద్రియ విషయములను మౌనముగా, సాక్షిగా, ఆనందంగా, అతీతంగా, అప్రమేయంగా - కథచదివే పాఠకునిలాగా - నాటకం చూచే ప్రేక్షకునిలాగా అతీతంగా చూస్తూ ఉండటమును అభ్యాసం చేయాలి. నిద్ర లేచి అరచేతులను చూచుకుంటున్నట్లు ఈ దృశ్యమును చూస్తూ ఉండాలి.

"ఆహా! ఈ ఇంద్రియములకు అనుభూతమయ్యేదంతా కూడా మనోదర్పణ ప్రతిబింబదృశ్యమే కదా! ఈ కనబడేదంతా కూచిపూడికి వేంచేసిన బాలత్రిపురసుందరీ సహిత శ్రీరామలింగేశ్వరస్వామి యొక్క ప్రదర్శనా చమత్కారమే కదా!" అనే శివతత్త్వజ్ఞానము (సర్వమ్ తత్ శివమేవ - ఇతి జ్ఞానమును) పునికి పుచ్చుకోవాలి.

ఓ విప్రవర్యా! ఇదియే "ఆత్మయజ్ఞము"! అటువంటి ఆత్మయజ్ఞమును ఎన్నడూ, ఏస్థితిలో ఉన్నప్పటికీ ఏమరువకూడదు కదా!

అందుచేత.....,

ఆత్మయజ్ఞమును ఏమరిచి కర్మవ్యవహారపూరితమైన యజ్ఞవిధి - విధానములు మాత్రమే మనస్సులో నింపుకోమని యజ్ఞశాస్త్రము యొక్క ముఖ్యోద్దేశ్యము కాదని నాకు అనిపిస్తోంది! కేవలము యజ్ఞ విధి- విధానములను ఎరిగినంత మాత్రము చేత ఈశ్వరుడు చిక్కడు.

**"సర్వము - సర్వులు బ్రహ్మమే ! వేద - వేదాంత శాస్త్రముల అంత్యతికమైన ఉద్దేశ్యము ఇదే!"** అను భావన చేత, అవగాహన చేత యజ్ఞ కర్మతో సహా సర్వకర్మలు పవిత్రమౌతాయి. అమృత మాధుర్యమును సంతరించుకుంటాయి. ఈశ్వరుడు చేతికందుతాడు.

అంతేకానీ.....,

సాంసారిక దృష్టులతో భేదభావనలను పరిపోషించుకుంటూ ఉంటే లాభమేముంటుంది? **"ఈశ్వర: సర్వభూతానామ్ హృద్దేశే, అర్జున! తిష్ఠతి!"** అనే అవతారమూర్తి వాక్యము అనుభవానికి రాదు కదా!

సర్వజనుల పట్ల - జీవుల పట్ల ప్రేమభావన పెంపొందించుకోవాలి! అదియే కదా, **వాత్సల్య భక్తి!** ఉత్తమమైన - ప్రేమపూరితమైన ధ్యాసచే భక్తి ప్రవృద్ధం అగుచున్నది. ధ్యాస చేతనే కదా.... ఈ దృశ్యము జీవునకు అనుభవము - అనుభూతము అగుచున్నది !

అటువంటి **ధ్యాసను** "దృశ్యరహితము - జగద్రహితము" చేస్తూ క్రమంగా సుషుమ్నానాడి యొక్క ఊర్ధ్వస్థానానికి అభ్యాస - వైరాగ్యముల ద్వారా మనలో ఎవ్వరైనా ఎప్పుడైనా ఎక్కడైనా నడిపించవచ్చని మరల గుర్తు చేస్తున్నాను! సర్వతత్త్వాత్మకమగు బ్రహ్మరంధ్రములో జగత్ భావత్వమును లయింపజేయాలని ఇంకొక్క సారి కూడా మనము గుర్తు చేసుకొనెదము గాక!

**బ్రహ్మభావనను పెంపొందించుకుంటూ బ్రహ్మమే మనమై వెలుగొందెదము గాక!**

అందుకు త్రోవ ఏమిటంటే.....,

అనుభవజ్ఞులు మనకు చెప్పుచున్న (తత్త్వమ్, సోఽహమ్, జీవో బ్రహ్మేతి నాపర :- ఇత్యాది) తత్త్వార్థ వాక్యాల విచారణ చేస్తూ జగత్తును భగవత్ భావనతో చూడటమే! ఆత్మశాస్త్ర పాఠ్యాంశాలు శ్రద్ధగా విని హృదయస్థం చేసుకుంటూ ఉండటమే! చిత్తములోని మలిన భావాలను తొలగించుకోవటమే! ఇడ-పింగళ నాడులమధ్య సుషుమ్నానాడిని ఆశ్రయించే 'అంతర్‌యోగసాధన' అభ్యసించుచూ ఉండటమే!

## 47. ఆత్మయజ్ఞమహిమ

**బ్రాహ్మణుడు :** ఏదీ! మరొక్కసారి ఆత్మయజ్ఞము యొక్క మహిమ గురించి నీవు చెప్పినదంతా సమీక్షించు! విందాము!

పరబ్రహ్మము - పరబ్రహ్మతత్త్వము అందిపుచ్చుకోవటానికై

- యజ్ఞములు చేస్తేనో.....,
- అపరిమిత ద్రవ్యము దానము చేస్తేనో....,
- శతాధికంగా క్రతువులు నిర్వర్తిస్తేనో....,
- గంగ - యమున - సరస్వతి ఇత్యాది పుణ్యనదులలో స్నానాలు చేస్తేనో.....,
- కాశీ - ప్రయాగ ఇత్యాది పుణ్యక్షేత్రాలు దర్శించినంత మాత్రము చేతనో...,
- నాలుగు వేదములు పారాయణం చేయటంతో పరిమితమైతేనో....,
- తర్కము - వ్యాకరణము - మీమాంస ఇత్యాది షట్ శాస్త్రములలో పాండిత్యము సంపాదించుకొన్నంత మాత్రంగానో, ఆయా పండితులను వాదనతో జయించే పాండిత్యము పుణికి పుచ్చుకోవటం చేతనో....,
- ఒంటి పాదముపై నిఠారుగా నిలబడి రోజుల తరబడి తపస్సు చేసినంత మాత్రము చేతనో....,
- ముక్కు - నోరు బిగించి 'షణ్ముఖి' మొదలైన ముద్రలు చేబడితేనో....
- 'వాయు స్థంభన'చే కడుపునిండా గాలిని నింపి, నిలిపి ఉంచితేనో...,

"ఇవన్నీ సరిపోవు" అని అనవచ్చునేమో కూడా! మరి? అవన్నీ సాధ్యము వైపుగా ప్రయాణించటానికి సాధనారూపములు !

(1) సద్గురుబోధను వినటము

(2) ఈశ్వరునిపట్ల నిశ్చలమైన భక్తి.

(3) "కనబడేదంతా అదే అయిఉండగా కళ్ళుమూతలెందుకు" అనే అంతిమ సాక్షాత్కారానికి కావాలసిన సుషుమ్నానాడియోగము.

(4) సర్వము పరబ్రహ్మముగా అనుభూతమయ్యే వరకు ప్రయత్నములు కొనసాగించటము.

అనుకుంటూ - అనుకుంటూ ఉంటే దానంతట అదే "సర్వము బ్రహ్మమే" అని అనిపించగలదని పెద్దలచే చెప్పబడుతోంది కదా!

ఇవియేకదా ముఖ్యమైన మార్గాలు! ఈశ్వర భక్తి లేకుంటే బ్రహ్మము చిక్కదయ్యా!

**బ్రాహ్మణుడు :** ఓ పడతీ! ఇప్పుడు 'బ్రాహ్మణుడు' అనే శబ్దానికి అర్థమేమిటో కూడా ఇంకొక్కసారి వివరించు.

**గొల్లభామ :** "బ్రహ్మమును ఎరుగుట + బ్రహ్మమే తానై ప్రకాశించుట" ఈ రెండు లక్షణములు ఎవరిలో తారసబడతాయో, వారే 'బ్రాహ్మణులు' అని చెప్పబడుచున్నారు కదా, విప్రవర్యా!

**బ్రాహ్మణుడు :** "బ్రహ్మమును ఎరగటము" ... అంటే?

**గొల్లభామ :**

- అరణి - చిత్రకోలలను రెండు చేతులతో పట్టి ఒరిపిడి చేసి అగ్నిని పుట్టించటమా? ఊహూ!
- పశువును (మేకపోతును) బంధించి తేవటమా?
- ఆ మేకపోతు యొక్క యామిషమును (కండను - క్రొవ్వు - మాంసములను) అగ్నిలో వ్రేల్చటమా? హోమము చేయటమా? .... కాదు - కాదు.
- అగ్నిగుండము చుట్టూ రకరకాల ఆకారములు - తళుకు - బెళుకులు గల ఇత్తడి - రాగి - పంచలోహ పాత్రలను ఒకటి తరువాత మరొకటి - ఒకదానిపై మరొకటి చమత్కారంగా అమర్చటమా? ఆ పాత్రలకు రంగు రంగుల పూదండలను అలంకరించటమా? కానే కాదు! లేదు!
- గొప్ప - గొప్ప సూక్త వాక్యములను, స్తోత్రపాఠములను, వర్ణనా చమత్కృతులను పెద్ద గొంతుకలతో కొందరు ఎలుగెత్తి ఉచ్ఛరించటమా? కాదు!
- లేక... శాస్త్రములలో వర్ణించినట్టి అంతర్వేది - శ్రీపీఠము ఇత్యాది వన్నె వన్నె వేదికలను - ముగ్గులను తీర్చిదిద్దటమా? లేదు!
- గోధుమలు - శనగలు - కందులు - పెసలు - మినుగులు - దర్భలు ఇటువంటి హోమద్రవ్యములను తెచ్చి సిద్ధము చేయటమా? అదీ కాదు!

యూపస్తంభాన్ని అడవిలో నుంచి సంపాదించి తెచ్చి, ఒకచోట పాతి, మేకపోతును కట్టి అద్దాని నవ నాడులు మూయటమా? ఊహూ!

ఇటువంటి ఆయా భౌతిక వస్తువులతో చేసే యజ్ఞము - "మనో - బుద్ధి - చిత్త - అహంకారములు, వాటి వాటి ప్రత్యక్ష - పరోక్ష కార్యవ్యవహారములతో సహా సర్వము సర్వదా ఏకబ్రహ్మమే!"- అనే పరబ్రహ్మ - పరతత్త్వ బ్రాహ్మణత్వమును సిద్ధింపజేయగలవా? లేదు. అయితే ఏం ? **పరబ్రహ్మతత్త్వమే ఆశయముగా కలిగి యజ్ఞములు నిర్వర్తించే వారికి అది యజ్ఞఫలంగా తప్పక సిద్ధించగలదు !**

**బ్రాహ్మణుడు :** బ్రాహ్మీ స్థితి (లేక) బ్రాహ్మణత్వము మరెట్లా సిద్ధిస్తుందని నీ ఉద్దేశ్యము - గొల్లభామా! ఏదీ? మరల మరొక్కసారి చెప్పు !

**గొల్లభామ :** అదే మనవి చేస్తున్నాను మహాత్మా! ఈ ఇంద్రియాలను గమనించండి! "వారు అటువంటి వారు! వీరు ఇటువంటి వారు"... అని మననము చేస్తూ ఇవి దృశ్య సమాచార సంబంధమైన భేదదృష్టి వైపుగానే క్షణ క్షణం పరుగులు తీస్తున్నాయే! వీటి పరుగులను, విషయములపై వ్రాలటమును కొంచము గమనించవద్దా మహనీయా!

ఇప్పుడు......,

ఈ ఇంద్రియములను సాంసారికమైన ఆశలు - అభిప్రాయములు - ఆవేశకావేశములనుండి నెమ్మది నెమ్మదిగా వెనుకకు మరల్చాలి సుమా!

శ్లో॥ శనైః శనైః ఉపరతమ్, బుద్ధ్యా **ధృతి** గృహీతయా ।
ఆత్మసంస్థమ్ **మనః** కృత్వా న కించిదపి చింతయేత్ ॥

అని గీతావాక్యము కదా!

ఈ చెవులను సద్గురువు చెప్పే ఆత్మతత్త్వాన్ని శ్రవణము చేయటానికి, ఆకళింపు చేసుకోవటానికి మరల - మరల నియమించాలి!

- **"యోగః సన్న్యస్త కర్మాణాం, జ్ఞానస్సంఛిన్న సంశయః"** అని శ్రీకృష్ణస్వామి చెప్పినట్లుగా..., స్వకీయ సహజ స్వరూపమగు ఆత్మను

సందర్భసంబంధమైనజీవాత్మ స్వభావము నుండి విభాగించాలి! విడదీయాలి! స్వస్వరూపమగుసచ్చిదానంద స్వరూపము పట్ల గల అనుమానాలను, అల్పభావనలను, దురభిప్రాయములను క్రమక్రమంగా జయిస్తూ - త్యజిస్తూ రావాలి!

- "శమము - విచారణ - సత్సంగము - సంతోషము" అగు సాధన చతుష్టయముతో మెల్లమెల్లగా శత్రువుల కూటమి అగు కామ - క్రోధ - లోభ - మోహ - మద - మాత్సర్యములను మొదలంట్లా పెకలించి పారవేస్తూ రావాలి.
- **"మమాత్మా సర్వభూతాత్మా!"** నేను సర్వాత్మకుడను! సర్వమునకు పరమైయున్న పరబ్రహ్మమును - అను ఆస్వాదనను ప్రవృద్ధం చేసుకుంటూ క్రమంగా అద్దానిని స్వాభావికము - అనుక్షణికము చేసుకోవాలి!

స్వామీ! స్వామీ! ఏమీ అనుకోకండేం! ఇంకొక్కసారి మనవి చేస్తున్నాను.

- అరణిలో అగ్నిని పుట్టించటము,
- ఎంతో వ్యయ - ప్రయాసలకు ఓర్చి, ఎంతో ధనమును వెచ్చించి గొప్ప అలంకారాలుండే యజ్ఞశాలను నిర్మించటము.

...... ఇటువంటి వ్యవహారములు తెలుసుకొని నిర్వర్తించినంత మాత్రంచేత బ్రహ్మము తెలియవస్తుందా, స్వయమాత్మానంద స్వరూపా?

ఓ భూసురోత్తమా! ఈ భూమిపై సంచరించే దేవతా! స్వామీ!

- అంతు లేకుండా కామ్యకర్మలు నిర్వర్తించటము,
- ధనము పట్ల ధ్యాసనులోభము అంటాం కదా! అది ఆశయంగా కలిగి ఉండటము.

..... ఇవి అజ్ఞానమునకు వేరైనవా? కావు. అజ్ఞానమునకు అంతర్భాగమే కాదా చెప్పండి! అవన్నీ అజ్ఞానమును తొలగించకపోగా, ప్రవృద్ధము చేస్తాయేమో కదా! అర్ధరాత్రి కటిక చీకటిలో ఉన్నవాడు కారుమేఘాలను ఆహ్వానిస్తే ఆ చీకటి తొలగుతుందా? లేదు. పైగా వృద్ధి అవుతుంది కదా!

- చీకటి తొలగాలంటే దీపమును వెలిగించాలి.

- అజ్ఞానము తొలగాలంటే ఆత్మజ్ఞానమొక్కటే మార్గమని భారత
- రామాయణ - భాగవతాది పురాణాలలో ఎన్ని చోట్ల ప్రవచించబడలేదు? చెప్పండి!

అందుచేత మహనీయా! "కర్మ కంటే జ్ఞానము గొప్పది!" అని మనము ఒప్పుకోకతప్పదు! "జ్ఞానాదైవతు కైవల్యమ్"..... అని ఉపనిషత్ వాక్యము కదా!

**బ్రాహ్మణుడు :** మరి వేదవాఙ్మయము కర్మ కాండను ప్రశస్తంగా ఎందుకు ప్రతిపాదిస్తోంది? సూచిస్తోంది! వేదమాత యొక్క హృదయమేమిటి? ఉద్దేశ్యమేమిటి? చెప్పు!

**గొల్లభామ :** "కర్మ జ్ఞానము సంపాదించటానికి సాధనము వంటిది. । లేక, అజ్ఞానము తొలగించుకోవటానికి ఉపకరణము వంటిది" అనునదే కర్మ విభాగము యొక్క ముఖ్యోద్దేశ్యము - అని పెద్దల అభిప్రాయము కదా మహాత్మా !

**బ్రాహ్మణుడు :** ఓ నీరజాక్షీ!

- "కర్మ అజ్ఞానమునకు విరోధి కాదు. లేక, కర్మ మాయ యొక్క అంతర్గతమే!
- కేవలము కర్మ మాత్రమే అజ్ఞానమును తొలగించలేదు!"

అనునది నేనూ ఒప్పుకుంటున్నాను. ఈ విషయం వేదాంగాలైనట్టి సంహిత - బ్రాహ్మణములు కర్మ విధానములను ఒకవైపు చెప్పుచునే - మరొకవైపు జ్ఞాన ప్రాసస్త్యమును గుర్తు చేస్తూనే ఉన్నాయని కూడా మేము గమనిస్తున్నాము. ఈ విషయము కర్మకాండను బోధించిన మా గురువులు మాకు ఆప్తవాక్యముగా చెప్పుతూ వస్తున్నదే!

వేదాంత శాస్త్రము కూడా "జ్ఞానస్యకారణమ్ కర్మ" - జ్ఞానమునకు కర్మయే కారణముగా ఏర్పడినదై యున్నది.... అని చెప్పుతోంది. అంతేగానీ కర్మలను ఖండించటము లేదు!

- ఈ జీవుడు కర్మను వదలరాదు.

- అయితే కర్మను జ్ఞానమే ఆశయముగా ఉంచుకొని నిర్వర్తించాలి.
- అంతేగానీ కర్మ కర్మ కొరకు కాదు!

కాబట్టి ఇప్పుడు మరొక ముఖ్య విషయానికి వద్దాము.

కర్మ జ్ఞానముగా పరిణమించటము ఎట్లా?

**గొల్లభామ :** అవును మహాత్మా! కర్మను జీవుడు వదలవలసిన పనిలేదు. వదలకూడదు. వదలలేడు. దేహమున్నంత వరకు ఈ జీవుడు ఏదో ఒక కర్మను నిర్వర్తించక తప్పదు. తప్పించుకోవటము అసాధ్యము. కర్మను పూర్తిగా మానేస్తే ఇక ఈ దేహపంజరమే నిలవదు. నేలకూలుతుంది.

శ్లో ॥ నహి కశ్చిత్ క్షణమపి । జాతు తిష్టతి అకర్మకృత్ ॥
శ్లో ॥ శరీర యాత్రాపి చే నప్రసిద్ధ్యేత్ అకర్మణః ॥

అని గీతాచార్యుల వారు సిద్ధాంతీకరించారు కదా! ఇక మనము కాదనే ప్రసక్తి ఎక్కడున్నది? ఒకవేళ్ల కర్మ చేయము అనుకుని ఊరుకున్నామో, ఇకప్పుడు కర్మదేవతలే మన చేత తమపని బలవంతంగా చేయించుకుంటారు కదా!.

అందుచేత, ఇక ఇప్పుడు మనమందరము చేస్తున్న -మనకు నియతమైన మన మన లౌకిక యజ్ఞ సంబంధమైన కర్మలను ఎలాఉపాసనగా మలచుకోవాలో...మనము మరొక్కసారి గుర్తు చేసుకుందాము విప్రవర్యా!

- ఈశ్వరార్పణ బుద్ధితో,
- సహజీవులకు సానుకూల్యత కలిగించే విధంగా,
- లోకకళ్యాణమే మన ముఖ్యోద్దేశ్యముగా,
- ఉపాసనా భావనతో

మనము నిర్వర్తిస్తూ ఉన్నామనుకోండి! గొల్లగా నేను చేస్తున్న పనులను, విప్రుడుగా మీరు నిర్వర్తించుచున్న యజ్ఞ-యాగ-వ్రతాది ధర్మనిరతిని సృష్టికర్తయగు ఆ పరమాత్మను పూజించే పూజా పుష్పాలుగా భావించామనుకోండి...., అప్పుడు, కర్తలమగు మనకు మనము నిర్వర్తిస్తున్న కర్మలు చిత్తశుద్ధికి కారణమౌతాయి. చిత్తశుద్ధిని ప్రసాదిస్తాయి. ఆత్మశు ద్ధిలేని ఆచారమదిఏల? భాండ శుద్ధిలేని పాకమేల? చిత్త శుద్ధి లేని

...పూజలేలయా? (వేమన)

చిత్తము శుద్ధి పొందుతూ ఉంటే.... క్రమంగా వివేకము వికశించనారంభిస్తుంది. **చిత్తశుద్ధితో ఏర్పడే వివేకము సహాయముగా ప్రక్కనే ఉన్నప్పుడు వేదాంతవాక్యాల అర్థపరిశీలనపట్ల అభిరుచి రూపుదిద్దుకుంటూ ఉంటుంది.** ఆ అభిరుచి జ్ఞానమహావాక్యములను అర్థము చేసుకొనే ఉత్సాహమును పెంపొందింపజేయనారంభిస్తుంది.

ఉత్సాహం - సాహసం - ధైర్యమ్ బుద్ధిః - శక్తిః - పరాక్రమః ।
షడైతే యత్ర తిష్ఠంతి తత్ర దేవోఽపి తిష్ఠతి ॥

అనునది మహనీయ ప్రవచనము కదా!

కర్మల సహాయముతో నిర్మలత్వము - సునిశితత్వము సంతరించుకున్న ఉత్సాహ పూరితమైన బుద్ధిచే రూపుదిద్దుకునే నిర్మలమైన చిత్తము ఆప్తులగు మహనీయులు పలికే వేదాంత వాక్యముల అర్థాన్ని - పరమార్థాన్ని - ఉద్దేశ్యాలను, - ఆకలిగొన్నవాడు రుచికరమైన పదార్థము వలె - స్వీకరించగలుగుతోంది. అనగా, గురువాక్యాలపట్ల శ్రద్ధ, సూక్ష్మమైన వేదాంత ప్రవచనాలు వినటము - మననము చేయటము - ఆకళింపు చేసుకోవటము జరుగుతోంది.

(1) సద్గురు సామీప్యము.
(2) వివేచన పూర్వకమైన బుద్ధి.

ఈ రెండు భగవత్ సమర్పితంగా కర్మలను నిర్వర్తించేవారికే ప్రసాద రూపంగా ప్రాప్తిస్తున్నాయి. సద్గురుబోధ ఆత్మజ్ఞానమునకు సులువైన మార్గమై దారిచూపుతోంది!

క్రమంగా ఆత్మజ్ఞాన పుష్పము అంతరంగములో వికసించనారంభిస్తోంది! ఆత్మజ్ఞాన సౌరభము హృదయలో వ్యాపిస్తూ ఉంటే, ఇక ఆపై బుద్ధి మరింతగా సునిశితమై, విస్తారమై, మహోన్నతమై సమగ్రమై .... క్రమ క్రమంగా "సర్వము మమాత్మ స్వరూపమే!" అను ఆస్వాదనను, అనునిత్య - ఆత్మసుఖమును సిద్ధింపజేయటం ప్రారంభిస్తోంది!

- సర్వమూ శివతత్త్వమే ।

- ఇదంతా విష్ణుమయమే ।

అనే భాగవత పురాణ వాక్యాలు క్రమంగా అనుభవానికి వస్తున్నాయి. అదియే ఆత్మయజ్ఞము.

అట్టి ఆత్మయజ్ఞము అంతరంగములో రంగరించుకొన్న వారే బ్రాహ్మణులు కదా! వారిపట్ల "ముక్తి - మోక్షము - జన్మరాహిత్యము - ఆత్మసాక్షాత్కారము - బ్రహ్మానుభూతి".... ఇత్యాది శబ్దముల అర్థము కుంకుమ - విభూతి లవలె తేజోమయమైన అంకారాలుగా అగుచున్నాయి.

**"మానవుడై పుట్టటము అనే మహత్తరమైన సదవకాశమును సద్వినియోగ పరచుకోవటము" .... అనగా, అటువంటి ఆత్మయజ్ఞమును దైనందికంగా అభ్యసించటమే కదా మహనీయా!**

ఈ విధంగా "కర్మ సాక్షాత్ మోక్ష స్వరూపము కాకపోయినప్పటికీ,.... మోక్షమునకై, ఆత్మానందము కొరకై మార్గదర్శకము. పరంపరా సాధనము".... అని మనమందరము నిర్ద్వంద్వముగా ఒప్పుకోవలసిందే!

ఇక ఆత్మయజ్ఞమో! మోక్షస్వరూపమే!

అదంతా దృష్టిలో పెట్టుకొనే మీ వంటి మహనీయులు "కర్మ నిర్వర్తించండి. ఉత్తమమైన కర్మను ఆశ్రయించండి. వేదవిహితమైన - లోకశుభకారకమైన కర్మ మిమ్ములను తప్పక ఉద్ధరిచగలదు" ... అని మా వంటి వారికి బోధించటం జరుగుతోంది.

ఒకానొకడు ఆకలిగా ఉన్నాడు. ఆ ఆకలి ఎట్లా తీరుతుంది. ఆహారము తింటే కదా! ఆహారము ఎట్లా లభిస్తుంది!

- భూమిని దున్నాలి.
- విత్తులను నాటాలి. నారుబడి పోయాలి.
- మడి కట్టాలి.
- నీటితో తడపాలి.
- ఆపై మొక్కలను నాటాలి. పెంచాలి.
- పంటను రక్షించుకుంటూ ఉండాలి.

- కుప్పకట్టాలి. కుప్ప కొట్టాలి.
- ధాన్యాన్ని ఇంటికి తేవాలి.
- బియ్యము వండాలి.

"భూమిని దున్నితే ఆకలి తీరుతుందా?" అని ప్రశ్నిస్తే? తిరుతుంది. కానీ మిగతావన్నీ నిర్వర్తిస్తేనే!

'కర్మ నిర్వర్తించటము' అనగా భూమిని చదును చేయటము వంటిది. కర్మ సమర్పిత బుద్ధితో నిర్వర్తిస్తే, బుద్ధి వికశించి చిత్తము నిర్మలమై మోక్షాపేక్ష వికసించగా... ఆత్మ సాక్షాత్కారము లభించకేంచేస్తుంది?

మరల సమీక్షిస్తున్నాను వినండి.

- కామ్య కర్మ మోక్షసాధనము కాజాలదు.
- నిష్కామ్య కర్మ **పరంపరాసాధన**. జ్ఞానసాధన.
- జ్ఞానము ప్రజ్ఞను సునిశిత పరుస్తోంది.
- జ్ఞానము విజ్ఞాన రూపమై బ్రాహ్మీదృష్టిని ప్రసాదిస్తూ...., ఈ జీవుని బ్రాహ్మణునిగా తీర్చిదిద్దుతోంది.
- తనతో సహా సర్వము బ్రహ్మముగా అనభూతమగుచుండగా సర్వత్యాగ బుద్ధిచే ఆత్మయజ్ఞము పరిసమాప్తమై ఈ జీవుని పూర్ణానంద బ్రహ్మముగా తీర్చిదిద్దుతోంది!

ఒకడు యజ్ఞ - యాగములను నిర్వర్తించటం చేత 'సోమయాజి' అగుచున్నాడు. ఆత్మయజ్ఞముచే ఆత్మయజ్ఞపరిపూరిపూర్ణుడగుచున్నాడు.

ఇక మనము వర్ణించుచున్న 'ఆత్మయజ్ఞము' గురించి ఇంకొక్కసారి పునశ్చరణ చేసుకోవాలంటే....,

(1) ఇంద్రియములను విషయముల నుండి (విషయ భావనల నుండి) ఉపసంహరించుకోవటము.

(2) స్వకీయమైన మనోబుద్ధి - చిత్త - అహంకారములతో సహా సర్వమును ఆత్మభావన యందు లయింజేయుటము. ఆత్మ రూపముగా చూడటము.

(3) జగత్ దృశ్యాన్ని సర్వాత్మతత్త్వ స్వరూపుడు - సర్వ స్వరూపుడు అగు శ్రీరామలింగేశ్వరస్వామి యొక్క లీలా విశేషంగా, లీలా వినోదంగా దర్శించటము.

ఇటువంటి ఆత్మయజ్ఞమును "ఏ బాహ్య ఉపకరణాల అవసరము లేకుండా, ఎక్కడ ఉంటే... అక్కడ"... నిర్వర్తించే 'బ్రహ్మసోమయాజి' యొక్క ఆనందము ఇట్టిది - అట్టిది అని చెప్పగలమా? "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ"... వాక్కు - మనస్సు కూడా భాష్యము చెప్పలేవు - అని వేదమాతయే మనకు చెప్పటము లేదా?

అట్టి ఆత్మయజ్ఞ ఫలమైనట్టి ఆత్మానందమే ఈ జీవుని ఆశయము కావాలి! కర్మ సోమయాజిత్వము సరిపోదేమోనని నా ఉద్దేశ్యము.

**బ్రాహ్మణుడు :** ఓ నీరజాక్షీ! గొల్లభామా! ఉత్తమజ్ఞానీ! కర్మయోగీ! 'ఆత్మయజ్ఞము' గురించి నీవు చెప్పిన విశేషాలన్నీ వేదాంత శాస్త్ర సారము, మహత్తరము. వేద హృదయ ప్రవచనము. బహు మాధుర్యము. శిరోధార్యము. జ్ఞాన - విజ్ఞాన సంజ్ఞితము.

బాగు బాగు!

మన పూర్వీకులు ఆత్మయజ్ఞము గురించి చెప్పియే ఉన్నారు. అంతే కాదు. వారు ఆత్మయజ్ఞమును కర్మయజ్ఞ విధాన కృతంగా కూడా వర్ణించి చెప్పారు కదా!

ఇప్పటికే మనము చాలా సేపు సంభాషించుకున్నాము. సంతోషము.

ఈ రోజు చాలా మంచి రోజు. **ఈ శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో మన ఈ సత్సంగమహిమ యొక్క పరిమళము అనేక మందికి చేరును గాక!**

చివరిగా, యజ్ఞము యొక్క అంగములను 'ఉత్ప్రేక్షాలంకారము'గా చెప్పుచూ ఆత్మయజ్ఞమును అభివర్ణించటము కూడా నీవు ఎరిగియే ఉన్నావని అనిపిస్తుంది. మనము ఈ సత్సంగ సందర్భాన్ని ముగిస్తూ ఇంకొక్క సారి వేదయజ్ఞ విహితంగా ఆత్మయజ్ఞ సారాంశాన్ని సమీక్షిస్తే వినాలని నాకు

ఉత్సాహంగా ఉన్నది. ఒకానొక వరుసలో ఆత్మయజ్ఞ వర్ణన చెప్పుతావా, తల్లీ!

**గొల్లభామ :** (పాలు - పెరుగు - వెన్న - పాత్రలను సర్దుకుంటూ) హే విప్రవర్యా! ఈ రోజు నాకు సుదినం.! వేదజ్ఞులమగు మీవంటి మహనీయునితో ఈ కొంతసేపు 'ఆత్మయజ్ఞము' గురించి పెద్దల వద్ద విన్నమాటలను మననము చేయటం నా యొక్క పూర్వజన్మ సుకృతము. ఈ మహత్తరమైన అవకాశము మీ దయ వల్లనే నాకు ప్రాప్తించిందని నేను భావిస్తున్నాను. ఇదంతా మీ యొక్క సహృదయ వాత్సల్యమే!

తమ యొక్క - శ్రోతల యొక్క హృదయములను రంజింపజేయటానికి, ఆహ్లాదము కొరకై ఆస్వాదనకై మన ఈ సంభాషణను ముగించే సందర్భంలో కర్మయజ్ఞ అంగ-ఉపాంగ పూర్వకంగా ఆత్మయజ్ఞ విధిని సంగ్రహంగా సమీక్షిస్తున్నాను. వినండి.

'ఆత్మయజ్ఞము' అనే రాచబాటలో ఆత్మయజ్ఞ సోమయాజి అయి విహరిస్తూ.... "సర్వము శివమయముగా, శివాత్మకముగా, స్వస్వరూపాత్మకముగా సందర్శించాలనుకొనే ముముక్షువు ఏమి చేయాలి? చెప్పుతున్నాను.

**(1) రాగరాహిత్యము :**

మొట్టమొదటగా రూప - నామముల పట్ల, సంగతి - సందర్భము - ప్రాపంచిక సంఘటనలు - వ్యవహార సంబంధముల పట్ల - "ఇవి నాకు చెందినవి. వీటికి నేను చెందినవాడను. వారు అటువంటివారు. వీరు ఇటువంటివారు. వీళ్ళువీళ్ళు మావారు - వారువారు పరాయివారు".... ఇటువంటి రూపమైన రాగమును నెమ్మదిగా - దృఢంగా త్యజిస్తూ రావాలి.

**(2) అభిలాషాత్యాజ్యము :**

క్రమంగా అభిలాష త్యజిస్తూ రావాలి. "అది అట్లా అయితే బాగుండు కదా! ఇది ఇట్లా అవదు కదా, కొంపతీసి! ఇది వస్తే బాగుకదా! అదేమో అట్లా అవకపోతేనే బాగు! ఏది ఎప్పుడు ఏమౌతుందో ఏమో!".... అన్న అభిలాషను త్యజించటము.! ఎవ్వడైనా, నిదురపోబోతూ "నా కలలో ఇల్లు కనబడాలి. అది గొప్ప కట్టడం అయి ఉండాలి. గుడిశ కాకూడదు" ... అని నిదురిస్తున్నాడా? అట్లాగే ఈ స్వప్న సదృశ దృశ్యవ్యవహారంలో "ఇది

లభించాలి! అది ఉండకూడదు!''..... అను అభిలాష దేనికి?

**(3) అసంగత్వము :** అప్రమేయత్వము

"ఒక నటుడు తాను నటిస్తున్న పాత్ర యొక్క వస్త్రములుగానీ, ఆభరణములు గానీ, భార్య - పిల్లలు - స్నేహితులు ఇత్యాది సంబంధములు గానీ - ఈ నాటకంలో నా పాత్రకు సంబంధించి ఉన్నాయి కాబట్టి నావే! నాకు సంబంధించినవే!'' ..... అని అనుకుంటాడా? అనుకోడు. అనుకోకుండానే తన పాత్రకు ఉచితమైన విధంగా నటిస్తాడు.

అట్లాగే....,

'ఆత్మయజ్ఞము'నకు ఉపక్రమించే యోగి "ఈ జన్మ - దేహ - తదితర సంబంధములు ఈ ఉపాధికి సంబంధించిన వాటివలె కనిపించవచ్చు గాక! కానీ ఇవి నావి కావు. నా సహజ స్వరూపము ఈ జగన్నాటకములోని 'జీవుడు' అనే పాత్రకు సర్వదా వేరే!'' అని గమనిస్తూ అప్రమేయత్వము - అసంగత్వము వహించి ఉండటము అభ్యసిస్తూ ఉంటాడు. లోకానుకూలంగా జీవిస్తూ కూడా ఉంటాడు.

**(4) దుర్విషయత్యాజ్యము :**

ఇతరులను బాధించాలనో, కష్టపెట్టాలనో, 'వారు శత్రువులు - వీరు అప్రియులు' అనో..., ఇత్యాది దుర్విషయములను తన మనస్సును తాకకుండా చూచుకుంటూ ఉంటాడు. కొంచము - కొంచము దుర్భావములే ఈ జీవునిపట్ల అభ్యాస వశంగా సంసారసముద్రము అవుతోంది కదా!

**(5) రాజయోగాభ్యాసము :**

ఈ మనస్సు 'దృశ్యము సత్యమే' అని భావించటము చాలా జన్మలుగా అశ్రద్ధ - అవిచారణ పూర్వకంగా అభ్యసిస్తూ వస్తోంది. ఇప్పుడు దీనిని దృశ్యవ్యవహారముల పట్ల ఏర్పడే దురభిప్రాయ పూర్వకమైన సంబంధముల నుండి ఉపశమింపజేయాలి. మరి మనస్సు తనంతట తానే విషయములతో అతీతత్వము - అప్రమేయత్వము పొందుతుందా? లేదు. అందుకే శాస్త్రములు యోగ - భక్తి - జ్ఞాన సంబంధమైన అనేక సాధనలు సూచిస్తున్నాయి.

అట్టి పూజ - ప్రాణాయామము - ధ్యానము - వ్రతములు ..... ఇటువంటి అభ్యాసములే 'రాజయోగము' అని చెప్పబడుచున్నాయి. యజ్ఞ - యాగములు కూడా అట్టియోగములో అంతర్విభాగములే!

మనం ఒకానొక రాజయోగసాధన గురించి ఇంతకు ముందే చెప్పుకున్నాము కదా స్వామీ!

**బ్రాహ్మణుడు :** ఏ రాజయోగము గురించి చెప్పుకున్నామో, మరొక్కసారి ఇప్పుడు గుర్తుచేయి.

**గొల్లభామ :** మరల సంక్షిప్తముగా చెప్పుకుందాము. వినండి!

- ధ్యాసను ధ్యానము ద్వారా .....,
- దేహమునకు కుడి - ఎడమలుగా శక్తిరూపంగా ప్రవహిస్తున్న ఇడ - పింగళ నాడుల మధ్య గల "సుషుమ్నానాడి" లోనుండి ఊర్ధ్వముఖంగా పయనింప జేస్తూ,
- 'బ్రహ్మరంధ్రము'ను చేరి, ! ఆ బ్రహ్మరంధ్రములోనే లోక దృశ్యాలన్నీ బ్రహ్మమునకు అభేదముగా దర్శిస్తూ.... బ్రహ్మనాదమును - బ్రహ్మగానమును వింటూ ఆస్వాదించటము.

ఇది రాజయోగాభ్యాసము. అటువంటి అభ్యాసమును పెంపొందించుకొనెదము గాక! "సర్వము సర్వదా సదాశివమ్" అను మననమే రాజయోగాభ్యాసము యొక్క మూలమంత్రమని గమనించెదము గాక!

ఇంకా వినండి.

**(6) దృశ్యము యొక్క వాస్తవతత్త్వావగాహన :**

క్రమంగా "గుణములు భ్రమయే! గుణియే పరమాత్మ! సర్వులలోని - సర్వుల యొక్క - సర్వము యొక్క వాస్తవ స్వరూపము పరమాత్మయే! పరతత్త్వమే!".... అనే పవిత్ర దృష్టిని కొంచము కొంచముగా పెంపొందించుకోవటమే ఆత్మయజ్ఞోపాసన!

**(7) విరాగము :** "సర్వ వ్యవహారముల పట్లా అతీతత్వము వహిస్తూ దేనిపట్లా

రాగము లేకపోవటము''ను యోగి అభ్యసిస్తూ ఉంటాడు. విరాగమే ఆత్మసందర్శనమునకు అవసరమగు మార్గము కదా!సంబంధం ఉన్నట్లు నటిస్తూ లేనివారమై ఉండాలి! నవరసములొలికించే నటునిలాగా !

**(8) మహదాశయము :**

"కిమ్ క్షుద్రాశయ ఫల్వలభ్రమణ సంజాత శ్రమమ్ ప్రాప్యసి?" అని ఆది శంకరులవారు మనందరినీ ప్రశ్నించటములేదూ? **"ఎందుకు మురికి గుంటలలో మునగాలనుకుంటారు? ఎదురుగా మంచినీటి సరోవరము అయినట్టి ఆత్మతత్త్వజ్ఞానము - శివానందలహరి ఉండనే ఉండగా?"** అని అన్నారు కదా! సర్వత్రా సర్వము పరమాత్మ యొక్క ప్రత్యక్ష రూపముగా సందర్శించటమే భారతీయ తత్త్వశాస్త్రము యొక్క ఉద్దేశ్యము కదా!

'భా'రతీయ - జ్ఞానము నందు రమించుటకు సంబంధించిన

తత్+త్వమ్ - 'నీవు'గా కనిపించేదంతా 'తత్' -పరమాత్మయొక్క స్వరూపమే - బంగారు ఆభరణాలన్నీ బంగారమే అయినట్లు!

శాస్త్రము - పై సత్యాన్ని యుక్తి యుక్తంగా నిరూపించే శాస్త్రము.

అటువంటి ముఖ్యాశయము కలిగి ఉండటమే ఉచితము! సర్వ తదితర లౌకిక - శాస్త్రీయ - యజ్ఞాది కర్మలన్నీ అందుకొరకే ఉద్దేశించబడునుగాక!

**(9) సర్వత్రా సమదర్శనము :**

"సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్" అని కదా! శాస్త్రవాక్యము.

**"సర్వదా సర్వత్రా సర్వము సత్స్వరూపుడగు పరమాత్మ యొక్క సంప్రదర్శనమే"**

అనునదే ముక్తి (లేక) మోక్షము యొక్క రూపము. అటువంటి సంతోషాతిశయ రూపమగు ఆత్మదృష్టిని ప్రవృద్ధము చేసుకోవటమే ఆత్మయజ్ఞము.

ఈ విధంగా ఆత్మయజ్ఞ దీక్షాపరులు ఆత్మయజ్ఞ కోవిదులు అగుచూ, ఆత్మయజ్ఞ ప్రావీణ్యత సంపాదించుకుంటూ ఆత్మానందమును ఆస్వాదిస్తున్నారు!

## 48. మానసిక యాగము

ఆత్మయజ్ఞ దీక్షాపరులు ఆత్మోపాసనా సంబంధమైన మానసిక యాగము నిర్వర్తించుటలో అన్ని వేళల, అన్ని పరిస్థితులలోను నిమగ్నులై ఉంటున్నారు.

వారు లోక సంబంధములైనట్టి ఈ 14 ఊర్ధ్వ - అధోలోకాలలోని సర్వ సంప్రదర్శనములకు, సర్వ వ్యవహారములకు, సంఘటనలకు అతీతమైన మనస్సును సంపాదించుకునే ప్రయత్నశీలురై ఉంటున్నారు. సర్వ సుఖ-దు:ఖాలకు అతీతులై అలౌకికమైన (లోకములకు సంబంధించనట్టి) - తెంపులేని ఆత్మానందమును సుస్థిరము - నిశ్చలము చేసుకొంటున్నారు.

ఆత్మయజ్ఞ విదులై వారు 'మానసికయాగము' అను దానిని ఎట్లా దినదినము నిర్వర్తిస్తున్నారో ..... వినండి!

### మానసిక యాగాంగములు

**ఋత్విజులు** : చిత్తము - బుద్ధి - అహంకారము అనే మూడింటిని మానసిక యజ్ఞమును చేయించే ముగ్గురు ఋత్విజులు (పురోహిత గురువులు) గా ఆహ్వానిస్తున్నారు.

**యూపస్థంభము** : 4 వేదములు ఆత్మకు 'సంజ్ఞ'గా ప్రతిపాదించే ఏకాక్షరము 'ఓం' (అ+ఉ+మ : ద్రష్ట + దర్శనము + దృశ్యము) కారమును 'యూపస్థంభ ము' (జంతువును కట్టి ఉంచేస్థంభము)గా భావన చేస్తున్నారు.

**యజ్ఞ పశువు** : జ్ఞానేంద్రియ పంచకము + కర్మేంద్రియ పంచకము + పంచ ప్రాణములను యజ్ఞపశువు (నల్లమేకపోతు)గా భావన చేస్తున్నారు.

**మంత్రోచ్ఛారణ** : ప్రాణ - అపానముల మధ్య గల అనాహతము నుండి వినిపించే దశవిధములైన ప్రణవనాదము - ప్రణవరవ

మును మంత్ర శబ్దముగా భావి స్తున్నారు.

| | | |
|---|---|---|
| **సోమరసము** | : | ఆత్మజ్ఞులగు మహనీయుల జ్ఞానవాక్యాలు - ఆత్మ సమాచారము 'సోమరసము'గా సంకల్పి స్తున్నారు. |
| **యజ్ఞశాల** | : | ద్రష్ట - దృశ్యము - దర్శనము తెలుసుకొనువాడు - తెలియబడునది - తెలుసుకోవటం ఈ '3'కూడా ఏ స్థానములో బయల్వెడలుచున్నాయో గమనించి...., అద్దానిని 'యజ్ఞశాల'గా భావిస్తున్నారు. |
| **యజ్ఞవిధిని నడిపించే ఆధ్వర్యుడు** | : | వివేకమునే యజ్ఞమును నడిపించే ఆధ్వర్యునిగా సంకల్పము చేస్తున్నారు. |
| **అగ్నిని పుట్టించే అరణి** | : | ఆలోచనారూపమైన అంతరంగవిభాగమును అరణిగాఉద్దేశ్యస్తున్నారు. |
| **హోమ ద్రవ్యాలను యజ్ఞ వస్తువులను సిద్ధము చేసే కత్తి** | : | నిశ్చలమైన భక్తియే ఆ కత్తి. "సాతు అస్మిన్ పరమప్రేమ రూపాచ" అని నారదులవారు చెప్పినట్లు సర్వులను ప్రేమాస్పదమగు పరమాత్మరూపంగా / విశ్వరూపంగా భావిస్తూ ఉండటమే భక్తి యొక్క మూల రూపం. |
| **స్రుక్కు - స్రవములు** | : | శమము (అంతరింద్రియ నిగ్రహము) దమము బాహ్య ఇంద్రియ నిగ్రహములు |
| **అవబృధస్నానము** | : | భృకుటిలో ఏర్పడియున్న త్రివేణి సంగమస్థానము గంగ - యమున - సరస్వతుల సంగమ స్థానము. మనో- వాక్ - కాయముల త్రికరణ శుద్ధి యొక్క అభ్యాసము. ద్రష్ట - దృశ్యములను ఆత్మకు అభిన్నంగా, అద్వితీయంగా దర్శించటం. |
| **యజ్ఞకర్త యొక్క ధర్మ పత్ని** | : | శ్రద్ధ |

**యజ్ఞసంచాలనము లోని అంతర్యామి - ముఖ్యోద్దేశ్యము** : క్షేత్రజ్ఞోపాసన. ! సర్వ సహజీవులలోని మనో - బుద్ధి - చిత్త - అహంకారముల యజమానుని ఉపాసిస్తూ ఉండటం.

**శుభవస్త్రము** : శాంతి - అమానిత్వము - అదంభిత్వము ఇటువంటి జ్ఞానవస్త్రాలు! జ్ఞానాభ్యాసాలు!

**పూలమాల** : జ్ఞానసారాన్ని పూమాలగా ధరిస్తున్నారు!

**శిఖను నిర్వికల్ప పుష్పమాలిక చుట్టి**
**ప్రకృతి పీఠమునెక్క లేరా..... ।**
**అకలంకమగు ముద్ర ధరియించి దొరవై**
**సుఖరాజ్యమేలుదువు లేరా ॥**

**ఆనంద జలధిలో స్నానము చేసి**
**సుజ్ఞానవస్త్రము కట్టలేరా... ।**
**సర్వ వేదాంతసిద్ధాంత భూషితుడవై**
**గంధలేపనము చేయు....లేరా ॥"**

అని కూచిపూడిలోని పెద్దలు మేలకొలుపుపాడుతూ ఉంటారు కదా...! ఆ విధమైన 'మెళకువ' ఆత్మయజ్ఞ యోగి తెచ్చుకుంటూ - తెచ్చుకుంటూ ఉంటాడు. బ్రహ్మసోమయాజి అయి వెలుగొందుతూ ఉంటాడు.

**బ్రాహ్మణుడు :** ఓ గొల్లభామా! సుజ్ఞానీ! పవిత్ర సహృదయీ !

నీవు ఇప్పుడు అభివర్ణించి చెప్పిన ఆత్మయజ్ఞము అభ్యసించటానికి....,

- ఏ బాహ్యవస్తు - ధన - జన సముదాయము ప్రోగుచేయనవసరం ఉండదని,
- ఎవ్వరైనా - ఎక్కడైనా - ఏ ఆశ్రమము వారైనా తమ హృదయ యజ్ఞశాలలో నిర్వర్తించవచ్చునని,

- దీనికి సమయాసమయాలు గానీ, జాతి - మత - కుల భేదాలు గానీ లెక్కించవలసిన అవసరము లేదని నేను గమినిస్తున్నాను. ఒప్పుకుంటున్నాను.

ఇక చివరి ప్రశ్న

మనము చెప్పుకున్న రీతిగా 'ఆత్మయజ్ఞము' నిర్వర్తిస్తున్న మహనీయులనెవ్వరినైనా నీవు చూడటం జరిగిందా? అట్టి వారెవ్వరైనా చెప్పగా నీవు శ్రవణంగా వినటం జరిగినదా?

**గొల్లభామ :** ఎందుకు లేరు స్వామీ! ఆత్మయజ్ఞము నిర్వర్తిస్తున్న మహనీయులెందరో ఈ భూమిపై భూసురులై సంచరిస్తున్నారు. కూచిపూడి నృత్య యోగ ప్రసాదకులగు మన శ్రీ సిద్ధేంద్ర యోగులు అట్టివారే కదా!

ఈ భూమిపై జ్ఞానభూమియగు ఈ భారతదేశములో ఆంధ్ర రాష్ట్రము - కృష్ణా మండలములో ఈ కూచిపూడి అగ్రహారము ఉన్నది కదా! కూచిపూడి అగ్రహారములో అటువంటి ఎందరో మహనీయులు ఈ గడ్డపై నడచి యున్నారు.

అట్టి ఈ కూచిపూడి అగ్రహారములో

- సద్గురువరేణ్యులగు
- పూర్వాశ్రమములో 'భాగవతుల' అనే ఇంటి పేరు గల వంశాకాశములో....,
- వద్దూలస గోత్రోద్భవులగు
- బ్ర॥ శ్రీ'రామలింగము' అనే మహాశయుణ్ణి గురించి మనము విన్నదే కదా!

ఓ బ్రాహ్మణోత్తమా! మనము కూడా వారి వలెనే - మరెందరో మహనీయుల వలెనే త్రివేనీ సంగమ స్థానమగు భృకుటీ మధ్య భాగము నందో, హృదయ కుహరములోనో ఆత్మయజ్ఞము నిర్వర్తిస్తూ అలౌకికమైన ఆత్మానందమునకు పాత్రులమయ్యెదము గాక!

పాము కుబుశమును విడచినట్లు 'అహంకారము' అనే పొరను తొలగించుకొని ఆత్మాకాశ విహారులమయ్యెదము గాకఋ

**బ్రాహ్మణుడు :** ఓ భామామణీ! నీవు చెప్పినట్లే నేను ఆత్మదీక్షను వహించే ప్రయత్నములో శాస్త్రీయమైన - లౌకికమైన కర్మలను ఉపాసనాపూర్వకంగా - సాధనపూర్వకంగా నిర్వర్తిస్తాను. సర్వమానవులను - సర్వకుల గోత్రములవారిని - సర్వ మతస్థులను మమాత్మ స్వరూపముగా సందర్శించే ఆత్మయజ్ఞ విధిని కొనసాగిస్తాను.

ఛండాలోస్తు, సతు ద్విజోస్తు ।
గురురేషామనీషామమ ॥

అని శంకర భగవత్ పాదుల వారు 'మనీషాపంచకము'లో చెప్పినట్లు నీ మాటలు **గురుముఖత:** వచ్చిన వాక్యములుగా పరిగణిస్తూ నీ ఆత్మస్వరూపమునకు నమస్కరిస్తున్నాను.


వయసులో పిన్నవగుటచే ఆశీర్వదిస్తున్నాను కూడా! నీకు సర్వదా శుభమగుగాక!

ఇక వెళ్ళిరా!

శెలవు!

★ ★ ★

**'ఆత్మయజ్ఞము' అను గొల్లకలాపము కూచిపూడి నృత్యవాఙ్మయ ప్రబంధము.**




లోక కళ్యాణమస్తు

## మూలము :

- వాద్దూలస గోత్ర సంజనిత
- బ్రాహ్మీభూత భాగవతుల **వంశపయ :**

పారావార రాకాసుధాకర - శ్రీ రామలింగేశ్వర నామ పూర్వాశ్రమ విరాజిత

- యోగ విద్యా దురంధరపుత్ర
- శ్రీ రామయ్య నామధేయ విద్యా విశారద విరచిత

## పిడోత్పత్తి - ఆత్మయజ్ఞ నామకలాప
## దృశ్య ప్రబంధము
## అధ్యయన - వాఖ్యాన పుష్పము
## / / సమాప్తము / /

# అధ్యయన వాఖ్యాన పుష్పము

**బుధజన విధేయుడు**

విశ్వామిత్ర - అహమర్ష - కౌసిస త్రయార్షేయ కౌసిస గోత్రోద్భవస్య - శ్రీయేలేశ్వరుపు ఆదిలక్ష్మీకావేశ్వరమ్మ - లక్ష్మీనారాయణ ఏకైక పుత్రుడు.

శ్రీ యేలేశ్వరపు రామకృష్ణయ్యగారి పౌత్రుడు.

పెద్దల ముందు అల్పజ్ఞుడు - స్వల్పజ్ఞుడు శ్రీసిద్ధేంద్రయోగి పాదరజోపాసకుడు

యేలేశ్వరపు హనుమ రామ కృష్ణచే!

## సమర్పణ :

ఈ అధ్యయన - వ్యాఖ్యాన పుష్పము శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారి పాదములు అలంకరించి ఉండును గాక!

**- యేలేశ్వరపు హనుమ రామ కృష్ణ**

# అనుబంధం

ఈ అత్మయజ్ఞము అనే గొల్ల కలాపము లో "జీవునికి దేహముతో ఏర్పడే అనుబంధము" (లేక) "పుట్టుక" గురించిన కొన్ని భౌతికమైన-మానసిక సంబంధమైన విశేషాలు గమనించాము కదా! ఇప్పుడు 'మృత్యువు' (చావు) గురించి యోగవాసిష్ఠము ఇత్యాది గ్రంథాలలో ఏరీతిగా విశదీకరించారో ..... అది కూడా చెప్పుకుందాము.

జీవుని పట్ల ఈ భౌతిక దేహం కనబడుతోంది కదా! అయితే ఈ భౌతిక దేహము కలుపుకొని మరికొన్ని దేహాలు కూడా ఈ జీవుని సదా ఆశ్రయించి ఉన్నాయి. అట్టి దేహాలన్ని కలిపి, "ఈ జీవుడు మహా దేహ సమన్వితుడు" అని భారతీయ తత్త్వశాస్త్రం మనకు నిర్వచించి చెపుతోంది.

మహాదేహము : (1) భౌతిక- (పాంచభౌతిక) దేహము

(2) మనో దేహమున (ఆలోచనలు)

(3) సంస్కార దేహము, (కారణ దేహము)

(4) ఆత్మ - అహమ్ (నేను) స్వరూపము

**- చావు లేక మృత్యువు :** అనబడేది భౌతిక దేహమునకు సంబంధించినది మాత్రమే.

**- మనో దేహము :** ఇందులో ఇష్టము - అయిష్టము- కోపము - ప్రేమ - ఆవేశము- తెలివి- ఆశయములు- ఆశ- నిరాశలు ఇటువంటి వన్నీ దాగిఉండి.......**'ఆలోచనలు-ప్రవర్తన** రూపములుగా ప్రదర్శితమౌతూ ఉన్నది. మనో దేహము చేతనే భౌతిక దేహం ధరించబడుతోంది.

# అనుబంధం

ఈ అత్మయజ్ఞము అనే గొల్ల కలాపము లో "జీవునికి దేహముతో ఏర్పడే అనుబంధము" (లేక) "పుట్టుక" గురించిన కొన్ని భౌతికమైన-మానసిక సంబంధమైన విశేషాలు గమనించాము కదా! ఇప్పుడు 'మృత్యువు' (చావు) గురించి యోగవాసిష్ఠము ఇత్యాది గ్రంథాలలో ఏరీతిగా విశదీకరించారో ..... అది కూడా చెప్పుకుందాము.

జీవుని పట్ల ఈ భౌతిక దేహం కనబడుతోంది కదా! అయితే ఈ భౌతిక దేహము కలుపుకొని మరికొన్ని దేహాలు కూడా ఈ జీవుని సదా ఆశ్రయించి ఉన్నాయి. అట్టి దేహాలన్ని కలిపి, "ఈ జీవుడు మహా దేహ సమన్వితుడు" అని భారతీయ తత్త్వశాస్త్రం మనకు నిర్వచించి చెపుతోంది.

మహాదేహము : (1) భౌతిక- (పాంచభౌతిక) దేహము

(2) మనో దేహమున (ఆలోచనలు)

(3) సంస్కార దేహము, (కారణ దేహము)

(4) ఆత్మ - అహమ్ (నేను) స్వరూపము

**- చావు లేక మృత్యువు** : అనబడేది భౌతిక దేహమునకు సంబంధించినది మాత్రమే.

**- మనో దేహము** : ఇందులో ఇష్టము - అయిష్టము- కోపము - ప్రేమ - ఆవేశము- తెలివి- ఆశయములు- ఆశ- నిరాశలు ఇటువంటి వన్నీ దాగిఉండి....... **'ఆలోచనలు-ప్రవర్తన** రూపములుగా ప్రదర్శితమౌతూ ఉన్నది. మనో దేహము చేతనే భౌతిక దేహం ధరించబడుతోంది.

**- సంస్కార దేహము :** మనస్సు అనేక సందర్భములలో అనేక దేహములతో ప్రవర్తిస్తూ, పాల్గొనుచూ, ఉండగా, స్వయంకృతమైన మనో - ఉపకరణముచే సంపాదించుకొనియున్న స్పందనలు, అభిప్రాయములు, అభిరుచులు, ఆవేదనలు, భావనాచమత్కారములు, కళావిశేషములు (Artistic aspects) మొదలైనవన్నీ అప్రదర్శితంగా దాగి ఉన్న స్థానము. దీనినే 'స్వభావదేహము' 'కారణ దేహము' అని కూడా అంటున్నారు.

మనో దేహము సంస్కార దేహము యొక్క ఉపకారణము అని అనవచ్చు. సంస్కారదేహము ఆత్మకు ఉపకరణము వంటిది.

ఆత్మ : భౌతిక దేహమును, మనోదేహమును కదిలించువాడు 'దేహి' (ie, one who moves the physical body) అని చెప్పబడుచున్నాడు.

- భౌతిక - మనో - సంస్కార దేహముల యజమాని యే ఈ దేహి.

- మొదటి మూడు దేహములతో సంబంధము కలిగిన ఆత్మ విభాగమును 'జీవాత్మ' అనేపేరుతో పిలుస్తున్నాం.

- కేవలసాక్షిగా ఉన్న ఆత్మవిభాగమును అంతరాత్మ అంటున్నాం.

- అంతా ఆత్మయందే ఆత్మకు అభిన్నమై, అద్వితీయమై యున్నది. ఆత్మైవమ్యేవ సర్వత్ర

'కల' తనదైనవాడు 'కలలోని నేను-కలలోని దృశ్యములను' నిర్మించుకొని తద్వారా కలలోని విశేషములను వ్యక్తులను - సంఘటనలను, సందర్భములను తన యొక్క భావనా-కల్పనా విశేషంగా ఆస్వాదిస్తున్నాడు కదా !

అట్లాగే, 'జాగృత్' కూడా ! ఈ జీవుడు తన భావనా చమత్కృతిచే జాగృత్ విశేషాన్ని కల్పన చేసుకొని ఆస్వాదించటం మాత్రమే ఇక్కడ

జరుగుతోంది.

జీవాత్మ - కలలోని 'నేను'

పరమాత్మ - ఆ కల నాదైన 'నేను'

జీవాత్మ - ఒక నాటకంలో నేను నటిస్తున్న ఒక పాత్ర.

పరమాత్మ - నటనా చాతుర్యము కలిగి ఉండి, అనేక నాటకములలో అనేక పాత్రలుగా నటించగల నటనా సామర్ధ్యము కలిగియున్న నేను. నవరసములు ప్రదర్శించగలిగినట్టి నేను రససిద్ధుడను. కవీశ్వరుడను. పాత్రలకు, నటనకు కేవల సాక్షిని.

కనుక

'పరమాత్మ' అనే మహానటనాకౌశలస్వరూపుడు........, కల్పనా రూపమైన జగత్‌దృశ్య సంరంభమును తనకు తనే కల్పించుకొని అందులో జీవాత్మ అనే పాత్రాధారణచేసి నవరసాలు ప్రదర్శిస్తున్నాడు.

ప్రతి జీవుడు స్వత:గా పరమాత్మ స్వరూపుడే సందర్భానుచితంగా "జీవాత్మ" గా వ్యవహరిస్తూ తన మాయా కల్పనా చమత్కృతిని ప్రదర్శించు కొంటూ ఇదంతా ఆస్వాదిస్తున్నాడు. మనమంతా పరమాత్మ స్వరూపులం.

పరమాత్మ సర్వంతర్యామియై వెలుగొందుచున్నాడు.

**జీవాత్మ మనసందర్భ స్వరూపము, పరమాత్మ మన సహజ స్వరూపము**

సంస్కార దేహము స్వభావము మన మహాకల్పనా వ్యవహారము

మనోదేహము ఆలోచనలు : మన సందర్భోచితమైన స్పందన

భౌతిక దేహము చావు - పుట్టుక ధర్మము కలిగినది

మృత్యువు ఆత్మకు స్వప్న సంఘటన వంటిది.

ఆత్మకు మృత్యువు లేదు దేహము జడము

మృత్యువు దేహపరిమితమైనది. అయితే వాస్తవానికి.... జడమైన దేహానికి మాత్రం జన్మ ఏమున్నది ? మృత్యువు ఎక్కడిది ?

- లోక కళ్యాణమగు గాక !

★

- ఋషి వాక్కు సంరంభం సర్వత్ర వెల్ల విరియును గాక !

★

**- యేలేశ్వరపు హనుమ రామ కృష్ణ**

డి.టి.పి. : బృందావనం సాయికుమార్, ఏలూరు

ఫోన్ : 08812 - 221876

ముద్రణ : హసితాగ్రాఫిక్స్ అండ్ ప్రింటర్స్, ఏలూరు

ఫోన్ : 9704275472

బాలా త్రిపుర సుందరి
సహిత రామలింగేశ్వర
స్వామి దేవాలయము,
కూచిపూడి

